



# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక






ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 103: శుక్రవారం 28 నవంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు24:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్




## మతం కంటే మానవత్వమే గొప్పది

**మతం ఏదైనా మాన-వత్వంమర్చిపోకూడదు**

**ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్**

**మంగళగిరిలో మసీద్‌ను ప్రారంభించిన మంత్రి**

**అమరావతి :** మతం ఏదైనా మానవత్వాన్ని ఎన్నడూ మరవకూడదని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. యువత భవిష్యత్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, రాష్ట్ర, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం మంగళగిరిలోని

మిగతా 2 లో

## సొంత ఖర్చులతోనే లోకేశ్ విమాన ప్రయాణాలు

లోకేష్‌పై ఆరోపణలపై టీడీపీ నేతలు స్పష్టత కావాలనే ఓ వర్గం మీడియా తప్పుడు ప్రచారం



2

# దేవతల రాజధానిగా అమరావతి

## క్యాపిటల్ గెయిన్స్ మరో 2 ఏళ్లు పొడిగించాలి

- రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు
- కావాలని రాజధానికి వ్యతిరేకంగా పోస్టులు
- అమరావతి 29 గ్రామాల పరిధి సరిపోదు
- అమరావతి ఎదగాలంటే విస్తరణ తప్పనిసరి
- అమరావతి రైతులతో భేటీలో సీఎం చంద్రబాబు



రాజధాని అమరావతిని హైదరాబాద్ స్థాయి మహానగరంగా తీర్చి దిద్దాలంటే కేవలం 29 గ్రామాల పరిధి సరిపోదని, నగరాన్ని మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పరిధిని పెంచకపోతే అమరావతి ఒక సాధారణ మున్సిపాలిటీగానే మిగిలిపోయే ప్రమాదం ఉందని, ఈ బృహత్ ప్రణాళికకు రైతుల పూర్తి సహకారం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతుల పట్ల తనకు ఎనలేని గౌరవం, కృతజ్ఞత ఉన్నాయని ఆయన పునరుద్ఘాటించారు.


**అమరావతి :** కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం అమరావతి పర్యటన ఉన్నందున క్యాపిటల్ గెయిన్స్ మరో 2 ఏళ్లు పొడిగించేలా కేంద్రాన్ని కోరాలని రైతులు సీఎం చంద్రబాబును కోరారు. రైతుల సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించారు. రాజధాని అమరావతి రైతులతో సచివాలయం 5వ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సమావేశానికి 80 మంది రైతులు హాజరు అయ్యారు. రైతుల సమస్యలపై కేంద్ర

మిగతా 2 లో

## స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను

- అమరావతిలో శ్రీవారి ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన
- రూ.260 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి ప్రణాళిక
- రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని టీటీడీకి సీఎం ఆదేశం

వివరాలు 2లో..



**లోపలి పేజీల్లో**



## ఆధార్ కార్డు పౌరసత్వానికి ప్రామాణికం కాదు

- సుప్రీంకోర్టు స్పష్టం కీలక వ్యాఖ్యలు
- చొరబాటుదారులకు ఆధార్ కార్డులపై ఆందోళన

## సమస్యల మూలాలను గుర్తించాలి

- వాయు కాలుష్యం సమస్య ఢిల్లీ సతమతం
- కాలుష్యం ప్రతి ఒక్కరిని వేధిస్తున్న అంశం
- మాదగ్గర వద్ద 'మంత్రదండం' లేదు
- సమస్యను తక్షణమే పరిష్కరించండి
- ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

## ప్రపంచానికే ఆదర్శం మన యువత

- యువత వల్లే స్టార్టప్ విప్లవం
- దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌ల ఏర్పాటు
- మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు



**న్యూఢిల్లీ :** భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-I ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను

మిగతా 3 లో




## దళారులను నమ్మి రైతులు మోసోవద్దు

- ధాన్యం కొనుగోలు వేగవంతం
- 8.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- వినియోగదారుల వ్యవహారా శాఖ మంత్రి నాదెండ్ల

అమరావతి : రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేశామని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర పౌర-సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. గురువారం విజయవాడలోని

మిగతా 2 లో



## శ్రీలంక తీరంలో కేంద్రీకృతమైన తుపాన్

- తుఫాన్‌కు దిత్వాహ్‌గా నామకరణం
- మత్స్యకారులను అప్రమత్తం చేసిన అధికారులు
- ఏపీలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక

.. వివరాలు 3లో




.. వివరాలు 3లో


## ఈవీఎంల తనిఖీపై ఫిర్యాదులందలేదు

- తనిఖీ చేయాలని ఎవరూ ఫిర్యాదు చేయలేదు
- వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

# అమరావతి ఎదగాలంటే విస్తరణ తప్పనిసరి

మొదటి పేజీ తరువాయి

మంత్రి పెమ్మసాని, మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌లతో ప్రభుత్వం ఇప్పటికే త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఈ త్రిసభ్య కమిటీ 3 సార్లు భేటీ అయ్యింది. అయితే ఇప్పుడు ఈ రైతుల సమావేశంలో సమస్యల పరిష్కారంపై మరింత స్పష్టత వచ్చింది. రైతులకు ప్లాట్ల కేటాయింపు, జరీబు భూములు, ఎసైన్డ్ భూములకు సంబంధించి సమావేశంలో చర్చ జరిగింది. ఇంకా పరిష్కరించదగ్గ సమస్యలన్నింటినీ త్రిసభ్య కమిటీ పరిష్కరిస్తుందని తెలిపారు. హైదరాబాద్ తరహాలో అమరావతి అభివృద్ధి చెందాలంటే 29 గ్రామాల పరిధి సరిపోదని సీఎం చంద్రబాబు అన్నారు. అదే జరిగితే ఓ మున్సిపాలిటీగా మాత్రమే అమరావతి ఉంటుందని అన్నారు. అమరావతి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే తాను తీసుకునే నిర్ణయాలకు రైతుల నుంచి కూడా మద్దతు కావాలని సీఎం చంద్రబాబు కోరారు.రాజధానికి భూములు ఇచ్చిన రైతులుగా మీపై అభిమానం, కృతజ్ఞత ఉన్నాయని తెలిపారు. రాజధానికి వ్యతిరేకంగా కొందరు కావాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని రైతులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అసత్య పోస్టులను కట్టడి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. అమరావతి ఉద్యమంలో భాగంగా అనేక జేఏసీలు వచ్చాయని, ఇప్పుడు రైతులంతా కలిసి అమరావతి డెవలప్‌మెంట్ అసోసియేషన్ పేరుతో ఒక సంస్థ ఏర్పాటు చేసుకోవాలని సీఎం రాజధాని రైతులకు సూచించారు. అమరావతి రైతుల అభివృద్ధికి,



భవిష్యత్తుకు తాను పూర్తి కమిట్?మెంట్?తో ఉన్నానని అన్నారు.మీకు న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం వెల్లడించారు. రైతులు కూడా తనకు పూర్తిగా సహకరించాలని కోరారు. రైతులు, జేఏసీ నేతలు సీఎం దృష్టికి పలు అంశాలను తీసుకువెళ్లారు. బిల్డింగ్‌కి ఫ్లోర్ పర్సంటేజ్ ఎస్ఎఫ్ఐ పెంచాలని రైతులు కోరారు. విజయవాడ, గుంటూరు కంటే అమరావతిలో తక్కువ ఉందని రైతులు సీఎం దృష్టికి తెచ్చారు. కరకట్ట బలోపేతం చేయాలని రైతులు చెప్పగా అది ప్రభుత్వం బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. బ్యాంకు లోన్ల కోసం వెళ్తే 30 సంవత్సరాల డాక్యుమెంట్?లు అడుగుతున్నారని రైతులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. గత ఐదేళ్లలో రాజధాని రైతులు సుదీర్ఘ పోరాటం చేశారు. వారికి ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి" అని పురపాలక, సీఆర్డీఏ శాఖలను ఆదేశించారు. రైతుల ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు త్వరలోనే వారితో సమావేశం కావాలని పురపాలక శాఖ మంత్రి నారాయణకు, ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వం కోసం త్యాగాలు చేసిన రైతులకు అదే స్థాయిలో సహకారం అందించడం మన బాధ్యత అని అన్నారు. ఇంకా ఏమైనా అపరిష్కృత అంశాలు మిగిలి ఉంటే, వాటిని కేబినెట్ సమావేశం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.అలాగే, అమరావతిలో నిలిచిపోయిన నిర్మాణాలను వేగంగా పూర్తిచేసేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. నిర్మాణాల వేగం, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అంతిమంగా అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి. నారాయణతో పాటు సీఆర్డీఏ, పురపాలక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతులు ఎట్టిపరిస్థితులలో నష్టపోకూడదు

**రెండు రోజుల్లో ధాన్యం బకాయిలు చెల్లించండి**

**అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు**

**అమరావతి :** రాష్ట్రంలో ఏ రైతు కూడా పండించిన పంటకు నష్టపోకూడదని, పంటలకు ధరలు తగ్గకుండా, కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోళ్ల బకాయిలను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలపై ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో 50.75 లక్షల టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు గానూ రూ. 13,451 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని సీఎం దృష్టికి తెచ్చారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ, "చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు రాకూడదు. ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుని రెండు రోజుల్లో చెల్లింపుల ప్రక్రియ పూర్తి చేయాలి. భారీ వర్షాలు పడతాయన్న హెచ్చరికల నేపథ్యంలో రైతులకు తగినన్ని గోనె సంచులు అందించాలి," అని ఆదేశించారు.పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెచ్చిన కొత్త విధానాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు సీఎంకు వివరించారు. దీంతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నుంచే కేంద్ర టెక్స్‌టైల్స్ కార్యదర్శి నీలం రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. కొత్త నిబంధనల వల్ల రాష్ట్రంలోని పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వర్ష సూచన ఉన్నందున త్వరగా పరిష్కరించాలని కోరారు. పత్తి కొనుగోళ్ల సమస్యపై కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని, ఈ బాధ్యతలను కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలుకు అప్పగించాలని అధికారులకు సూచించారు. అరటి, జొన్న ధరల సమస్యల పరిష్కారానికి స్థానిక వ్యాపారులు, ఎగుమతిదారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ రైతులను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు.

# నలుదిశలా తిరుమల ఆధ్యాత్మిక వైభవాన్ని చాటాలి

**ప్రధాన ఆలయాల్లో తిరుమల తరహా విధానాలు**

**శ్రీవారి సేవకులుగా వైద్య నిపుణులు..**

**టీటీడీపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష**

**అమరావతి:** ప్రపంచం నలుచెరగులా తిరుమల శ్రీవారి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా కార్యక్రమాలు చేపట్టాలని, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్యాత్మికత, అన్నదానం, విద్య, వైద్యానికి చిరునామాగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గురువారం సచివాలయంలో దేవాదాయశాఖ, టీటీడీపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తిరుమల ఆలయంలో పాటిస్తున్న అత్యుత్తమ విధానాలను రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రసాదాల తయారీ, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాల్లో తిరుమల ప్రమాణాలను అనుసరించాలని సూచించారు. ప్రసాదాల తయారీకి సేంద్రియ ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలని, భక్తుల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వాడుకోవాలని ఆదేశించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యం కావాలని, టీటీడీ భక్తుల పోర్టల్‌ను ఆర్టీజీఎస్‌తో అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు.తిరుపతిలోని స్విమ్స్, రుయా, బర్డ్ ఆస్పత్రులను అనుసంధానం చేసి, వాటిని ఒక మోడల్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పుట్టపర్తి శ్రీ సత్యసాయి ఆస్పత్రుల తరహాలో అత్యుత్తమ నిర్వహణ ప్రమాణాలతో వీటిని తీర్చిదిద్దాలని సూచించారు. దేశంలోని ప్రముఖ వైద్య నిపుణులను 'శ్రీవారి సేవకులు'గా ఆహ్వానించి, వారి సేవలను ఈ ఆసుపత్రుల ద్వారా భక్తులకు, ప్రజలకు అందించేలా అవకాశం కల్పించాలన్నారు. మందులను నేరుగా తయారీదారుల నుంచే కొనుగోలు చేయాలని, అత్యవసర సమయాల్లో క్యూలైన్లలోని భక్తులను తక్షణమే ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. భక్తులకు సులభంగా సమాచారం అందించేందుకు అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. రాబోయే వైకుంఠ ఏకాదశికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎం టీటీడీ అధికారులను ఆదేశించారు. భక్తులు అన్ని భాషల్లోనూ దర్శనానికి రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యం కల్పించాలని, వీలైనంత ఎక్కువ మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. టీటీడీ ఆధ్వర్యంలోని అన్ని దేవాలయాల్లో నిత్యాన్నదానం జరిగేలా చూడాలన్నారు. తిరుమల కొండలపై జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, దివ్య ఔషధవనం ఏర్పాటుతో పాటు వివిధ రకాల పుష్పజాతుల మొక్కలను నాటాలని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నిర్మించ తలపెట్టిన 5,000 దేవాలయాల డిజైన్లను మార్చి, వాటిలో ఆధ్యాత్మికత, ప్రశాంతత ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నిర్మాణాలను టీటీడీ పాలకమండలి సభ్యులతో కూడిన కమిటీ పర్యవేక్షించాలని సూచించారు. కొత్త ఆలయాలతో పాటు రాష్ట్రంలోని పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుతం దేశంలోని వివిధ ప్రాంతాల్లో టీటీడీ ఆలయాల నిర్మాణం జరుగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. అసోంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి 10 ఎకరాలు కేటాయించారని తెలుపగా, మరింత స్థలం కోసం తాను స్వయంగా మాట్లాడతానని సీఎం బదులిచ్చారు. లడ్డూ నాణ్యత పెంచడంతో పాటు అన్నప్రసాదంలో వడ కూడా అందిస్తున్నామని, వంటశాలను ఆటోమేషన్ చేసి రోజుకు 2.75 లక్షల మందికి అన్నప్రసాదం అందించేలా ప్రణాళిక చేస్తున్నామని వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వెంకయ్య చౌదరి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



## స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను

**అమరావతిలో శ్రీవారి ఆలయ**

**విస్తరణ పనులకు శంకుస్థాపన**

**రూ.260 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి ప్రణాళిక**

**రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని**

**టీటీడీకి సీఎం ఆదేశం**

రాజధాని అమరావతిలోని వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రూ.260 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆలయ విస్తరణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ బృహత్తర కార్యాన్ని రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజధాని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ విస్తరణ పనులను రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. తొలి దశలో రూ.140 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం, ఏడంతస్తుల మహారాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయస్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ వంటి నిర్మాణాలు చేపడతారు. ఇక రెండో దశలో రూ.120 కోట్లతో శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, భారీ అన్నదాన సముదాయం, యాత్రికుల విశ్రాంతి భవనాలు, అర్చకులు-సిబ్బంది నివాస గృహాలు, రెస్ట్ హౌస్, పరిపాలన భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ సదుపాయాలను అభివృద్ధి చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, కలియుగ దైవం వెంకటేశ్వరుని ఆశీస్సులతోనే రాజధానికి అమరావతి అని పేరు పెట్టామని గుర్తు చేశారు. "దేవతల రాజధాని అమరావతే మన రాజధానిగా ఉండాలని సంకల్పించాం. కృష్ణానది ఒడ్డున 25 ఎకరాల్లో 2019లోనే ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాం. కానీ గత ప్రభుత్వం విధ్వంసం తప్ప ఒక్క మంచి పని కూడా చేయలేదు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాల భూమిని త్యాగం చేస్తే, వారికి గత ఐదేళ్లు నరకం చూపించారు. ఆ వెంకన్ననే నమ్ముకున్న రైతులు 'న్యాయస్థానం టు దేవస్థానం' పేరుతో పాదయాత్ర చేశారు. వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని అన్నారు. తాను శ్రీవారికి పరమ భక్తుడినని, తమ ఇంటి దైవం ఆయనేనని చంద్రబాబు తెలిపారు. "మా ఇంటి నుంచి చూస్తే శేషాచల పర్వతం కనిపిస్తుంది. చిన్నప్పటి నుంచి స్వామిని చూస్తూ పెరిగాను. స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను, ఎవరినీ చేయనివ్వను. తప్పు చేస్తే ఆయనే ఈ జన్మలో శిక్షిస్తాడు. నాడు స్వామివారి సేవకు వెళ్తుంటే నక్సలైట్లు 23 క్లైమోర్ మైన్లు పేల్చినా, ఆ స్వామి దయ వల్లే ప్రాణాలతో బయటపడ్డాను" అని నాటి ఘటనను గుర్తుచేసుకున్నారు. తిరుమలలో ఎన్టీఆర్ అన్నదానానికి శ్రీకారం చుడితే, తాను స్విమ్స్‌లో ప్రాణదానం కార్యక్రమాన్ని ప్రారంభించానని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణాన్ని చేపడతామని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించేందుకు ప్రణాళికలు ఉన్నాయని చంద్రబాబు వెల్లడించారు. ముంబైలో రేమాండ్స్ సంస్థ రూ.100 కోట్లతో స్వామి ఆలయాన్ని నిర్మిస్తోందని ఉదహరించారు. భక్తులు కూడా ఆలయ నిర్మాణాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా, సంపదతో వర్ధిల్లాలని ఆ స్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# మతం ఏదైనా మానవత్వం మర్చిపోకూడదు



మొదటి పేజీ తరువాయి

ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న పావురాల కాలనీలో నూతనంగా నిర్మించిన 'నూర్ మసీద్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మస్జీద్‌ను ప్రారంభించి, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "మంగళగిరి ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం నాకు దక్కింది. నాకున్న శక్తి మేరకు సేవ చేస్తున్నాను. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి రాష్ట్ర ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. మనతో ఉన్నవారిని పైకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. సమాజంలో ఇంకా పేదరికం ఉంది, దానిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు. తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ, "2019లో దేవుడు నాకు ఒక కఠినమైన పరీక్ష పెట్టాడు. చాలామంది నన్ను ఎగతాళి చేశారు. కానీ, అదే దేవుడు నాకు శక్తిని, పట్టుదలని ఇచ్చాడు. క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తే విజయం తప్పక వరిస్తుంది. కష్టాలు అందరికీ వస్తాయి, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి" అని యువతకు స్ఫూర్తినిచ్చారు. కాలం మారిందని, యువత చదువుపై దృష్టి సారించి భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. 2047 నాటికి దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా అందరూ పనిచేయాలని లోకేశ్ కోరారు. "మెరుగైన సమాజ నిర్మాణం కోసం నైతిక విలువలు చాలా అవసరం. ముఖ్యంగా మహిళలను గౌరవించాలి. మన మధ్య విభేదాలు సృష్టించడానికి కొందరు ప్రయత్నిస్తుంటారు, అలాంటి వాటికి తావివ్వకుండా ప్రశాంతంగా ఉండాలి. ప్రజలు నా పనిని గుర్తించినప్పుడే నాకు కొండంత బలం. అందరికీ అండగా ఉంటూ, కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దాం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ నేత పోతినేని శ్రీనివాసరావు, మసీదు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ, కమిటీ సభ్యులు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సొంత ఖర్చులతోనే లోకేశ్ విమాన ప్రయాణాలు

**అమరావతి :** ఏపీ మంత్రి నారా లోకేశ్ విమాన ప్రయాణాలకు ప్రభుత్వ సొమ్మును వినియోగిస్తున్నారంటూ వస్తున్న ఆరోపణలపై టీడీపీ నేతలు స్పష్టతనిచ్చారు. ఆయన తన పర్యటనలన్నింటికీ సొంతంగానే ఖర్చు చేస్తున్నారని, ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పారు. కావాలనే ఓ వర్గం మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని వారు మండిపడ్డారు. జగన్‌కు చెందిన పత్రికలో లోకేశ్ 77 సార్లు హైదరాబాద్‌కు విమానంలో వెళ్లారని, ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని కథనం ప్రచురించడాన్ని టీడీపీ నేతలు తీవ్రంగా ఖండించారు. పెట్టుబడుల సాధన కోసం వెళ్లే అధికారిక పర్యటనలకు సైతం లోకేశ్ తన సొంత డబ్బునే వాడుతున్నారని గుర్తు చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తెలంగాణ పార్టీ వ్యవహారాలు చూసే బాధ్యత కూడా ఆయనపై ఉందని, అందుకే తరచూ హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోందని వివరించారు. గతంలో జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌కు 15 కిలోమీటర్ల దూరంలోని కార్యక్రమానికి ప్రభుత్వ ఖర్చుతో ప్రత్యేక విమానంలో వెళ్లారని, కానీ లోకేశ్ అలా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయలేదని విమర్శించారు. గతంలో 'చినబాబు చిరుతిండి' అంటూ తప్పుడు వార్తలు రాసినప్పుడే లోకేశ్ పరువు నష్టం దావా వేశారని, అయినా ఆ పత్రిక బుద్ధి మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం



మొదటి పేజీ తరువాయి

సివిల్ సప్లైస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నేటి వరకు 8,22,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, రైతుల ఖాతాల్లో రూ. 1,713 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 4 నుంచి 6 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, రైతులు రూపాయి కూడా నష్టపోకుండా కల్లాల వద్దే ధాన్యం కొంటున్నామని స్పష్టం చేశారు. కొంతమంది నేతలు ధాన్యం కొనుగోళ్లపై అనవసరంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, రైతులు అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గత ప్రభుత్వం రైతులకు రూ. 1,674 కోట్ల బకాయిలు పెడితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ బకాయిలన్నింటినీ చెల్లించిందని గుర్తుచేశారు. ఈ సీజన్‌లో ఒక్క కృష్ణా జిల్లాలోనే లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం ఒక రికార్డు అని అన్నారు. గోదావరి జిల్లాల్లోనూ లక్ష టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు రేయింబవళ్లు కష్టపడుతుంటే, వారి మనోధైర్యం దెబ్బతినేలా కొందరు విమర్శలు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వం 2022-23లో 3,33,155 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని రూ. 679.79 కోట్లు చెల్లిస్తే, తమ ప్రభుత్వం ఇప్పటికే అంతకు రెట్టింపు స్థాయిలో కొనుగోళ్లు జరిపిందని పోల్చి చెప్పారు. రవాణా వ్యవస్థను కూడా పటిష్టం చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24లో కేవలం 455 లారీలు నమోదు కాగా, తమ ప్రభుత్వంలో ఇప్పుడు 2,715 లారీలు నమోదు చేసుకున్నాయని వివరించారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో రవాణా వాహనాల బకాయిలు రూ. 9 కోట్లు చెల్లించామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో 7.53 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచామని, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో అదనంగా మరో లక్ష సంచులను సిద్ధం చేశామని చెప్పారు. వాతావరణ మార్పుల దృష్ట్యా రైతుల ఆందోళనను గమనించి మూడు నెలల్లో జరగాల్సిన ప్రక్రియను ముందే ప్రారంభించామన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం 30వ తేదీ తర్వాత కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వర్ష సూచన ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో ఒకటో తేదీ నుంచి ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వర్షాల నుంచి పంటను కాపాడేందుకు కౌలు రైతులకు టార్పాలిన్ పట్టాలు సిద్ధంగా ఉంచామన్నారు. దళారులు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు ధాన్యం కొనే ప్రయత్నం చేస్తారని, ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ. 1792 మద్దతు ధర చెల్లిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ-క్రాప్‌లో నమోదైన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు.

# యువత వల్లే స్టార్టప్ విప్లవం




మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు. దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు. గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్-టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

# శ్రీలంక తీరంలో కేంద్రీకృతమైన తుపాన్

**విశాఖపట్నం :** నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో తీవ్ర వాయుగుండం.. తుపానుగా మారిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ తు-పానుకు 'దిత్వాహ్'గా యెమన్ దేశం నామకరణం చేసినట్టు అధికారులు తెలిపారు. ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా తీరం వైపు గడిచిన 6 గంటల్లో గంటకు 15 కి.మీ వేగంతో తుపాను కదులు తోందని పేర్కొన్నారు. దిత్వాహ్ తుపాను శ్రీలంక ట్రింకోమలీకి 200 కి.మీ, పుదుచ్చేరికి 610 కి.మీ, చెన్నైకి ఆగ్నేయంగా 700 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఆదివారం తెల్లవారుజామున నైరుతి బంగాళాఖాతం ఆనుకుని తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలకు చేరే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈనెల 30న ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశముందని రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆయా జిల్లాల్లో 20 సెం.మీకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశముందని విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.శ్రీలంకను అనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడింది. ఈ మేరకు విశాఖపట్నంలోని తుఫాన్ హెచ్చరికల కేంద్రం ఉన్నతాధికారి జగన్నాథ కుమార్ వెల్లడించారు. ఈ తుఫాన్ కారణంగా రానున్న వారం రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురుస్తాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు.. మరికొన్ని ప్రదేశాల్లో భారీ వర్షాల నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో తీరం వెంబడి గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. కాబట్టి సముద్రంలో వేటకు వెళ్ళ వద్దని మత్స్యకారులను హెచ్చరించారు. తీరం వెంబడి ఉన్న పోర్టులో రెండో నెంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశామని జగన్నాథ కుమార్ వివరించారు. ఇక దిత్వా తుఫాన్ కారణంగా.. శనివారం నుంచి సోమవారం వరకు అంటే.. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయిన అంచనా వేస్తున్నారు. 29వ తేదీన అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఇక 30వ తేదీన నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. తెలంగాణలో పూర్తిగా భిన్న పరిస్థితులు ఉన్నాయి. మొన్నటి వరకు తెలంగాణలో చలి తీవ్రత అధికంగా ఉంది. కానీ గత నాలుగు రోజులుగా ఈ తీవ్రత తగ్గింది.

# ఈవీఎంల తనిఖీపై ఫిర్యాదులందలేదు

**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, ఇతర రాష్ట్రాల్లోని ఉప ఎన్నికల్లో ఈవీఎం మెమొరీ, మైక్రో కంట్రోలర్ కాలినట్లు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎన్నికల సంఘం వెల్లడించింది. బిహార్?లోని 243, పలు రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఓడిన అభ్యర్థులు ఎవరూ ఈవీఎంలు తనిఖీ చేయాలని అడగలేదని తెలిపింది. "ఇటీవల జరిగిన బిహార్ శాసనసభ ఎన్నికలు 2025 ఎన్నికలు, 8 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాలిపోయిన మెమరీ/మైక్రోకంట్రోలర్‌ను తనిఖీ చేయాలని ఏ అభ్యర్థి నుంచి దరఖాస్తు అందలేదు." అని ఈసీ పేర్కొంది.అయితే, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు EVMల కాలిపోయిన మెమరీ/మైక్రోకంట్రోలర్ లెక్కింపు తర్వాత తనిఖీ, ధృవీకరణపై సవరించిన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని (SoP) జూన్ 17న జారీ చేసినట్లు ECI తెలిపింది. దీని ప్రకారం ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లు పోలైన అభ్యర్థి తర్వాతి స్థానాల్లో ఉన్న నంబర్ 2 లేదా నంబర్ 3 అభ్యర్థులు ఫలితం ప్రకటించిన ఏడు రోజుల్లోపు EVMలను తనిఖీ చేయడానికి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన ఈసీ పలు విషయాలను తెలిపింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు పోలింగ్ కేంద్రాల్లో (మొత్తం 1,215 పోలింగ్ కేంద్రాలు) VVPAT స్లిప్‌లను లెక్కించామని, ఎక్కడా EVM లెక్కింపుతో వ్యత్యాసం రాలేదని వివరించింది. బిహార్‌లోని 38 జిల్లాలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టిన తర్వాత 12 గుర్తింపు పొందిన పార్టీలు లేదా ఓటర్ల నుంచి తొలగింపు, నమోదుపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని చెప్పింది. ఇంకా 2,616 మంది అభ్యర్థులు, 12 గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల్లో ఎవరూ కూడా రీ పోలింగ్ నిర్వహించాలని కోరలేదని పేర్కొంది. బిహార్ ఎన్నికలు, వివిధ రాష్ట్రాల్లోని 8 ఉపఎన్నికలు నిర్వహించిన 72 గంటల్లోనే ఇందుకు సంబంధించిన వివరాలను అందుబాటులో ఉంచామని తెలిపింది. ఎన్నికల ముగిసిన ఐదు రోజుల్లోనే గణాంకాలతో సహా పూర్తి వివరాలను ఉచితంగా ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. కాగా, అంతకుముందు జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ ఘన విజయం సాధించింది. 243 స్థానాల్లో 202 సీట్లు గెలుచుకొని సత్తా చాటింది. 101 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 89 సీట్లు గెలుచుకుంది. అదే సంఖ్యలో పోటీ చేసిన జేడీయూ 85 స్థానాలు గెలిచి తక్కువ తేడాతో రెండో స్థానంలో నిలిచింది. ఫలితంగా బిహార్ ముఖ్యమంత్రిగా జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ పదోసారి బాధ్యతలు చేపట్టారు. మరోవైపు బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. ప్రజలకు తెలియని పార్టీలకు కూడా లక్షల ఓట్లు రావడంపై అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తమ బృందం సేకరించిన అభిప్రాయాలకు, వెలువడిన ఫలితాలకు పొంతనేలేదని అభిప్రాయపడ్డారు. అయితే దీన్ని నిరూపించేందుకు మాత్రం తన వద్ద ఆధారాలు లేవన్నారు. కానీ, ఎప్పటికైనా ఆధారాలు బయటకు వస్తాయని పీకే చెప్పారు.

# ఆధార్ కార్డు పౌరసత్వానికి ప్రామాణికం కాదు

**న్యూఢిల్లీ :** ఆధార్ కార్డును పౌరసత్వానికి ప్రామాణికం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చొరబాటుదారులు ఆధార్ కార్డులు సంపాదించడంపై ఆందోళన వ్యక్తంచేసింది. పౌరులు కానివారు ఆధార్ కలిగిఉంటే,వారికి ఓటు హక్కు కూడా ఇచ్చేయాలా అంటూ ప్రశ్నించింది. అనేక రాష్ట్రల్లో భారత ఎన్నికల సంఘం చేపట్టి సర్‌ను సవాలు చేస్తూ పిటిషన్స్ దాఖలు అయ్యాయి. దీనిపై బుధవారం విచారణను చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్?మాల్యా బాగ్చీతో కూడి ధర్మానసం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు, కేరళ, బంగాల్?లో సర్? కసరత్తుపై ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. 'ఆధార్ అనేది సంక్షేమ పథకాలను పొందేందుకు రూపొందించిన చట్టబద్ధ పత్రం మాత్రమే. ఒక వ్యక్తికి రేషన్ ఇవ్వడం కోసం ఆధార్‌ను మంజూరు చేసినందుకు, వాళ్లన్ని తప్పసరిగా ఓటరుగా చేయాలా పక్క దేశానికి చెందిన ఓ వ్యక్తి ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తే, అతడికి కూడా ఓటు హక్కు ఇవ్వాలా? ఓటరు నమోదు ఫారం-6లో పేర్కొన్న వివరాలు సరైనవో, కావో నిర్ధరించుకునే అధికారం ఈసీకి ఉంది' అని ధర్మాసనం పేర్కొంది. కొంతమంది పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. సర్ ప్రక్రియ సాధారణ పౌరులపై రాజ్యాంగ విరుద్ధమైన భారాన్ని మోపుతుందని చెప్పారు. వారిలో



అనేకమంది నిరక్షరాస్యులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక, తమిళనాడు, కేరళ, బంగాల్?లో సర్ నిర్వహించడాన్ని ప్రత్యేకంగా సవాల్ చేసిన పిటిషన్ల విచారణకు సుప్రీం షెడ్యూల్ చేసింది. డిసెంబరు 1లోపు వీటిపై స్పందన తెలియజేయాలని ఈసీని కోరింది. మరోవైపు, దిల్లీలో వాతావరణ కాలుష్యం అధికంగా ఉన్నందున వర్చువల్ విధానంలో విచారణలను చేపట్టే యోచనలో సుప్రీంకోర్టు ఉంది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను నిర్వహించాలన్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ తాను అనారోగ్యానికి గురైన విషయాన్ని వెల్లడించారు. వర్చువల్ విధానంలో విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు విజ్ఞప్తి చేశారు. ఉదయపు నడకకు వెళ్లినప్పుడు తీవ్ర కాలుష్యం కారణంగా తాను కూడా అస్వస్థతతకు గురయ్యానని సీజేఐ వెల్లడించారు. అరవై ఏళ్లకు పైబడిన న్యాయవాదులు వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. బార్ అసోసియేషన్ అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దశాబ్దానికిపైగా తీవ్ర అస్వస్థతకు గురై అచేతన స్థితిలో, స్పృహ లేకుండా ఉన్న 31ఏళ్ల యువకుడికి కారుణ్య మరణాన్ని ప్రసాదించేందుకు సంబంధించి వైద్య మండలిని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోయిడా జిల్లా ఆస్పత్రికి జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం బుధవారం సూచనలు చేసింది. ఆ యువకుడి తండ్రి చేసిన కారుణ్య మరణం అభ్యర్థనపై వైద్యపరమైన అన్ని అంశాలను పరిశీలించి రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని తెలిపింది.

# సమస్యల మూలాలను గుర్తించాలి

**వాయు కాలుష్యం సమస్య దిల్లీ సతమతం**

**కాలుష్యం ప్రతి ఒక్కరిని వేధిస్తున్న అంశం**

**మాదగ్గర వద్ద 'మంత్రదండం' లేదు**

**సమస్యను తక్షణమే పరిష్కరించండి**

**దిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని దిల్లీ- ఎన్‌సీఆర్‌లో పెరుగుతున్న వాయు కాలుష్యం సమస్యపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వాయు కాలుష్యం సమస్య దిల్లీలో నివసిస్తున్న ప్రతి ఒక్కరిని వేధిస్తున్న అంశమని ధర్మాసనం పేర్కొంది. దిల్లీలో కాలుష్య దుస్థితి నేపథ్యంలో ఈ అంశంపై తక్షణమే విచారణ జరపాలని సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ చేసిన విజ్ఞప్తిని సీజేఐ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించడానికి తమ వద్ద 'మంత్రదండం' లేదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. దిల్లీలో వాయు కాలుష్యం పెరగడానికి గల మూలాలను మొదటగా గుర్తించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఆ తర్వాతే పరిష్కారాలను కనుగొనగలమని అభిప్రాయపడ్డారు. కాలుష్యం అంశాన్ని విచారణకు స్వీకరిస్తాం. అయితే, దీనికి త్వరగా పరిష్కారాలు కనుగొనడానికి మా వద్ద మంత్రదండం లేదు. సమస్యలను గుర్తించి వాటికి అవసరమైన పరిష్కాలను కనుక్కోవాలి. ఈ సమస్యకు గల అన్ని కారణాలను గుర్తించాలి. కాలుష్యం సమస్యకు ఒక కారణం ఉండదు. బహుశా ప్రజలు ఒకే కారణం ఉండవచ్చని భావించవచ్చు. కానీ, కాలుష్యానికి అనేక కారణాలు దోహదం చేస్తాయి. ప్రతి కారణానికి పరిష్కారాలను శాస్త్రవేత్తలు మాత్రమే కనుక్కోగలరు. ప్రభుత్వం ఏదైనా పరిష్కారంతో ముందుకు వచ్చి ఉంటుందని మేము ఆశిస్తున్నాం. కాలుష్యంపై మేము సైతం నిరంతరం పర్యవేక్షణ చేపడుతాం. సోమవారం ఈ అంశంపై విచారణ చేపడుతామని అన్నారు. అంతకుముందు జస్టిస్ బీఆర్? గవాయ్ సీజేఐగా ఉన్నప్పుడు ఆయనతో కూడిన ధర్మానసం వాయు కాలుష్య సమస్యపై విచారణ చేపట్టింది. రాజధాని పరిసర ప్రాంతాలను ఉద్దేశించి ప్రస్తావించింది. పంజాబ్?, హరియాణా, రాజస్థాన్ ప్రభుత్వాలు కాలుష్యాన్ని తగ్గించడానికి నివారణ చర్యలు చేపట్టాలని, క్రమం తప్పకుండా సమీక్ష?లు నిర్వహించాలని ఆదేశించింది. ఈ విషయాలను కోర్టులు కూడా తప్పకుండా పర్యవేక్షించాలని పేర్కొంది. కాలుష్యాన్ని అరికట్టడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు సూచించింది. శీతాకాలంలో ఉత్తరాది రాష్ట్రాల్లో గాలి నాణ్యతను మరింత దిగజార్చే కారకాల్లో ఒకటైన పంట వ్యర్థాలు తగలబెట్టడం అరికట్టాలని తెలిపింది. అయితే ఈ విషయంపై పంజాబ్?, హరియాణాల నుంచి నివేదికలను కూడా అప్పట్లో న్యాయస్థానం కోరింది.మరోవైపు వాయు కాలుష్య సమస్యపై శాస్త్రీయంగా ప్రణాళికాబద్ధమైన, పౌర ఆధారిత హరిత వ్యూహాన్ని రూపొందించాలని కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ దిల్లీ-ఎన్‌సీఆర్‌లోని రాష్ట్రాలను ఆదేశించారు. దిల్లీ, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్ అటవీ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పచ్చదనం పెంపు విషయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అటవీ భూమి, రక్షిత ప్రాంతాలు, నదీ పరీవాహక ప్రాంతాలు, చిత్తడి నేలలు, క్షీణించిన అడవులు, నర్సరీల వంటి వాటిని పరిగణించాలని ఆదేశించారు.

## జవాబుదారీతనం తప్పనిసరి

**న్యూఢిల్లీ :** సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌కు ఎవరో ఒకరు తప్పనిసరిగా బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సొంతంగా ఛానల్ ప్రారంభించినంత మాత్రాన ఎవరికీ జవాబుదారీగా ఉండననుకోవడం సరికాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియాకు సంబంధించిన ఓ వివాదంపై గురువారం విచారణ సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంపై అభ్యంతరకర ప్రశ్నలు అడిగిన ఘటనలో రణ్‌వీర్ వివాదాస్పదుడయ్యారు. ఈ కేసు విచారణకు రాగా, ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. "అసభ్యకరమైన కంటెంట్ అప్‌లోడ్ చేస్తే అది వైరల్ అవుతుంది, లక్షల మంది చూస్తారు. దీన్ని ఎలా నియంత్రిస్తారు? దేశ వ్యతిరేక కంటెంట్ పెట్టినప్పుడు దానికి సదరు క్రియేటర్ బాధ్యత వహిస్తారా?" అని కేంద్రాన్ని ప్రశ్నించింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశం కాదని, యూజర్లు సృష్టించే కంటెంట్‌లోని లోపాలను ఇది ఎత్తిచూపుతోందని అన్నారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను వక్రీకరించకూడదని ఆయన పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం, ఆన్‌లైన్ కంటెంట్‌ను పర్యవేక్షించే వ్యవస్థ ఉన్నప్పటికీ ఇలాంటివి ఎందుకు జరుగుతున్నాయని కేంద్రాన్ని నిలదీసింది. సోషల్ మీడియాలో వినియోగదారులు సృష్టించే కంటెంట్‌ను నియంత్రించేందుకు సరైన నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. ఇందుకు కేంద్రానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది.

# ఆర్టీసీ బస్సులో నాటుబాంబులు

## బస్సులో 1000 నాటుబాంబుల రవాణా

**విజయనగరం :** అది ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉండే బస్టాండ్. ఒక్కసారిగా భారీ శబ్దం. దట్టమైన పొగలు. కారణం, ఆర్టీసీ బస్సులో వచ్చిన ఓ పార్శిల్‌లో ఏకంగా 1000 నాటుబాంబులు ఉండటమే. అవును, మీరు విన్నది నిజమే. ఇటీవల పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జరిగిన నాటుబాంబుల పేలుడు ఘటన, ఆర్టీసీ కార్గో సేవల్లోని భద్రతా వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. బస్సులో వచ్చిన పార్శిల్‌ను దించే క్రమంలో జరిగిన ఈ పేలుడులో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అసలు ఆ మూటలో ఏముందో తెలియకుండానే బస్సులో ఎక్కించేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ప్రయాణికులను చేరవేయడంతో పాటు, అదనపు ఆదాయం కోసం ఆర్టీసీ 2017లో కార్గో (పార్శిల్) సేవలను ప్రారంభించింది. తక్కువ ధరకే వస్తువులను పంపించే వెసులుబాటు ఉండటంతో దీనికి మంచి ఆదరణ లభించింది. రోజురోజుకూ ఆదాయం రెట్టింపు అవుతోంది. విజయనగరం జోన్ పరిధిలోనే రోజుకు సుమారు 250 వరకు బుకింగ్‌లు జరుగుతున్నాయి. దీని ద్వారా రోజుకు రూ.40 వేల వరకు, నెలకు రూ.12 లక్షల ఆదాయం సమకూరుతోంది. నిత్యం ఈ సేవలను ఆశ్రయించేవారు 40 మంది వరకు రెగ్యులర్ కస్టమర్లు ఉన్నారు. అయితే, ఆదాయంపై పెట్టిన శ్రద్ధ, భద్రతపై పెట్టకపోవడమే ఇప్పుడు కొంప ముంచుతోంది.ప్రస్తుతం ఆర్టీసీ కార్గో బుకింగ్ వ్యవస్థను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. బుకింగ్ కౌంటర్లలో స్కానర్ పరికరాలు లేవు. లోపల ఏ వస్తువు ఉందో సాంకేతికంగా గుర్తించే వ్యవస్థ లేదు. పార్శిల్ పైన ఒక పేరు రాసి ఉంటే, లోపల మరో వస్తువు ఉంటోంది. కేవలం బరువును మాత్రమే చూసి, డబ్బులు తీసుకుని రశీదు ఇచ్చేస్తున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గంజాయి, గుట్కా, ఇప్పుడు ఏకంగా నాటుబాంబులు వంటి నిషేధిత వస్తువులను దర్జాగా ఆర్టీసీ బస్సుల్లో తరలిస్తున్నారు.ప్రైవేట్ కొరియర్ సర్వీసులతో పోలిస్తే ఆర్టీసీలో ఛార్జీలు చాలా తక్కువ. పైగా ఆర్టీసీ బస్సులు మారుమూల గ్రామాల వరకు వెళ్తాయి. ఇదే అక్రమార్కులకు వరంగా మారింది. ఏజెన్సీ సిబ్బందిలో తెలిసిన వారు ఉంటే చాలు, ఎలాంటి తనిఖీలు లేకుండానే అనుమానాస్పద వస్తువులను పంపించేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు మూట కట్టి తెచ్చిన వస్తువును యథాతథంగా బస్సు ఎక్కించేస్తున్నారు. అది ప్రయాణికుల పాలిట యమపాశంగా మారుతున్నా పట్టించుకునే నాథుడే లేడు.లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా, పర్యవేక్షణ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. కార్గో విభాగానికి మూడు జిల్లాల పరిధిలో (విజయనగరం జోన్) కేవలం ఒక్కరే సూపర్‌వైజర్ ఉన్నారు. డిపోల పరిధిలో డిపో మేనేజర్లు (డీఎంలు) పర్యవేక్షించాల్సి ఉన్నా, పని ఒత్తిడి కారణంగా అది జరగడం లేదు. నిఘా కొరవడటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.ఈ పరిస్థితిపై విజయనగరం డిపో కమర్షియల్ విభాగం అసిస్టెంట్ మేనేజర్ హెచ్. దివ్య స్పందించారు. స్కానర్లు వంటి ప్రత్యేక పరికరాలు కావాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. రూ.5 వేలు విలువ దాటిన వస్తువులకు తప్పనిసరిగా బిల్లు అడుగుతున్నామని, ఇకపై అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.ఏది ఏమైనా, పార్వతీపురం ఘటన ఒక హెచ్చరిక మాత్రమే. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు మేల్కొని, కార్గో కేంద్రాల్లో స్కానర్లు ఏర్పాటు చేసి, కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టకపోతే, సామాన్య ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం పొంచి ఉంది.

# టీటీడీ జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం అరెస్ట్

**అమరావతి :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కొనుగోలు విభాగం జనరల్ మేనేజర్ (జీఎం) కె. సుబ్రహ్మణ్యంను గురువారం అరెస్ట్ చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు కాంట్రాక్టర్లు, వ్యాపారులు అరెస్ట్ కాగా, టీటీడీకి చెందిన ఓ ఉన్నతాధికారిని అదుపులోకి తీసుకోవడం ఇదే తొలిసారి. ఈ అరెస్టుతో కేసులో మొత్తం నిందితుల సంఖ్య 10కి చేరింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన సిట్, కల్తీ నెయ్యి సరఫరాలో జీఎం సుబ్రహ్మణ్యం పాత్ర ఉందని గుర్తించింది. కొనుగోలు ప్రక్రియలో అవకతవకలకు పాల్పడటంతో పాటు, నాణ్యత లేని నెయ్యి సరఫరాకు ఆయన సహకరించారని బలమైన ఆరోపణలు ఉన్నాయి. గతంలో నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్లను విచారించగా వెల్లడైన వివరాల ఆధారంగా సుబ్రహ్మణ్యంను అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. అరెస్టు చేసిన అనంతరం సుబ్రహ్మణ్యంను తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన్ను నెల్లూరులోని ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు సిట్ అధికారులు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ఆయన్ను రిమాండ్‌కు తరలించే అవకాశం ఉంది. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై ఏపీ హైకోర్టు ఆదేశాలతో మొదలైన దర్యాప్తు, సుప్రీం కోర్టు పర్యవేక్షణలో కొనసాగుతోంది.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## సంపాదకీయం

# రైతులను దెబ్బతీస్తున్న తుఫాన్లు!

మరో తుఫాన్ ద్వితాహ్ దూసుకుని వస్తోంది. అంది ఎంతటి బీభత్సం సృష్టిస్తుందో అన్న బెంగపట్టుకుంది.తుఫాన్లు వచ్చినప్పుడల్లా రైతన్నలు వణుకుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏ ఒక్క రైతుకు సక్రమంగా నష్టపరిహారం అందడం లేదు. అందుకే తుఫాన్లు వస్తున్నాయంటే రైతులకు కన్నీరు రావడంతో పాటు, కంటిమీద కునుకు లేకుండా పోతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఊకదంపుడు ఉపన్యాసాలతో రైతులను ముంచేస్తున్నారు. అటు కేంద్రం ఆలస్యంగా సర్వే బృదాలను పంపడం, వారు లెక్కలు వేసి పంపే అరకొర సాయం ఎప్పుడో రైతుల ఖాతాల్లోకి పడుతుందో తెలియని దుస్థితి ఉంది. అందుకే ఇప్పుడు పంటలను త్వరగా అమ్ముకునే దుస్థితిలో ఉన్నారు. తుఫాన్ రానుందన్న హెచ్చరికలతో ధాన్యం నూర్పి అమ్మకాలు సాగిస్తున్నారు.తీరప్రాంతం ప్రకృతి విపత్తులకు శాశ్వత కేంద్రంగా మారింది. రైతులు, వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులతో పాటు వివిధ వృత్తులపై ఆధారపడే లక్షలాది మంది ప్రతి ఏటా ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నారు. భౌగోళిక పరిస్థితుల కారణంగా సహజ విపత్తుల కడలిలో మనుగడ సాగించక తప్పని స్థితి దాపురించింది. ప్రతి ఏడాది రాష్ట్రంపై తుపాన్లు విరుచుకుపడుతున్నాయి. ఈ ఏడాది విరుచుకుపడిన మొంథా తుపాను కూడా తీరని నష్టాన్నే మిగిల్చింది. ఇప్పటికీ అనేకమందికి సరైన పరిహారం అందడం లేదు. ప్రభుత్వాలు ప్రకటించే సాయం అరకొరగా ఉంటున్నాయి. ఇటీవల నష్ట తీవ్రతను అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి రైతులు ఇదే విషయాన్ని వివరించారు. తుపాన్ల కారణంగా రాష్ట్రం తరచూ ప్రభావితవ-ఔతోందని, ముందస్తు హెచ్చరికలు చేస్తున్నా, నష్టాన్ని నివారించలేకపోతున్నామంటూ కేంద్ర బృందానికి సిఎం చంద్రబాబు కూడా చెప్పారు. పెరిగిన సాంకేతికత కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించినప్పటికీ, పంట నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని అదుపు చేయడం సాధ్యం కావడం లేదు. పైగా వాతావరణ మార్పుల కారణంగా విపత్తుల తీరు కూడా మారింది. ఊహించని చోట, ఊహించని విధంగా గంటల తరబడి కుండపోతగా వర్షం కురవడం, వాగులు, వంకలు పొంగి అనూహ్య వరదలు చోటు చేసుకోవడం, విపరీతమైన వేగంతో గాలి వీచడం వంటి వైపరీత్యాలు సాధారణంగా మారుతున్నాయి. దీంతో నష్టం భారీగా పెరుగుతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. నిజానికి మొంథా తుపాన్ ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలోని 443 మండలాల్లోని 3,109 గ్రామాలు తుపాను బారినపడ్డాయి. దాదాపు 10 లక్షల మంది ప్రజలు తుపాను కారణంగా తీవ్రంగా ప్రభావితమయ్యారు. 1.11 లక్షల మంది నిరాశ్రయులైనారు. 1.61 లక్షల హెక్టార్లలో పంటలు నీట మునిగి, 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టమూ ఉంది. అయితే, ప్రభుత్వం రూపొందించిన ఈ లెక్కల మీద కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో 6,384 కోట్ల రూపాయల నష్టం సంభవించినట్లు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు రూపొందించిన నివేదికలో వ్యవసాయం, మత్స్యకార, చేనేత, పశు సంవర్ధక రంగాలతో పాటు విద్యుత్, రహదారులు, ఇళ్లు, విద్యా సంస్థలు తీవ్రంగా దెబ్బ తిన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. తక్షణ సాయంగా 2,622 కోట్ల రూపాయలు విడుదల చేయాలని, తీరప్రాంతంలో సముద్ర కోత నివారణ పనుల కోసం ఉప్పాడకు రూ.323 కోట్లు, విశాఖ సమీప ప్రాంతాలకు రూ.203 కోట్లు, శ్రీకాకుళం ప్రాంతానికి రూ.98 కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. పంటల బీమా లేకపోవడంతో నష్టాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించి చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్యూమరేషన్ సమయంలో తమను విస్మరిస్తున్నారంటూ కౌలు రైతులు అనేకచోట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటే నష్ట తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంది. గతంతో పోలిస్తే నష్టం అంచనా కోసం కేంద్ర బృంద త్వరగా పర్యటించి, అంచనాలు వేసినా అవి డబ్బురూపంలోకి వచ్చేది ఎప్పుడో చెప్పలేం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగానే స్పందించిది. అయితే, ఇదొక్కటే చాలదు. కేంద్ర బృందం పర్యటించినంత మాత్రాన నిధులు ఇచ్చినట్లు కాదు. కష్టకాలంలో రాష్ట్రాన్ని ఆదుకోవాలన్న చిత్తశుద్ధి కేంద్రానికి ఉండాలి. విపత్తుల సమయంలో నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించే వ్యవస్థ రావాలి. అత్యవసర సాయం కింద ఎంతో, కొంత నిధులు వెంటనే ఇచ్చేలా ఏర్పాటు చేయాలి. ఈ నేపథ్యంలో విపత్తు అంచనాలు లెక్కకట్టేందుకు వచ్చే కేంద్ర బృందం పర్యటన తరువాతైనా కేంద్రం ఉదారంగా స్పందించాలి. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన తక్షణ సాయాన్ని వెంటనే విడుదల చేయడంతో పాటు, పూర్తిస్థాయి పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా విడుదల చేయగలగాలి. హుద్‌హుద్ తుపాన్ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యాన్ని రాష్ట్ర ప్రజలు మరచిపోలేదు. అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చూసుకోవాలి. అదే సమయంలో రైతులు, కౌలురైతులతో పాటు నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే! ఆ మేరకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధపడాలి. అలాగే ఇందుకోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకుని రావాలి. ప్రత్యేక నిధి ఉంటే తుపాన్ల సమయంలో నష్టపోయిన రైతులకు, ప్రజలను తోణం అదుకునే వీలుంటుంది.

# డేటా సెంటర్ల హబ్‌గా మారనున్న విశాఖి

**మూడు నాలుగేళ్లలో దిగ్గజ సంస్థల ఏర్పాటు**

**విశాఖపట్నం,నవంబర్27 :**

విశాఖపట్నం మూడు నాలుగేళ్లలో డేటా సెంటర్ల హబ్‌గా మారనుంది. ప్రపంచ దిగ్గజ సంస్థలు డేటా సెంటర్ల ఏర్పాటుకు విశాఖకు వరుస కట్టాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ డిజిటల్ కనెక్షన్స్‌తో కలిసి జాయింట్ వెంచర్‌గా 1,000 మెగావాట్ల డేటా సెంటర్‌ను విశాఖలో 400 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనుంది. రూ.98 వేల కోట్లతో ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను 2030 నాటికి అందుబాటులోకి తేనుంది. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో ఆ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిసి ప్రతిపాదన పై చర్చించారు.డేటా సెంటర్ ఏర్పాటుకు అవసరమైన భూములు, ఇతర అంశాల గురించి తుది చర్చలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వంతో రిలయన్స్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడులతో 1,000 మెగా వాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ఇప్పటికే ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నా విషయం తెలిసిందే. మరో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ అయిన బ్రూక్‌ఫీల్డ్ సైతం రూ.1.10 లక్షల కోట్లతో విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. సిఫీ టెక్నాలజీస్ రూ.16 వేల కోట్ల పెట్టుబడితో విశాఖలో డేటా సెంటర్ కాంప్లెక్స్ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించింది.విశాఖలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 400 ఎకరాల్లో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోంది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న 1,000 మెగావాట్ల డేటా సెంటర్‌కు అనుబంధంగా ఇది పని చేయనుంది. మాడ్యులర్ సాంకేతికతల గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్ , టెన్సర్ ప్రాసెసింగ్ యూనిట్, ఏఐ ప్రాసెసర్ల ద్వారా డేటా నిల్వ చేసేలా అత్యాధునిక సాంకేతికతతో వివిధ సంస్థల అవసరాలకు అనుగుణంగా వాటిని సంస్థ తీర్చిదిద్దనుంది. సబ్‌స్టేషన్లు, అవసరమైన విద్యుత్ ఫీడర్లతో భవిష్యత్తు దశాబ్ద ఆవిష్కరణలకు వీలుగా దీన్ని ఏర్పాటు చేయాలనుకుంటోంది. ఆసియాలో అత్యంత శక్తిమంతమైన ఏఐ మౌలిక సదుపాయాలున్న నెట్‌వర్క్‌లలో ఒకటిగా రిలయన్స్ డేటా సెంటర్ ఉండబోతోందని అధికారులు తెలిపారు. విశాఖలో 6,000 మెగావాట్ల డేటా సెంటర్లు ఏర్పాటు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. వాటిని 2030 నాటికి అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే గూగుల్, రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ కలిపి 3 వేల మెగావాట్ల డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. మరో మూడు ప్రముఖ అంతర్జాతీయ సంస్థలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాయి. వాటికి అవసరమైన భూములు, ఇతర సదుపాయాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాబోయే మూడు నెలల్లో వాటికీ అనుమతులు ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.విశాఖలో 1,000 మెగావాట్ల హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రిలయన్స్-డిజిటల్ కనెక్షన్ జాయింట్ వెంచర్ రూ.98 వేల కోట్ల పెట్టుబడి పెడుతుందన్న విషయాన్ని వెల్లడిరచడం సంతోషాన్ని కలిగిస్తోందని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. విశాఖ భారతదేశ డేటా రాజధానిగా అవతరించబోతోందని పేర్కొన్నారు.

# తిరుపతి నగరంలో వసుదైక కుటుంబం

- **600 ఎకరాల విస్తీర్ణంలో మెగా టౌన్‌షిప్**
- **3వేల కోట్ల పెట్టుబడితో డెల్లా గ్రూప్ సిద్ధం**

**వివరాలు వెల్లడించన మంత్రి అనగాని సత్యప్రసాద్**

**అమరావతి,నవంబర్27 :**



తిరుపతి నగరంలో 600 ఎకరాల విస్తీర్ణంలో రూ. 3,000 కోట్ల వ్యయంతో మెగా ఆధ్యాత్మిక టౌన్‌షిప్ నిర్మించేందుకు డెల్లా గ్రూప్ ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్ట్‌కు రాష్ట్ర రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడిరచారు.. తిరుపతిలో త్వరలో చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్ వివరాలను మంత్రి అనగానికి డెల్లా గ్రూప్ ప్రతినిధులు వివరణాత్మకంగా వివరించారు. ఈ టౌన్‌షిప్‌లో 5 వేల ఏళ్ల హిందూ మత సాంస్కృతిక చరిత్రను ప్రతిబింబించే ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. డెల్లా గ్రూప్ ప్రతినిధులు ప్రాజెక్ట్ ప్రధాన ఆకర్షణగా 'వసుదైక కుటుంబం' పేరిట ప్రపంచ సేవలు, ధార్మిక అధ్యయనం, సాంస్కృతిక వారసత్వ ప్రదర్శనలు, వసతి, విద్య, వినోదం వంటి సేవలను ఒకేచోట ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కేవలం నిర్మాణ ప్రణాళిక కాకుండా, భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతను ప్రపంచానికి పరిచయం చేసే గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. త్వరిత అనుమతుల కోసం మంత్రి హామీ ఇచ్చారు.. ప్రతినిధుల విజ్ఞప్తికి స్పందించిన మంత్రి అనగాని మాట్లాడుతూ.. ఈ భారీ ఆధ్యాత్మిక ప్రాజెక్ట్‌ను రాష్ట్రం స్వాగతిస్తోంది. టౌన్‌షిప్ నిర్మాణానికి కావాల్సిన అనుమతులు త్వరగా లభించేలా ప్రభుత్వం సహకరిస్తుందన్నారు.. అలాగే, ఈ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కూడా చర్చిస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్‌తో తిరుపతికి కొత్త గుర్తింపు వస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు అనగాని.. ఈ టౌన్‌షిప్ నిర్మాణం పూర్తయితే.. ఆధ్యాత్మిక టూరిజం, అంతర్జాతీయ పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు, సాంస్కృతిక`పర్యాటక అభివృద్ధి.. వంటి రంగాల్లో తిరుపతి కొత్త స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టుపై త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన చేసే అవకాశముంది.

# రైతులపై మొసలి కన్నీరు ఆపండి

- **మీ ఐదేళ్ల పాలనలో ఎలా ఉండేదో తెలుసు**
- **రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాం**
- **24గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నాం**
- **వైసిపి నేతల విమర్శలను తిప్పికొట్టిన మంత్రి నాదెండ్ల**

**విజయవాడ,నవంబర్ 27 :**

ఐదేళ్ల పాటు రైతులను కనీసంగా కూడా పట్టించుకోని వైకాపా ఇప్పుడు రైతుల గురించి మొసలి కన్నీరు కార్చడం వింతగా ఉందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. ధాన్యం సేకరణ మొదలు, వారికి వివిధ రకాల సాయం అందించడంలో గత ఐదేళ్లలో ఎలా ఉండేదో రైతులే చెబుతారని అన్నారు. రైతులకు రూపాయి నష్టం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ మంత్రి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 24 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని.. అయినా వైసీపీ నేతలు అన్యాయంగా అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.1674 కోట్లు బకాయిలు పెట్టి పారిపోయిన వైసీపీ నేతలా రైతుల పక్షాన మాట్లాడేది అంటూ ్గaర్ అయ్యారు. ఇప్పటి వరకు 8 లక్షల 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వెల్లడిరచారు. కృష్ణా జిల్లాలో లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం రికార్డ్ అని తెలిపారు. గోదావరి జిల్లాల నుంచి లక్ష టన్నుల పైనే ధాన్యం సేకరించామని చెప్పారు. అధికారులు రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నారని.. వారి మనోధైర్యం దెబ్బ తీసేలా వైసీపీ నేతలు నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కృష్ణా జిల్లాలో 2022`23 ఖరీఫ్‌లో కేవలం 13వేల 560 మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని.. 2023`24లో 16 వేల 978 మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారని తెలిపారు. తాము మాత్రం లక్షా 7 వేల 960 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని చెప్పుకొచ్చారు. ఖరీఫ్, రబీలో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లో ట్రాన్స్ పోర్టు వాహనాల బకాయిలు నేడు రూ.9 కోట్లు చెల్లించామని మంత్రి చెప్పారు. 7 కోట్ల 53 లక్షల గోనె సంచులను ఏర్పాటు చేశామన్నారు. సీఎం సూచనలతో లక్ష సంచులు అదనంగా సిద్ధంగా ఉంచామని తెలిపారు. మూడు నెలల్లో జరగాల్సిన పక్రియ.. వాతవరణంలో వచ్చిన మార్పులతో ముందే ధాన్యం సేకరించామని చెప్పుకొచ్చారు. రైతుల ఆందోళనను గుర్తించి.. ప్రభుత్వం చాలా వేగంగా స్పందించిందన్నారు. రైతులు కూడా అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి ఇంత పెద్ద కార్యక్రమం చేస్తున్నామంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చే సూచనలు, ప్రోత్సాహం వల్లే అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కొంతమంది మాఫియాగా ఏర్పడి రైతులను ఇబ్బందులు పెట్టడానికి వారి స్వలాభం కోసం డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. తాము పూర్తి పారదర్శకత కోసం వాహనాలకు జీపీయస్ ఏర్పాటు చేస్తే.. దళారులు రైతులను మాయ మాటలతో మోసం చేస్తున్నారన్నారు.

### పార్లమెంట్ సమావేశాలపై

# టిడిపి వ్యూహం

## పార్టీ ముఖ్యులతో సిఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి,నవంబర్27 :**

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశమైంది. గురువారం రాజధాని అమరావతిలోని ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ముఖ్యనేతలతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, కేంద్రం నుంచి రావాల్సిన ప్రయోజనాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సందర్భంగా చర్చించారు. మరోవైపు ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోంది. దీంతో ఏపీలో అభివృద్ధికి కేంద్రం తన వంతు సహాయ సహకారాలు అందిస్తుంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ఇవి డిసెంబర్ 19వ తేదీతో ముగుస్తాయి. 2014లో ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ తొలిసారి బాధ్యతలు చేపట్టారు. ఆయన అధికారం చేపట్టిన తర్వాత జరుగుతున్న శీతాకాల సమావేశాల్లో ఇది అత్యంత తక్కువ కాలం. అంటే కేవలం 19 రోజులు మాత్రమే ఈ సమావేశాలు జరగనున్నాయి.

# ఎస్సీ,ఎస్టీలకు మాదిరి దివ్యాంగులకు రక్షణ

- **కఠిన చట్టాలు అవసరమన్న సుప్రీం ధర్మాసనం**

**న్యూఢిల్లీ, నవంబర్ 27 :**

దివ్యాంగులకు కూడా రక్షణ కవచం ఉండాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడిరది. వారినికించపరిచే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఎస్సీ/ఎస్టీ చట్టం లాంటి కఠినమైన చట్టాలు అవసరమని సుప్రీం కోర్టుపేర్కొంది. ఈ దిశగా ఆలోచన చేయాలని కేంద్రానికి సూచించింది. యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించి పిటిషన్ల విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కండరాల క్షీణత సమస్యపై అవగాహన కల్పిస్తూ బాధితులతో కలిసి ఓ ప్రదర్శన నిర్వహించాలని ఈ సందర్భంగా సమయ్ రైనాకు సుప్రీం కోర్టు సూచించింది. ఓ ఆన్‌లైన్ షోలో వెన్నెముక కండరాల క్షీణతతో బాధపడుతున్న ఓ చిన్నారికి అవసరమైన ఔషధాల గురించి ప్రస్తావిస్తూ వారిని కించపరిచే విధంగా సమయ్ రైనా మాట్లాడాడు. ఈ షోలో పాల్గొన్న వారిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ అరుదైన వ్యాధిపై పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం.. ఆ షోలో పాల్గొన్న వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు సమయ్ రైనా క్షమాపణలు చెప్పాడు.రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాలకు సంబంధించిన పిటిషన్లను సుప్రీం కోర్టు నేడు విచారించింది. బాధితుల తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్.. కమెడియన్ వ్యాఖ్యలు చిన్నారులను కించపరిచేలా ఉన్నాయని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకున్న సత్యారావు



హుకుంపేట నవంబర్ 27 (మనసులు మాట)... రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, విద్యార్థులను ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి విదేశాలకు పంపించి, అక్కడి విద్యా విధానాలు, బోధనా నైపుణ్యాల వినియోగంపై అధ్యయనం చేయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం మత్యాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోస్య సత్యారావు ఎంపికయ్యారు. ఆయన విద్యార్థులను తనదైన శైలిలో, వినూత్న పద్ధతులతో బోధిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. పాఠశాలలో ప్రవేశాలు పెరగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఏపీఆర్ పాఠశాలల్లో సీట్లు వచ్చేలా ప్రత్యేక తర్ఫీదు అందించడం విశేషం. ఈ సేవలకు గానూ ఆయన 2025 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతగా ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విదేశీ విద్యా అధ్యయన కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ నెల 27 నుంచి డిసెంబర్ 2 వరకు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు.మోస్య సత్యారావు హుకుంపేట మండల ఏపిటీఎఫ్ మండల అధ్యక్షులుగా కూడా బాధ్యతలు నిర్వహిస్తూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎనలేని సేవలు అందిస్తున్నారు. విద్యాబోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, అందరితో మెలిసి, ఉదార స్వభావం కలిగిన మిత్రుడిగా మంచి గుర్తింపు పొందారు.

# పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

- కొత్తపెంటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.2389బీ సాధారణానికి రూ.2369 మద్దతు ధర
- రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ విజయకృష్ణన్
- 24 గంటల్లో రైతుల ఖాతాల్లోకి చెల్లింపులు: మాడుగుల ఎమ్మెల్యే బండారు





దేవరాపల్లి, నవంబర్ 27(మనసులో మాట): జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మొత్తం 65 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణను వేగంగా, నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. గురువారం ఉదయం దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామంలో కలెక్టర్ జిల్లా పర్యటన చేపట్టారు. అక్కడి రైతు సేవా కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తితో కలిసి ప్రారంభించి, అనంతరం రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని, దళారీ వ్యవస్థకు దూరంగా ఉండాలని, కోత,నూర్పిడి అనంతరం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ఇవ్వాలని రైతులకు సూచించారు. కొనుగోలు రిజిస్ట్రేషన్, గ్రేడింగ్, మాయిశ్చర్ చెక్ వంటి ప్రక్రియలను పరిశీలించిన కలెక్టర్, రైతులతో, సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలను వివరించారు. గ్రేడ్ 'ఏ' రకం ధాన్యానికి క్వింటాకు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 చెల్లిస్తున్నట్లు తెలిపారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దేవరాపల్లి మండలంలో 6 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. రైతు దగ్గర నుండి కొనుగోలు కేంద్రం వరకూ బస్తా వేయడం, లోడింగ్, రవాణా వంటి అన్ని ఖర్చులను ప్రభుత్వం భరిస్తోందని, రైతు నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయరాదని స్పష్టం చేశారు. ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో 24 గంటల్లోపే చెల్లింపులు జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయేషా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె.వి.ఎల్.ఎన్. మూర్తి, సివిల్ సప్లైస్ మేనేజర్ పి. జయంతి, వ్యవసాయ అధికారిణి ఆశాదేవి, రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ చైర్మన్ పి.వి.జి. కుమార్, అధికారులు, తహశీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీవో ఎం.వి.సువర్ణ రాజు,మండల వ్యవసాయ అధికారిణి ఎల్. వై. కాంతమ్మ, సర్పంచ్ రొంగల వెంకటరావు, మండల టిడిపి అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ,మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, చిరికి గోవింద,సిబ్బంది పాల్గొన్నారు.



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ

# నూతన అంబులెన్స్

- ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్

పాడేరు, నవంబర్ 27 ( మనసులో మాట) : అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్రాంచ్ కు సంబంధించి రెడ్ క్రాస్ సేవలు విస్తృతం చేసేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నూతన అంబులెన్స్ కొనుగోలు చేసింది. జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ తిరుమణి శ్రీ పూజ, అసిస్టెంట్ కలెక్టర్ కె. చిరంజీవి నాగ వెంకట సాహిత్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నూతన అంబులెన్స్ ను లక్ష్మీవారం ఉదయం జెండా ఊపి ప్రారంభించారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం విస్తృతంగా పనిచేస్తుందని, అధికారులందరూ రెడ్ క్రాస్ సొసైటీ కి సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యవర్గం పూర్తిస్థాయిలో పనిచేస్తుందని అన్నారు. డిసెంబర్ లో జనరల్ బాడీ నిర్వహించి పూర్తిస్థాయిలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఎంపీడీవోలు, తహసిల్దార్లు, మండల విద్యాశాఖ అధికారూలతో టీముగా ఏర్పాటు చేసి విరివిగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దీనికి సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారుచేసి ఆయా మండలాల అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని అన్నారు. రక్తపు నిలువలను పెంచేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తూ, రక్తదాన శిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపడతామని అన్నారు. పాడేరు డివిజన్ పరిధిలో రెడ్ క్రాస్ సొసైటీ వాహనాన్ని వినియోగించుకోవాలని పాత వాహనాన్ని చింతూరు ప్రాంతంలో అప్పగించి చింతూరు, రంపచోడవరం ప్రాంతానికి పనిచేస్తుందని, చింతూరు ప్రాజెక్టు అధికారి, ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీని జిల్లాలో మరింత బలంగా పనిచేసేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు మాట్లాడుతూ జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ విస్తరణకు జిల్లా కలెక్టర్ విశేష కృషి చేస్తున్నారని అదే చొరవతో జిల్లా అధికారులంతా తమకు సహకారం అందించాలని కోరారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాలు నిర్వహిస్తామని తెలిపారు. గతంలో ఓ నూతన వాహనాన్ని కొనుగోలు చేసి విశాఖపట్నం కేజీహెచ్ లో ఎస్టీ సెల్ కు అప్పగించామని దానిని గిరిజన రోగుల కోసం వినియోగించుకుంటున్నారని అన్నారు. వాహన ప్రారంభోత్సవానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులకు ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగరాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, రెడ్ క్రాస్ మెంబర్స్ జిల్లా కలెక్టర్ కు పూల బొకేతో ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి ఏం వి ఎస్ లోకేశ్వరరావు,రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి సూర్యారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తమర్బా ప్రసాద్ నాయుడు, సుబ్రహ్మణ్యం, రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీసీ లో

# జిల్లా కలెక్టర్

పాడేరు, నవంబర్ 27 ( మనసులో మాట ): కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ల ఆదేశాల మేరకు చేపట్టే అన్ని రకాల ప్రక్రియలపై, అన్ని అంశాలపై బీఎల్వోలు సమగ్ర అవగాహన శిక్షణ కలిగి ఉండాలని, ఆ మేరకు ఈఆర్వోలు, ఏఈఆర్వోలు క్రమం తప్పకుండా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ అన్నారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక కలెక్టరేట్ వీసీ హాలు నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏ ఎస్ ఆర్ (పాడేరు) జిల్లాకు సంబంధించిన అన్ని అంశాలను వెల్లడించారు. ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, మ్యాపింగ్ ప్రక్రియలు, ఇతర అంశాలపై నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి అధికారులకు శిక్షణ సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. బీఎల్వోలకు రెండు శిక్షణ కుడా పూర్తి చేశా మన్నారు. దరఖాస్తులను పరిశీలించి తగినచర్యలుచేపడుతున్నామని, పెండింగ్ లేకుండా చూసుకుంటున్నామని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు.

వీసీ అనంతరం అధికారులకు జిల్లా కలెక్టర్ పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. రాబోయే అవసరాలను, జాబితా సవరణ, మ్యాపింగ్ ప్రక్రియలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే అందరూ సన్నద్ధంగా ఉండాలని సూచించారు. 2002 జాబితాను 2025 ఓటర్ల జాబితాతో సరిచూసి పరిశీలించాలని చెప్పారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను ఇప్పటివరకు జిల్లాలో 28.14% మాత్రమే జరిగింది. అరకు, పాడేరు నియోజకవర్గంలో 1200దాటినా ఓటర్ల పోలింగ్ స్టేషన్స్ గుర్తించి, కొత్తగా 25 పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి వాటి పరిధిలో అన్ని మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. మిగిలినవన్నీ ఈనెలాఖరులోగా సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు వీలుగా ప్రణాళిక చేసుకోవాలన్నారు. రోజు ఒక గంట సమయం కేటాయించాలని, బీఎల్వోలకు క్రమం తప్పకుండా సూచనలు ఇస్తూ అన్ని విషయాల్లో అవగాహన కల్పించాలని ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు సూచించారు. బీఎల్వోలు కచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, మ్యాపింగ్ ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా బీఎల్వోలు చర్యలు తీసుకోవాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి జాయింట్ కలెక్టర్ ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ, రెవిన్యూ డివిజన్ అధికారి ఏం వి ఎస్ లోకేశ్వరరావు, ఎలక్షన్ సెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాలతో దూసుకు పోతున్న

# ఘనత కూటమిదే

అనకాపల్లి నియోజకవర్గ జనసేన ఇంచార్జి భీమరశెట్టి రాంకీ



అనకాపల్లి, నవంబర్ 27 (మనసు లో మాట): సంక్షేమ కార్యక్రమాల తోపాటు అభివృద్ధి లోను దూసుకు పోతున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) అన్నారు. అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయం లో గురువారం అనకాపల్లి శాసనసభ్యులు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అదేశాల మేరకు 82 వ వార్డులో అనారోగ్యానికి గురైన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి డబ్బై ఎనిమిది వేల రూపాయలు చెక్కులను రాంకీ అందజేశారు. ఈ సంధర్భంగా రాంకీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ల చొరవతో పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారని ఆయన అన్నారు. ఎంతో మంది అనారోగ్యానికి గురై ఆపరేషన్లు చేయించుకోలేని నిరుపేదలైన రోగులకు కొండంత అండగా నిలిచి ఆదుకోవడం కోసమే సీఎం సహాయ నిధి అని అన్నారు. ఈ 16 నెలలకాలంలో అనకాపల్లి నియోజకవర్గం లో అనారోగ్యానికి గురైన వందల మంది నిరుపేద రోగులకు సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, కొణతాల రామకృష్ణ లకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే రాంకీ కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పట్టణంలోని వివిధ వార్డుల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగులో సరికొత్త దృశ్యం

- డ్రిప్‌తో బొప్పాయిలో అధిక దిగుబడి



విజయనగరం (మనసులో మాట) అక్టోబర్ 27: సాగులో ఆధునిక పద్ధతులను అనుసరిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని డెంకాడ మండలం, గంట్లాం గ్రామానికి చెందిన రైతు దంపతులు కంది సుమలత మరియు సురేష్ నిరూపించారు. బొప్పాయి సాగులో వీరు ఏపీఎంఐపీ (ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్) పథకాన్ని సద్వినియోగం చేసుకొని, డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) ఏర్పాటు ద్వారా అధిక ఫలసాయం సాధించి, ఆర్థికంగా పురోగతి సాధించారు.

డ్రిప్‌తో నీటి పొదుపు, అధిక దిగుబడి:రైతు కంది సుమలత, ఆమె భర్త సురేష్ తమ బొప్పాయి తోటకు డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని ఎంచుకున్నారు. సాంప్రదాయ పద్ధతుల్లో నీటి వినియోగం అధికంగా ఉండటంతో పాటు, పంటకు సరిగా అందక దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. అయితే, డ్రిప్ పద్ధతిలో నీరు నేరుగా మొక్క వేరు వ్యవస్థకు చిన్న బిందువులుగా అందడంతో, నీటి వ ృధా అరికట్టబడిరది, పోషకాలు సమర్థవంతంగా వినియోగమయ్యాయి.

సబ్సిడీతో భారం తగ్గింది:ఈ డ్రిప్ ఇరిగేషన్ యూనిట్ ఖరీదు రూ. 1,52,250/-. అయితే, ప్రభుత్వం ఏపీఎంఐపీ పథకం ద్వారా రైతులకు అండగా నిలిచింది. ఈ యూనిట్‌పై ఏకంగా రూ. 1,15,110/- భారీ సబ్సిడీని అందించింది. దీంతో, రైతు దంపతులు కేవలం రూ. 37,095/- మాత్రమే చెల్లించి ఈ ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ ప్రోత్సాహం వలన పెట్టుబడి భారం గణనీయంగా తగ్గింది.రైతన్న మీకోసం మార్గదర్శనం:కంది సుమలత, సురేష్ దంపతులు సాధించిన విజయం ఈ ప్రాంతంలోని ఇతర రైతులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. రైతన్న మీకోసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం కూడా ఇదే: ఆధునిక పద్ధతులు, ప్రభుత్వ పథకాల ద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి. ఏపీఎంఐపీ వంటి పథకాలను వినియోగించుకోవడం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడిని సాధించి, లాభాల బాట పట్టవచ్చని వీరి విజయం స్పష్టం చేస్తోంది.

# అడ్డురోడ్డులో మెడికల్ ల్యాబ్ సీజ్

- నిర్వాహకురాలు నిరసన





ఎస్. రాయవరం, నవంబర్ 27, (మనసులో మాట): మండలంలో అడ్డురోడ్డు జంక్షన్ లో జ్యోతి దయాగ్నస్టిక్ మెడికల్ ల్యాబ్ ను గురువారం అధికారులు సీజ్ చేసారు.ల్యాబ్ ను తనిఖీ చేసిన జిల్లావైద్య ఆరోగ్య శాఖాధికారి నిర్వహకురాలు నిబంధనలు పాటించనందున సీజ్ చేస్తున్నట్లు నోటీసులుజారీ చేసారు. స్థానిక తహాశీల్దారు, వైద్య ఆరోగ్యశాఖధికారి పర్యవేక్షణలో ల్యాబ్ ను సీజ్ చేసారు. కేవలం కక్షసాధింపుచర్య గా హెూంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాలు మేరకు తన ల్యాబ్ నుసీజ్ చేసారని ల్యాబ్ నిర్వహకురాలు దాట్ల ఉమాదేవి ల్యాబ్ ఎదుట నిరసన కు దిగారు. బల్క్ డ్రగ్స్ పార్క్ కు తన భూములు ఇవ్వనందున, భూములు ఇవ్వవద్దు అంటూ పోరాటం చేసినందున తనను అర్థికంగా నష్ట పర్చుడంకోసం హెంమంత్రి అనిత తన పై కక్ష సాధింపుకు దిగారన్నారు తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు భూములు ఇచ్చేది లేదని ఆమె అన్నారు నాకు, నాపిల్లలు ప్రాణ హాని ఉందంటూ అందోళన వ్యక్తం చేసారు.



## ఖేలో ఇండియా బాక్సింగ్ పోటీలకు దండు కిరణ్ సాగర్ ఎంపిక

**జాతీయ రిఫరీగా కిరణ్ విశాఖపట్నం (మనసులో మాట) నవంబర్ 27:** దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక క్రీడా పోటీలైన ఖేలో ఇండియా ఇంటర్ యూనివర్సిటీస్ గేమ్స్ – 2025 లో జరిగే బాక్సింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ప్రముఖ జాతీయ బాక్సర్ దండు కిరణ్ సాగర్ రిఫరీగా ఎంపికయ్యారు. ఈ ఎంపిక రాష్ట్రానికి, ఆయన పనిచేస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వేకు ఎంతో గర్వకారణమని ద్రోణాచార్య అవార్డీ, ప్రముఖ బాక్సింగ్ కోచ్ శ్రీ ఐ. వెంకటేశ్వర్రావు గారు మరియు విశాఖపట్నం జిల్లా బాక్సింగ్ కార్యదర్శి శ్రీ బి. అప్పన్నరెడ్డి గారు హర్షం వ్యక్తం చేశారు. ఖేలో ఇండియా ఇంటర్ యూనివర్సిటీస్ గేమ్స్ – 2025 బాక్సింగ్ పోటీలు రాజస్థాన్‌లోని భరత్‌పూర్ వేదికగా డిసెంబర్ 01, 2025 నుండి డిసెంబర్ 05, 2025 వరకు జరగనున్నాయి. ఈ జాతీయస్థాయి పోటీలకు రిఫరీగా కిరణ్ సాగర్ సేవలు అందించనున్నారు. కిరణ్ సాగర్ ?ప్రస్తుతం ఈస్ట్ కోస్ట్ రైల్వేలో చీఫ్ టికెట్ ఇన్స్పెక్టర్గా పనిచేస్తున్న దండు కిరణ్ సాగర్, ఒకప్పుడు అంతర్జాతీయ బాక్సర్‌గా కీర్తి గడించారు. ఆయన వరల్డ్ బాక్సింగ్, ఆసియాన్ బాక్సింగ్ పోటీలతో సహా మొత్తం ఎనిమిది అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్‌లలో పాల్గొని దేశానికి పతకాలు సాధించారు. జిల్లా, రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ వేదికపై నిలబెట్టిన ఆయన కృషిని విశాఖపట్నం బాక్సింగ్ సంఘం ప్రత్యేకంగా అభినందించింది. కిరణ్ సాగర్ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీ దండు నాగేశ్వరావు గారి కుమారుడు కావడం విశేషం.

## అనకాపల్లి ఎంపీ సి.ఎం. రమేష్ కి మాతృవియోగం

### శ్రీకాళహస్తి బోర్డు మెంబర్ బిలా స్రవంతి సంతాపం



**మునగపాక, నవంబర్ 27, మనసులో మాట..** మునగపాక గ్రామానికి చెందిన శ్రీకాళహస్తి బోర్డు మెంబర్ బీలా స్రవంతి రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ సంతాపం తెలిపారు 83 సంవత్సరలు కడప జిల్లా, పొట్లదుర్తి గ్రామంలోని వారి స్వగృహంలో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు బీల స్రవంతి సంతాపం తెలిపారు. సీఎం రమేష్ కు మాతృమూర్తి అంటే ఎంతో ప్రేమాభిమానాలు. ఆమె మరణం ఆ కుటుంబానికి తీరని లోటని భగవంతుడా కుటుంబానికి శక్తిని ధైర్యాన్ని ప్రసాదించాలని బీల స్రవంతి ఆకాంక్షించారు.

## నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**చీడికాడ, నవంబర్ 27, (మనసులో మాట)..** మండల కేంద్రమైన చీడికాడ సబ్ స్టేషన్ పరిధిలో గురువలు పీడర్ లో గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఇ వెంకట్రావు తెలిపారు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ చీడికాడ సబ్ స్టేషన్ పరిధిలో తురువోలు పీడర్ లో తురువోలు అర్జునగిరి పెదగోగాడ వరహాపురం చుక్కపల్లి చెట్టుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు ప్రజల సహకరించాలని ఆయన కోరారు.

# సేవా మూర్తికి వందేళ్ళు

### ఆపద వస్తే అమ్మ కన్నా ముందు రాజమ్మ ప్రత్యక్షం - అమ్మతనాన్ని పరిపూర్ణం చేసే రాజమ్మకు వందేళ్ళు

**ఎస్. రాయవరం, నవంబర్ 27 (మనసులో మాట):** ఎస్. రాయవరం మండలం రేవుపోలవరం పక్కగ్రామాలన్నింటికీ ప్రసూతి సమయంలో మొట్టమొదట గుర్తొచ్చే పేరుయజ్జల రాజమ్మ. ఎలాంటి సమయమైనా, ఎలాంటి పరిస్థితులైనా, "నేను ఉన్నానమ్మా.. భయపడకు" అని గర్భిణులకు ధైర్యం చెప్పే అండగా నిలిచిన ఆమె, నేడు తన జీవిత ప్రయాణంలో మహత్తరమైన మైలురాయిని అందుకుంది. రాజమ్మ తన వందవ వసంతంలోకి అడుగుపెట్టింది.

బాల్యం నుంచే ఇతరులకు ఉపయోగపడాలి, సమాజానికి ఏదైనా సేవ చేయాలనే తపన రాజమ్మ మనసులో బలంగా నాటుకుపోయింది. కుటుంబ బాధ్యతలతో పాటు ఎందరో గర్భిణులకు ప్రసవాలు పోసిన ఆమెను ప్రజలు ప్రేమతో 'మంత్రసాణి రాజమ్మ' అని పిలిచేవారు. ఆ పేరుకు తగ్గట్టుగానే ఆమె చేతుల్లో ఎన్నో



వందల మంది శిశువులు ఈ లోకానికి అడుగుపెట్టారు.

ఆశ్చర్యమేమిటంటే ఎలాంటి ఆపరేషన్లు అవసరం లేకుండా, సూదులు లేకుండా, ఆర్థిక లాభం ఆశించకుండా, పూర్తిగా ఉచితంగా అందించిన సేవలే ఆమెకు ప్రత్యేకత. ఆమె చేత ప్రసవం అయ్యిందంటే కుటుంబ సభ్యులందరికీ నమ్మకం, ఆత్మవిశ్వాసం పెరిగేది. అర్ధరాత్రి అయినా, అపరాత్రి అయినా, రాజమ్మ తలుపు తట్టగానే ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండేది. దాదాపు పదిహేనేళ్ల క్రితం వరకు రాజమ్మ సేవలు కొనసాగాయి. ఎనభై ఏళ్లు దాటిన తర్వాత మాత్రమే ఆమె ఇంటికే పరిమితమైంది. కానీ వయసు పెరిగినా, ప్రజల ప్రేమ మాత్రం తగ్గలేదు. నేడు వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్నా కూడా రాజమ్మను గ్రామస్థులు ఎంతోగౌరవంగా, అభిమానంగా చూసుకుంటున్నారు. ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించికుఃది యజ్జల రాజమ్మ.

### జనసేన పార్టీ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు

# స్టడీ మెటీరియల్ పంపిణీ





**నాతవరం, నవంబర్ 27( మనసులో మాట)..** నాతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ ను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర, ముఖ్య అతిథుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం జనసేన చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో చదువు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. గతేడాది కూడా ఇక్కడి పదో తరగతి విద్యార్థులకు జనసేన పార్టీ తరఫున స్టడీ మెటీరియల్ అందించామని, గత ఏడాది మెటీరియల్ పంపిణీ చేయడం వల్ల పదవ తరగతిలో ఆరుగురు విద్యార్థులు 550 సాధించారని, ఇద్దరు ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. 15 మందికి 500 దాటి మార్కులు వచ్చాయన్నారు. దీంతో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు గర్వకారణంగా నిలిచారన్నారు. ఈసారి కూడా అందించిన మెటీరియల్ ను సద్వినియోగం చేసుకుని ఉత్తమమైన ఫలితాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. విద్యార్థులకు మంచి లక్ష్యాలు పెట్టుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థి మంచి స్థాయికి చేరుకోవాలనే దృష్టితో జనసేన పార్టీ ఎల్లప్పుడూ ముందుండి సహాయం చేస్తుందని సూర్యచంద్ర స్పష్టం చేశారు. తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సదుపాయాల పెంపు అత్యంత అవసరమన్నారు. విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, అవసరమైన పాఠ్యపుస్తకాలు, మెటీరియల్ లభిస్తే వారు పెద్ద స్థాయిలో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తాండ్ర కరక ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యనారాయణ జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అల్లాడ సురేష్, జనసేన పార్టీ నాతవరం మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నర్సీపట్నం వైస్ ఎంపిపి ఇన్నం రమణ, రత్నం, నాతవరం మండల నాయకులు పోలుపర్తి శ్రీనివాస్, అసేన్ కుమార్, వర్రె నరసింహం, యర్రంశెట్టి పాపారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉపాధిహామీ నిధులను పూర్తిగా

# వినియోగించుకోవాలి

- సహజ ప్రసవాలు జరిగే విధంగా చూడండి
- రాష్ట్ర అంచనాల కమిటీ చెట్కర్మన్ జోగేశ్వర్రావు
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష
- సేంద్రీయ పంటల ప్రతిపాదనపై డిఆర్‌డిఏకి అభినందనలు

**విజయనగరం: (మనసులో మాట)::అక్టోబర్ 27::**అధికారులంతా జిల్లా అభివ ృద్ధికి తమవంతు క ృషి చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మెన్ వి.జోగేశ్వర్రావు కోరారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం జిల్లా ఎంతో అభివ ృద్ధి చెందిందని, దీనిని మరింత ముందుకు తీసుకువెళ్లి, రాష్ట్రంలోనే



మొదటి స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. అందుకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఛైర్మన్ జోగేశ్వర్రావుతో పాటు కమిటీ సభ్యులు నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, డాక్టర్ పివివి సూర్యనారాయణరాజు, వరుదు కల్యాణి గురువారం జిల్లాలో పర్యటించారు. కలెక్టరేట్లో వివిధ శాఖలకు మంజూరైన నిధులు, వినియోగం, అవసరాలపై సమీక్షించారు. వ్యవసాయం, ఉద్యానశాఖ, పశు సంవర్ధకశాఖ, మైక్రో ఇరిగేషన్, నీటిపారుదల, వైద్యారోగ్యం, విద్య, త్రాగునీరు, పంచాయితీరాజ్, జిల్లా పరిషత్, పబ్లిక్ హెల్త్, ఆర్ అండ్ బి, డిఆర్‌డిఏ, స్త్రీశిశు సంక్షేమం తదితర శాఖలపై చర్చించారు. మహిళా పొదుపు సంఘాల అధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయం ద్వారా కూరగాయలు పండిరచి మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయడానికి డిఆర్‌డిఏ చేసిన ప్రణాళికను అభినందించారు. ఈ ప్రణాళికను రాష్ట్రమంతా అమలు చేయడానికి క ృషి చేస్తామని ఛైర్మన్ ప్రకటించారు. జిల్లాలో మహిళా అక్షరాస్యత తక్కువగా ఉందని, దీనిని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. వరి ఉత్పాధకత పెంచాలని సబ్సిడీపై రెయిన్ గన్‌లను అందజేసేందుకు ప్రతిపాదన చేయాలని సూచించారు. సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని, సిజేరియన్లను తగ్గించాలని చెప్పారు.గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో పాఠశాలల ప్రహరీ గోడలు, లింకు రోడ్లు, సిమ్మెంటు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఛైర్మన్ కోరారు. నిధులను పూర్తిగా వినియోగించుకోవాలని, మురిగిపోకుండా చూడాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్ సెంటర్ భవనాలను పూర్తిచేయడంపై దృష్టి పెట్టాలన్నారు. చాలాచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలోను, అద్దె భవనాల్లోను ఉన్నాయని, సమీపంలో ఖాళీగా ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని సూచించారు.కమిటీ సభ్యులు, ఎంఎల్‌ఏ నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ చాలాచోట్ల పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయని చెప్పారు. ఉపాధిహామీ ద్వారా పాఠశాలల ప్రహరీగోడలు నిర్మించాలని సూచించారు.ఎంఎల్‌ఏ మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ విద్యాప్రమాణాలను పెంచేందుకు మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో ఎన్నో సంస్కరణలను అమలు చేస్తున్నారని చెప్పారు. తల్లికి వందనం పథకం ద్వారా పాఠశాలల్లో చేరికలు పెరిగాయని చెప్పారు. మధ్యాహ్నభోజన పథకం నాణ్యత పెరిగిందని, పోషకాహార పదార్థాలు అందుతున్నాయని అన్నారు.ఎంఎల్‌సి డాక్టర్ పివివి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య పించన్లు మంజూరు చేయాలని కోరారు.ఎంఎల్‌సి వరుదు కల్యాణి మాట్లాడుతూ వర్షాలవల్ల వరిపంట కొంతమేర దెబ్బతిన్నదని, నూకలు ఎక్కువగా వస్తుండటం వల్ల, ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు రైతు నష్టపోకుండా చూడాలని కోరారు.కమిటీ డిప్యుటీ కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో మహిళా అధికారిణులు ఎక్కువగా ఉన్నప్పటికీ సమర్థవంతంగా పరిచేస్తున్నారని చెప్పారు. అలాగే సేంద్రీయ వ్యవసాయం విషయంలో డిఆర్‌డిఏ పిడిని ప్రత్యేకంగా అభినందించారు.ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్ ఛైర్మన్‌కు వివరించారు. జిల్లాలో ఆయిల్ పాం వ ృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ సమీక్షా సమావేశంలో డిఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, సిపిఓ పి.బాలాజీ, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు.



# దెబ్బతిన్న ఘాట్ రోడ్డు

**కోటవురట్ల(మనసులో మాట) నవంబర్: 27:** కోటవురట్ల మండలం పరిధిలో నర్సీపట్నం రేవు పోలవరం ఆర్ అండ్ బి రహదారిలో ఇందేశమ్మ ఘాట్ రిటైనింగ్ వాల్ దెబ్బతింది. పదేళ్ల కిందట వచ్చిన వరదలకు వరాహనది ఉదృతంగా ప్రవహించడంతో నదికి ఆనుకుని ఉన్న ఘాట్ రోడ్డు కోతకు గురైంది. తాత్కాలికంగా మరమ్మతులు చేసి వదిలేసారు. దీంతో ఇక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతున్నానని వాహన చోదకులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క కొండ మరోపక్క వరాహనది మధ్యలో ఇరుకైన రోడ్డు కావడంతో తరచూ ఇక్కడ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రయాణికులతో పాటు వాహన చోధకులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కర్రిసాయికృష్ణ సహకారంతో పేటకట్టు చేలకు విద్యుత్ లైట్లు ఏర్పాటు



**మునగపాక, నవంబర్ 27, మనసులో మాట..** మునగపాక మండలంలో రైతుల సంక్షేమం కోసం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ మరో మంచి పనికి ముందుకొచ్చారు. గత నెలలో జరిగిన మునగపాక రైతు సంఘం సమావేశంలో, "మహిళలు మరియు రైతులు చీకట్లో చేల దారులు నడవడంలో ఇబ్బంది పడకూడదు" అని ప్రకటిస్తూ, 12 మూల సంఘాలపరిధిలోని చేలకు సొంత నిధులతో వీధి దీపాలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గురువారంపేటకట్టు మూల సంఘంపరిధిలోని చేలకు కూడా స్వయంగా పర్యవేక్షిస్తూ వీధి దీపాల ఏర్పాటు పనిచేశారు. సాయంత్రానికి అన్ని స్థంబాలకు లైట్లు అమర్చడంతో, రైతుల సమక్షంలో స్విచ్ ఆన్ చేసి విద్యుత్ వెలుగులను అందుబాటులోకి తీసుకువచ్చారు. చీకట్లో చేలకు వెళ్లాల్సి వచ్చి ఇబ్బంది పడుతున్న మహిళలు, రైతులు ఈ కార్యక్రమంతో సాయికృష్ణకు ధన్యవాదాలు తెలియజేసారు. రైతులకు మహిళలకు ఉపయోగపడే విధంగా సాయికృష్ణ చేసిన ఈ మంచికి మాజీ జడ్పీటీసీ మల్ల సంజీవరావు, పేటకట్టు మూల సంఘం అధ్యక్షులు మళ్ల చిన జగ్గారావు మరియు రైతులు ఆయనకు సాలువాతో సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

### కూటమి ప్రభుత్వం హయాంలోనే

## వ్యవసాయ రంగంలో రైతులకు పండగ

### బీసీ సాధికార సమితి జిల్లా అధ్యక్షులు సబ్బి శ్రీనివాసరావు



**మునగపాక, నవంబర్ 27, మనసులో మాట..** మునగపాక మండలం నరాయుడుపాలెం గ్రామంలో కూటమి నాయకులు రైతు సేవలో ఏపీ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు గురించి ఇంటింటికి వెళ్లి వివరించడం జరిగింది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన అన్నదాత సుఖీభవ నిధులు రైతులకు అందాయని రైతులు సంతోషం వ్యక్తం చేసారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రైతాంగానికి ఎనలేని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగుతుందని శ్రీనివాసరావు రైతులకు భరోసా పలికారు.ఈ కార్యక్రమం లో బీసీ సాధికార సమితి జిల్లా అధ్యక్షులు సబ్బి శ్రీనివాస్ యాదవ్, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షులు యలమంచిలి గోవింద, జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు దాసరి గోపాల కృష్ణ, యలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇల్లపు శ్రీనివాసరావు, నాయకులు కొయ్య శేషు, కొయ్య శ్రీనివాసరావు, చందనాటి నాగాప్పారావు, రైతులు పాల్గొన్నారు.

## సైనిక సంక్షేమాధికారిగా కృష్ణారావు బాధ్యతలు స్వీకరణ

**విజయనగరం: (మనసులో మాట)::అక్టోబర్ 27:** విజయనగరం, పార్వతీపురం ఉమ్మడి జిల్లాల సైనిక సంక్షేమాధికారిగా మజ్జి కృష్ణారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఇంతకుముందు కూడా జిల్లాలో సైనిక



సంక్షేమాధికారిగా పనిచేసిన అనుభవం ఉంది. ఇప్పటివరకు ఇక్కడ సైనిక సంక్షేమాధికారిగా పనిచేసిన కెవిఎస్ ప్రసాదరావు పశ్చిమగోదావరి జిల్లా అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలను స్వీకరించిన కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్‌ను, డియార్వో శ్రీనివాసమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుఛరే అందజేశారు. బాధ్యతలను స్వీకరించిన కృష్ణారావును పలువురు మాజీ సైనికులు, వీరనారీమణులు, సంక్షేమ సంఘం నాయకులు, సిబ్బంది అభినందించారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## ప్రారంభమైన శ్రీ ముత్యాలమ్మ వారి మాసోత్సవాలు

**వి మాడుగుల నవంబర్ 27 (మనసులో మాట)..** మాడుగుల మండలంలోని ఎంకోడూరు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ముత్యాలమ్మ వారి మా మాసోత్సవాలను నేటి నుండి నాలుగు వారాలు మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది ఈ సందర్భంగా ఈ మార్గశిర మాసంలో నాలుగు గురువారాలలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడంతోపాటు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలలో భక్తులందరూ పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

## షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రమా కుమారి





**వి మాడుగుల నవంబర్ 27 (మనసులో మాట)..** మండల కేంద్రమైన మాడుగుల బస్టాండ్ ఆవరణ లో కొలువైన శ్రీదేవి గుడి ఆడిటోరియం ముందు ఐదు లక్షల రూపాయలతో రేకుల షెడ్ నిర్మాణానికి విశాఖ డైరీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావ్ కుమార్తె పాయకరావుపేట మున్సిపల్ చైర్మన్ రమకుమారి గురువారం శంకుస్థాపన చేశారు. ఐదు లక్షల రూపాయలతో ఈ షెడ్ పూర్తి నిర్మాణాన్ని చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు గ్రామ పెద్దలు సర్పంచ్ ఎడ్ల కళావతి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, దేవి ఆలయం గౌరవ అధ్యక్షులు శ్రీనాథ్ శ్రీనివాసరావు , ఉపసర్పంచ్ జవాది వరహాలు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, దేవి తల్లి ఆలయ కార్యదర్శి అన్నం వీడు ప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీ రావు, ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి అభ్యర్థి రోబ్బ మహేష్ , కూటమి నాయకులుదితరులు పాల్గొన్నారు.

## మునగపాక మండలాన్ని యధాతథంగా అనకాపల్లి రెవెన్యూ డివిజన్లోనే కొనసాగించాలి

**వెంకటాపురం మాజీ సర్పంచ్ సుందరపు వెంకట కనక అప్పారావు**



**మునగపాక, నవంబర్ 27, మనసులో మాట..** పరిపాలన సౌలభ్యం కోసం కొత్తగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయడం స్వాగతిస్తామని, అయితే అనకాపల్లి రెవిన్యూ డివిజన్ కు కేవలం రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉమ్మలాడ, నాగులపల్లి, జగ్గయ్యపేట అగ్రహారం, గవర్ల అనకాపల్లి, తోటాడ, టి సిరసపల్లి, ఒంపోలు, గంగాదేవి పేట ఒంటి గ్రామాలతో మునగపాక మండలం అత్యంత సమీపంలో అనకాపల్లి ఆర్డీవో కార్యాలయానికి ఉన్నాయి. అయితే ప్రభుత్వం మునగపాక మండలాన్ని నక్కపల్లి రెవెన్యూ డివిజన్లో విలీనం చేసే పద్ధతిలో ఆలోచించడం భావ్యం కాదని వెంకటాపురం మాజీ సర్పంచ్ సుందరపు వెంకట కనక అప్పారావు ఆక్షేపించారు. ప్రభుత్వం పునర్ ఆలోచన చేసి మునగపాక మండలాన్ని యధాతథంగా అనకాపల్లి రెవెన్యూ డివిజన్ లోనే కొనసాగించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## సాంకేతికతను ప్రణాళికతో వినియోగించుకొని లక్ష్యాన్ని సాధించాలి

**- జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**



**విజయనగరం (మనసులో మాట) అక్టోబర్ 27:** స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సి.ఎస్.ఆర్. పథకంలో భాగంగా విద్యార్థినులకు సైకిళ్ళను అందజేసే కార్యక్రమంకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. విజయనగరం పట్టణంలోని ప్రభుత్వ మహారాజ సంస్కృత పాఠశాలలో చదువుతూ, సుదూర ప్రాంతాల నుండి పాఠశాలకు వచ్చే 16మంది విద్యార్థినులకు గుర్తించి, ఎస్.బి.ఐ. వారి సౌజన్యంతో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ నవంబరు 27న సైకిళ్ళను అందజేసారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - పాఠశాల విద్యను అభ్యసించే సమయంలో విద్యార్థినులకు 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్' వంటి విషయాలపై అవగాహన ఉండాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు శక్తి టీమ్స్ ను పంపి, విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో మానవ మృగాలు ముక్కు పచ్చలారని మైనరు బాలికలను లైంగికంగా వేధిస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు, ఏదైనా సంఘటన జరిగితే ఎవరికి ఫిర్యాదు చేయాలన్న అంశాలు పట్ల విద్యార్థులను చైతన్యపరుస్తున్నామన్నారు. ప్రతీ విద్యార్థి తాను చదువుతున్న కాలం లోనే భవిష్యత్తుకు సంబంధించి లక్ష్యం ఏర్పరుచుకొని, లక్ష్య సాధనకు కృషి చెయ్యాలన్నారు. ప్రజలందరికీ ప్రస్తుతం ఇంటర్నెట్ అందుబాటులో ఉందని, ఇంటర్నెట్ను వినియోగించుకొని లక్ష్య సాధనకు సంబంధించిన విషయాలపై శ్రద్ధ పెట్టాలన్నారు. అంతేతప్పా, ఇంటర్నెట్ను దుర్వినియోగం చేస్తూ, అనవసర విషయాలకు ప్రాధాన్యత కల్పిస్తూ, సోషల్ మీడియా, రీల్స్ అంటూ సమయాన్ని వృధా చేస్తే, భవిష్యత్తులో బాధపడే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. చిన్న వయస్సు లో బాలికలను మభ్యపెడుతూ, వారికి తాయిలాలు ఇచ్చి, మాయ మాటలు చెప్పి, లైంగిక వేధింపులకు పాల్పడే వ్యక్తుల మాటలను నమ్మవద్దన్నారు. దురుద్దేశంతో అటువంటి వ్యక్తుల ప్రలోభాలకు, అకృత్యాలకు లొంగితే చిన్న వయస్సులోనే పిల్లల జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఇటువంటి నేరాలను తీవ్రంగా పరిగణించాలన్నారు. కావున, టీనేజ్లో ఇతరుల ఆకర్షణకు లోనుకావద్దని, చదువు, లక్ష్యం పై శ్రద్ధపెట్టి, తల్లిదండ్రులకు, ఉన్న ఊరు, జిల్లాకు మంచి పేరు తీసుకొని రావాలన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగువర్చుకొని, తాము ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానాలకు ఎదిగి, మంచి విజయాలను సాధించాలన్నారు. సైబరు మోసాలకు గురికాకుండా ప్రతీ ఒక్కరూ టెక్నాలజీ పట్ల అవగాహన పెంచుకోవా అన్నారు. చదువుకొనే సమయంలో విద్యార్థులు చెడు మార్గంలో పయనించకుండా లక్ష్య సాధన వైపు నడవాలన్నారు. మద్యం, గంజాయి వంటి దురలవాట్లకు లోను కావద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దన్నారు. వాహనం నడిపే సమయంలో మీ కుటుంబ సభ్యులు తప్పనిసరిగా హెల్మెట్స్ ధరించే విధంగా మాడాల న్నారు. డిజిటల్ అరెస్టు, సైబరు నేరాలు పట్ల అవగాహన పెంచుకొని, మీ ప్రాంతంలో ఉండే పెద్దలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని యువతకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి.ఐ. రీజనల్ మేనేజరు ఎం.సురేష్ బాబు, విజయనగరం ఇంచార్జ్ డిఎస్పీ ఆర్.గోవిందరావు, డిఈఓ కే.వెంకట రమణ, ఎస్బీఐ జోనల్ సెక్రటరీ ఎం.రమేష్ కుమార్, ఎస్.బి.ఐ. హెచ్ఆర్ మేనేజరు పి.ఎన్.చారి, పాఠశాల హెచ్.ఎం. టి.లలిత కుమారి, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాస్ ఇతర అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో 5గురు నిందితులకు 18 నెలలు జైలు శిక్ష, జరిమాన

**- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**

విజయనగరం: (మనసులో మాట)::అక్టోబర్ 27::విజయనగరం జిల్లా 1వ పట్టణ పోలీసు స్టేషన్ 2024 సంవత్సరంలో నమోదైన గంజాయి కేసులో విజయనగరం పట్టణానికి చెందిన నిందితులు (ఎ1) బొంతు వెంకటేశ్వర రావు (34 సం.లు), (ఎ2) మండ శాంతి (34 సం.లు), (ఎ3) గాబు మస్తాని (28 సం.లు), (ఎ4) బాబూ సింగ్ (40సం.లు), (ఎ5) అలజంగి ప్రసాద్ రావు (55 సం.లు)కు 18 నెలలు కఠిన కారాగార శిక్ష మరియు ఒక్కొకరికి రూ.10,000లు జరిమానా విధిస్తూ విజయనగరం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం. మీనాదేవి నవంబర్ 27న తీర్పు వెల్లడిరచినట్టు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, తెలిపారు. విజయనగరం పట్టణం రైల్వే స్టేషన్ సమీపంలో .గత ఏడాది జూలై 26 తేదిన పాత రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో కొంత మంది వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారని విజయనగరం 1వ పట్టణ పోలీసులకు రాబడిన ఖచ్చితమైన సమాచారంతో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని అయిదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేసి, వారి వద్ద నుండి సుమారు 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై అప్పటి 1వ పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ ఎ.నరేష్ కేసు నమోదు చేయగా, అప్పటి 1వ పట్టణ పోలీసు స్టేషన్ సిఐ బి. వెంకటరావు దర్యాప్తు చేపట్టి, నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తలరించారు. అనంతరం అప్పటి 1వ పట్టణ పోలీసు స్టేషన్ సిఐ ఎస్.శ్రీనివాస్ కోర్టులో అభియోగ పత్రాలను దాఖలు చేసారు. కోర్టు విచారణలో నిందితులు (ఎ1) నుండి (ఎ5) పై నేరారోపణలు రుజువు కావడంతో నిందితులకు విజయనగరం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి ఎం. మీనాదేవి 18 నెలలు కఠిన కారాగార శిక్ష మరియు ఒక్కొకరికి రూ.10,000లు జరిమానా విధించారు. ఈ కేసులో పోలీసుల తరు పున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.సత్యం గారు వాదనలు వినిపించగా, 1వ పట్టణ పోలీసు స్టేషన్ కోర్టు ఎఎస్ఐ పి.శ్రీనివాసరావు, సి.ఎం.ఎస్. కానిస్టేబులు కే.త్రినాధ రావు సాక్ష్యులను సకాలంలో హాజరపర్చి నిందితులకు శిక్ష పడే విధంగా వ్యహరించారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ తెలిపారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడే విధంగా వ్యవహరించిన పోలీసు అధికారులని, సిబ్బందిని మరియు ఎపిపిని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ అభినందించారు.

## రైతులు సేంద్రియే ఎరువులు వాడకం వలన అధిక దిగుబడులు

**మండలం తెలుగు యువత నాయకుడు బిశెట్టినాగేశ్వరరావు**



**మునగపాక, నవంబర్ 27, మనసులో మాట..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రైతాంగానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించింది అని మండల తెలుగు యువత నాయకుడు బి శెట్టి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలో గల మూలపేట గ్రామంలో రైతు కోసం కార్యక్రమంలో రైతులకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా అన్నదాత సుఖీభవకార్యక్రమం తూచా తప్పకుండా అమలు చేయడం జరుగుతుందని రైతులకు ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది శాంతి, పద్మిని, శరగడం నాగేశ్వరరావు, కొయిలాడ సత్యనారాయణ, బి సెట్ వీరు నాయుడు, బీసెట్టి వెంకట అప్పారావు, బీసెట్టి పైడికొండ, బీసెట్టి సూరప్పారావు పలువురు రైతులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద అతిపెద్ద స్పీడ్ బ్రేకర్లు నిర్మాణం

**రోడ్డు గైడ్లైన్స్ పాటించకుండా చేపట్టిన నిర్మాణం పై పలువురి నిరసన**



**అనకాపల్లి, నవంబర్ 27 (మనసు లో మాట):** అనకాపల్లి పట్టణం లోని విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిర్మించిన అతిపెద్ద స్పీడ్ బ్రేకర్లు తో ప్రమాదాల బారిన పడే పరిస్థితి ఏర్పడుతుందేమోనని పలువురు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఈ స్పీడ్ బ్రేకర్లు ను కూటమి నేతలు పరిశీలించారు. రోడ్ గైడ్లైన్స్ పాటించకుండా నిర్మించిన అతి భారీ ప్రమాదకరమైన స్పీడ్ బ్రేకర్ల వల్ల ప్రజల ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి భారీ స్పీడ్ బ్రేకర్లు ఎలా నిర్మిస్తారని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేమిటని వాహనదారులు వాపోతున్నారు. ఈ స్పీడ్ బ్రేకర్ వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తడమే కాకుండా వాహనాలు అదుపుతప్పే ప్రమాద ముందని పలువురి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయాన్ని మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి కూటమి నేతలు ఆళ్ళ రామచంద్రరావు, పోలవరపు త్రినాథ్ తదితరులు తీసుకెళ్ళడం జరిగింది. దీంతో శాసనసభ్యులు రామకృష్ణ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు వారు తెలియజేశారు.



## బోసుబెడ్డలో బినామీ పేరుతో రిసార్ట్స్ నిర్మాణం


- బినామీ నిర్మాణంపై అధికారుల మౌనమేలా?
- అధికారుల తీరుపై మండిపడుతున్న గిరిజనులు
- రిసార్ట్స్ నిర్మాణాన్ని నిలిపివేయాలి





అరకులోయ,నవంబర్ 27 (మనసులోమాట):అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం మాడగడ పంచాయతీ బోసుబెడ్డ గ్రామ సమీపంలో మాడగడ వ్యూ పాయింట్ కు వెళ్లే రహదారికి ఆనుకొని ఇరువైపులా జరుగుతున్న అక్రమ బినామీ రిసార్ట్స్, టెంట్లు నిర్మాణంపై అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని గిరిజనులు మండిపడుతున్నారు.ప్రశాంతంగా ఉన్న గిరిజన ప్రాంతాలలో అక్రమ బినామి రిసార్ట్స్ నిర్మాణం వలన అసాంఘిక కార్యక్రమాలు పెచ్చు మీరే అవకాశం ఉందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.ఉపాధి పేరుతో గిరిజనులను కల్లిబుల్లి మాటలతో మంచి చేసుకుని ఆదివాసి గిరిజనుల పేరు మీద మైదాన ప్రాంత వ్యక్తులు బినామీ అక్రమ రిసార్ట్స్, టెంట్లు నిర్మించి కోట్ల రూపాయలు సంపాదించాలనే లక్ష్యంతో రెవిన్యూ, పంచాయతీ అధికారులు బినామీ అక్రమ రీసెర్స్ నిర్మాణానికిఅండగా నిలుస్తుండడం విచారకరమని గిరి జనులు,ప్రజాసంఘాలనాయకులు చర్చించుకుంటూ ఉండడం విశేషం.తెల్లరేషన్ కార్డు కలిగిన గిరిజనుడికి కోట్ల రూపాయలతో రిసార్ట్స్ నిర్మించే స్తోమత ఎక్కడ నుండి వస్తుందని వారంతా అంటున్నారు.ప్రశాంత వాతావరణనికి నిలయమైన గిరిజన పల్లె ప్రాంతంలో అశాంతిని కలిగించే విధంగా జరుగుతున్న బినామి అక్రమ రిసార్ట్స్, టెంట్లు నిర్మాణాలకు అధికారులు ఏ విధంగా అనుమతులు ఇస్తారని గిరివాసులుమండిపడుతున్నారు.అక్రమ బినామీ రిసార్ట్స్, టెంట్లు నిర్మాణం చేపడుతున్న వ్యక్తులు తమ వద్ద అన్ని అనుమతులు ఉన్నాయని చెబుతుండడం విడ్డూరంగా ఉందని పలువురు ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులుచర్చించుకుంటున్నారు. భూబదాలాయింపు 1/70చట్టం అమల్లో ఉన్న మన్యప్రాంతంలో బినామి ఆక్రమ రిసార్ట్స్ నిర్మాణాలకుఅనుమతులు ఏ విధంగా ఇవ్వగలుగుతారని ఈ ప్రాంత ప్రజలు స్థానిక అధికారుల తీరుపైవిమర్శలుగుప్పిస్తున్నారు.గిరిజన చట్టాలకు విరుద్ధంగా అక్రమ రిసార్ట్ నిర్మాణాలకు పంచాయతీ, రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి అనుమతులు ఇచ్చినట్లయితే అటువంటి అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు,గిరిజన సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.బోసుబెడ్డ గ్రామ సమీపంలో జరుగుతున్న అక్రమ బినామీ రిసార్ట్స్ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్న పంచాయతీ, రెవిన్యూ అధికారులపై జిల్లా స్థాయి అధికారులతో విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులైతే నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని అలాగే అక్రమ బినామీ రిసార్ట్స్ నిర్మాణాన్నినిలిపివేయాలని గిరిజనసంఘాలనాయకులు,గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఇదిలా ఉండగా బోసుబెడ్డ గ్రామ సమీపంలో జరుగుతున్న బినామీ అక్రమ రిసార్ట్స్,టెంట్లు నిర్మాణంపై పలు సంఘాలు నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి సన్నద్ధమవుతున్నాయి.ప్రశాంత మన్యంలో అశాంత వాతావరణం కలుగజేసెందుకే మారుమూల ప్రాంతంలో బినామీ అక్రమ రిసార్ట్స్ నిర్మాణం చేపడుతున్నారని పలు సంఘాల నాయకులు అంటున్నారు.పట్టణ ప్రాంతానికి ఈ రిసార్ట్స్ దూరంగా ఉండటం వలన అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరిగే ప్రమాదం ఉందని,గంజాయి ఇతర మాదకద్రవ్యాల వినియోగం విక్రయాలు పెరిగే అవకాశం కూడా లేకపోలేదని,గిరిజన యువకుల భవిష్యత్తు ప్రమాదంలో పడక తప్పదని గిరిజనులు, ప్రజా సంఘాల సభ్యులు,స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు విచారం వ్యక్తం చేస్తారు.గ్రామ గిరిజనులతో కలసి రిసార్ట్స్, టెంట్లు ఎదుట ఆందోళన కార్యక్రమంచేపట్టడానికి పలు సంఘాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనాఅల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్,పాడేరు ఐటీడీఏ తిరుమణి శ్రీ పూజ తక్షణమే స్పందించి అక్రమ బినామి రిసార్ట్స్, టెంట్లు నిర్మాణంపై నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యార్థులతో ముచ్చటిస్తున్నాయి టిడిపి



**హుకుంపేట నవంబర్ 27 (మనసులు మాట)..** హుకుంపేట మండలం సూకూరు గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలపై ఐటీడీఏ పాడేరు ప్రాజెక్టు అధికారి తిరుమాని శ్రీ పూజ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలపై ఆమె సమగ్రంగా పరిశీలన చేపట్టారు. విద్యార్థులకు వేడి చేసి సరఫరా చేస్తున్న త్రాగునీటిని, వంటగది పరిశుభ్రతను, స్టాక్ రూమ్ను, జీసీసీ ద్వారా సరఫరా చేసిన సరుకులను ఆమె స్వయంగా తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులకు హెల్త్ ఐడీ కార్డులు అందుబాటులో ఉన్నాయా అనే విషయాన్ని కూడా పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల సామాన్య శాస్త్రంలో నైపుణ్యాన్ని పరీక్షిస్తూ, వారి విద్యా స్థాయిపై అవగాహన పొందారు. తరగతి గదులు, వంటగది, పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య పూర్తిస్థాయిలో అందించేందుకు ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. విద్యా ఫలితాలను శాతంగా మెరుగుపర్చేందుకు కృషి చేయాలని, విద్యతో పాటు విద్యార్థుల ఆసక్తిని బట్టి ఇతర రంగాల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. తనిఖీ సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందుబాటులో లేరని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## మూలపేట శ్రీ గంగాలమ్మ తల్లికి లక్ష పసుపు కొమ్ములతో అలంకరణ

**అమ్మవారిని దర్శించుకుంటున్న గ్రామ సర్పంచ్ బిశెట్టి గంగప్పల నాయుడు దంపతులు**

**మునగపాక, నవంబర్ 27, మనసులో మాట..** మండలంలో గల మూలపేట గ్రామంలో కొలువైయున్న శ్రీగంగాలమ్మ తల్లి అమ్మవారికి మార్గశిర మాసం మొదటి లక్ష్మీవారం (అమ్మవారికి ఇష్టమైన రోజు) సందర్భంగా లక్ష పసుపు కొమ్ములతో అలంకరణ చేయడం జరిగింది. గ్రామ ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు ప్రత్యేక పూజలుతో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ ను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అమ్మవారిని గ్రామ ప్రథమ పౌరుడు బి శెట్టి గంగప్పలనాయుడు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## స్పీకర్ అయ్యన్న సహకారంతో నూకాలమ్మ ఆలయ పునర్నిర్మాణం

**మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి**



**నర్సీపట్నం ,నవంబర్ 27 (మనసులో మాట)..** గత ఐదేళ్లుగా నిలిచిపోయిన నూకాలమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో తిరిగి వేగవంతం చేస్తున్నట్లు స్పీకర్ సతీమణి, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి తెలిపారు. నూతన ఆలయ నిర్మాణంలో భాగంగా పాత ఆలయంలోని అమ్మవారిని గురువారం ఆలయ ప్రాంగణంలోని బాలాలయంలోకి ఆవాహన చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు రేజేటి సీతారామాచార్యుల బృందం అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో చింతకాయల పద్మావతి పాల్గన్నారు. అనంతరం పద్మావతి మాట్లాడుతూ పురాతన ఆలయం స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో అమ్మవారి కలశాన్ని బాలాలయంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలోనే ఈ ఆలయ నిర్మాణం కోసం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబం రూ.10 లక్షలు విరాళంగా అందించిందని, ప్రభుత్వ పరంగా రూ.40లక్షలు మంజూరు చేయించారని గుర్తు చేశారు. అయితే గత ఐదేళ్ల పాలనలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఆలయ నిర్మాణంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రితో మాట్లాడి, ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులపై చర్చించారన్నారు. ఈ క్రమంలో స్పీకర్ కుటుంబం తరపున మరో రూ.10లక్షలు, ప్రభుత్వం నుండి రూ.40లక్షలు నిధులు సమకూర్చి ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నర్సీపట్నంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా దుర్గాలమ్మ, అయ్యప్ప స్వామి, సాయిబాబా ఆలయాలతో పాటు నూకాలమ్మ, మరిడమ్మ వంటి అమ్మవార్ల ఆలయాలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొరుప్రోలు శ్రీనివాస్, దేవాదాయ శాఖ ఈవో సాంబశివరావు, టిడిపి కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## మాడగడ పీహెచ్ సి ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

**- కృష్ణమూర్తి నాయక్**



అరకులోయ, నవంబర్ 27 (మనసులు మాట): అల్లూరి సీతారామరాజు జిల్లా అరుకులోయ మండల పరిధి మాడగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్టు అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. డి కృష్ణమూర్తి నాయక్ తెలియజేశారు. అల్లూరి సీతారామరాజుజిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ముందుగా మాడగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారి మరియు వైద్య సిబ్బందినిఅడిగితెలుసుకున్నారు. పి.హెచ్.సి లో వైద్యం కోసం వచ్చే రోగులకు సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించడం జరిగిందన్నారు. పి.హెచ్.సి కి వచ్చిన రోగులతో ముచ్చటించి గ్రామాలలో అధికంగా ప్రబలుతున్న రోగాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. పి.హెచ్.సి హాజరు పట్టికను పరిశీలించి విధులకు గైర్హాజరయిన సీనియర్ అసిస్టెంట్ ఎస్. సింహాచలం రెండు రోజుల జీతంను నిలుపుదల చేస్తామన్నారు. విధులకు ఆలస్యమైన అటెండర్ కు మందలించడం జరిగిందని తెలియజేసారు. పి.హెచ్.సిలో సుఖ ప్రసవాలు అధికంగా జరుగునట్లు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిని జిల్లా వైద్యాధికారి ఆదేశించారు. గ్రామ స్థాయిలో సుఖప్రసవాలు గూర్చి చిన్నారులలో వచ్చే న్యుమోనియా వ్యాధి లక్షణాలు తీసుకొనే జాగ్రత్తల గూర్చి, తల్లిపాల ప్రాముఖ్యత గూర్చి, వ్యాధి నిరోధక టీకాల గూర్చి, పౌష్టికాహారం గూర్చి అవగాహన కలిపించాలని అన్నారు. కాన్పు అనంతరం 48 గం.లు సిబ్బంది పర్యవేక్షణలో ఉండాలని తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్టు నిర్ధారించిన అనంతరం తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనం సహాయంతో వారి గ్రామానికి తరలించాలని సిబ్బందికి ఆయన ఆదేశాలు జారీ చేశారు. అన్ని వార్డులను మరియు ప్రసూతి గదిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన ల్యాబ్ ద్వార నిర్వహిస్తున్న పరిక్షలు మలేరియా కేసులను అందించిన చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ ని తనిఖీ చేసి అందుబాటులో ఉన్న మందులను వ్యాక్సీన్ లను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి గ్రామాలలో ఇంటింటి సందర్శనలు నిర్వహించే క్షేత్ర స్థాయి సిబ్బంది, పర్యవేక్షణ సిబ్బంది అంకిత భావంతో తమ విధులను నిర్వర్తించాలని విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యాక్రమంలో పి.హెచ్.సి వైద్యాధికారి డా. ఎస్ వసంత మరియు సిబ్బంది పాల్గున్నారు.

## జల జీవన మిషన్ పనులు పూర్తి చేయాలి





**పాడేరు నవంబర్ 27 ( మనసులో మాట ):** జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామానికి మంచినీటి సదుపాయం అందించడం జరుగుతుందని అందులో ఈ కార్యక్రమంలో భాగంగా జల సంవాదం దేశం మొత్తం అన్ని జిల్లాలలో ఈ కార్యక్రమం యూ ట్యూబ్ ఛానల్ ద్వారా ప్రచారంజరుగుచున్నది. లక్ష్మివారం సాయం సాయంత్రం గరిగిన వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దీనిష్ కుమార్ పాల్గున్నారు.
బెస్ట్ ప్రాక్టీస్ లో భాగంగా అల్లూరి సీతారామ జిల్లా సంబంధించి జిమాడుగుల మండలం నుండి 13 కిలోమీటర్ల దూరం నడచి వెళ్ళుచున్న గ్రామం అయినా నేరేడు బందాగ్రామానికి స్ప్రింగ్ సోర్స్ ద్వారా వాటర్ సప్లై స్కీమును ఏర్పాటు చేశారు. ఈ గ్రామస్తులు గతం లో పారుగెడ్డ ద్వారా మంచి నీటిని వినియోగించేవారు. ప్రస్తుతం ఈ స్కీమ్ ఏర్పాటుచేసిన తర్వాత రెండున్నర కిలోమీటర్ల ఊటబావి ద్వారా వాటర్ సప్లై స్కీమును ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి ద్వారా వాటర్ సప్లై చేయడం జరుగుతుందన్నారు. జి.మాడుగుల మండలం, గడుతూరు పంచాయతీకి చెందిన నేరేడు బంధ గ్రామంలో 52 మంది జనాభా, 13 కుటుంబాలకు సంబంధించిన వారు నివాసముంటున్నారు. కొండ ప్రాంతంలో నివాసం ఉండటం వలనఈ గ్రామాలకు రోడ్డు మార్గం లేనందున నడక మార్గమున ద్వారా వారి ప్రాంతం కి వెళ్లాల్సి ఉంటుంది. జల జీవన్ మిషన్ స్కీం ద్వారా గేమ్మిలి పంచాయితీ, చిన్న పొర్లు గ్రామంలో 15 గృహాలకు, సీత బందాలో 25 గృహాలకు గ్రేవిటి స్కీమ్ ద్వారా కుళాయిలు ఏర్పాటుచేసి మంచి నీటిని అందజేస్తున్నమని, అలాగే జి.మాడుగుల మండలం, గేమ్మిలి పంచాయతీలో కొండపై నివాసం ఉంటున్న గ్రామాలకు కుండ దిగువనున్న ఊట బావి నుండి స్ప్రింగ్ కలెక్షన్ ద్వారా ట్యాంక్ ఏర్పాటు చేసి మోటార్ ద్వారా పంపిని చేసి గ్రామాలకు మంచి నీటిని అందజేయడ జరుగుతుందన్నారు. మల్టీ విలేజ్ స్కీం ద్వారా అనంతగిరి, అరకులోయ మండలాలకు కరెంటు వినియోగం లేకుండా 24x7 నిరంతర త్రాగునీటిని అందజేస్తున్నమన్నారు. అనంతగిరిలో 529 గృహాలు, అరకు లోయలో 1240 గృహాలు గ్రావిటీ ద్వారా ఫిల్టర్ చేసి మంచినీటి సరఫరా చేస్తున్నామన్నారు.
విశాఖ జిల్లా నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో ఏ ప్రాంతంలో అయితే జలజీవన్ మిషన్ స్కీం నూతనంగా సాక్షన్ అయినా గ్రామాలకు, విలేజ్ వాటర్ %డ% శానిటేషన్ కమిటీ ద్వారా సంఘటిత పరిచి, నీటి వనరులు గుర్తించి మంచినీటి వినియోగానికి, నిర్మాణము మరియు నిర్వహణలో భాగస్వామ్యం చేయడం, శిక్షణ, బుక్ మెంటైనెన్స్ కు సంబంధించి రిజిస్టర్ లో నమోదు చేయడం జరుగుతుందన్నారు.
జల జీవన్ మిషన్ లో భాగంగా చింతపల్లి ముంచంగి పుట్టు,పాడేరు, కొయ్యూరు 4 మండలాలలో విలేజ్ వాటర్ మరియు శానిటేషన్ కమిటీ వాటర్ వినియోగంపై శిక్షణా తరగతులు నిర్వహిస్తుందన్నారు. అల్లూరు జిల్లా 11 మండలాలకు సంబంధించిన జలజీవన్ మిషన్ ద్వారా మంచినీటి సదుపాయం ఏర్పాటు చేస్తున్నామని, జల సంవాద్ ప్రతినెల ఆన్లైన్ ద్వారా జిల్లాలో పోటీ తత్వం పెంచడానికి జయం -జయం పనులు సమర్ధవంతంగా పూర్తి చేయడానికి ప్రతి ఇంటికి నాణ్యమైన త్రాగునీరు అందించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎక్స్క్యూటివ్ ఇంజనీర్ (ఇంచార్జి ) టి చంద్ర ఆస్కెడ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి హెచ్ రవీంద్ర తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## మండలం ఏర్పాటు చేయాలి...

**జిసిసి రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ కి, గోమంగి మండల సాధన సమితి వినతి....**



**పెదబయలు నవంబర్ 27 మనసులో మాట:** అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలాన్ని విభజించి గోమంగిని ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రులు కమిటీ ఈనెల 5వ తేదీన ఆమోదం తెలిపిన విషయం అందరికీ తెలిసిందే. అయితే 25వ తేదీన మంత్రుల కమిటీ సమావేశంలో గోమంగి మండల కేంద్రం ఏర్పాటు విషయం ప్రస్తావన లేకపోవడం 13 పంచాయతీల ప్రజలు నిరాశకు గురయ్యారు గోమంగి మండలం ఏర్పాటుతోనే మారుమూల పంచాయతీల అభివృద్ధి జరుగుతుందని, ఐదో తేదీన తీసుకున్న మంత్రం కమిటీ నిర్ణయాన్ని యధావిధిగా కొనసాగించాలని జిసిసి రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ కి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా గోమంగి మండల సాధన సమితి నాయకులు కూడా బొంజు బాబు, కొమ్మ అనంత పద్మనాభం, కూడా రాధాకృష్ణ, గల్లీలు రమేష్ బాబు, గంపరాయి రవి వర్మ, టిడిపి నాయకులు కర్ణ అచ్చిబాబు, సతీష్ కుమార్, గోపాలం, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## గంటా జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బయ్యవరం పాఠశాల్లో విద్యార్థులకు మ్యాప్ పాయింటింగ్, జామెంట్రీ బాక్స్ పంపిణీ..



**కశింకోట, నవంబర్ 27 మనసులో మాట..** మాజీ మంత్రి భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాలలో భాగంగా గంటా యువసేన ఆధ్వర్యంలో మూడవ రోజు బయ్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నిర్వహిస్తున్న కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి . మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు విచ్చేసి 9. 10 వ,తరగతి విద్యార్థినీ విద్యార్థులకు మేప్ పాయింటింగ్ బుక్స్. ప్లాంక్స్ జామెంట్రీ బాక్సు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సురేంద్ర. శ్రీనివాసరావు మాట్లాడుతూ గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాలు సందర్భంగా మీ అందరి దీవెనలు ఆయన కు ఉండాలి అని తెలిపారు. మీరు బాగా చదువుకుని హైస్కూల్ మంచి పేరు తీసుకురావాలి.చదువులో ఎప్పుడూ పోటీ తత్వంతో చదవాలని మనం చదువులు ముందంజలో ఉండి క్రీడలు అన్ని విషయాల్లో ఏకాగ్రతతో చదువుకుని మంచి మార్కులు సంపాదించుకొని ప్రథమ స్థానంలో నిలవాలని తెలియజేశారు. గంటా శ్రీనివాసరావు అంటే ఒక వ్యక్తి కాదని. మహాశక్తి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓటమి ఎరుగని నేత గంటా శ్రీనివాసరావు అని తెలియజేశారు. గంటా శ్రీనివాసరావు అనకాపల్లి నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పోలవరపు త్రినాథ్, దాడి జగన్., గొంతిని చిరంజీవి, ఎన్టీఆర్ హాస్పిటల్ డైరెక్టర్ ఉల్లింగల రమేష్, గొల్లవిల్లి ప్రవీణ్, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు మజ్జి శ్రీకర్, నైనా%శీ%శెట్టి రమణారావు, మండల ఐటీడీపీ అధ్యక్షులు./గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకునాయుడు. గంటా యువసేన కన్వీనర్ గొంతీన గంగాధర్ మండల ఐటీడీపీ లు సెక్రెటరీ వీరబ్రహ్మాం . రామకృష్ణ సిద్దిరెడ్డి శ్రీను పరవాడ చిన్న రమణ మండల తెలుగు యువత కార్యదర్శి తురిబిల్లి శంకర్ గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ప్రసాద్ గూడుపు చలపతి ఎస్సి సెల్ రాజు తెరపల్లి శ్రీను స్కూల్ సిబ్బంది కూటం నాయకులు పాల్గొన్నారు



## 75వార్డు లో కోటి సంతకాల సేకరణ

**గాజువాక (మనసులోమాట) నవంబర్ 27..**75 వ వార్డు సీతానగరం ఎస్సీ కాలనీ వద్ద 75వార్డు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొందేశి శ్రీనివాస్ రెడ్డి (బుజ్జి) ఆధ్వర్యంలో మెడికల్ కాలేజ్ ప్రైవేటీకరణ రద్దు చేయాలని కోటి సంతకాల సేకరణ అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా ఈ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ ఆధీనంలో మెడికల్ కాలేజీలో కొనసాగే విధంగా కూటమి ప్రభుత్వం ప్రజల తాలూకు ఆలోచనలు అలాగే దళిత బడుగు బలహీన వర్గాల ఆలోచనలు పరిగణలో తీసుకొని ప్రభుత్వ ఆధీనంలో మెడికల్ కాలేజీలు కొనసాగే విధంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు సహకరించాలి గత ప్రభుత్వ 17 కాలేజీల్ని ఈ రాష్ట్రానికి తీసుకురావడం జరిగింది అందులో 5 కాలేజీలు పూర్తి అవ్వగా మిగతా కాలేజీలు పూర్తిగా సమయంలో కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రభుత్వ కాలేజీ అన్నీ కూడా ప్రైవేటీకరణ చేయడమైన దుర్మార్గ చర్యని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలైనా ఇచ్చిన హామీల నెరవేర్చకుండా అబద్ధపు ఆ వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేస్తూ కాలయాపన చేస్తున్నారు యొక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రభుత్వ ఆధీనంలో కొనసాగే విధంగా రాష్ట్ర ప్రజల తరఫున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో 75వ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొందేశి శ్రీనివాస్ రెడ్డి, (బుజ్జి), మారేడుపూడి పరదేశి, గొందేసి మహేశ్వర్ రెడ్డి, గంట్యాడ గురుమూర్తి, నక్క వెంకటరమణ గొందేసి వెంకటరమణారెడ్డి, ములకలపల్లి వెంకటేష్, పెట్టా రెడ్డి మారేడుపూడి రాము, మారేడుపూడివెంకటేష్, పిట్టా రెడ్డి ఇంటికిబిల్లి ప్రకాష్, శంకర్రావు, కనితి వెంకట్రావు, కనితి అప్పారావు, పెద్దాడ రాములు, టేకేటి శ్రీను, మద్ది అప్పలరాజు, పెద్దాడ ప్రసాద్, నీలాపు బిల్డర్ శీను, గొందేసి అప్పల రెడ్డి, కనితి ఈశ్వరరావు, గొందేసి అప్పల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో**

## ఆరోగ్య వికాస కేంద్రాలు

**అందరికీ నాణ్యమైన, సమ సమగ్ర ఆరోగ్య సేవలు...**



**పెదబయలు నవంబర్ 27 మనసులో మాట:** ఆంధ్ర ప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒక ఆచరణాత్మక అధ్యయనం. దీనికి గాను ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రీసెర్చ్ వారి ప్రోత్సాహంతో అల్లూరి సీతారామరాజు జిల్లా లో ప్రిన్సిపల్ ఇనిస్టిగేటర్ డాక్టర్.వై.యస్. కుసుమ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ నిర్వహించడం జరుగుతుంది. దీనికి గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య బంధం వారి సహకారంతో జిల్లా వైద్య బృందం వారి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో విడతలవారీగా 12 సీ.పీ.హెచ్.సి సేవల పైన శిక్షణ తరగతలను కొంతమంది టి.ఓ.టీ లను తయారు చేసి వాళ్ళతో జిల్లా మొత్తము హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ యొక్క సిబ్బంది మొత్తమునకు ఈ శిక్షణను అందించే లక్ష్యంతో హుకుంపేట, అరకు వ్యాలీ, చింతపల్లి, డుంబ్రిగూడ, పెదబయలు అను ఐదు కేంద్రాలు వద్ద ఒక్కో బ్యాచ్ కి మూడు రోజులపాటు శిక్షణ అందించడం జరుగుతుంది. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రాజెక్ట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్. జి.వర్మ , కన్సల్టెంట్స్ జి.దిలీప్ కుమార్ , నీలా శాంతి ఆధ్వర్యంలో %జూఖఞా% బృందము (ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్ -%×××%) కార్యక్రమాన్ని ముందుకు నడిపించడం జరిగింది, ఈ కార్యక్రమానికి మెడికల్ ఆఫీసర్స్, సి.హెచ్.ఓ లు ఏ.ఎన్.ఎం లు, హెల్త్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

## బి ఆర్ టి కాలనీలో ఘనంగా నల్లమారమ్మ తల్లి విగ్రహప్రతిష్ట



**అనకాపల్లి రూరల్ నవంబర్27 మనసులో మాట..** మండలం లోని పిసినికాడ పంచాయతీ బి ఆర్ టి కాలనీలో శ్రీనల్లమారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట అత్యంత ఘనంగా ఆలయ కమిటీ నిర్వహకులు గ్రామ ప్రజలు నిర్వహించారు. అనకాపల్లి మండలం , పిసినికాడ పంచాయతీ ,బి ఆర్ టి కాలనీలో 1994వ సంవత్సరంలో స్వయంభుగా వెలసిన శ్రీ శ్రీ నల్లమరమ్మతల్లి అమ్మవారు వెలిసింది. ఈ నల్లమారమ్మ అమ్మవారి దినదిన అభివృద్ధి చెందుతూ బిఆర్ టి కాలనీ భక్తులకు కొంగు బంగారమై కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వెలిసిందని భక్తుల నమ్మకం, అందులో భాగంగా మార్గశిర మాసం మొదట గురువారం శ్రీశ్రీశ్రీ నల్లమారమ్మ అమ్మవారి నీ విశాఖపట్నం ఆడారి వెంకట అప్పారావు (చిన్న) సుకన్య దంపతుల ఆధ్వర్యంలో వేద పండితుల , గ్రామస్తులు ,ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా విగ్ర ప్రతిష్ట నిర్వహించారు . అమ్మవారికి బి ఆర్ టి కాలనీ పురవీధుల్లో పలు సంస్కృతి కార్యక్రమాలతో ఊరేగించి అమ్మవారి దేవాలయం చేరుకొని అక్కడ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు పాలాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంపీటీసీ మొల్లేటి హైమావతి శివాజీ, మాజీ ఎంపీటీసీ మల్ల శ్రీను, మేడేపల్లి పాపారావు, కాండ్రేగుల రాజు, పెద్దిశెట్టి రమేష్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అమ్మవారికి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. అలాగే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే అమ్మవారి మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు శిల్పి విల్లూరి పరమేశ్వరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎల్లపు వెంకటరావు, బుద్ధ నాగేష్, గండిపోయిన బుజ్జి , ఆడారి సత్తిబాబు, మేస్త్రి మల్ల శ్రీను, దొడ్డి కుమార్ రాజా, దొడ్డి నరేంద్ర, కొణతాల రమేష్ నాయుడు, వెంకట్రావు మాస్టారు, సరిస భాస్కరరావు, బండి రాధిక, దొడ్డి నాగమణి, ఎంఎం నాయుడు, ఆడారి శ్రీను, పెంటకోట శ్రీను పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శిశు మరణాలపై సమగ్ర అధ్యయనం చేసి శిశు మరణాలు అరికట్టాలి...

**ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి: కూడ రాధాకృష్ణ**



పెదబయలు నవంబర్ 27 మనసులో మాట : అల్లూరి సీతారామరాజు జిల్లా ఆదివాసి ప్రాంతంలో శిశు మరణాలపై సమగ్రంగా అధ్యయనం చేసి శిశు మరణాలు అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు: వారు మాట్లాడుతూ: ఆదివాసి ప్రాంతంలో గతంలో పెదబయలు మండలం రుడకోట, ఈ నెల రోజుల వ్యవధిలో ముంచంగిపుట్ మండలం దార్రెల పంచాయతీ డి కుమారిపుట్ లో వరుసగా ఐదుగురు శిశువులు మరణించారని, డి. కుమ్మరిపుట్టు గ్రామానికి చెందిన 4 నెలల చిన్నారి హర్షశ్రీ శనివారం మృతి చెందాడు. మూడ్రోజుల నుంచి పాలు తాగకపో వడంతో నీరసించిపోయాడు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు
శుక్రవారం 28 నవంబర్ 2025



# క్రమ శిక్షణ బీజేపీ లక్షణం

- ►► క్షేత్ర స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి
- ►► బీజేపీ గోదావరి జోన్ ప్రశిక్షణలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ




**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** క్రమ శిక్షణ గల కార్యకర్త అనగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యకర్తలే అని కేంద్ర భారీ పరిశ్రమల ఉప శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తెలిపారు. గురువారం నగరంలోని హెూటల్ రివర్ బే 'ఆహ్వానం' ఫంక్షన్ హాల్ లో బీజేపీ గోదావరి జోన్ పరిధిలో గల ఆరు జిల్లాల నుంచి పార్టీ మండల శాఖ అధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు సుమారు 350 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, సంఘటన్ కార్యదర్శి మధుకర్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి, తూర్పు గోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఫిక్కి నాగేంద్ర సహా మచిలీపట్నం, ఏలూరు, కాకినాడ, అమలాపురం జిల్లాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు బీజేపీ నేతలు, ప్రశిక్షణకు హాజరైన ముఖ్య నేతలు, క్రియాశీలక ప్రతినిధులు యోగా సాధన చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వందేమాతరం గీతంతో ప్రశిక్షణను ప్రారంభించారు. సభలో ముఖ్య అతిథులు పార్టీ బాధ్యులకు దిశానిర్దేశం చేశారు. పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. అలాగే పార్టీ సిద్ధాంతాలను ప్రతి కార్యకర్త అవగాహన చేసుకుని, సుశిక్షితులైన క్రమశిక్షణ గల కార్యకర్తలుగా వ్యవహరించి బీజేపీకి ఉన్న గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం పార్టీ శ్రేణులపై ఉందన్నారు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను విశ్లేషించారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పలు అంశాలపై సమగ్రంగా మాట్లాడారు. సంస్థాగతం విధానంలో భాగంగా ఆరు జిల్లాల మండల బిజెపి అధ్యక్షులకు, జిల్లా ప్రధాన కార్యదర్శులుకు ప్రశిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు. బీజేపీ కార్యకలాపాలను ఏ విధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలనే విధంగా మార్గదర్శకం చేశామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలతో ఎలా పనిచేయాలి తదితర అన్ని అంశాలపై చర్చించామన్నారు. బూత్ ఆధారంగా రాష్ట్రంలో పార్టీని పటిష్టం చేసి, ఏ విధంగా ప్రజల్లోకి చొచ్చుకు వెళ్ళాలో, స్థానిక అంశాలపై ఉద్యమాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం పై కేంద్ర ప్రభుతం చిత్తశుద్ధితో ఉందని 11,500 కోట్ల రూపాయల ప్యాకేజీ మంజూరు చెయ్యడమే దానికి నిదర్శనం అన్నారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి అమిత్ షా , ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి నచ్చ చెప్పడం ద్వారా ప్యాకేజీ సాధించామని, ఇంకా తమ చిత్తశుద్ధి పై ప్రశ్నించే వారి చిత్తశుద్ధిని అనుమానించాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు.




## రీసర్వే ప్రాజెక్టు
# దేశానికే ఆదర్శం

### - రీజనల్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్వీఎస్ఎన్ కుమార్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** రాష్ట్రంలో అమలు జరుగుతున్న రీసర్వే ప్రాజెక్టు దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రీజనల్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్వీఎస్ఎన్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయం పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన రీసర్వే సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్వే ఉప పరిశీలకులు, రీసర్వే ఉప తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లతో ఆయన నిర్వహించిన సమావేశంలో, గత ఐదు సంవత్సరాలుగా రీసర్వే పూర్తయిన గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న జాయింట్ యల్.పి.యంల సమస్య లను ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌గా పట్టాల విభజన కార్యక్రమం ద్వారా వేగంగా పరిష్కరించడానికి చర్యలు చేపట్టిందని వివరించారు. రైతు సమస్యల పరిష్కారం అత్యంత ప్రాధాన్యమైందని, రీసర్వే ఉప తహశీల్దార్లు తమ మండల పరిధిలో ఉన్న అంశాలను శ్రద్ధగా పర్యవేక్షించి త్వరితగతిన పరిష్కరించాలని ఆయన సూచించారు. తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 412 జాయింట్ యల్.పి.యం లను ఇప్పటికే రిజిస్టర్ చేసి విభజన ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. వెబ్‌ల్యాండ్ అడంగల్ల పరిధిలో 1305 కరెక్షన్ రికార్డులను తహశీల్దార్లు, రీసర్వే అధికారులు ప్రత్యేక దృష్టితో విచారణ చేసి త్వరితంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫేజ్ 2, 3, జనవరి 1 నుంచి ప్రారంభమయ్యే ఫేజ్ 4 గ్రామాలలో రీసర్వే నిర్వహణ సమయంలో జాయింట్ యల్.పి.యం లు 1 శాతాన్ని మించకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ అధికారులు ఆర్.ఓ.ఆర్ చట్టం ప్రకారం, సర్వే అధికారులు సర్వే సరిహద్దుల చట్టం ప్రకారం విధులు నిర్వహించి, రైతుల సంతృప్తి స్థాయిని పెంచేలా సేవలు అందించాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ సూచించారు. సర్వే భూమి రికార్డుల శాఖ అధికారి బీఎల్ నారాయణ, సర్వే పరిశీలకులు టీ వెంకటేశ్వరరావు, సర్వే కార్యాలయం పర్యవేక్షకుడు వీ శేషగిరిరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశానికి ముందుగా రీజనల్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్వీఎస్ఎన్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.



## సీఎం పర్యటనపై
# కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్

**ఏలూరు, నవంబర్, 27 (మనసులో మాట)...** డిసెంబర్,1వ తేదీన ఉంగుటూరు మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులతో గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ డిసెంబర్, 1వ తేదీన ఉంగుటూరు మండలంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొంటారని, అందుకు సంబంధించి ఆయా ప్రదేశాలలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలనీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి డిసెంబర్, 1వ తేదీన ఉంగుటూరు మండలంలో సామాజిక పెన్షన్ల పంపిణీ, బంగారు కుటుంబాలను కలిసి, మార్గదర్శకులతో సమావేశమయ్యే అవకాశం ఉందని,అనంతరం బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉందన్నారు. గొల్లగూడెం, గోపీనాథపట్నం లలో ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెలిపాడ్, సభాస్థలి ప్రాంతాలను అధికారులు పరిశీలించి, ఏర్పాట్లకు అనువైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని, వాటిని ఆమోదం కోసం ముఖ్యమంత్రివర్యుల కార్యాలయానికి పంపవలసి ఉంటుందని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## తూర్పు గోదావరిలో 18 మంది డిప్యూటీ ఎంపీడీవోలు నియామకం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** తూర్పు గోదావరి జిల్లాలో 18 మంది డిప్యూటీ ఎంపీడీవోలను నియమిస్తూ గురువారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖలో తీసుకొస్తున్న సంస్కరణలో భాగంగా సచివాలయ పరిపాలనకు సంబంధించి కొత్తగా డిప్యూటీ ఎంపీడీఓ (జీఎస్‌డబ్ల్యూఎస్) లను నియమించారు. గ్రామ పంచాయతీలో ఎలాంటి కేసులు లేని సీనియర్ గ్రేడ్-1 కార్యదర్శులను, మండల పరిషత్ లో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ లకు పదోన్నతి ఇచ్చి డిప్యూటీ ఎంపీడీఓలుగా అవకాశం ఇచ్చారు. ఈ 18 మందిలో 12 మంది ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లాలో పనిచేస్తున్న వారు కాగా, మరో ఆరుగురు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందినవారు. జోన్ 2 పరిధిలో ఉన్న ఈ పద్దెనిమిది మందిని తూర్పు గోదావరి జిల్లాకు కేటాయిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో వారికి జిల్లా కలెక్టర్ మండలాలలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**మండలాల వారీగా డిప్యూటీ ఎంపీడీవోలు వీరే..**

గోపాలపురం-ఆర్ వి సత్యనారాయణ, రంగంపేట-ఎం శ్రీనివాస్, నిడదవోలు-టీ గోపాలకృష్ణ, తాళ్లపూడి-కేవీఎస్‌వీ వీరన్న, నల్లజర్ల-కేవీవీ రాంబాబు, కడియం-ఎస్ శ్యాంప్రసాద్, కొవ్వూరు-ఎం ముత్యం, గోకవరం-వీ శ్రీరామ్మూర్తి, రాజనగరం-సీహెచ్ దేవదాసు, అనపర్తి-సీహెచ్ శ్రీ శాస్త్రి, సీతానగరం-మల్లిడి వెంకటరెడ్డి, బిక్కవోలు-వై మునేశ్వరరావు, కోరుకొండ-గుణ్ణం ప్రసాదరావు, దేవరపల్లి-కాయల వీ సత్యనారాయణ, రాజమహేంద్రవరం రూరల్- దాసరి సూర్యనారాయణ, చాగల్లు-పుల్లేటికుర్తి అచ్యుత రామకృష్ణ, పెరవలి- కొవ్వూరి శ్రీనివాస్ రెడ్డి, ఉండ్రాజవరం- తాళ్లూరి శేషుబాబు.. నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

## పిఠాపురం మున్సిపాలిటీ పై
# అవినీతి మరకలు

- ►► కోటి రూపాయల మేర నిధులు దుర్వినియోగం చేసినట్లు ఆరోపణ
- ►► రోడ్లు వేయకుండానే బిల్లులు పాస్ చేసుకున్న వైనం
- ►► పలు నిర్మాణాలలో నాణ్యత లోపాలను గుర్తించిన విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు
- ►► గతంలో విధులు నిర్వహించిన పలువురు అధికారులపై శాఖా పరమైన చర్యలకు ఆదేశం




**పిఠాపురం (మనసులో మాట) నవంబరు 27 :** పిఠాపురం పురపాలక సంఘంలో భారీ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. గతంలో చేపట్టిన పలు నిర్మాణాల లో జరిగిన అవకతవకలు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల తనిఖీలలో బయటపడ్డాయి. కోటి రూపాయల మేర నిధులు స్వాహా చేసిన ఘటనలో ఐదుగురు అధికారులకు క్రమశిక్షణ చర్యలు కు ప్రభుత్వం ఆదేశించింది. పిఠాపురం పురపాలక సంఘానికి 2019 -20ఆర్థిక సంవత్సరంలో 14వ ఆర్థిక సంఘం ద్వారా 55 పనుల కు గాను 7,73,44,000 (ఏడు కోట్ల ఢబై మూడు లక్షల నలబై నాలుగు వేల రూపాయలు రూపాయలు మంజూరు చేశారు. ఇందులో 36 పనులకు సాంకేతిక ఆమోదం లభించగా 30 పనులకు వర్కు అగ్రిమెంట్లు జరిగాయి. ఇందులో మూడు కోట్ల పదిలక్షల (3,10,00000) రూపాయల విలువైన 28 పనులు ప్రారంభించి పూర్తి చేశారు. రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం,తాగు నీటి సరఫరా, పైపులైన్లు నిర్మాణం వంటి పలు పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా నిర్మించారంటూ తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. కాంట్రాక్టర్ల తో ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కయి భారీగా నిధులను స్వాహా చేశారని కోటి రూపాయల మేర నిధులు దోచుకున్నారని, పనులు చేయకుండా బిల్లులు మంజూరు చేయించుకున్నారని, పలు ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఆయా పనులపై తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీలలో పలు లోపాలను గుర్తించారు పనులు చేయకుండానే బిల్లులు చెల్లించినట్లు పలు పనుల్లో నాణ్యత లోపించినట్టు ప్రభుత్వానికి నివేదిక అందించారు. పురపాలక సంఘంలో గతంలో అసిస్టెంట్ ఇంజనీర్లుగా పని చేసిన వంశీ అభిషేక్,రత్నవల్లి డిప్యూటీ ఇంజనీర్ లు భవానీ శంకర్, హుస్సేన్, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేసిన నరసింహారావులపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి జీవో నెంబర్ 1339 ని జారీ చేసింది. ఈ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి ఎన్ సురేష్ కుమార్ ఆదేశించారు.

అధికారులు కోట్లు దోచుకుని ప్రజల భద్రతను గాలికి వదిలేసారని తీవ్రంగా విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో ఈ ఉదాంతం పిఠాపురంలో దుమారం రేపుతుంది. కోట్ల రూపాయలు అవినీతి చేస్తున్న అధికారులను ప్రభుత్వం కట్టడి చేయకపోతే ప్రజల భద్రతకి ముప్పు వాటిల్లుతుందని ప్రభుత్వం చొరవ తీసుకుని సదరు అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు. జరగరానిది ఏదైనా జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతే అధికారులు బాధ్యత వహిస్తారా అంటూ పలువురు ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు.

## రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా
# చర్యలు తీసుకుంటున్నాం



**ఏలూరు, నవంబర్, 27 (మనసులో మాట)..** వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో రైతులకు ఎటువంటి పంట నష్టం జరగకుండా రైతులకు ముందస్తు జాగ్రత్త చర్యలపై అవగాహన కలిగిస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ కు తెలియజేసారు.జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ధాన్యం కొనుగోలు, సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆర్టీజీఎస్, ప్రభుత్వ కార్యక్రమాలపై పాజిటివ్ పబ్లిక్ పెరస్పన్,తదితర అంశాలపై ఎపి సచివాలయం నుండి వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ మాట్లాడుతూ వాతారణం శాఖ తుఫాన్ హెచ్చరిక జారీ చేసిన దృష్ట్యా రైతుల పంటకు నష్టం కలగకుండా రైతు సేవా కేంద్రాల వద్ద టార్పాలిన్లు సిద్ధం చేస్తామన్నారు. ధాన్యం సేకరణను మరింత వేగవంతం చేస్తున్నామన్నారు.

## వరి కోతల కోసి ఆరబెట్టిన ధాన్యాన్ని
# వెంటనే కొనుగోలు చేయాలి

### జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్



**అమలాపురం( మనసులో మాట) నవంబరు 27:** భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రానున్న మూడు రోజుల్లో వరి కోతలు నిర్వహించి ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే కొను గోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పౌరసరఫరాల అధికారులకు సూచించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయా నంద్ అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ లో 26 జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ ధాన్యం సేకరణ గోనెసంచులు, తార్పా లెనిలు సరఫరా రియల్ టైం గవర్నెన్స్ డాక్యుమెంట్లు అప్లోడింగ్ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మరమ్మత్తులు నిర్వహణ అంశాల పురో గతిపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు తాము ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని త్వరితగతిన విక్రయించుకుని తుఫాన్ భారి నుండి బయట పడాలన్నారు. గోనె సంచులు తార్పాలిన్లు అందుబాటు లో ఉంచడం జరిగిందని వాటిని సద్వినియోగం చేసుకొని గిట్టుబాటు ధరలు పొందాలని సూచించారు. ఆసుపత్రి వైద్య సేవలు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు దేవాలయాల్లో దర్శనాలు అన్నా క్యాంటీన్ల నిర్వహణ తదితర అంశాలలో లబ్ధిదారుల సంతృప్తి స్థాయిలను మరింత మెరు గుపరిచి జిల్లాను ముందంజలో నిలపాలని సూచించారు. ప్రభుత్వం ఆదేశించిన డాక్యుమెంట్ల ను అప్లోడ్ చేస్తూ ఆశించిన పురోగతిని సాధించాలన్నారు. అర్జీలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరిస్తూ నూటికి నూరు శాతం పరిష్కార మార్గాలు చూ పుతూ అర్జీలు పునరావృతం కాకుండా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వం సేకరించే ధాన్యం రకాలకు అనుగుణంగా వరి వంగడాలను సాగు చేస్తూ వ్యవసాయ రంగాన్ని లాభ సాటిగా మార్చుకోవాలన్నా రు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల పట్ల ఆశించిన పురోగతిని సాధించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి, జిల్లా పౌరసరఫ రాల అధికారి అడపా ఉదయ భాస్కర్, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల శాఖ పి శ్రీనివాస్, డి ఎల్ డి వో రాజేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధి కారత అధికారిని పి జ్యోతి లక్ష్మి దేవి తదితరులు పాల్గొన్నారు.



## అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయానికి
# మాస్టర్ ప్లాన్ రెడీ

**అమలాపురం (మనసులో మాట) నవంబరు 27:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. మొత్తం 4,618 ఎకరాల్లో ఈ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఫేజ్-1లో భాగంగా 4 కిలోమీటర్ల పొడవైన రన్‌వేను నిర్మించనున్నారు. ఈ విమానాశ్రయాన్ని 'కోడ్-4ఎఫ్' ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు. దీని ద్వారా ఎయిర్‌బస్ ఎ380, బోయింగ్ 777-9 వంటి ప్రపంచంలోని అతిపెద్ద విమానాలు కూడా అమరావతిలో ల్యాండింగ్ చేసే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ విమానాశ్రయం పూర్తయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అంతర్జాతీయ విమాన రవాణాలో కీలక కేంద్రంగా అమరావతి అభివృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలోనే భూసేకరణ, టెండర్లు, నిర్మాణ పనులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని దీంతో ప్రభుత్వ ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



# జగన్ విద్యార్థులను చూసైనా నేర్చుకో... అసెంబ్లీకి రా

**మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు హితవు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** విద్యార్థులు ఇటీవల నిర్వహించిన మాక్ అసెంబ్లీని చూసి జగన్ నేర్చుకోవాల్సింది చాలా ఉందని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు అసెంబ్లీనికి కౌరవ సభలా నిర్వహించిన జగన్ నియంతలా పాలన సాగించారని మండిపడ్డారు. ఇప్పుడిప్పుడే లోకం చూస్తున్న విద్యార్థులు ఇటీవల నిర్వహించిన మాక్ అసెంబ్లీ జగన్ వంటి వారికి కనువిప్పు కలగడంతో పాటు అసెంబ్లీని ఎలా నిర్వహించాలి, ప్రతిపక్షంలో ఎలా వ్యవహరించాలో తెలుస్తుందన్నారు. విద్యార్థుల మాక్ అసెంబ్లీని చూసి నేర్చుకోవాలని జగన్ కు సూచించారు. చిన్న పిల్లలైనా ఎలాంటి తాత్కాలిక శాశ్వత బహిష్కరణలకు తావివ్వకుండా ప్రజా సమస్యలను సభలోనే ప్రస్తావిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. కనీసం జగన్ ఇప్పటికైనా అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండు చేశారు. సభ వెలుపల మాట్లాడడం కంటే ప్రజా ప్రతినిధిగా సభకు హాజరై చర్చించడం ముఖ్యమని ఆదిరెడ్డి అప్పారావు హితవుపలికారు.

# లక్ష్మీపురం గ్రామానికి మంచినీటి సమస్యను తీర్చండి

- కాళీ బిందెలతో సచివాలయం ఎదుట నిరసన
- లక్ష్మీపురం సచివాలయ సిబ్బందికి వినతి



**ఎటపాక( మనసులో మాట), నవంబర్ 27:** ఎటపాక మండల పరిధిలోని లక్ష్మీపురం సచివాలయం ఎదుట తమ గ్రామానికి మంచినీళ్లు గురువారం ఇప్పించండి అంటూ గురువారం కాళీ బిందులతో నిరసన తెలిపారు. లక్ష్మీపురం పంచాయతీలోని మంచినీటి సమస్యను తీర్చాలంటూ గ్రామస్తులు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సచివాలయం ఎదుట నిరసన చేపట్టారు. పేద ప్రజలు కోరుకునే కనీస అవసరాలైన మంచినీటి సమస్యను పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కాక అర్జున్ అన్నారు. తక్షణమే నీటి సమస్యను తీర్చాలని సచివాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం మాజీ సర్పంచ్ రత్తమ్మ, మండల కార్యదర్శి అర్జున్, జిల్లా కమిటీ సభ్యుడు ఐ వి, మండల కమిటీ సభ్యుడు పులుసు బాలకృష్ణ, భద్రయ్య, వెంకట్రావు, రాము, జయమ్మ మరియు గ్రామస్తులు, మహిళలు జయమ్మ మరియు మహిళలు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్న ఆలయానికి రూ. లక్ష విరాళం



**కొత్తపేట (మనసులో మాట) నవంబర్ 27..** కోనసీమ తిరుమల గా పేరు పొందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి, ఆలయ నిత్యానంద పథకానికి , తెలంగాణ, హైదరాబాద్, %ూ =% నగర్ కు చెందిన, ఆవాల వెంకట సుబ్బారావు , ఆవాల వీర వెంకట లక్ష్మి ఇషాన్వి, కుటుంబ సభ్యులు రూ, లక్ష 116 వెంకటేశ్వర స్వామి నిత్యా అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు కు విరాళం అందజేశారు. దాతలకు వేద పండిట్ పణిశర్మ, స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి వేదఆశీర్వచనం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

# ఇంకెన్నాళ్లు ఈ రహదారి కష్టాలు?

- కుయ్యేరు - గొల్లపాలెం రహదారి ప్రయాణం నరకప్రాయం
- శంకుస్థాపన జరిగి ఆరు సంవత్సరాలు గడిచినా పనులలేమి - ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- మంత్రి సుభాష్ జోక్యం తీసుకుని రహదారి పూర్తి చేయాలని కాజులూరు మండల ప్రజల విజ్ఞప్తి
- మండల కేంద్రానికి రాని ఆర్టీసీ బస్సులు - రవాణా సౌకర్యాల కోసం పెరుగుతున్న డిమాండ్





**కాజులూరు (మనసులో మాట) నవంబర్ 27..** కాజులూరు మండలంలో కుయ్యేరు నుంచి గొల్లపాలెం వరకు వెళ్లే రహదారి పరిస్థితి ఏళ్ళ తరబడి ప్రజలను నరకం చూపిస్తోంది. గ్రామాల మధ్యను కలుపుతూ, విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రాథమిక అవసరాలకు కీలకంగా ఉండాల్సిన ఈ రహదారి ప్రస్తుతం ప్రయాణీకుల ప్రాణాలకే ముప్పుగా మారింది. వర్షాకాలంలో ఈ మార్గం పూర్తిగా చెరువులా మారిపోతే, వేసవిలో దుమ్ముతో ఊపిరాడని పరిస్థితి ఏర్పడుతోంది. వీధిదీపాలు లేకపోవడం, రోడ్డు పక్కనున్న కందరాలు కుచించుకుపోవడం వల్ల రాత్రి సమయంలో ప్రయాణం మరింత ప్రమాదకరం అవుతోంది.

ఆరు సంవత్సరాల తర్వాత కూడా పూర్తిస్థాయిలో పనులు మొదలవ్వకపోవడం పై ప్రజల ఆవేదన చెందుతున్నారు.

ఈ రహదారి అభివృద్ధికి ఆరు సంవత్సరాల క్రితం నాటి బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ 36 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి శంకుస్థాపన జరిగినప్పటికీ, పనులు పూర్తి అవ్వడం దూరమైతే, ప్రారంభించి కూడా పూర్తికాని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లింకు రోడ్లపై దృష్టి సాధించారు తప్ప దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదనీ చాలా గ్రామాలకు నిరాశ కలిగిస్తోంది. ప్రతి సంవత్సరం నాయకులు హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిధుల కొరత, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, శాఖల మధ్య సమన్వయం లేకపోవడంఇవి అన్ని ఈ ప్రాజెక్టను అరకొరగా వదిలేశాయి.

కుయ్యేరు, గొల్లపాలెం, రహదార్లలో తరచూ స్కూల్ పిల్లలు పడుతున్న ఇబ్బందులు, రైతులు తమ పంటలు రవాణా చేయలేక నష్టాలు చవిచూడడం ఇప్పుడు అలవాటైపోయింది. అత్యవసర వైద్య సేవలు అవసరం వచ్చినప్పుడు అంబులెన్స్ రావడం కష్టంగా మారి, పలుమార్లు ప్రాణాలు ప్రమాదంలో పడిన ఉదంతాలు స్థానికులకు గుర్తున్నాయి.

కాజులూరు మండల కేంద్రానికి రావడానికి మండలంలో గల గ్రామాల నుండి వివిధ పనులపై మండల శాఖల కార్యాలయానికి రావడానికి తీవ్ర ఇబ్బందులకు గురై పనులు పూర్తి చేసుకోవడానికి తీవ్ర కాలయాపన జరుగుతుందని పలు గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు.

**ఉద్యోగులు రావడానికి వెనుకంజ -అభివృద్ధికి అడ్డంకి...**

గ్రామంలో ఉద్యోగాలు ఉన్నప్పటికీ, రహదారి దయనీయ పరిస్థితి కారణంగా ఇక్కడ పనిచేయడానికి సిబ్బంది కూడా ఆసక్తి చూపటం లేదు. టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, వ్యవసాయ అధికారులుఎవరు వచ్చినా తిరిగి వెళ్ళిపోతున్నారు. దీని వల్ల గ్రామ అభివృద్ధి మరింత వెనుకబడుతోంది. ప్రభుత్వ సేవలు అందించే ఉద్యోగులు కూడా రోడ్డు పరిస్థితిని చూసి భయపడి అక్కడ పనిచేయటానికి నిరాకరిస్తున్నారు.

**ఆర్టీసీ బస్సులు మండల కేంద్రానికి రాని పరిస్థితి**

ఇంకో పెద్ద సమస్య రవాణా సౌకర్యాల కొరత. కుయ్యేరు–గొల్లపాలెం రహదారిపై ఆర్టీసీ బస్సులు దాదాపుగా నడవటం లేదు. రోడ్డు పరిస్థితి బస్సులకు అనుకూలం కాదని అధికారులు అంటున్నారు. దీనివల్ల గ్రామ ప్రజలు ప్రైవేట్ వాహనాలపై, ఆటోల్లో, వాటికి కూడా లభ్యమయ్యేంతవరకు మాత్రమే ప్రయాణించాల్సి వస్తోంది. విద్యార్థులు స్కూలులకు, కాలేజీలకు వెళ్లడానికే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ఈ రహదారి నిజంగానే శిక్షలా మారింది.

**మంత్రి సుభాష్‌కు ప్రజల విజ్ఞప్తి..**

కాజులూరు మండల గ్రామాల ప్రజలు ఇప్పుడు మంత్రి సుభాష్‌ను కోరుతున్నారు

“మా రహదారి పూర్తి చేయండి మా దైనందిన జీవితాన్ని సులభం చేయండి.”

ఇది రాజకీయ సమస్య కాదు, ఇది జీవనాధార సమస్య అని ప్రజలు చెబుతున్నారు. ఎన్నేళ్లుగా నిరీక్షిస్తున్న ఈ రహదారి పూర్తి అయితేనే గ్రామాలకు కొత్త ఊపిరి వస్తుందని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, విద్య మరియు వైద్య సౌకర్యాలు మెరుగుపడతాయని అందరూ భావిస్తున్నారు.

**ప్రజల ఆశ – రహదారి పూర్తి అయితే..**

విద్యార్థులకు సురక్షిత ప్రయాణం
రైతులకు మార్కెట్లకు సులభ రవాణా
అత్యవసర వైద్య సేవలకు వేగవంతమైన చేరిక
గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పని చేయడానికి ఆసక్తి
ఆర్టీసీ బస్సుల పునఃప్రారంభం
గ్రామ అభివృద్ధికి అవసరమైన పునాది నిర్మాణం

ఇంకెన్నాళ్లు ఈ రహదారి కష్టాలు?

ప్రజల ఈ ప్రశ్నకు ప్రభుత్వం త్వరలోనే సమాధానం చెప్పాలి.

కాజులూరు మండల ప్రజల ఆశలు నెరవేరేలా కుయ్యేరు–గొల్లపాలెం రహదారి పూర్తి కావడం అత్యవసరం.

# ఈశ్వరయ్య గౌడ్... విశారదన్ మహారాజ్ కు ఘన స్వాగతం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** నగరంలో జరగనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ రాష్ట్ర స్థాయి సదస్సుకు హాజరయ్యేందుకు జిల్లాకు విచ్చేసిన హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య గౌడ్, అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజ్ లకు రాజమండ్రి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. వారిని రాష్ట్ర మూల్ సంఘ్ అధ్యక్షుడు, ప్రముఖ బీసీ నాయకుడు మార్గాని చంటిబాబు, మానవ హక్కుల ఛైర్మన్, సీనియర్ నాయకురాలు ఖండవల్లి లక్ష్మి, రాజ్యాంగ పరిరక్షణ సమితి కన్వీనర్ మేకల లక్ష్మీపతి, రాష్ట్ర యాదవ సంఘం యువజన నాయకుడు వియ్యపు రాఘవేంద్ర యాదవ్, దివాన్ చెరువు జేఓబీసీ అధ్యక్షుడు తణుకు నాగేశ్వరావు, జేఓబీసీ గౌరవ అధ్యక్షుడు భీమన వెంకటేశ్వర గౌడ్, బొల్లా శ్రీనివాస్, పాక సూర్యచంద్రరావు, మార్గాని శివరామకృష్ణ, విద్యా కమిటీ వైస్ చైర్మన్ పలివెల నూకరాజు, పాక అనిల్ కుమార్, బుడ్డిగ అర్జునరావు, బట్టి నవీన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

# విద్యార్థులందరికీ రాజ్యాంగ రచన పుస్తకం అందజేయాలన్న మంత్రి లోకేష్

-హర్షం వ్యక్తం చేసిన దళిత గిరిజన సంఘాల నాయకులు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ రచన పుస్తకాన్ని రాష్ట్రంలోని విద్యార్థులందరికీ ఉచితంగా పంపిణీ చేయాలని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నిర్ణయించడం పట్ల దళిత గిరిజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మాక్ అసెంబ్లీ సమావేశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నారా లోకేష్ మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు ముగ్ధుడై నేటి విద్యార్థిలే రేపటి దేశ రక్షకులని వారిని ప్రసంశించడమే కాక డాక్టర్ అంబేద్కర్ రాసిన ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్క విద్యార్థినీ విద్యార్థులు తెలుసుకోవాలని ఉద్దేశంతో వారికి అర్థమయ్యే రీతిలో భారత రాజ్యాంగాన్ని, దాని విశిష్టతను తెలియపరుస్తూ తెలుగు ఇంగ్లీషు భాషలలో 100 పేజీలు పుస్తకంగా రూపొందించి విద్యా శాఖ ద్వారా మాక్ అసెంబ్లీ లో పాల్గొన్న విద్యార్థులకు అందజేశారు. అంతే కాకుండా రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులందరికీ ఉచితంగా ఈ పుస్తకాన్ని పంపిణీ చేయాలని ఆదేశాలను జారీ చేశారు. మంత్రి నారా లోకేష్ నిర్ణయం పట్ల దళిత గిరిజన నాయకుడు కోరుకొండ చిరంజీవి, ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘాల నాయకుడు తాళ్లూరి బాబు రాజేంద్ర ప్రసాద్, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి, జగ్గంపేట నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు దారా యేసురత్నం, ఉసురుమర్తి రామారావు, బీజేపీ దళిత మోర్చ మండల అధ్యక్షుడు అర్థాలు కుమార్ బాబు, తెలుగుదేశం పార్టీ నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు చాపల చినరాజు, తెలుగుదేశం పార్టీ నేత అజ్జరపు రమేష్, తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు మోత నాగలక్ష్మి, మాజీ కార్పొరేటర్ కప్పల వెలుగు కుమారి, అర్యాపురం కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ తురకల నిర్మల తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# సామర్లకోటలో మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీ... ఎమ్మెల్యే



**పెద్దాపురం (మనసులో మాట) నవంబర్ 27:** సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయం వద్ద చెన్నై శంకర్ నేత్రాలయ, ఎర్నేని చారిటబుల్ ట్రస్ట్, నటరాజ నాట్య అంజలి అమెరికా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా కంటి వైద్య శిబిరాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి బాబు గురువారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మెరుగైన కంటి చూపును అందించాలన్న లక్ష్యంతో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎర్నేని చారిటబుల్ ట్రస్ట్, నటరాజ నాట్యాంజలి (అమెరికా) ప్రతినిధులు శివ, శ్యామ్, సునీత వివరించారు. భీమేశ్వర స్వామి ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్, ఈవో బల్ల నీలకంఠం ఆధ్వర్యంలో చెన్నై శంకర్ నేత్రాలయ ట్రస్ట్ కన్వీనర్ రాజు సారథ్యంలో మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నవంబర్ 27 నుండి డిసెంబర్ 3 వరకు కంటి పరీక్షలు, డిసెంబర్ 1 నుండి 5 వరకు కంటి శస్త్ర చికిత్సలు అందిస్తామని డాక్టర్ శివ, శంకర్ నేత్రాలయ ప్రతినిధి రాజు వివరించారు. సుమారు 800 మంది వరకు కంటి వైద్య పరీక్షలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భీమేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు చీమల కొండ ప్రసాద్, అరుణ వంశీ, గోల్టి సత్యనారాయణ, పడాల వీరబాబు, బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, నిడదవోలు వీర్రాజు, వల్లూరి దొరబాబు, జార్జ్ చక్రవర్తి, ముసిరెడ్డి శ్రీరాములు పలువురు నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.




# దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం

- ఎంపీ హరీష్



**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 27:** దివ్యాంగులు దైనందిక జీవితంలో ముందడుగు వేసేలా మనోధైర్యం నింపేందుకు చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అమలాపురం ఎంపి గంటి హరీష్ మాదుర్ పేర్కొన్నారు. ముమ్మిడివరం శాసన సభ్యుడు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, జనసేన పార్టీ కోనసీమ ఇన్చార్జి బందారు శ్రీనివాసరావు లతో కలసి గురువారం ముమ్మిడివరం నియోజకవర్గం లో గుర్తించిన 386 మంది వికలాంగులకు 832 రకాలైన చార్జింగ్ ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలు,వీల్ చైర్సు, బ్రెయిలీ కిట్స్, ట్రై సైకిల్స్ తదితర 25 రకాల ఉపకరణాలను ఎంపి హరీష్ మాదుర్ పంపిణీ చేశారు.. హామీ ఇచ్చిన విధంగా ఫించన్ లు పెంచి పంపిణీ చెయ్యడమే గాకుండా, వారు తమ కాళ్లపై నిలబడేలా ఉపాధి అవకాశాలు కల్పనకు సైతం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, తాడి నరసింహారావు, గోలకోటి దొరబాబు, దూడల స్వామి నాయుడు, గోదాశి పుండరీష్, దాట్ల బాబు, గోలకోటి వెంకట రెడ్డి లతో పాటు టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో 1.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి

- ధాన్యం సేకరణపై జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- జేసి వై మేఘా స్వరూప్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** తూర్పు గోదావరి జిల్లాలో ఖరీఫ్ 2025–2026 ధాన్యం సేకరణకు సంబంధించిన వివరాలను సంయుక్త కలెక్టర్ వై మేఘ స్వరూప్ వెల్లడించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో వరి సేకరణ అంచనా 4 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 27 నాటికి మొత్తం 34,737 కొనుగోలు కూపన్లు రైతులకు జారీ చేయబడినట్లు వివరించారు.

జిల్లాలోని 18 మండలాల్లో ఏర్పాటు చేసిన 201 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా, ఇప్పటి వరకు 21,794 రైతుల నుంచి 1,61,611.920 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన 48 గంటల గడువులోపే మొత్తం 10,008 మంది రైతులకు రూ.172.85 కోట్లు చెల్లింపులు చేసినట్టు తెలిపారు. జిల్లాలోని 157 రైస్ మిల్లులు ఈ కొనుగోలు ప్రక్రియలో పాల్గొంటున్నాయని స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని 17 శాతం తేమ వరకు ఆరబెట్టుకోవాలని సూచించారు. సేకరణకు అవసరమయ్యే గోనె సంచులు జిల్లాలోని 212 ఆర్ఎస్కె కేంద్రాల్లో సమృద్ధిగా అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం..కామన్ వెరైటీకి రూ.2,389లు, గ్రేడ్%–%ఏ వెరైటీకి రూ. 2,369లు చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు.

రైతుల తరఫున ప్రభుత్వం ద్వారా చెల్లించబడే సేవల ప్రకారం..గోనె సంచి వినియోగ ఛార్జీ ఒక్కంటికి రూ.4.74లు, హమాలీ ఛార్జీ క్వింటాకు రూ. 22లుగా నిర్ణయించబడినట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావలసిన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. ధాన్యం కొనుగోలు సంబంధిత ఫిర్యాదులు, సందేహాల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరు కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కంట్రోల్ రూమ్ ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తుంది. రైతులు 83094 87151 నెంబర్‌కు సంప్రదించవచ్చు అని జేసీ మేఘా స్వరూప్ తెలియజేశారు.

# పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట, (మనసులో మాట )నవంబర్ 27..** ఆలమూరు మండలం సంధిపూడి గ్రామంలో రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం ప్రారంభించారు. అనంతరం కాపు కళ్యాణ మండపానికి శంకుస్థాపన చేసిసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తోందని, ప్రతి గ్రామానికి అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందేలా గ్రామ సచివాలయాల నిర్మాణం వేగవంతం చేస్తున్నందున ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



ప్రభుత్వ విప్ యనమల దివ్య ను మర్యాదపూర్వకంగా కలిసిన

# కొత్తకొండ బాబు

**కోటనందూరు మండల బూత్ కమిటీల పరిశీలకులుగా కొత్తకొండ బాబు నియామకం**



**జగ్గంపేట (మనసులోమాట) నవంబర్ 27..** జగ్గంపేట గ్రామానికి చెందిన రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకొండ బాబు ను తుని నియోజకవర్గంలోని కోటనందూరు మండలం బూత్ కమిటీల అబ్జర్వర్ గా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం బాధ్యతలు అప్పగించింది. అందులో భాగంగా గురువారం తేటగుంటలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో రాష్ట్ర ప్రభుత్వ విప్ తుని ఎమ్మెల్యే యనమల దివ్యను మర్యాదపూర్వక కలిసి కోటనందూరు బూత్ కమిటీల పై చర్చించుకున్నారు. అనంతరం కోటనందూరు మండలం వెళ్లి అక్కడ మండల నాయకులు అందర్నీ కలిసి బూత్ కమిటీలు బలోపేతానికి బూత్ వ్యవస్థ పటిష్టతకు క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలతో కార్యాచరణ రూపొందించామని ఈ మండలం నుంచి ప్రజల మద్దతు కేవలం ఎన్నికలకే కాకుండా శాశ్వతమైన క్షేత్ర స్థాయిలో శక్తిగా బూత్ వ్యవస్థను పటిష్టంగా నిర్మించడం ద్వారా బూత్ కమిటీలు బలోపేతమై విజయాన్ని అందిస్తాయని ప్రతి కార్యకర్తను నాయకుడిని ఇందులో భాగస్వామ్యం చేయాలని కొండబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో తుని నియోజకవర్గ టిడిపి ప్రధాన కార్యదర్శి వెలగా వెంకటకృష్ణారావు, కోటనందూరు మండల టిడిపి అధ్యక్షుడు పోతల సూరిబాబు, కోటనందూరు మాజీ ఎంపీపీ, తలుపులమ్మ తల్లి దేవస్థానం, కోటనందూరు క్లస్టర్ ఇంచార్జి గాడి రాజబాబు, మండల ప్రధాన కార్యదర్శి సామీడి కృష్ణార్జున రావు, మాజీ చైర్మన్ అల్లిపూడి కి చెందిన బుల్లిబాబు, మాజీ ఎంపీటీసీ శ్రీను, చిరంజీవి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు గోకవరంలో
# ప్రజా దర్బార్

- ప్రజల అర్జీలు స్వీకరించున్న ఎమ్మెల్యే జ్యోతుల
- అధికారుల సమక్షంలో తక్షణ పరిష్కారం



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 27 :** మండల కేంద్రమైన గోకవరం ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 28వ తేదీన కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాధర్బార్ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గోకవరం మండల మాజీ జడ్పిటిసి సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పాలూరి బోసు బాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల యొక్క సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తుందని అందులో భాగంగా జగ్గంపేట శాసనసభ్యుడు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా ప్రజా దర్బార్ కు విచ్చేసి ప్రజల సమస్యలను స్వీకరించి అధికారుల సమక్షంలో ఆ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తారని మండల టిడిపి అధ్యక్షుడు పిల్లా అర్జున సారధి (చంటి బాబు) తెలిపారు. అలాగే ఈ ప్రజా దర్బార్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవలసిందిగా తాసిల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో గోవింద్ ప్రజలను కోరారు.

# అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ ఇంటింటా ప్రచారం

## - పాల్గొన్న డాక్టర్ రవి రామ్ కిరణ్ గోరంట్ల





**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేటలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశాల మేరకు 'అన్నదాత సుఖీభవ -పీఎం కిషన్' ఇంటింటా ప్రచారంలో డాక్టర్ రవి రామ్ కిరణ్ గోరంట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రామ్ కిరణ్ మాట్లాడుతూ రైతు క్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం అన్నారు. రైతుల వద్ద నుండి ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతులు తమ ఖాతాలకు సొమ్మును జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని అన్నారు. రైతుకి ఇచ్చిన మాట ప్రకారం 2 దఫాలుగా రైతు ఖాతాలలోనికి కేంద్ర ప్రభుత్వం రూ.4 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేలు మొత్తం రూ.14 వేలు వేయడం జరిగిందని, అర్హులైన రైతులకు పీఎం కిషన్ అందేలా ప్రత్యేక చర్యలు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీసుకుంటున్నారని తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కార్యాచరణతో ముందుకు వెళుతున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రాజమండ్రి రూరల్ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మత్సేటి శివ సత్య ప్రసాద్, అగ్రికల్చర్ ఏడీ సూర్య రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కాశీ విశ్వనాథ్, సొసైటీ చైర్మన్ బొప్పన శ్రీనివాస్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుద్దుపూడి రమేష్, మద్దిపాటి సత్య ప్రసాద్, సోము వినయ్, వై సత్యనారాయణ, పెండ్యాల రామకృష్ణ, వల్లేపల్లి సుబ్రహ్మణ్యం, మట్టా శ్రీనివాస్, యలమాటి రామకృష్ణ, గారపాటి నాగేశ్వరావు, మండా హిమబిందు, అల్లూరి నరసింహారావు, రత్నాకర్, యార్లగడ్డ వెంకన్న, ఈర్లి సతీష్, గోపి, చక్రయ్య వ్యవసాయక శాఖ అధికారులు వేణు మాదవ్, పీటర్, సురేఖ, రాంబాబు, గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం - ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట (మనసులో మాట) నవంబర్ 27..** రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే రెండు విడతల అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ నిధులు కర్షకుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు . అన్నదాతలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చైతన్యవంతమైన పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులు అడుగులు వేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రైతన్నా మీకోసం పేరుతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పెట్టుబడి సాయం, పథకాలు, పంటల మార్పిడి, నీటి భద్రత, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతులకు రెండు విడతల్లో ఒక్కో రైతు వారికి రూ.14,000 చొప్పున అందజేసినట్లు చెప్పారు. వ్యవసాయానికి అనుబంధ పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాల్సిన అవసరముందని, మహిళా రైతులకు 35 శాతం సబ్సిడీతో పాటు అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. అలాగే రావులపాలెం లో రైతులకు శిక్షణ, మార్గదర్శకత్వం కోసం త్వరలో ప్రత్యేక ఆఫీసు ప్రారంభించ నున్నట్లు ప్రకటించారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని, రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని, ఆరోగ్య సమస్యలు పెరగడానికి రసాయన ఎరువుల దుర్వినియోగమే కారణమని, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, ఆధునిక సాంకేతిక పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు . తొలుతగా ఆలమూరు మండలం లో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి రైతన్నా మీ కోసం కరపత్రాలను పంపిణీ చేస్తూ రైతులతో ముఖాముఖీ మాట్లాడి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు.

# నన్నయలో ఆల్ ఇండియా బెస్ట్ ఫిజిక్ మెన్ ఛాంపియన్ షిప్

## -డిసెంబరు 27 నుండి 30 వరకు పోటీలు - బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో డిసెంబరు 27 నుండి 30వ తేదీ వరకు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ మెన్ ఛాంపియన్ షిప్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ తెలియజేశారు. గురువారం యూనివర్సిటీలో దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సహకారంతో నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ మెన్ పోటీలుకు ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం వేదిక అవుతుందన్నారు. డిసెంబరు 27 నుండి 30వ తేదీ వరకు ఈ పోటీలను నిర్వహించేందుకు కార్యాచరణ ప్రారంభించామన్నారు. దేశం నలుమూలల నుండి బెస్ట్ ఫిజిక్ పోటీలకు క్రీడాకారులు హాజరవుతారని, పోటీలలో పాల్గొనే క్రీడాకారులు డిసెంబరు 15వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ప్రతిభవంతులైన క్రీడాకారులకు నన్నయ విశ్వ విద్యాలయం చక్కని వేదిక అవుతుందని, విశ్వ విద్యాలయం ప్రతిష్ఠను పెంచే ఈ జాతీయ స్థాయి పోటీలను సమిష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్ ను సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్, సెక్రటరీ స్పోర్ట్స్ బోర్డ్ ఆచార్య కేవీ స్వామి, అసోసియేట్ సెక్రటరీ డాక్టర్ ఎంవీఎస్ఎస్ మూర్తి, ప్రిన్సిపాల్స్, విశ్వ విద్యాలయ అధికారులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు పాల్గొన్నారు.

# పి.డి.ఎస్.యు రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 27..** పి.డి.ఎస్.యు రాష్ట్ర మహా సభల కారణంగా పెద్దాపురం మరియు జగ్గంపేట డివిజన్ కమిటీ సభ్యులు, జగ్గంపేటలో పోస్టర్ ఆవిష్కరణ చేసారు, ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ పి.డి.ఎస్.యు 24వ రాష్ట్ర మహా సభలు రాజమండ్రిలో నవంబర్ 28,29 వ తేదీలలో రెండు రోజులు జరగనున్నాయని మొదటి రోజు బహిరంగ సభ రెండవరోజు ప్రతినిధులు సభ అని, ఈ మహా సభలకు రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల నుండి విద్యార్థుల వస్తున్నారు అని, ఈ మహా సభలకు ఆంధ్ర ప్రదేశ్ కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ మరియు అధ్యక్షుడు రఫీ హాజరు అవుతారు అని, అలాగే విద్యార్థి హక్కుల సాధనకు, శాస్త్రీయ విద్యా వ్యవస్థ పరిరక్షణకు, సమాన విద్య కోసం ప్రతి విద్యార్థి తరలి రావాలని పిలుపునిచ్చారు.జగ్గంపేట పట్టణంలో ఐటిఐ కాలేజీ నందు రాష్ట్ర మహాసభలు గోడపత్రికలు విడుదల చేయడం జరిగింది.రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యార్థులకు అనేక హామీ ఇచ్చి మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేద విద్యార్థుల కష్టాలు తీరుస్తామని చెప్పిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ఎన్నికలలో విద్యార్థులకు ఇచ్చిన హామీ ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని కూటమి ప్రభుత్వం పైన మండిపడ్డారు.ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ విద్యా రంగం దశ తిరగకుండా మరింత దుర్వస్థితికి చేరుకుందని అన్నారు.విద్యా సంస్థల పేరుతో వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ యాజమాన్యాలు పేద, మధ్యతరగతి విద్యార్థులపై భారం మోపుతున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ విద్య సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ ఇవ్వకుండా,నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు.“పేదల రక్తాన్ని డొనేషన్ల రూపంలో పీలుస్తున్నారు” అంటూ మండిపడ్డారు.రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్ షిప్ నిధుల విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు చదువులు మధ్యలో ఆపవలసి వస్తోందని తెలిపారు. పీజీ మరియు వృత్తి విద్యలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఫీజులు చెల్లించలేక సర్టిఫికెట్లు కూడా పొందలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.విద్యను హక్కుగా, వ్యాపారం కాకుండా అందరికీ ఉచితంగా అందించే విధానం కోసం పి.డి.ఎస్.యు పోరాటం కొనసాగిస్తోందని, శాస్త్రీయ విద్య, సమానత్వ సమాజ నిర్మాణం, ఉద్యోగ హామీల కోసం సంస్థ నిరంతర ఉద్యమం సాగిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు పెద్దాపురం మరియు జగ్గంపేట డివిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# ఘనంగా జరిగిన బిక్కవోలు సుబ్రహ్మణ్యషష్టి వేడుకలు



**అనపర్తి (మనసులో మాట) నవంబరు 27:** అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు ప్రసిద్ధ కుమార సుబ్రమణ్యస్వామి షష్టి వేడుకలు అంబరాన్నంటాయి. బుధవారం రాత్రి గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి వారి జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా విచిత్ర వేషధారణలు, తీన్మార్ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఏర్పాటు చేసిన బాణాసంచా అందరిని ఆకట్టుకుంది. మిరుమిట్లు గొలిపే వెలుగులు, కళ్లు జిగేల్మనే బాణాసంచ మెరుపులతో బిక్కవోలు హోరెత్తిపోయింది. రంగురంగుల కాంతులు వెదజల్లుతూ, సాగిన బాణాసంచా పేలుళ్లు ప్రజలకు కనువిందు చేశాయి. షష్టి వేడుకలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు బిక్కవోలుకు తరలివచ్చారు. విద్యుత్ దీపాలంకరణలను అందర్నీ ఆకట్టుకున్నాయి.



## నేదునూరు సచివాలయంలో డి ఎ లు లేక
# గ్రామస్తులు విద్యార్థులు ఇబ్బందులు

**అయినవిల్లి (మనసులో మాట) నవంబరు 27:** అయినవిల్లి మండలం నేదునూరు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు లేక విద్యార్థులకు కుల ఆదాయ సర్టిఫికెట్లు తీసుకోవడానికి, గ్రామస్తులు సాంకేతికపరమైన పనులు చేయించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయ సిబ్బంది బదిలీలో భాగంగా సచివాలయం 1, 2 లలో పనిచేసిన డిజిటల్ అసిస్టెంట్లు బదిలీపై వెళ్లారు. కొత్తగా నేదునూరు సచివాలయం 1 కి డిఎ రాగా సచివాలయం 2 కు డిఎ పోస్ట్ ఖాళీగా ఉంది. ఇదిలా ఉండగా సచివాలయం 1 లో పనిచేస్తున్న డీఎన్ ను ఎంపీడీవో సరోవర్ కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటేషన్ పై పంపించారు. దీంతో సచివాయసల్లో డిఎ లు లేకపోవడంతో గ్రామస్తులు విద్యార్థులు నిరుద్యోగ యువతీ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాత్కాలికంగా సచివాలయం 1లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ కు డిఎ పనులు అప్పగించినా ఆమె హౌసింగ్ సర్వే చేస్తున్నానని డిఎ పనులు పక్కన పెట్టింది. నేదునూరు మేజర్ పంచాయతీలో ఇన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ స్థసనిక ప్రజాప్రతినిదులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు నిరుద్యోగులకు కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్యలు తీసుకుని నేదునూరులో రెగ్యులర్ డిజిటల్ అసిస్టెంట్ ను కలెక్టర్ కార్యాలయం నుండి వెనక్కి పంపించాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గ్రామస్తులు అధికారులను హెచ్చరించారు.

# తెలుగువారి గుండె చప్పుడు బ్రౌన్

## -బ్రౌను మందిరంలో ప్రముఖ రచయిత వల్లీశ్వర్ పుష్పాంజలి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** తెలుగు వారి గుండె చప్పుడు సీపీ బ్రౌన్ అని 'ఇది యదార్ధ భారతం' తో సహా అనేక పుస్తకాలు వ్రాసిన రచయిత జీ వల్లీశ్వర్ పుష్పాంజలి ఘటించారు. తెలుగు వారు సిగ్గుపడే విధంగా తెలుగు భాషకు సేవ చేసిన విదేశీ మహనీయుడు బ్రౌను అని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఉదయం వల్లీశ్వర్ సీపీ బ్రౌను మందిరం దర్శించి బ్రౌనుకు పుష్పాంజలి ఘటించారు. బ్రౌను మందిరం నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వల్లీశ్వర్ మాట్లాడుతూ ఏ భాషకూ లేనన్ని అక్షరాలు తెలుగు భాషకు ఉన్నాయని, అందుకే తెలుగు భాష మాధుర్యత సంతరించుకుందని చెప్పారు. గుండె లోతులు.. గుండెలో సుళ్ళు...గుండెలో గూడు....ఇలా ఒకే రెండక్షరాల పదానికి అనుబంధ బంధాలు కేవలం తెలుగు భాషకు మాత్రమే కలిగి, అనేక భావాలను తెచ్చిపెట్టాయని వివరించారు. తెలుగు నేర్చుకుని సీపీ బ్రౌను తెలుగును ఉద్ధరించడం సామాన్య విషయం కాదన్నారు. కాఫీనము, కౌపీనము అనే రెండు పదాలకు ఉన్న అర్థాలు వేరయినా, భాషా పటిమను నిరూపించుకోవడం తెలుగు భాషకు మాత్రమే సాధ్యమని వల్లీశ్వర్ స్పష్టం చేశారు. తెలుగు వారికి తెలియని తెలుగు లోతులను బ్రౌను తరచి చూసి బయటి ప్రపంచానికి చాటి చెప్పారన్నారు.

**వందేళ్ళ డిక్షనరీ పదిలం..**

వందేళ్ల నాటి బ్రౌన్ డిక్షనరీ ఇప్పటికీ తన వద్ద భద్రంగా ఉందని, శిధిలమవుతున్న ఈ డిక్షనరీని సాలార్ జంగ్ మ్యూజియం అధికారుల ద్వారా భద్రం చేయించుకున్నానని ఈ సందర్భంలో ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ డిక్షనరీ లక్షల విలువ చేస్తుందన్నారు. సన్నిధానం శాస్త్రి మాట్లాడుతూ తెలుగు భాషకు ప్రాణం పోసిన బ్రౌనును స్మరించడమే బ్రౌను మందిరం లక్ష్యమని తెలిపారు. సన్నిధానం నరసింహ శర్మ వ్రాసిన 'బ్రౌను ఉదాహరణం' వల్లీశ్వర్ కి బహుకరించి సన్నిధానం శాస్త్రి వల్లీశ్వర్ ను సన్మానించారు. కార్యక్రమంలో లీలాప్రసాద్, అరుణ్ కిమార్, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ దినోత్సవం వేడుకలు



**కపిలేశ్వరపురం (మనసులో మాట) నవంబర్ 27..** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం కపిలేశ్వరపురం ఎంపీడీఓ కార్యాలయము ఆవరణలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది భారత రాజ్యాంగ నిర్మాణకర్త డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్రపటమునకు పూల మాలలు వేసి భారత సంవిధాన ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమములో మండల పరిషత్ అభివృద్ధి అధికారి హెచ్. భానోజీ రావు, డిప్యూటీ ఎంపీడీఓ.బి వర ప్రసాద బాబు, పరిపాలనాధికారి జి. రాజేంద్రప్రసాద్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, మరియు మహాత్మా గాంధి జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొనియున్నారు.అలాగే మండలం లోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద రాజ్యాంగ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి.

# రేషన్ షాప్ తనిఖీ



**కపిలేశ్వరపురం (మనసులో మాట) నవంబర్ 27..** ప్రభుత్వ ఆదేశముల ప్రకారం ప్రతి నెలా 65 సం.లు నిండిన రేషన్ కార్డుదారులు అందరికి చౌక ధరల దుకాణం డీలర్ల ద్వారా ప్రతీ నెలా 26 వ తేదీ నుండి 30 వ తారీకు వరకు నిత్యవసర సరుకులు బియ్యం , పంచదార పంపిణీ కార్యక్రమము ఏ విధంగా జరుగుతోంది అనే విషయాలు పై గురువారం తహసీల్దార్ జి. శ్రీనివాస్ ఆకస్మికం గా పరిశీలించారు. వల్లూరు గ్రామము నందు .తహసీల్దార్ జి.శ్రీనివాసు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కపిలేశ్వరపురం మండలము మొత్తము మీద 65 సం.ల పైబడిన రేషన్ కార్డులు 3292 వారికి 42 చౌక ధరల డీలర్ల ద్వారా ఇంటింటికి డోర్ డెలివరీ చేయబడునని, నిత్యవసర సరుకుల (బియ్యం, పంచదార) డోర్ డెలివరీ పర్యవేక్షించుటకు ప్రతీ దుకానమునకు ఒక్కొక్క సచివాలయ సిబ్బందిని నియమించడం జరిగినదని, కావున 65 సం.లు పైబడిన రేషన్ కార్డు దారులందరూ ఇంటి వద్దే ఉండవలసినదిగా విజ్ఞప్తి చేశారు.



## అనాథ వ్యక్తికి అంత్యక్రియలు చేసిన తీరు హృదయాన్ని హత్తుకునేలా సాగింది..

**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27..** కండిబోయినవారి శ్రీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సేవా కార్యక్రమం హృదయాన్ని హత్తుకునేలా సాగింది. కాకినాడ ప్రతాప్ నగర్ అచ్చుతాపురం రైల్వే గేట్ సమీపంలో బిక్షాటన చేస్తూ జీవిస్తున్న అనాథ వ్యక్తి చంద్రభట్ల లక్ష్మణ్ మూర్తి (వయసు సుమారు 50 సంవత్సరాలు) మృత స్థితిలో కనిపించారు. సమాచారం అందుకున్న వెంటనే సంస్థ నిర్వహిస్తున్న శ్రీ మహాప్రస్థానం సేవా వాహనం అక్కడికి చేరుకుని స్థానిక ప్రజల సహకారంతో మృతదేహాన్ని తన బాధ్యతగా స్వీకరించింది. అనంతరం వాహన సిబ్బంది మృతదేహాన్ని తీసుకెళ్లి డ్రైవర్ కూపర్ భాను అంబేద్కర్ ద్వారా తగిన విధంగా తలగోరు పెట్టించి అంత్యక్రియలను నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో ప్రతాప్ నగర్, అచ్చుతాపురం రైల్వే గేట్ పరిసరాల పెద్దలు మరియు స్థానికులు పాల్గొన్నారు. నరం మణికంఠ (మున్నా), కోక వెంకటగిరి, కోకా సత్తిబాబు, గాలి శివయ్య, నమ్మ రావు, నిమ్మకాయల శివ, నాగు తదితరులు సేవలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమానికి ఆలీ ప్రత్యేక సహకారం అందించారు. శ్రీ మహాప్రస్థానం వాహనం డ్రైవర్ కేబీ అంబేద్కర్ ఈ సేవలో కీలకంగా వ్యవహరించారు. ఎవరిని అనాథలుగా వదిలేయకండి. మనవసేవే మాధవసేవ అనే మంత్రంతో ముందుకు సాగుతున్న ఈ సంస్థకు, అలాగే ఈ కార్యక్రమానికి తోడ్పడిన 43వ డివిజన్ ప్రజలకు సంస్థ తరఫున ధన్యవాదాలు తెలిపారు.

## తప్పిపోయిన బాలుడిని తిరిగి కుటుంబీకులకు అప్పంగింత



**యానాం (మనసులో మాట), నవంబరు 27:** బీహార్ రాష్ట్రము రాజనగర్ ప్రాంత నివాసి సాధుసరం సాహు కుమారుడు ధరమ్ జీ కుమార్ గత రాత్రి గిరియం పేట కూడలిలో అనుమాస్పద రీతిలో తిరుగుతుండగా, దరియాలతిప్ప అవుట్ పోలీస్ స్టేషన్ వారు గుర్తించి ఆ బాలుడిని యానాం చైల్డ్ హెల్ప్లైన్ వారికీ అప్పగించారు. తదుపరి చైల్డ్ హెల్ప్లైన్ వారు ఆ బాలుడి వివరాలను పూర్తిగా సేకరించిన పిమ్మట ఆ బాలుడిని కుటుంబీకులని యానాం పిలిపించి యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి అంకిత్ కుమార్, యానాం సబ్ఇన్స్పెక్టర్ పునీత్ రాజ్ కుమార్ స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి సమక్షం లో చైల్డ్ హెల్ప్లైన్ వారు ఆ బాలుడను క్షేమముగా అప్పగించారు.

## ఫక్రుద్దీన్ పాలెం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం



**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 27 :** పిఠాపురం మండలం ఫక్రుద్దీన్ పాలెం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ విజయకుమార్ విచ్చేశారు. రైతులకు పంచ సూత్రాలు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎం విజయ్ కుమార్ మాట్లాడుతూ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయంలో టెక్నాలజీ అనుసంధానం చేయడం, ఆహార ప్రాసెసింగ్, పరిశ్రమలు, ప్రభుత్వము యొక్క మద్దతు. వంటి సూత్రాలను పాటిస్తూ వ్యవసాయంలో రైతులంతా లాభసాటిగా మారాలని సూచనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు స్వాతి, మండల వ్యవసాయ అధికారి గంగాధర్, గ్రామ సర్పంచ్ ముమ్మిడి మహాలక్ష్మి శేఖర్, గ్రామ వ్యవసాయ సహాయకులు భాగ్యరేఖ రైతులు తదితరులు పాల్గొన్నారు.

### రైతుకు తప్పని ఇబ్బందులు కష్టపడి

# పంట పండించే రైతుకు కష్టమే మిగులుతుంది



**అమలాపురం (మనసులో మాట) నవంబరు 27:** ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతుకు కష్టమే మిగులుతుందని కనీసం పంట కోసం చేసిన అప్పులు తీరే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కోనసీమలో జిల్లాలో ఖరీఫ్ పంట కోసం 90 శాంతం రైతులు 1318 వంగడానే పండించారు. ఇది తుఫాన్లకు తట్టుకుంటుందని ఉద్దేశంతో రైతులు ఈ వంగడంపై మెగ్గుచూపారు. అయితే ఇది పంట కాలం ఆరు నెలలు అనగా 180 రోజులు పడుతుందని ఇంకా జిల్లాలో ఖరీఫ్ పంట కోతలు పూర్తిస్థాయిలో ప్రారంభించలేదని రైతులు చెబుతున్నారు. అక్కడక్కడా కోతలు మొదలుపెట్టిన మిషన్ల తో కోసిన పంటను అక్కడకక్కడే వ్యాపారులకు బస్తా 1200 నుండి1300 వరకు విక్రయించుకుంటున్నారు. వరి కోతలు పూర్తిస్థాయిలో ప్రారంభ కావాలంటే ఇంకా పది రోజులు పడుతుందని ఖరీఫ్ లో ప్రస్తుతం పంట దిగుబడి ఆశించిన స్థాయిలో లేదని ఎకరాకు 20 నుండి 25 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమ శాతం తక్కువగా ఉండాలని దీని కోసం కోసిన ధాన్యాన్ని ఆరబెట్టాలని ఒకపక్క వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు ఆందోళన చెంది ప్రభుత్వం నిర్ణయించిన ధాన్యం బస్తాకు 1850 కి బదులు పచ్చిధాన్యం 1300 కే అమ్ముకుంటున్నామని వాపోతున్నారు. 1318 వంగడం దిగుబడిలో రైతులకు తీవ్ర నిరాశే మిగుల్చిందని, మొంథా తుఫాన్ ప్రభావం, అధిక వర్షాలతో ఈ వంగడానికి ఎండు తెగులు సోకి దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటకు 1318 వంగడానికి బదులు కొత్తరకం వంగడం ప్రభుత్వం పెడితే ప్రయోజకరంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ కోతలు పూర్తిస్థాయిలో ప్రారంభించడానికి ఇంకా పది రోజులు పడుతుంది అయితే రబీ పంటకు నారు మడులు ఎప్పుడు వేయాలని సందిగ్ధంలో రైతులు ఉన్నారు. డిశంబరు 15 లోపు నారుమడులు వేస్తే పంట ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని అయితే ఎక్కువగా రైతులు రబీ పంటపై ఆశలు పెట్టుకుంటారు ఎందుకంటే ఎకరాకు 50-నుండి 60 బస్తాలు పండే పంట కు తొందరగా నారుమడులు వేసుకోవాలని రైతులు ఎదురుచూస్తున్నారు.

# తూర్పు గోదావరిలో కొత్తగా 217 పోలింగ్ కేంద్రాల ప్రతిపాదన

### -2026 ఎస్ఐఆర్ తయారీపై జిల్లా స్థాయిలో పనితీరుపై

### చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ సమీక్షలో కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) – 2026 సన్నాహక కార్యక్రమాలను సమీక్షించేందుకు చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ గురువారం అమరావతి నుంచి ఏపీఎస్డబ్ల్యూఏఎన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, డీఆర్వో టీ సీతారామ మూర్తి తదితరులు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. సమావేశంలో బీఎల్ఓ/ఈఆర్ఓఎస్/ఏఈఆర్ఓల శిక్షణ, ఓటర్ల మ్యాపింగ్ పురోగతి, బీఎల్ఓ ఐడీ కార్డుల పంపిణీ, పెండింగ్ ఫారమ్‌లు, కాల్ బుకింగ్ స్థితి, ఈఆర్ఓ మార్పు ప్రతిపాదనలు, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ అంశాలను చీఫ్ ఎలక్టోరల్ అధికారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు అనుసరించి నవంబర్ 26న ఈఆర్ఓఎస్, ఏఈఆర్ఓఎస్, ఎలక్షన్ సిబ్బందికి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)- 2026 పై శిక్షణ నిర్వహించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించిన మినిట్స్ సమర్పించినట్లు తెలియజేశారు. జిల్లాలోని మొత్తం 16,23,741 ఓటర్లలో 4,19,204 మంది ఓటర్లు బీఎల్ఓ యాప్ ద్వారా మ్యాప్ చేశామన్నారు. అలాగే కొత్తగా 12,696 వివరాలు కూడా బీఎల్ఓలు నమోదు చేశారని వెల్లడించారు. బీఎల్ఓ ఐడీ కార్డులు నవంబరు 25న అందుకుని పంపిణీ చేశామన్నారు. నవంబరు 1 నుండి 26 వరకు స్వీకరించిన 1,30,718 ఫారమ్‌లలో ఎక్కువ శాతం 7 రోజుల లోపే ప్రాసెస్ అవుతున్నాయని, కాల్ బుకింగ్ పెండెన్సీ జిల్లాలో ఏమీ పెండింగ్ లో లేవని తెలిపారు.

**కొత్తగా 217 పోలింగ్ కేంద్రాలు..**

తూర్పు గోదావరి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ప్రస్తుతం ఉన్న 1,581 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 217 కొత్త హేతుబద్ధీకరణ తర్వాత మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,798గా ఉందన్నారు. వీటిలో అనపర్తి (40)లో 228 నుండి 248కు, రాజానగరం (49) లో 216 నుండి 238కు, రాజమహేంద్రవరం నగరం (50)లో 241 నుండి 263కు, రాజమహేంద్రవరం గ్రామీణం (51)లో 267 నుండి 309కు, కొవ్వూరు ఎస్సీ (54)లో 176 నుండి 212కు, నిడదవోలు (55)లో 205 నుండి 248కు, గోపాలపురం ఎస్సీ (66)లో 248 నుండి 280కు పెరగనున్నట్టు తెలిపారు. మొత్తం 7 నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయడానికి బీఎల్ఓల నియామకానికి సంబంధిత వివరాలు ఈఆర్ఓల ద్వారా సమర్పించనున్నట్లు తెలిపారు. కొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ కేంద్రాలకు బీఎల్ఓల వివరాలు కూడా ఈఆర్ఓలకు అందజేశామని చెప్పారు. ఈపీఐసీ కార్డుల పంపిణీపై- జిల్లాకు అందిన 14,123 కార్డుల్లో 12,762 కార్డులు పోస్టల్ ద్వారా పంపిణీ పూర్తయిందని, బీఎల్ఓల ద్వారా పంపిణీ చేయాల్సిన 287 కార్డులు కూడా ఇవ్వబడ్డాయని కలెక్టర్ తెలిపారు. చీఫ్ ఎలక్టోరల్ అధికారి సూచించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమం దశల వారీగా వేగవంతంగా అమలవుతోందని, సమయానికి పరిశీలన, రివిజన్ ప్రక్రియ పూర్తయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

# కాకినాడ నగర పరిశుభ్రతకు ప్రజల సహకారం అవసరం

### కమిషనర్ సత్యనారాయణ వెల్లడి



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27:** కాకినాడ నగరాన్ని శుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో ప్రతి పౌరుడి బాధ్యత అత్యంత ముఖ్యమని నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్‌వివి సత్యనారాయణ పౌరులను కోరారు. గురువారం ఉదయం నగరంలోని డైరీ ఫార్మ్ సెంటర్ ప్రాంతంలో శానిటేషన్ నిర్వహణ పనులను పరిశీలించారు. పర్యటనలో భాగంగా టిఫిన్ సెంటర్లు, టీ స్టాల్స్ వద్ద రోడ్డుపై చెత్త పడేయడం గమనించిన కమిషనర్, అక్కడి వ్యాపార యాజమాన్యాలను కఠినంగా హెచ్చరించారు. షాపుల వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేయడం తప్పనిసరి అని, వినియోగదారులు రోడ్డు మీద చెత్త వేయకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంకా కాలువల్లో చెత్త పేరుకుపోయిన చోట్ల పరిశీలించిన ఇంచార్జ్ కమిషనర్ ౦ ప్రతిరోజూ డ్రైనేజీలను శుభ్రంగా ఉంచేలా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తించాలి అని సూచించారు. డ్రైనేజ్పై అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తరువాత రాజీవ్ గృహకల్ప సముదాయంలో త్రాగునీటి నిల్వను పరిశీలించి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సంజయ్ నగర్ ప్రాంతంలోని సాగ్రిగేషన్ సెంటర్‌ను సందర్శించగా, అక్కడి పరిస్థితులను హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్ వివరించారు. కమిషనర్ వెంట సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

**అన్న క్యాంటీన్ పరిశీలన**

పర్యటనలో భాగంగా కమిషనర్ సత్యనారాయణ డైరీ ఫార్మ్ సెంటర్లోని అన్న క్యాంటీన్‌ను కూడా తనిఖీ చేశారు. అల్పాహారం కోసం వచ్చిన ప్రజలను పలకరించి, ఆహార నాణ్యతపై అభిప్రాయాలు సేకరించారు. అవసరమైతే మార్పులు చేస్తామని కమిషనర్ సత్యనారాయణ భరోసా ఇచ్చారు.

# పోషక ఆహార లోపం వల్లే మధుమేహం వ్యాధి సంక్రమిస్తుంది

### మధుమేహ వ్యాధిని అశ్రద్ధ చేయరాదు... - డాక్టర్ రాఘవేంద్రరావు




**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27..** ఆధునిక జీవన విధానం ఆహారపు అలవాట్లు పౌష్టికాహార లోపం వంటి కారణాలవల్ల మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజు రోజుకి పెరుగుతుందని అయితే దీనిని అశ్రద్ధ చేయరాదని రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎం. రాఘవేంద్రరావు పేర్కొన్నారు. స్థానిక బోటు క్లబ్బు ఉద్యానవనంలో లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో మధుమేహం జాగ్రత్తలు పై కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తంలోని గ్లూకోజ్ ను క్రమపరిచే ఇన్సులిన్ సరిగా వినియోగించకపోవడం వలన మధుమేహ వ్యాధి వస్తుంద న్నారు. అతిమూత్రం, ఆకలి, దాహం వేయడం, గాయాలు త్వరగా మారకపోవడం, బలహీనత, కంటి చూపు మందగించడం, బరువు కోల్పోవడం వంటివి వ్యాధి లక్షణాలు అన్నారు .వ్యాధి వచ్చినవారు తరచు వైద్యుల సలహా పొందడంతో పాటు స్వయం శుభ్రత, ఆహార నియమాలు పాటించి వ్యాయామం చేయాలన్నారు. ఈ వ్యాధిని అశ్రద్ధ చేస్తే అందత్వం, మానసిక సమస్యలు, గుండెపోటు, మూత్రపిండాల వైఫల్యం వంటి సమస్యలు వేధించే అవకాశం ఉందన్నారు. మధుమేహ వ్యాధి పై పూర్తి సమాచారాన్ని కరపత్రం ద్వారా అందించిన లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ సభ్యులు అభినందనీయులని రాఘవేంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్బు కార్యదర్శి నాగేంద్ర గాంధీ, అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ దాసరి శ్రీధర్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, న్యాయవాది యనమల రామ౦, పి ధర్మచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.



### అమరావతిలో వెంకటేశ్వర స్వామి దేవస్థానం రెండవ ప్రాకార పనుల

# శంకుస్థాపన

### సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే నెహ్రూ

**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 27..** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని తుళ్లూరు మండలం వెంకటపాలెం సమీపంలో టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఉన్న సంగతి తెలిసిందే. ఈ ఆలయానికి రెండో ప్రాకారం 148 కోట్ల రూపాయలతో నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ పనులకు శంకుస్థాపన గురువారం ఉదయం 10.55 నుంచి 11.30 గంటల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి చైర్మన్ బి ఆర్ నాయుడు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టిటిడి బోర్డు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుమల ఆలయం మాదిరిగానే అమరావతిలోనూ రెండో ప్రాకారం నిర్మించడం జరుగుతుందని పడమర, ఉత్తరం, దక్షిణం దిక్కుల్లో ఐదు అంతస్తులతో గాలి గోపురాలు చేయడం జరుగుతుందని టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. తూర్పు వైపున ఏడు అంతస్తులతో మహా రాజగోపురం నిర్మిస్తున్నామని ఆలయం లోపల, మహా రాజగోపురానికి ఎదురుగా ఆంజనేయ స్వామి ఆలయం, ఉత్సవ మండపం, కోనేరు వంటివి కూడా రానున్నాయి అని అన్నారు. ఈ నిర్మాణాలతో ఆలయ వైభవం మరింత పెరుగుతుందని అమరావతి ప్రాంత ప్రజలకు, అమరావతి నిర్మాణానికి సహకరించిన రైతులకు ఆ స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉంటాయని ఆయన అన్నారు.

# రీ సర్వే సద్వినియోగం చేసుకోండి



**కపిలేశ్వరపురం ( మనసులో మాట)నవంబర్ 27..** జిల్లా కలెక్టరు, ఉన్నతాధికారుల ఆదేశముల మేరకు రీ-సర్వే పూర్తి అయిన గ్రామముల్లో భూ సంభందిత సమస్యలు గుర్తించుడం కోసం గ్రామ సభలు నిర్వహించాలనే ఆదేశముల మేరకు వడ్లమూరు, నిదసనమెట్ట గ్రామల్లో భూ సంభందిత సమస్యలపై రెవెన్యూ సర్వే టీం ల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జి. శ్రీనివాస్ మాట్లాడారు. గ్రామ సభల ప్రధాన అంశము గా రీ సర్వే పూర్తి అయిన గ్రామములలో విశ్తీర్ణం తక్కువ ఎక్కువలు నమోదు అవుట, కొరిలేషన్ సర్వే నెంబర్లు తప్పుగా నమోదు అవుట, జాయింట్ %ట్రావీ% లు, ఖాతాకు ఆధార్ నెంబరు తప్పుగా నమోదు అవుట తదితర సమస్యలపై గ్రామములలో దరఖాస్తు చేస్తే, రెవెన్యూ సర్వే బృందం రైతులు భూమికి సంభందించిన దస్తావేజులతో హాజరు అయి రైతులు సమస్యలను పరిష్కరించుకోవచ్చునీ గ్రామ సభల్లో తహసీల్దార్ జి.శ్రీనివాసు తెలియజేసారు. గ్రామముల టీం సభ్యులు ఇప్పటికే సర్వే నిమిత్తం అందుబాటులో కి వచ్చార న్నారు. బృందం డిసెంబర్ 18వరకూ అంబాటులో ఉంటారన్నారు. ఇదే విధంగా అన్నీ గ్రామముల లోనూ నిర్ణయించిన తేదీల్లో గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించబడతాయన్నారు గ్రామ సభకు తహశీల్దారు, షేక్ అబ్దుల్ కరీమ్, బి.నాగ మహేష్, గ్రామ సర్వేయరు నేలటూరు, బి.వివేక్ వర్మ, ఎం.కృష్ణ కిరణ్, గ్రామ , గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### శాసనసభ లో పాల్గొన్న

# సహర్షకు సత్కారం



**కాజులూరు (మనసులో మాట) నవంబరు 27...** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26 న అమరావతి శాసనసభ లో పాఠశాల విద్యార్థులతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన శాసనసభ లో రామచంద్రపురం నియోజకవర్గం నుండి తమ విద్యార్థిని యాళ్ళ సహర్ష పాల్గొని పాఠశాల గౌరవాన్ని ఇనుమడింపజేసినదని కాజులూరు జిల్లా పరిషత్తు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి తెలిపారు. గురువారం కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విష్ణుమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు భారత దేశ రాజ్యాంగ గొప్పదనం తెలియజేయడం కోసం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఒక విద్యార్థిని వారి సహ పాఠ్యాంశం కార్యక్రమాలలో ప్రతిభ మరియు విద్యా ప్రగతి ఆధారంగా ఎంపిక చేయడం జరిగినదని వారందరితో నవంబర్ 26 న అమరావతిలో పాఠశాల అసెంబ్లీ ఏర్పాటు చేశారని అందులో మా పాఠశాల విద్యార్థిని సహర్ష మన నియోజకవర్గ ఎమ్. ఎల్. ఏ పాత్ర పోషించడం పాఠశాల కు గ్రామానికి గర్వకారణమని తెలియజేశారు. ఈ సందర్భంగా అమరావతిలో జరిగిన పాఠశాల అసెంబ్లీ లో పాల్గొన్న సహర్ష ను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు, మండల విద్యా శాఖాధికారులు ఎస్. డేవిడ్ , పి.జాన్ , ఫస్ట్ అసిస్టెంట్ చింతా నారాయణ మూర్తి, పాఠశాల విద్యాదాత అన్యం శ్రీ రామ చంద్ర మూర్తి, గైడ్ టీచర్ గుత్తుల విజయ లక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ కె.హరనాథ్, టీచర్స్ బాషా,కె.సత్య ప్రసాద్, లక్ష్మీ కామేశ్వరీ, బుజ్జి బాబు, సుబ్రహ్మణ్యం తదితరులు జ్ఞాపికతో సత్కరించి అభినందించారు.



## అధిక లోడుతో వెళుతున్న 116 లారీ లా పై
# కేసు నమోదు

**రౌతులపూడి, (మనసులో మాట )నవంబర్ 27:** అధిక లోడుతో వెళుతూ భద్రతా నియమాలు పాటించని లారీలపై కేసు నమోదు చేశామని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ సంవత్సరం ఏప్రియల్ నుండి ఇప్పటివరకు సుమారు 577 కేసులు నమోదు చేసి 68 లక్షలు జరిమానా విధించామని శ్రీనివాస్ అన్నారు. మరి ముఖ్యంగా రౌతులపూడి నుండి వెళుతున్న నల్లారాయి లారీలు చింతలూరు నుండి రవాణా చేసే ఎర్రమట్టి లారీలు అధిక లోడు ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించని 116 లారీలపై కేసు నమోదు చేసి 16 లక్షల రూపాయలు జరిమన విధించినట్టు శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడులు ఇంకా కొనసాగుతాయని ఆయన తెలిపారు.

## మస్కట్ దేశంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న
# మహిళను స్వదేశానికి తీసుకొచ్చిన మైగ్రేషన్ అధికారులు



**అమలాపురం( మనసులో మాట) నవంబరు 27:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరానికి చెందిన తెడ్లపు మల్లమ్మ భర్త తాతరావు వృత్తిరీత్యా టైలరింగ్ చేస్తూ జీవనం సాగించేవారు. కుటుంబ పరిస్థితులు బాగాలేకపోవడంతో పిల్లలు భవిష్యత్తు కోసం తన భార్యను గల్ఫ్ దేశానికి పంపించాలని నిర్ణయించి, ఒక ఏజెంట్ ద్వారా ఫిబ్రవరి 2025లో మస్కట్‌కు పంపించారు. అక్కడ మూడు నెలలు పని చేసిన తర్వాత, ఆమెకు ఆ దేశపు ఐడి కార్డు ఇవ్వకపోవడంతో, ఆమె పనిచేసే ఇంటి యజమాని మల్లమ్మను మస్కట్‌లోని హవాలా ఆఫీస్ వద్ద వదిలి వెళ్లిపోయాడు. అక్కడి ఆఫీస్ వారు రూ.2 లక్షలు చెల్లిస్తే గానీ మల్లమ్మ ను పంపించే పరిస్థితి లేదని చెప్పడంతో కుటుంబం కొంత మొత్తం చెల్లించినప్పటికీ పూర్తి మొత్తం ఇవ్వాలని ఒత్తిడి చేశారు.
ఈ నేపథ్యంలో పరిచయస్తుల సూచనలు మేరకు తాతరావు, అమలాపురం కలెక్టరేట్‌లో ఇటీవల స్థాపించిన 'కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ (కెసిఎం)' ను ఆశ్రయించారు. విదేశీ సమస్యలపై వెంటనే స్పందించే ప్రత్యేక కేంద్రంగా కలెక్టర్ ఈ కెసిఎం ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఫిర్యాదు అందుకున్న వెంటనే కెసిఎం బృందం ఈ విషయాన్ని కలెక్టర్ మహేష్ కుమార్ కు వివరించగా ఆయన వెంటనే స్పందించి అత్యవసర చర్యలు తీసుకుని, సంబంధిత సంస్థలతో సమన్వయం చేసి, మల్లమ్మను సురక్షితంగా ఇండియాకు చేర్చాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు కెసిఎం బృందం మస్కట్ లో ఇంటి రాజ్యలక్ష్మి మస్కట్ తెలుగు అసోసియేషన్ మెంబరు మరియు ఏజెంట్‌లతో సంప్రదింపులు జరిపి, అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసి, మల్లమ్మను విజయవంతంగా స్వదేశానికి తీసుకురావడం. జరిగిందని కేంద్రం నోడల్ అధికారి కె. మాధవి, సమన్వయ అధికారి గోళ్ళ రమేష్ వెల్లడించారు.

# ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సీ రివిజన్...




**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27..** ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సీ రివిజన్(ఎస్ఐఆర్ - సర్) ఇతర ఎన్నికల అంశాలపై గురువారం ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలెక్టోరల్ అధికారి వివేక్ యాదవ్ వెలగపూడి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఎస్ఐఆర్ పై ఏఈఆర్ఓ, బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలు, సర్ జాబితా మ్యాపింగ్, బీఎల్వోలకు ఐడీ కార్డు పంపిణీ, ఫారం పెండెన్సీ, ఎపిక్ కార్డులు పంపిణీ, పోలింగ్ కేంద్రాల రాసలైజేషన్ వంటి అంశాలపై చీఫ్ ఎలెక్టోరల్ అధికారి.. అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. కాకినాడ జిల్లాలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సీ రివిజన్(ఎస్ఐఆర్ - సర్) కార్యకలాపాలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టమన్నారు. ఇందుకు సంబంధించి ఈఆర్ఓ, బీఎల్వోలకు ఈనెల 25 నాటికి శిక్షణా కార్యక్రమాలు పూర్తి చేసామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా బిఎల్వోలకు 2002, 2025 ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ 37.53 శాతం పూర్తయిందన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 1640 బూతు లెవల్ అధికారులకు 1624 మందికి బీఎల్వో ఐడీ కార్డులు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వివరించారు. ఫారం పెండెన్సీకి సంబంధించి 147 క్లెయిమ్ లను సకాలంలో పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 1640 పోలింగ్ కేంద్రాలు ఉండగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ లో భాగంగా 185 పోలింగ్ కేంద్రాలు కొత్తగా ప్రతిపాదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ చీఫ్ ఎలెక్టోరల్ అధికారికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్వో వెంకటరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం కార్యక్రమాలను
# రైతాంగం సద్వినియోగం చేసుకోవాలి...

### మొబైల్ వెటర్నరీ అంబులెటనరీ యూనిట్ ని సందర్శించిన అడిషనల్ డైరెక్టర్ హెల్త్ డాక్టర్ ఎన్ రాజకుమారి డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అంబేద్కర్



**కాకినాడ( మనసులో మాట) నవంబర్ 27..** ప్రభుత్వం రైతులకు ప్రవేశపెట్టిన ఐదు సూత్రాలు ప్రతి రైతు తెలుసుకోవాలని అడిషనల్ డైరెక్టర్ (హెల్త్) డా. ఎన్. రాజని కుమారి అన్నారు. గురువారం అడిషనల్ డైరెక్టర్ (హెల్త్) డా. ఎన్. రాజని కుమారి , జాయింట్ డైరెక్టర్ డా. కృష్ణమూర్తి ,డెప్యూటీ డైరెక్టర్ డా. అంబేద్కర్ గారితో కలిసి కాకినాడ అర్బన్1962 మొబైల్ వెటర్నరీ అంబ్యులేటరీ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతాంగం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. పశుసంవర్ధక శాఖ ద్వారా పాలు, గుడ్లు, మాంసం రాష్ట్ర స్థూల విలువ జోడింపునకు ఎంతో దోహదపడతాయని, వీటిని పెంపొందించడంతోనే పాడి రైతులకు, రాష్ట్రానికి అభివృద్ధి జరుగుతుందని ఆమె తెలిపారు. రైతులకు సహాయకారిగా నిలిచి, పశువుల ఆరోగ్యాభివృద్ధిలో 1962 మొబైల్ వెటర్నరీ సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా, రైతులకు సమయానుకూలంగా పశువైద్య సేవలను అందిస్తున్న 1962 అంబులెన్స్ బృందం అందిస్తున్న సమర్థవంతమైన మరియు అంకితభావ సేవలను అధికారులు అభినందించారు. ఈ సందర్భనలో భాగంగా డా. బాల సువర్ణ, పారావెట్ బాలయోగి, మరియు పైలట్ శ్రీను (కాకినాడ అర్బన్) ను వారి ఉత్తమ సేవలు మరియు పశుసంవర్ధక రంగానికి చేసిన కృషికి గాను సన్మానించారు.

# పెళ్లిళ్లు.. జరిగే స్టయిలే వేరు!

- పెళ్లి... కొత్త పంథా
- పెళ్లి అలంకరణ... కొత్త కొత్తగా
- ఈ సంవత్సరానికి ఈరోజే ఆఖరి మూహూర్తం!
- రేపటి నుంచి ఫిబ్రవరి 17 వరకు ముహూర్తాలు లేవు







**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 26:** పెళ్ళికి పర్యాయ పదం అలంకరణ అనడం లో ఏ మాత్రం అతిశయం లేదు. అవును మరి నిశ్చితార్థం లో తొడిగే ఉంగరాన్ని ఉంచే పెట్టె నుంచి చీర సారెల్ని పెట్టె బుట్టలు వరకూ అన్నింటిని అందంగా అలంకరించడం నేడు ఓ సంప్రదాయం గా మారింది. అక్కడ తో సరి అనుకుంటే పొరపాటే... పెళ్ళికి సంబందించిన ప్రతీది అంటే మెడలో వేసుకునే వరమాల నుంచి తల మీద ధరించే మేలి ముసుగు వరకూ ఎంతో ప్రత్యేకంగానూ కొత్తగా ఉండాలని కోరుకుంటుంది ఈ తరం అందుకే వాళ్ళకోసం తవంలోని సృజనంతటిని రంగరించి మరీ ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్ ని సృష్టిస్తున్నారు

**తామర పూ దండ:**
సంప్రదాయాలు పద్ధతులు వేరైనా అన్ని చోట్లా వివాహ బంధాన్ని ఎంతో పవిత్ర మైనది గానే భావిస్తారు. ఆ బంధాన్ని కలిపే పెళ్లి తంతులో ఒకటి వరమాల లేదా జయమాల. స్వచ్ఛతని ప్రేమ ని ప్రతిబింభించే ఈ పూల దండల్ని ఎక్కువ గా పరిమళ భరితమైన గులాబీ లు, లిల్లీలు, మల్లెలూ, చామంతులు వంటి వాటితోనే కడుతుంటారు. అయితే ఈ మధ్య తామర పువ్వుల వరమాలలు ఎక్కువ గా కనిపిస్తున్నాయి. ఏ డ్రెస్ మీదనైనా ఈ దండలు అందం గాక కనిపిస్తున్నాయి. అందుకే సెలబ్రిటీ ల నుండి సామాన్యుల వరకూ తామర పూదండ లకే ప్రాధాన్యత ఇస్తున్నారు

**పూల జడ:**
పెళ్లి కూతురు అలంకరణ అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది పూలజడే. ఎంత అందమైన చీర కట్టినా ఒంటి నిండుగా ఎన్ని రకాల నగలు పెట్టినా పూల జడ తరువాతే ఏవైనా. కాకపోతే అన్ని కాలా ల్లోనూ మల్లెలు ఉండవు కాబట్టి దొరికిన పూలతోనే జడలు వేసేవారు. కానీ ఈ మధ్య ఏ కాలం లో పెళ్లయినా జడలూ ముడులే కాదు, పెళ్లి తెరలూ వరమాలలూ, మేలి ముసుగులు, పెళ్లి మండపాలు, అవిరేణి కుండలు, బిందెలు ఇలా అన్నింటిని తెల్లని మల్లె పూల తోనే అందగా అలంకరించేస్తున్నారు. వాటిని చూసి చాలా మంది వాసన లేవు గాని, కాలం కాని కాలం లోనూ మల్లెలు బాగానే వస్తున్నాయి అనుకుంటున్నారు. నిజానికి ఈ మధ్య పెళ్లి అలంకరణ లో కనిపించే ఈ తెల్లని మొగ్గలన్నీ నంది వర్ధనాలే.

**రంగు రంగుల లైటింగ్:**
పెళ్లి వేడుకలో ప్రధాన ఆకర్షణ వధూ వరులే అయినప్పటికీ రాగానే అతిదుల్ని ఆకట్టుకునేది వేదిక అలంకరణే. పగలు పెళ్లి అయితే రంగుల పూలు పలచని పరదాలతోనే రక రకాలుగా అలంకరిస్తుంటారు. కానీ రాత్రి వేళల్లో చేసే పెళ్ళికి మాత్రం రంగు రంగుల దీపాల వెలుగులోనే మండపం అందగా కనిపించేలా తీర్చి దిద్దుతారు. అయితే ఇటీవల ఆ దీపాలను ఫెయిరీ టెల్ కథల్ని తలపించేలా అలంకరిస్తున్నారు. ముఖ్యం గా డేస్టినేషన్ వెడ్డింగ్ లు పెరగడం తో వేదిక చుట్టూ ఉండే పరిసరాలకి ప్రాధాన్యత పెరిగింది. అందులో భాగం గానే పెళ్లి కి దాని కన్నా ముందు జరిగే మేహందీ, సంగీత్ ఇలా అన్ని వేడుకల్లోనూ వేదిక కు తగినట్లుగా అక్కడ చెట్లు, పందిళ్ళు, రాళ్ళని, పచ్చిక నీ బుల్లి బుల్లి ఎల్ ఈ డీ లైట్ లతో అలంకరిస్తున్నారు. దాంతో అతిధులకు ఏ చుక్కల లోకంలోనో విహరిస్తున్న అనుభూతి కలిగిస్తుంది ఈ లైటింగ్

**పెళ్లిళ్ల కి 80 రోజులు బ్రేక్:**
పెళ్లికి అతి ముఖ్యమైంది ముహూర్తం. బలమైన ముహూర్తంలో వివాహం చేసుకుంటే నూరేళ్ల జీవితం సుఖమయం అవుతుందన్నది అందరి నమ్మకం. అందుకే వివాహ తంతులో ప్రతి కార్యక్రమానికి ముహూర్తాలు చూసుకుంటాం. అందుకు పురోహితులు, పండితుల చుట్టూ తిరుగుతాం. అలాంటి ముహూర్తాలకు శుక్రవారం నుంచి బ్రేక్ పడనుంది. ఈ నెల 30న ప్రారంభమయ్యే శుక్ర మౌఢ్యమి(మూఢం), వచ్చే ఏడాది ఫిబ్రవరి 17న మాఘ బహుళ అమావాస్య వరకు కొనసాగనుంది. అప్పటి వరకు శుభకార్యాలకు విరామం ఏర్పడుతుంది. ఇప్పటికే వివాహాలు కుదుర్చుకుని సిద్ధంగా ఉన్న వారు మంచి ముహూర్తాల కోసం మూఢమి ముగిసే వరకు వేచి ఉండాల్సిందే.

**మాఘమాసమూ మూఢంలోనే:**
మాఘమాసం ఎప్పుడొస్తుందా అని వివాహాలు చేసుకునేవారు ఆశగా ఎదురు చూస్తారు. ఎందుకంటే ఆ మాసంలో బలమైన ముహూర్తాలు ఉంటాయి. అయితే ఈసారి మాఘమాసం మూఢమిలో కలవడంతో ఒక్క ముహూర్తం కూడా లేదు. అంతే కాదు.. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, వసంత పంచమి, మాఘ పౌర్ణమి వంటి ముఖ్యమైన తిథులు కూడా మూఢంలో కలిసిపోయాయి.

**వ్యాపారులకు గడ్డు కాలం:**
శుభకార్యాలకు బ్రేక్ పడనున్న ఈ 80 రోజులు వ్యాపారులకు గడ్డు కాలమనే చెప్పాలి. మండపాలు, ఫంక్షన్ హాల్స్, వస్త్ర దుకాణాలు, స్వర్ణకారులు, నగల షాపుల యజమానులు, డెకరేషన్, క్యాటరింగ్, ఫొటో, వీడియో గ్రాఫర్లు, టెంట్‌హౌస్, పూల వ్యాపారులు, ట్రావెల్స్, లైటింగ్, డీజే బాక్సులు అద్దెకిచ్చేవారు ఇలా శుభకార్యాలపై ఆధారపడ్డ అన్ని రంగాల వారు, ముఖ్యంగా పురోహితులు తీవ్రంగా నష్టపోనున్నారు.



## ఘనంగా అంకమ్మ తల్లి తిరునాళ్ళ మహోత్సవం

**పల్నాడు, నవంబర్ 27,(మనసులో మాట):** కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారు తల్లి అంకమ్మ తల్లి తిరునాళ్ళ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బెల్లంకొండ మండలంలోని మాచాయపాలెం గ్రామం అంకమ్మ తల్లి తిరునాళ్ళ మహోత్సవంలో గ్రామ దేవతలకు దేవుళ్లకు గ్రామ పెద్దలు ఆలయ కమిటీ టెంకాయలు కొట్టి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. త్రిశూలాలకు జలాభిషేకం చేసుకొని కనక తప్పెట్లు వాయిద్యాలతో గ్రామోత్సవంగా గ్రామంలో త్రిశూలాలతో తిరుగుతున్న భవాని స్వాములకు గ్రామస్తులు వారు పోసి టెంకాయలు కొట్టారు. అనంతరం అమ్మవారి దేవాలయం లో త్రిశూలాలు ఉంచారు. భక్తులు పొంగల్లు చెల్లించి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయధర్మకర్తలు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయం ప్రాంగణం రంగురంగుల కాంతులతో విద్యుత్ దీపాలంకరణ చేశారు.

# రైతులను ఇబ్బంది పెడితే తగిన చర్యలు తీసుకుంటామన్న ఎమ్మెల్యే



**పల్నాడు, నవంబర్ 27,(మనసులో మాట):** రైతులను ఇబ్బంది పెడితే తగిన చర్యలు తీసుకుంటామని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. 100 రోజులు 100 గ్రామాల పర్యటన లో భాగంగా క్రోసూరు మండలం బయ్యవరంలోనీ గ్రామ సచివాలయాన్ని రికార్డులను ఆయన పరిశీలించారు. అధికారులు గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా సేవా భావంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి విషయం పై రికార్డులను నమోదు చేయాలని అన్నదాత సుఖీభవ సమస్యలను పరిష్కరించేలా వ్యవసాయ అధికారులు పని చేయాలన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి త్రాగు అందించేలా అధికారులు కృషి చేయాలని, గ్రామంలో పారిశుధ్య వ్యవస్థను మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ఉన్న గుంతలు పూడ్చి, డ్రైనేజీ పూడికలు తీయాలని ఆయన ఆదేశించారు.

## నేర నియంత్రణయే ప్రథమ కర్తవ్యంగా
# కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



**పల్నాడు, నవంబర్ 27,(మనసులో మాట):** శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన నేర నియంత్రణయే ప్రథమ కర్తవ్యంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లు నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా పోలీసులు తెలిపారు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు గురువారం పోలీసు శాఖ,ఎక్సైజ్ శాఖ వారి ఆధ్వర్యంలో నాగార్జున సాగర్ పోలీస్ స్టేషన్ పరిధి హస్నాబాద్ తాండా గ్రామం నందు శాంతి భద్రతల పరిరక్షణ చర్యలలో భాగంగా సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించి ప్రజలకు మేమున్నాము అనే భరోసా కల్పిస్తూ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నందు రౌడీ షీటర్లు,ట్రబుల్ మాంగర్స్,పాత కేసుల లోని నిందితులపై ప్రత్యేక నిఘా... ఇళ్లు, పరిసర ప్రాంతాలలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీ లలో గ్రామంలో సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలు,గొడ్డళ్లు - 16 ,కత్తులు - 14, స్వాధీనం చేసుకొని, 200 లీటర్ల బెల్లం ఊట ను ధ్వంసం చేయడం జరిగింది. అదేవిధంగా పాత నేరస్తులను ఇద్దరిని అదుపులోకి తీసుకోవడం జరిగింది.
ఫుట్ పెట్రోలింగ్ చేస్తూ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. రౌడీషీటర్లు,ట్రబుల్ మాంగర్స్, అనుమానితులు మరియు పాత కేసుల లోని నిందితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాత కేసుల నిందితుల తో సమావేశమై పాత పంథా కొనసాగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గ్రామంలో అకారణంగా గొడవలు సృష్టిస్తే సహించేది లేదని, వారి మీద కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసరావు పేట రూరల్ సీఐ షేక్.నఫీజ్ భాష, మాచర్ల టౌన్ సిఐ టి.వెంకట రమణ, నాగార్జునసాగర్ ఎస్ఐ అశోక్ , మాచర్ల రూరల్ ఎస్సై సంధ్యారాణి,మాచర్ల టౌన్ ఎస్ఐ అనంత కృష్ణ,మాచర్ల ఎక్సైజ్ సీఐ ఎన్.వెంకటరమణ,ఈపూరు ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు,నరసరావుపేట ఎక్సైజ్ సీఐ గౌస్ భాషా, గురజాల ఎక్సైజ్ ఎస్సై సత్యనారాయణ, 68 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు పాల్గొన్నారు.

# దొంగల గ్యాంగ్ పై అప్రమతంగా ఉండండి

## ఎస్పీ బిందు మాధవ్ వెల్లడి

**కాకినాడ (మనసులో మాట), నవంబరు27:** మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల గ్యాంగ్ గత రాత్రి దువ్వాడ - స్టీల్ ప్లాంట్ ప్రాంతాల్లో ఈ గ్యాంగ్ కనిపించినట్లు సమాచారమున్న నేపథ్యంలో ఎస్పీ బిందు మాధవ్ ముందస్తు అప్రమత్తత సూచనలు చేసారు. గురువారం ఎస్పీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేసారు. దొంగల గ్యాంగ్ అనకాపల్లి మీదుగా ప్రయాణిస్తున్న అవకాశం ఉండటంతో, కాకినాడ జిల్లాలోని అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు లక్ష్యంగా పెట్టుకునే అవకాశం ఉందన్నారు.కాకినాడ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పదులపై వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు గమనించిన వెంటనే 100 / 112 కు ఫోన్ చేయాలని,అపార్ట్‌మెంట్లు %a% గేటెడ్ కమ్యూనిటీలకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకువాలని,ఎంట్రీ గేట్ల వద్ద సెక్యూరిటీ చెక్కింగ్‌ను కఠినతరం చేయాలన్నారు.కొత్తగా వచ్చే వ్యక్తులు రికార్డు, వాహన నంబర్లు నమోదు చేయాలని,

రాత్రి వేళల్లో పెట్రోలింగ్ లేదా క్రమబద్ధమైన సెక్యూరిటీ రౌండ్లు పెంచాలని సూచించారు.ఇళ్లను లాక్ చేసి బయటకు వెళ్లేవారికి దీర్ఘకాలం ఇంటికి దూరంగా ఉండేవారు తప్పనిసరిగా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ ను సంప్రదించాలని, ఇంటి బయట తాళాలు స్పష్టంగా కనిపించకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటు మీ సమాచారం మా చర్యలకు కీలకమని ఎలాంటి ప్రమాద సూచనలు కనపడినా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.

# కలియుగ స్వామికి వెండి కిరీటాలు బహుకరణ



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 27:** గోకవరం మండలం తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండ పై కలియుగ దైవంగా వేంచేసి యున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర సమక్షంలో రాజమహేంద్రవరానికి చెందిన కలిగొట్ల శ్రీనివాస నారాయణ సౌజన్యంతో స్వామివారికి అమ్మవారికి వెండి కిరీటాలు సమర్పించడం జరిగిందన్నారు.

# నాటి విద్యార్థి నేటి గురువు ప్రసాదు మాస్టర్ ఔన్నత్యం


- చదువుకున్న పాఠశాలకు తన వంతు సహాయం
- ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు



**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 27:** పిఠాపురం పట్టణంలో గల స్థానిక ఏకేపీఎం మున్సిపల్ ప్రాథమిక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి విశ్రాంత ఉపాధ్యాయుడు కె వి ఎస్ ఎస్ ప్రసాదు అద్భుతమైన ఆలోచనతో ముందుకు వచ్చారు. ఆయన చదువుకున్న ఆంధ్ర కేసరి ప్రకాశం పురపాలక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో మెరుగైన చేతిరాత కోసం ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. శ్రీకృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అభ్యాస పుస్తకాలను కూడా అందించారు. ఈ మేరకు గురువారం తన తరగతి మిత్రులతో ఆయన పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాకపల్లి రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాజు స్ఫూర్తిదాయకమైన కే వి ఎస్ ఎస్ ప్రసాదు మాస్టారు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఇది కేవలం చేతిరాత శిక్షణ మాత్రమే కాదని ఉపాధ్యాయుడు గొప్పతనాన్ని విద్య పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమను ప్రతిబింబిస్తుందని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. ప్రసాదు మాస్టార్ మాట్లాడుతూ ఉత్తమ చేతిరాతతో మెరుగైన మార్కులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో మంచి చేతిరాత చాలా ముఖ్యమైన నైపుణ్యం అని పేర్కొన్నారు. ఉత్తమ చేతిరాత పరీక్షలలో ఎక్కువ మార్కులు సాధించడంలో సహాయపడుతుందని తెలిపారు. ఈ చేతిరాత శిక్షణతో విద్యార్థులు ఆంగ్లంలో మరింత ఆత్మవిశ్వాసంతో రాయగలుగుతారని తెలిపారు. అంతేకాకుండా వారి భవిష్యత్తు బలమైన పునాదులు వేసుకునేందుకు చేతిరాత కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. విద్యార్థులంతా చక్కగా నేర్చుకుని ఉన్నత స్థానాలు చేరుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు రిటైర్డ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్ గణేష్ వలి, రిటైర్డ్ అసిస్టెంట్ ఇంజనీర్ అల్లుబోయిన సత్యనారాయణ, కాంట్రాక్టర్ సామాజికవేత్త సోము సత్యనారాయణ, అడ్వకేట్ తటవర్తి సురేష్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గుబ్బల రాజు , పాఠశాల ఉపాధ్యాయులు లోవరాజు, కృష్ణవేణి , సునీత తదితరులు పాల్గొన్నారు.

# స్కానింగ్ సెంటర్లపై నియంత్రణేది ?

- స్కానింగ్ సెంటర్లలో ఇష్టారాజ్యం
- జిల్లాలో జోరుగా అక్రమ దందా
- ఒక్కో సెంటర్లో ఒక్కో రేటు
- సిటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్రే రేలకు అంతా రెఫరల్
- పలు సెంటర్లలోటెక్నీషియన్లుగా జూనియర్లు
- బోర్డుపై ఓ రేటు..వసూలు చేసేది మరో రేటు
- తనిఖీలు చేపట్టని అధికారులు



**కాకినాడ (మనసులో మాట), నవంబరు 27:** కాకినాడ జిల్లాలోని పలుప్రాంతాల్లోని స్కానింగ్ సెంటర్లలో ధరల ని యంత్రణ కొరవడటంతో ప్రజలు దోపిడీకి గరవుతున్నారనే విమర్శలు తీవ్రమవు తున్నాయి. ఒక్కో స్కానింగ్ సెంటర్లో పరీక్షలకు ఒక్కో రకంగా ఫీజులు వసూలు వేయడంతోపాటు, రెఫరల్ డాక్టర్లకు భారీ కమిషన్లు ఇస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైద్యాధికారులు తనిఖీలు చేపట్టకపోవ డం పట్ల ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది.

**జోరుగా అక్రమ దందా..**

కాకినాడ పట్టణంతో పాటు పిఠాపురం, తుని, అమలాపురం, రాజమహేంద్రవరం తదితర ప్రాం తాలలో ఈ దందా జోరుగా సాగుతుంది. గర్భిణులతో పాటు చెస్ట్, గ్యాస్ట్రో, లివర్ వంటి సమస్యలున్న రోగులకు వైద్యులు స్కానింగ్ లను, గాయాలు, తలనొప్పి, నరాల సమస్యలున్న రోగులకు ఎక్స్రే, సిటీ స్కాన్, ఎంఆర్ఐలను రెఫర్ చేస్తున్నారు. స్కానింగ్ సెంటర్లు నుంచి నేరుగా ప్రవేటు ఆసుపత్రి డాక్టర్లకు రాయబారం తో పాటు, అయన ఎక్కడ స్కానింగ్ రాస్తే అక్కడే చేయించు కోవాలి. మరొక చోట స్కానింగ్ తీయించుకుంటే మళ్ళీ తప్పులు ఉన్నాయని, తిరిగి అక్కడికే పంపిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని కారణంగా జోబీలు చిల్లు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధిక ఫీజుల వసూలు..**

స్కానింగ్ సెంటర్లలో రోగుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు.. ఎక్స్ రే కోసం ?500 నుంచి ?1200 వరకు. సాధారణ స్కానింగ్కు ?800 నుంచి ?2000 వరకు. సిటీ స్కాన్, ఎంఆర్ఐల విషయానికి వస్తే ఫీజులు మరింత ఎక్కువ గా ఉంటున్నాయి. సెంటర్ల నిర్వాహకులు పేరుకు మాత్రమే ధరల బోర్డు ప్రదర్శిస్తూ ఇష్టారీతిన వసూలు చేస్తున్నారని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రతీ స్కానింగ్ సెంటర్లోనూ ఇదే పరిస్థితి ఉందని, అధికారులు నిర్వహణ లోపం కారణంగా ప్రవేట్ స్కానింగ్ సెంటర్లు ఇలా వ్యవహారిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా లో ఎక్కువ స్కానింగ్ సెంటర్ లు కేవలం కాకినాడ లోనే ఉంటారని, అధికారులు కూడ ఉదయం నుంచి సాయంత్రం వరకూ జిల్లా కర్యాలయాల్లో ఉన్నప్పుడు తనిఖీలు చేస్తే సామాన్యులు కొంచెం బాధ తప్పుతుందని అంటున్నారు.

**జూనియర్లతోనే నిర్వహణ..**

ఎక్స్రే, స్కానింగ్, సిటీ స్కాన్ నిర్వహణకు డీఎంఐటీ కోర్సు చేసిన అర్హత, అనుభవం ఉన్న టెక్నీషియన్ అవసరం. కానీ, ప్రైవేట్ ఆస్పత్రులు, సెంటర్ల నిర్వాహకులు టెక్నీషియన్లకు అధిక వేతనాలు (?30 వేల నుంచి ?45 వేలు) ఇవ్వాల్సి వస్తుందనే కారణంతో, జూనియర్లకు 20 వేల లోపు జీతాలు ఇచ్చి నిబంధనలకు విరుద్ధంగా సెంటర్లను నడుపుతున్నారు. జూనియర్లు ఇచ్చే స్కానింగ్ రిపోర్టులో తేడా వస్తే ఎవరు బాధ్యత వహిస్తారనేది ప్రశ్నార్థకం గా మారింది. ప్రతీ స్కానింగ్ సెంటర్లోను సీనియర్స్ ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు కోరుతున్నా, కేవలం ఎక్కువ వేతనాలు ఇవ్వాలని సాకుతో అనుభవం లేని వ్యక్తులు స్కానింగ్ సెంటర్లో ఉండటం వల్ల ఇబ్బందులు తలతితే బాధ్యత ఎవరు తీసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# విద్యార్థులకు రాజ్యాంగం పై అవగాహన అవసరం



**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 27:** ప్రతి విద్యార్థి రాజ్యాంగం పై అవగాహన కలిగి ఉండటం ఎంతో ఆవశ్యకత అని అడ్వకేట్ పెనుమాల సుధీర్ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక డా. మోకా గణపతి రావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని దీవెన ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు రాజ్యాంగం పై ఇతీవల పోటీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో విజేతలకు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు డిక్షనరీ, పెన్నులు మరియు ప్రశంస పత్రాలను సుధీర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితాలను మార్చే శక్తి కేవలం విద్యకు మాత్రమే ఉందని, విద్యార్థులు చదువుతో పాటు ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికన హక్కులు కల్పించిన భారత రాజ్యాంగం పై అవగాహన కలిగి ఉండాలన్నారు.దీవెన వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ సంస్థ విద్య, ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణ అనే వాటి పై అవగాహన కలిగించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముందు భారతరత్న అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జె సురేంద్ర కుమార్ సెకండ్ ఎంపీసీ(ప్రథమ), కె హర్ష సెకండ్ హెచ్ఇసి(ద్వితీయ), కె సత్య నిహాల్ సెకండ్ బైపీసి(తృతీయ ) లతో పాటు పాల్గొన్న వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ కె శ్రీనివాసరావు, అధ్యాపకులు భాను ప్రకాష్, దుర్గా ప్రసాద్, చందు, రామరాజు లతో పాటు దీవెన ఫౌండేషన్ సభ్యులు శరత్, ప్రసాద్, కవి పాల్గొన్నారు.

## తొర్రేడు అంగన్ వాడీ కేంద్రాన్ని

# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్






**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తొర్రేడు అంగన్ వాడి కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. వైద్య ఆరోగ్య శాఖ మహిళా-శిశు సంక్షేమ శాఖల సంయుక్త కార్యక్రమాల అమలుపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కే వెంకటేశ్వరరావు, సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ కీర్తి చేకూరి పలు ముఖ్య అంశాలను పరిశీలిస్తూ ఆరోగ్య సేవల నాణ్యత, పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ, సకాలంలో నిర్వహించ వలసిన వైద్య పరీక్షలు, రికార్డుల నిర్వహణ, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు సేవల సమన్వయం వంటి అంశాలపై సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో వైద్యుల నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా సందర్శనలు జరగాలని, ప్రతి చిన్నారి కోసం చైల్డ్ ట్రాకింగ్ రిజిస్టర్, హెల్త్ రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. 0%-%3 సంవత్సరాల పిల్లలపై ఇంటి సందర్శనలు నిరంతరంగా చేయాలని, తల్లిదండ్రులకు పోషకాహారం, శిశు వికాసం, హెచ్చరిక సంకేతాలు, తక్షణ వైద్య సహాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. శాన్/ మామ్ పిల్లలు, అభివృద్ధి ఆలస్యం ఉన్న చిన్నారులను గుర్తించడంలో అంగన్‌వాడీ సిబ్బందికి వైద్యులు మార్గనిర్దేశం చేయాలన్నారు. అలాగే పిల్లల గ్రోత్ చార్టులు అప్డేట్ చేసి, ఏవైనా వ్యత్యాసాలు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ప్రతి చిన్నారి హెల్త్ కార్డ్‌లో ఇమ్యూనైజేషన్, గ్రోత్, ఆరోగ్య వివరాలు సమయానుకూలంగా నమోదు చేయాలని, ఏఎన్ఎంలు, హెల్త్ విజిటర్లు, అంగన్‌వాడీ కార్యకర్తల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని సూచించారు. గర్భిణీలు తమ మాతృగృహాలకు వెళ్తున్న సందర్భాల్లో ౨ ం బ ం డి, ఆ వ ఎ న్ ఎ ం ఎ ల, మెడికల్ ఆఫీసర్లు తనతన ప్రాంతాల్లో నిరంతర ఫాలోఅప్ నిర్వహించేలా సమాచార మార్పిడిని మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మాతా-శిశు ఆరోగ్య సూచికలను మెరుగు పరచడం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అందించిన సూచనలు తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు.

## షష్ఠి సంబరాల్లో పాల్గొన్న

# మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి



**కపిలేశ్వరపురం (మనసులో మాట) నవంబర్ 27..** మండలం లోని నేలటూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ నీలాంబిక సమేత శ్రీ బసవేశ్వర స్వామి వారిని మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి దర్శించుకున్నారు.సుబ్రహ్మణ్య షష్ఠి సంబర మహోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేశారు.అనంతరం కమిటీ సభ్యులు ఆమెకు శాలువా కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రుద్రాక్షల సూర్య నాగ లింగం, నేలటూరు వైస్ ప్రెసిడెంట్ సెనక్కాయల దొరబాబు ఎంపీటీసీ రుద్రాక్షల వీర గౌరీకుమారి చిన్న వీర్రాజు,వాసా సూరిబాబు,వెన్న బసయ్య,అంచే సత్తిబాబు,మాజీ సర్పంచ్ రుద్రాక్షల శ్రీవాస్ తదితరులు పాల్గొన్నారు.అలాగే స్వయంభూ గా వెలసిన కపిలేశ్వరపురం గౌతమీ గోదావరి నదీ తీరం వద్ద, అంగర గ్రామం లో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వార్ల ఆలయాలు భక్తులతో కలకల లాడాయి.



# పవన్ కళ్యాణ్ కృషితో తాటిపర్తి –చెందుర్తి బీటీ రోడ్డు

- రూ 1.80 కోట్ల నాబార్డు నిధులతో
- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ శంకుస్థాపన



**గొల్లప్రోలు (మనసులో మాట), నవంబర్ 27:** గొల్లప్రోలు మండలంలో డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ కృషితో రవాణా సదుపాయాలు అభివృద్ధి దిశగా మరో అడుగు ముందుకు పడింది. తాటిపర్తి నుంచి చెందూర్తి వెళ్లే రహదారి బీటీ రోడ్డు నిర్మాణ పనులకు నాబార్డ్ నిధులతో రూ.1 కోటి 80 లక్షల వ్యయంతో చేపట్టనున్న ప్రాజెక్టుకు గురువారం కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్ నియోజవర్గ ఫైవ్ మాన్ కమిటీ తో కలిసి శంకుస్థాపన చేశారు.శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామీణ సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృషితో ఈ ప్రాజెక్ట్ ఆమోదం పొందిందని తెలిపారు.ఇది స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఉత్తమ రోడ్లు గ్రామీణ జీవనశైలిని మార్చగలవు అని,రవాణా సులభతరం అయితే వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు సౌకర్యం, విద్యార్థులకు కళాశాలలు,పాఠశాలలకు వెళ్లేందుకు సులభంగా, అలాగే అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు తక్షణమే చేరడానికి వీలవుతుంది అని ఇలాంటి అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని పేర్కొన్నారు.

అలాగే మండలంలోని మరికొన్ని రహదారి పనులు, తాగునీటి సమస్యల పరిష్కారం, వెలుగుల వసతులు, డ్రైనేజీ వ్యవస్థ వంటి అభివృద్ధి కార్యక్రమాలు త్వరలో ప్రారంభం కానున్నాయని హామీ ఇచ్చారు. త్వరలోనే మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు తాను తరఫున ప్రయత్నాలు చేస్తానని ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమం లో స్థానిక జనసేన నాయకులు, నియోజవర్గ జనసేన నాయకులు, గ్రామ పెద్దలు, అధికారులు, యువత, మహిళలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముగిసిన సీఆర్టీ ప్రోగ్రామ్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 27:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ నుండి 27వ తేదీ వరకు "క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్" ప్రోగ్రామ్ బీటెక్ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు విజయవంతంగా జరిగిందని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ తెలిపారు. గురువారం యూనివర్సిటీ సెమినార్ లో ఏర్పాటు చేసిన సీఆర్టీ ప్రోగ్రామ్ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ హాజరై విద్యార్థులనుద్దేశించి ఉపన్యసించారు. నేటి పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వినూత్న ఆలోచన నైతిక విలువలతో కూడిన సాంకేతిక పరిజ్ఞానం నిజమైన వృత్తిపరమైన స్ఫూర్తిని రూపొందిస్తుందన్నారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ కేవలం ఉద్యోగాన్ని పొందడం కోసమే కాదని, వాస్తవ సవాళ్లను ఎదుర్కోవడానికి ఉపయోగపడుతుందన్నారు. లైఫ్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రెజెంటేషన్ స్కిల్స్, ఎంప్లాయబిలిటీ స్కిల్స్, హెచ్‌ఆర్ రౌండ్ అధిగమించడం వంటి ఇంటర్వ్యూ స్కిల్స్ పై శిక్షణ తీసుకున్న విద్యార్థులు సందర్భం వచ్చినప్పుడు స్కిల్స్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఓయూ ద్వారా నాంది ఫౌండేషన్ యూనివర్సిటీలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ను నిర్వహిస్తున్నందని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆచార్య బీ జగన్మోహన్ రెడ్డి, ట్రైనర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా సత్య దత్త వ్రతాలు



**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 27:** పిఠాపురం పట్టణం లోని శ్రీపాద శ్రీ వల్లభ మహా సంస్థానం నందు గురువారం సత్య దత్త వ్రతాలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఈ వ్రతాన్ని ఆచరించడం ద్వారా త్రిమూర్తుల అనుగ్రహం కలుగుతుందని శ్రీపాద శ్రీ వల్లభ స్వామి ఆశీస్సులు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అంతేకాకుండా ఆనందం, శ్రేయస్సు, సంతోషం, శాంతి, సంపద ఈ వ్రతం ద్వారా సంకల్పసిద్ధి భక్తులు నమ్మకం గా ఇది ఆచరించబడుతుంది. ఈ సందర్భంగా శ్రీపాద శ్రీ వల్లభ స్వామి వార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఈఓ ఆర్ సౌజన్య ప్రభాకరన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు వ్రతాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



## విద్యుత్ షాకుతో పారిశుద్ధ్య కార్మికురాలు మృతి

**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 27:** పిఠాపురం పట్టణానికి చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికురాలు విద్యుత్ షాక్ తో మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. పట్టణంలోని మంగయమ్మరావుపేట లో నివాసముంటున్న ముత్యాల రమణమ్మ (55) పిఠాపురం మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగంలో కార్మికురాలుగా విధులు నిర్వహిస్తుంది. గురువారం ఇంటి ఆవరణలో శుభ్రం చేసుకును చు ఉండగా మాపు కర్రకు విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టి పడి ఉండడంతో,స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మణికుమార్ తెలిపారు. పోస్టుమార్టం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ఘటనతో పిఠాపురం మున్సిపాలిటీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## న్యాయవాదుల విశ్రాంతి మందిరాన్ని ప్రారంభించిన జడ్జి ఆనంది



**రామచంద్రపురం (మనసులో మాట) నవంబరు 27..** రామచంద్రపురం బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులకు విశ్రాంతి మందిరాన్ని గురువారం 13వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి జి. ఆనంది గురువారం ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవిల్లి గోపాలరావు అధ్యక్షతన ఈ విశ్రాంతి మందిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. నాగేశ్వరరావు నాయక్ ఏపీపీ కప్పల సునీల్,ఏజిపి లకాని పద్మ కమల కుమారి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు వరాహ నరసింహమూర్తి, ట్రెజరర్ చింతపల్లి శ్రీనివాసు, స్పోర్ట్స్ సెక్రటరీ సాధే నారాయణరావు, సీనియర్ న్యాయవాదులు డిపి శాస్త్రి, కాకులవరపు రామచంద్రరావు, సాలగ్రామ శ్రీనివాస సుబ్రహ్మణ్యం,తదితరులు పాల్గొన్నారు.

## పాడా ప్రాజెక్టు డైరెక్టర్ బదిలీ



**పిఠాపురం,(మనసులో మాట) నవంబరు 27:** పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న చైత్ర వర్షిని గురువారం బదిలీ అయ్యారు. ఆమెను కమిషనర్ గ్రామీణ అభివృద్ధి కార్యాలయంలో మైక్రో క్రెడిట్ ప్రత్యేక అధికారిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పిడి గా విధులు నిర్వహిస్తున్న చైత్ర వర్షిని బదిలీ కావడంతో పాడా కార్యాలయానికి నూతనంగా ప్రాజెక్టు డైరెక్టర్ ను నియమించాల్సి ఉంది.

# ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా ఓగూరి భాగ్యశ్రీ

### వైస్ చైర్మన్ గా గోలకోటి వెంకటరెడ్డి - ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 27:** ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జనసేన కి చెందిన ఓగూరి భాగ్య శ్రీ , వైస్ చైర్మన్ గా బీజేపీ కి చెందిన గోలకోటి వెంకట రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ముమ్మిడివరం లోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు

ఈసందర్భంగా ఓగూరి భాగ్యశ్రీ మాట్లాడుతూ తనని నమ్మి ఈ పదవి నాకు కట్టబెట్టిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కి ఋణపడి ఉంటానని ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ప్రధానంగా రైతుల సమస్యల పరిష్కారం పై దృష్టి సారిస్తానని వివరించారు. జనసేన పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తనకు పదవి లభించడం ఆనందంగా ఉందన్నారు.

బీజేపీ కి చెందిన గోలకోటి వెంకట రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద బాధ్యత అప్పగించారని పేర్కొన్నారు. మార్కెట్ వైస్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించటం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన బీజేపీ పెద్దలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు



**మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు:**

ముమ్మిడివరం మార్కెట్ యార్డు ఆవరణంలో జరిగిన మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి హాజరయ్యారు.స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో నూతన ఛైర్మెన్ గా ప్రమాణ స్వీకారం చేసిన ఓగూరి భాగ్యశ్రీ, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రైతులకు కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి తగ్గట్టుగా నూతన పాలక వర్గం కూడా పని చేయాలని సూచించారు. రైతులకు అండగా ఉండి యార్డు ద్వారా వారికి అవసరమైన సహకారాన్ని . అలాగే మార్కెట్ యార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ హరీష్ మాధుర్ తెలిపారు.ముమ్మిడివరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ కి ఎటువంటి సహాయ సహకారాలు అయినా తాను ముందుండి సహకరిస్తానని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిథి పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ చైర్మన్, వైస్ చైర్మన్ లకు డైరెక్టర్ లకు శుభాకాంక్షలు తెలిపారు. కోనసీమ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తరుపున జనసేన కి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి లభించడం శుభ సూచకమని, పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత ముందుకు తీసుకొని వెళ్లాలని కోరారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమికి చెందిన నాలుగు మండల శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు మోకా ఆనంద్ సాగర్, నాగిడి నాగేశ్వరరావు , నడింపల్లి సుబ్బరాజు గుత్తుల సాయి చెల్లి అశోక్ దాట్ల బాబు ,గుద్దేటి జిమ్మీ , మందాల గంగ సూర్యనారాయణ , చిక్కాల అంజిబాబు, టేకుమూడి లక్ష్మణరావు , విత్తనాల బుజ్జి గేదల రఘునాదబాబ లతోపాటు పలువురు పాల్గొని ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్, వైస్ చైర్మన్ ఇతర సభ్యులను అభినందించారు.

## భీమేశ్వరస్వామివారి హుండీ ఆదాయం రూ. 43.95లక్షలు

**రామచంద్రపురం (మనసులో మాట) నవంబరు 27..** ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి హుండీల లెక్కింపును గురువారం నిర్వహించారు. అక్టోబరు15 నుంచి నవంబరుల 27 వరకు 43 రోజులకు గాను ఆలయ హుండీల ద్వారా ఆదాయం రూ.43,95,359లు వచ్చినట్లు దేవస్థాన సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని మీడియాకు వెల్లడించారు.



అన్నదానం హుండీ ద్వారా రూ. 52,682లు వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమన్ని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి. సత్యనారాయణ పర్యవేక్షించారు. ఓదురు గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి విత్తనాల శ్రీనివాస్, కె. గంగవరం గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి వి. బాలకృష్ణ, అర్చకులు, ద్రాక్షారామ, పోలీస్ శాఖ,సిబ్బంది సేవా సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

**పిఠాపురం,(మనసులో మాట) నవంబరు 27:** ప్రముఖ ఫైనాన్స్ సంస్థ ఐఐఎఫ్ఎల్ పిఠాపురం బ్రాంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు.పిఠాపురం స్థానిక అగ్రహారం నందు గల సిబిఎం మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో గల 40 మంది విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డిప్యూటీ మేనేజర్ రౌతు ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.తమ ఐఐఎఫ్ఎల్ సంస్థ ద్వారా చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలలో




భాగంగా... పిఠాపురం బ్రాంచ్ నుండి స్థానిక అగ్రహారం మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో గల 40 మంది విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. తమ సంస్థ వివిధ ప్రాంతాలలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐఎఫ్ఎల్ సంస్థ బీఎం నక్క నాగభూషణం, సిబ్బంది ఆశిష్, శంకర్, బాలరాజు, సామాజిక సేవా కార్యకర్త నల్లమిల్లి అర్పణ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు ఎం. రమణ, సతీష్, పి. దుర్గా దేవి, అశ్విని దేవి, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**రామచంద్రపురం(మనసులో మాట) నవంబరు 27..** డెంగ్యూ, ఫైలేరియా, చికెన్ గున్యా వ్యాధుల నుంచి దూరంగా ఉండేందుకు ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలో యనమదల, కందులపాలెం గ్రామ శివారు ప్రాంతాలలో అనుమానిత డెంగ్యూ కేసులు నమోదు కావడంతో ఆయాగ్రామాలను పరిశీలించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ఇంటి పరిసర ప్రాంతాలలో దోమల



వృద్ధికి దారితీసే నీటి నిల్వలను పరిశీలించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజలు ఫ్రైడే డ్రై డే ఖచ్చితముగా పాటించాలని తద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చునని, దోమ కాటుతో వచ్చే మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వ్యాధి, చికెన్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు నివారించవచ్చునన్నారు. అవుట్డోర్ ,ఇండోర్ స్ప్రేయింగ్ లను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెల్ల ను సందర్శించి ల్యాబ్‌లో రక్త పరీక్ష వివరములు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ వి స్వాతి భవాని, వి లక్ష్మీ ప్రసన్న, సబ్ యూనిట్ ఆఫీసర్ బిషప్ , డివిజనల్ సూపర్వైజర్ జి కమల్ శేషు, డి వైకుంఠరావు ఎంపీహెఈఓ, మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## వైసిపి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### ప్రత్తిపాడు వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



**కిర్లంపూడి (మనసులోమాట) నవంబర్ 27..** ప్రత్తిపాడు నియోజకవర్గంలో గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు గురువారం ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే కాకుండా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి రానున్న రోజుల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముద్రగడను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి, ఎంపీపీ గొల్ల క్రాంతి సుధాకర్, జడ్పిటిసి బెహరా రాజరాజేశ్వరి, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, ఎంపీటీసీలు ఉమ్మిడి తాతయ్యలు, దాడి చక్రధర్,మొల్లి వీరబాబు,పిల్లా చిన్న,పినిశెట్టి ప్రకాష్,సీంద్రపు భాస్కరరావు,మేడసాని సింహాద్రి, తటవర్తి రామన్నదొర, అమరాది కాశీ, జువ్వల సుజాత,



### బాల్య వివాహ ముక్త భారత్

## క్యాండిల్ లైట్ ర్యాలీ ప్రతిజ్ఞ

**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27..** కాకినాడ జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ట్రస్ట్ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సంయుక్తంగా కాకినాడ జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కార్యాలయం దగ్గర బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ నోడల్ ఆఫీసర్ ఐసిడిఎస్ సిడిపిఓ జ్యోతి చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ ట్రస్ట్ డిస్టిక్ కోఆర్డినేటర్ బి .కుమారి ఐసిడిఎస్ సూపర్వైజర్లు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేస్ వర్కర్ ఎన్. లక్ష్మి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ జెస్సీ ఫ్లోరెన్స్ మాట్లాడుతూ నవంబర్ 27, 2024 నుండి బాల్య వివాహ ముక్త భారత్ అనే కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని దేశంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. బాల్య వివాహ నిరోధ చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం, నేరం. బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుంది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేయాలి. బాల్య వివాహం జరగడానికి చేసిన ఏ ప్రయత్నాన్నైనా పంచాయతీ ప్రభుత్వ అధికారులకు తెలిపరచాలని లేదా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ .సమాచారం ఇవ్వాలన్నారు. తదుపరి చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ బి. కుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా 27 నవంబర్ 2025 నుండి 8 మార్చ్ 2026 వరకు 100 రోజుల అవగాహన కార్యక్రమాలును క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించడం జరుగుతుందని, బాల్య వివాహాలు జరగకుండా కాపాడాల్సిన బాధ్యత సమాజములో అందరిపైన ఉందన్నారు . ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహించిన మరియు సహకరించిన లేదా 18 సంవత్సరాలు అమ్మాయికి నిండకుండా 21 సంవత్సరాలు పూర్తి కాకుండా అబ్బాయికి వివాహం చేసిన బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం లేదా పోక్సో చట్టం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలల విద్య, భద్రత కోసం ప్రతీ పౌరుడు గళాన్ని వినిపించాలని బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ సాకారానికి మద్దతు ఇవ్వాలని అన్నారు .అందులో బాగంగానే గురువారం జిల్లాలోని అన్ని గ్రామాలలో క్యాండిల్ లైట్ ర్యాలీ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు .ఎక్కడైనా బాల్య వివాహాలు జరుతున్నట్లు సమాచారం తెలిసిన లేదా చూసిన చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి సమాచారం ఇవ్వాలని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ నోడల్ ఆఫీసర్ జెస్సీ ఫ్లోరెన్స్ సి డి పి ఓ జ్యోతి , చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ బి .కుమారి మరియు ఐసిడిఎస్ సూపర్వైజర్ , చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేస్ వర్కర్ ఎన్ .లక్ష్మి ,అంగన్వాడీ కార్యకర్తలు, పాల్గొనడం జరిగినది.

## స్వర్ణకార ఉత్తిదారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 27:** పట్టణంలోని స్వర్ణకార వృత్తిదారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం నందు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా వరద సత్తిబాబు, ఉపాధ్యక్షుడు నొక్కుల రాజు, ప్రధాన కార్యదర్శి మందారపు సంతోష్, కోశాధికారి వాంపోలు జయకృష్ణ, ఉప కార్యదర్శి ఎండి భాష సంఘం సభ్యుల నిర్ణయం మేరకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ప్రమాణ స్వీకారం అనంతరం నూతన కార్యవర్గం మాట్లాడుతూ, సంఘం సభ్యుల సంక్షేమం కోసం పాటుపడతామని వృత్తిపరమైన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నూతనంగా ఏర్పాటు అయిన కమిటీకి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు బొజ్జ సతీష్,కౌన్సిలర్ కోళ్ల బంగారు బాబు తెలుగుదేశం నాయకులు సోము సత్యనారాయణ, కేతవరపు కృష్ణ, మసకపల్లి రాజా, కొండేపూడి ప్రకాష్,కరుప్రోలు శ్రీను, చంటి లు శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పంట సాగులో పంచ సూత్రాలు అమలు చేసుకుంటూ ముందుకు వెళ్లాలి

### రైతులకు సూచించిన వ్యవసాయ శాఖ జెడి విజయ్ కుమార్



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27..** జిల్లాలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్ పిఠాపురం మండలం ఫక్రుద్దీన్ పాలెం గ్రామంలో రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాముఖ్యతను తెలియజేస్తూ ముఖ్యమంత్రి లేఖను రైతులకు అందజేశారు. సాగులో పంచ సూత్రాలు అమలు చేసుకుంటూ ముందుకు వెళ్లాలని జేడీ విజయ్ కుమార్ రైతులకు సూచించారు. ప్రధానంగా నీటి భద్రత, గిరాకీ ఆధారంగా పంటలు పండించడం, వ్యవసాయంలో టెక్నాలజీని అనుసంధానం చేయడం, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న మద్దతును రైతులకు విసిదీకరించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

ఈ కార్యక్రమంలో ఫక్రుద్దీన్ పాలెం గ్రామపంచాయతీ ప్రెసిడెంట్ శేఖర్, వ్యవసాయ శాఖ పిఠాపురం ఏడీ స్వాతి, పిఠాపురం మండలం వ్యవసాయ అధికారి గంగాధర్, గ్రామ వ్యవసాయ సహాయకులు భాగ్యరేఖ రైతులు పాల్గొన్నారు.



## కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా సతీష్‌రావు

**రామచంద్రపురం (మనసులోమాట) నవంబరు 27..** ఆంధ్రప్రదేశ్ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమార్ స్వామి నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు సతీష్‌రావు గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. బిజెపిలో చేరినప్పటి నుండి పార్టీ నిర్ణయించిన కార్యకలాపాలకు తాను చేసున్న సేవలను గుర్తించి తనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. .తనకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి తనవంతు కషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు ,జిల్లా బిజెపి అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు మాధవ్,రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమ, అనకాపల్లి బిజెపి ఇంచార్జ్ కర్రిర చిట్టిబాబు,రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గ,మండల బిజెపి నాయకులు తదితరులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## గొల్లప్రోలులో పేకాట రాయుళ్ళ పై పోలీసుల దాడి

# నలుగురు అరెస్ట్

## నగదు స్వాధీనం



**గొల్లప్రోలు (మనసులో మాట )నవంబరు 27:** గొల్లప్రోలు గ్రామ శివారులో అక్రమంగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం సాయంత్రం సుమారు 6 గంటలు సమయంలో గెలుపు ఓటమి పద్ధతిలో డబ్బులు పణంగా పెట్టి పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ మరియు సిబ్బంది అక్కడికి చేరుకుని దాడి నిర్వహించారు. ఈ దాడిలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అందరూ భోగపురం పత్తిపాడు గ్రామానికి చెందినవారని పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 4,020 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులపై ఏపీ గేమింగ్ యాక్ట్ క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ..జూదం నిర్వహణ చట్ట రీత్య వ్యతిరేకమని,పలు అనర్థాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎవరైనా జూదం నిర్వహణ చేపడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హెచ్చరించారు.

### 2047 సంవత్సరం నాటికి తలసరి ఆదాయం

# రూ 55 లక్షలు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం




**ఏలూరు/నూజివీడు, నవంబరు 27 (మనసులో మాట)..** నూజివీడు యంపిడివో కార్యాలయ ప్రాంగణం లో గురువారం రూ 20 లక్షలుతో ఆధునికరించిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయ ప్రారంభోత్సవం, రూ 25 లక్షలుతో సమావేశ మందిరంకు శంకుస్థాపన, రూ 3.50 లక్షలతో నియోజకవర్గ అభివృద్ధి – ప్రణాళిక కార్యాలయం ప్రారంభోత్సవాలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ అభివృద్ధి – ప్రణాళిక కార్యాలయంలో ఆంధ్ర 2047 యాక్షన్ ప్లాన్, ప్రజా ధర్బార్ పిజిఆర్ యస్ అర్జీలుపై సంబంధిత అధికారులతో మంత్రి కొలుసు పార్థసారథి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి దేశంలోనే అత్యున్నత స్థానంలో నిలబెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్న "స్వర్ణ ఆంధ్ర ఏ 2047" అనే ప్రభుత్వ దార్శనికతను అమలు చెయ్యడానికి ఉద్దేశించిన ప్రణాళిక అన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో "విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్" కార్యాలయాలను ఏర్పాటు చేశామని, ఈ ప్రణాళిక ఆర్థికాభివృద్ధి, పర్యావరణ స్థిరత్వం, సామాజిక పురోగతి మరియు సుపరిపాలన వంటి వాటిపై దృష్టి సారిస్తుందని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి, తలసరి ఆదాయాన్ని 55 లక్షలకు పెంచడం ప్రధాన లక్ష్యం అన్నారు. నియోజకవర్గ స్థాయిలో అమలును పర్యవేక్షించడానికి మరియు పురోగతిని ట్రాక్ చేయడానికి "విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్" లను ఏర్పాటు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలతో సమన్వయం చేయడం ద్వారా సమగ్ర అభివృద్ధిని సాధించడం జరుగుతుందన్నారు. రాబోయే తరాలు వారికి జీవన ప్రమాణాలు విద్య, వైద్యం, స్కిల్ డెవలప్మెంటు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించడానికి ముందుగానే ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. వ్యవసాయం, త్రాగునీరు, సాగునీరు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుంటే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. మన భూములు ప్రాణపదంగా చూసుకుంటామని ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లు ఉంటేనే మనకు ఉపయోగ పడతాయని అన్నారు. వారం వారం ప్రజా ధర్బార్ నిర్వహిస్తామని, ప్రజలు నుండి వచ్చిన ప్రతి అర్జీకి నిర్ణీత సమయంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. 60 రోజులు దాటినను పరిష్కారం కాకపోతే నేను స్వయంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కారం చేస్తానని అన్నారు.

### రాష్ట్ర సగర ఉప్పర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గా

# మొగిలి అప్పారావు పదవి బాధ్యతల స్వీకరణ

### జనసేన నాయకులు శుభాకాంక్షలు



**గొల్లప్రోలు (మనసులో మాట) నవంబరు 27:** గొల్లప్రోలు మండలం చిన్న జగ్గంపేట గ్రామానికి చెందిన మొగిలి అప్పారావు రాష్ట్ర సాగర ఉప్పర సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గా గురువారం ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి రాష్ట్ర బీసీ సంక్షేమ భవనం లో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత సమక్షంలో రాష్ట్ర వివిధ ప్రాంతాల నుంచి 15 మంది రాష్ట్ర ఉప్పర, సగర సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ లు గా పదవి బాధ్యతల స్వీకరణ భాగంగా పదవి బాధ్యతను చేపట్టారు. ఈ కార్యక్రమానికి అతిధులుగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పళ్ళ శ్రీనివాస్, రాష్ట్ర సాగర ఉప్పర సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ,రాష్ట్ర నాయకులు ఈ కార్యక్రమని నిర్వహించారు. పదవి బాధ్యతను స్వీకరించిన మొగిలి అప్పారావును జనసేన నాయకులు శాలువాలతో, పూల బొకేలతో అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా మొగిలి అప్పారావు మాట్లాడుతూ...ఇటీవల జరిగిన నియామకాల్లో తనకివ్వబడిన ఈ అవకాశం సగర సమాజ అభివృద్ధికి ఒక కీలక మెట్టుగా భావిస్తున్నాని తెలిపారు. అంతేకాకుండా సగర కుల అభివృద్ధి నా లక్ష్యం అని.రాజకీయ పక్షపాతం లేకుండా, ఎటువంటి బాధ్యతను భుజాన వేసుకున్నా నిబద్ధతతో పనిచేస్తాను. రాష్ట్రవ్యాప్తంగా సగర, ఉప్పర వర్గాలకు విద్య, ఉపాధి, గౌరవం, హక్కులు అందేలా కృషి చేస్తానని అని తెలిపారు.అలాగే ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు గ్రామ స్థాయికి చేరేలా పర్యవేక్షణ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఈసారపు శ్రీను యాదవ్, సార్ పల్లి వెంకటరమణ, తంగెళ్ళ నాగేశ్వరరావు, నక్క అబ్బాయి,నక్క వెంకటేష్,కాకినాడ 9వార్డు తల్లి బోయిన వీర వెంకట సత్యనారాయణ, నక్క శ్రీనివాసరావు,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ నియోజకవర్గంగా పిఠాపురం..

# పలు రోడ్లు శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ తంగెళ్ల

- రోడ్ల నిర్మాణాన్ని వైసిపి గాలికి వదిలేసింది
- పిఠాపురం నియోజకవర్గాన్ని సర్వతో ముఖాభివృద్ధి చేసేందుకు

ఉప ముఖ్యమంత్రి సూచనలతో ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపిన ఎంపీ తంగేళ్ల



**పిఠాపురం,(మనసులో మాట) నవంబరు 27:** ప్రజల భద్రతకు, మౌలిక సౌకర్యాలు కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ అన్నారు. పిఠాపురం నియోజకవర్గం లో పలు రహదారుల శంకుస్థాపనల కార్యక్రమంలో ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాసు, జనసేన శ్రేణులు పాల్గొన్నారు. గురువారం మల్లం గ్రామానికి చేరుకున్న ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ ఉప్పాడ ఆర్ అండ్ బి రోడ్డు నుండి మల్లాం గ్రామం వరకు నాబార్డు నిధులు కోటి 40 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, కందరాడ లో 55 లక్షల నాబార్డు నిధులు తో నిర్మాణం చేపట్టనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషితో పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మాణాలను గాలికి వదిలేయడం వల్ల ప్రజలు చాలా కష్టాలు పడ్డారన్నారు. కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా రహదారుల మరమ్మతులు, నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అవసరమైన చోట కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధుల నుండి రహదారులు నిర్మించేందుకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు.




## ఆర్టీసీ డిపోలో ఆర్వో ప్లాంటు బహూకరణ

**రామచంద్రపురం(మనసులో మాట)నవంబరు27..** స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు చల్లని తాగునీరు అందించాలనే సదుద్దేశంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను నిర్మించడం ఎంతో హర్షణీయమని జిల్లా డి పి టి ఓ రాఘవ కుమార్ అన్నారు. మోతీ జ్యువెలర్స్ అధినేత కీర్తిశేషులు మోతిలాల్ జైన్ స్మృతికి అంకితంగా ఆయన సతీమణి కుసుమ, కుమారులు సంజయ్ జైన్, చంద్రిక జైన్, హితేష్ జైన్, వాణి జైన్, మనవడు దర్శ జైన్, కుమార్తె షితల్ జైన్, విక్రమ్ జైన్ గారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పేపకాయల భాస్కర్ రావు, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు హాజరై మోతీ జ్యువెలర్స్ కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సంస్థ పట్ల వారికి ఉన్న ప్రత్యేక అభిమానాన్ని ప్రశంసిస్తూ, ఈ దాతృత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సుమారు రూ 5 లక్షలు విలువచేసే ఆర్వో వాటర్ సదుపాయాన్ని కలిగించి సంస్థ పట్ల వారికి ఉన్న అభిమానాన్ని చల్లని మనసుతో ప్రయాణికులకు చల్లని నీరు ఏర్పాటు చేశారున్నారు.

## కూటమి ప్రభుత్వంలో

# విద్యకు అధిక ప్రాధాన్యత



**రామచంద్రపురం(మనసులో మాట) నవంబర్ 27..** కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్యాలయాలకు అవసరమైన సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేస్తుందని కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. నియోజకవర్గంలోని కె గంగవరం మండలం తామరపల్లిలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మనబడి మన భవిష్యత్తు పథకం కింద రూ.12 లక్షలతో నిర్మించిన వంటశాలలను, మరుగుదొడ్లను మండల విద్యాశాఖ అధికారి ఏ నాగరాజు, తహసిల్దార్ శ్రీరాం ప్రసాద్, కూటమి పార్టీ నాయకులు , గ్రామ పెద్దలు సమక్షంలో సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకొచ్చార న్నారు. విద్య ద్వారానే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉన్నందున విద్యా రంగానికి అధికంగా నిధులు కేటాయిస్తున్నారన్నారు. విద్యార్థి దశ చాలా కీలకమైనదని, చిన్ననాటి నుంచి సక్రమమైన మార్గంలో విద్యార్థులను నడిపించడం ద్వారా బావి భారత పౌరులుగా ఎదుగుతారన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు పాఠశాలలో నిర్మించిన వంటశాలను ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యకు సంబంధించి ఏ సమస్యలున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా సహకరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీ రామ్ ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి ఏ నాగరాజు, గ్రామ సర్పంచ్ తోకల మంగ, ఉప సర్పంచ్ బోయపాటి మంగాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి వెంకట సుబ్బారావు, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ సురేంద్ర రెడ్డి, టిడిపి మండల ప్రచార కార్యదర్శి చిల్లి నాగేశ్వరరావు, గన్ని శ్రీను, కంచుమర్తి బాబురావు,కూటమి పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### 74 నిరుపేద కుటుంబాలకు

## 35.56 లక్షలు ముఖ్యమంత్రి

# సహాయ నిధి చెక్కులు పంపిణీ




**ఏలూరు/నూజివీడు, నవంబరు 27 (మనసులో మాట)..** నూజివీడు మండలం నూజివీడు యంపిడివో కార్యాలయ ఆవరణలో గురువారం నూజివీడు నియోజక వర్గంలో 74 మందికి గాను సుమారు రూ 35.56 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ అత్యవసర సమయంలో నిరుపేదలు ప్రవేటు వైద్యం చేసుకున్నను ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడు డబ్బులు లేక వైద్యానికి దూరం కాకూడదని ప్రభుత్వం వేలాది కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. రాష్ట్ర పేద ప్రజలు పూర్తి ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వానిది అన్నారు. గత ప్రభుత్వం వైద్యాన్ని తుంగలో తొక్కిందని ఒక్కరికి కూడా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం అందించలేదని అన్నారు. గతంలో వైద్యం చేయించుకున్న వారు వైద్యబిల్లులను మా కార్యాలయంలో అందజేస్తే ముఖ్యమంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సహాయం వెంటనే అందజేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య పరికరాలు, నిపుణులైన సిబ్బంది, అందుబాటులో ఉన్నారని ప్రజలంతా మెరుగైన వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రాష్ట్ర మంత్రి పార్థసారథికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆపదలో ఉన్న మా కుటుంబాన్ని దేవుడిలా ఆదుకొన్నారని మంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామని, తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు, కుటుంబ సభ్యులు తమ హర్షాన్ని కృతజ్ఞతలు తెలియజేసారు.

# సమగ్ర శాస్త్రీయ కుల గణన నిర్వహించాలి




**యానాం (మనసులో మాట), నవంబరు 27:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో సమగ్ర శాస్త్రీయ కులగణన నిర్వహించి జనాభా దామాషా ప్రకారం తమిళనాడు రాష్ట్రంలో అమలు చేస్తున్నటువంటి 69% రిజర్వేషన్లు మాదిరిగా ఆంధ్రప్రదేశ్లో కూడా స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆంధ్రప్రదేశ్ బిసి ఫెడరేషన్ ఆధ్వర్యంలో యానాం గీతా మందిరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ ప్రతినిధుల సమావేశం మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా జస్టిస్ ఈశ్వరయ్య, డా. విశారథన్ మహారాజు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, మాజీ శాసన మండల డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయాలని ఎటువంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా 9వ షెడ్యూల్ లో చేర్చాలని, ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు అమలులో జరుగుతున్న లోపాలను సరిదిద్ది బీసీ ఎస్సీ ఎస్టీలకు లకు కూడా ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని అమలు సాధనకు జాతీయస్థాయిలో ఉద్యమ నిర్మాణం చేపడతామని, త్వరలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల ముఖ్యమంత్రులను గవర్నర్లను కలిసి అనంతరం కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఈ డిమాండ్లు నెరవేరేవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిసి ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ పప్పు దుర్గా రమేష్, ప్రెసింగి ఆదినారాయణ, గూడూరి వెంకటేశ్వరరావు ,బిసి రమణ, కర్రి చిట్టిబాబు, ఘంటసాల వెంకటలక్ష్మి,కడలి ఈశ్వరి, చొల్లంగి వేణుగోపాల్,మన్నే నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

రాయలసీమ

కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప

శుక్రవారం 28 నవంబర్ 2025



# రైతన్న సేవలో...



**పలమనేరు నవంబర్ 27 (మనసులో మాట):** బైరెడ్డిపల్లి మండలంలోని వెంగంవారి పల్లె పంచాయతీ కేంద్రంలో గురువారం రైతన్న సేవలో కార్యక్రమంలో పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవ సొమ్ము రైతులకు చేరిందా అనే విషయాన్ని వారిని అడిగి తెలుసుకున్నారు. మరోవైపు ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వం రైతులకు చేసిన మేలు గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఆయన రైతులకు వివరించారు. అనంతరం రైతన్నలకు కరపత్రాలను అందించడంతో పాటు ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న విత్తనాలను పలు రైతులకు ఆయన పంపిణీ చేశారు. ఇక అదే విధంగా వెంగంవారివల్లిలో జరిగిన పలు గృహప్రవేశ కార్యక్రమాలలో ఆయన నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు భువన చంద్ర గౌడ్, కస్టర్ ఇన్చార్జిలు మంజునాథ్ రెడ్డి, పైనువేల్ పిఎసిఎస్ చైర్మన్ నాగరాజు నాయుడు, వాణిజ్య విభాగపు రాష్ట్ర కార్యదర్శి పి. రఘుచంద్రగుప్త,మార్కెట్ కమిటీ డైరెక్టర్ జి.సుబ్రహ్మణ్యం, మండల యువత అధ్యక్షులు రాజేష్, సింగల్ విండో డైరెక్టర్ విశ్వనాథ్,యూనిట్ ఇన్చార్జిలు శేషు,శ్రీనివాస్ మూర్తి, సీనియర్ నాయకులు శంకరప్ప గ్రామ కమిటీ అధ్యక్షులు, రమేష్ రెడ్డి, వి ఎస్ ఎస్ చైర్మన్ ప్రకాష్, సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి,సోషల్ మీడియా కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతున్నలకు అండగా నిలుస్తోన్న

# కూటమి ప్రభుత్వం

- గత ప్రభుత్వం తప్పిదం... ఆర్థిక విధ్వంసం వల్ల ఇబ్బందుల్లో పడ్డ రాష్ట్రం
- రైతులను ఆదుకోవడం...ఏనుగుల దాడుల కట్టడికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి
- అటవీ ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలి
- పంట నష్ట పరిహార చెక్కుల పంపిణిలో ఎమ్మెల్యే అమర్



**పలమనేరు నవంబర్ 27 (మనసులో మాట) :** రైతన్నలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తోందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం పలమనేరు అటవీ రేంజ్ పరిధిలోని వీ.కోట, బైరెడ్డిపల్లి గంగవరం, పలమనేరు రూరల్ మండలాలకు చెందిన అటవీ ప్రాంత గ్రామాల రైతులకు పంట నష్ట నివారణ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 92 మంది రైతులకు 9.60 లక్షల రూపాయల చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... గత ప్రభుత్వం తప్పిదం వల్ల ఆర్థిక విధ్వంసం జరిగి రాష్ట్రం ఇబ్బందుల్లో కూరుకుపోయిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం రైతులకు సంబంధించిన అన్ని అంశాలలో ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని ఆదుకుంటున్నదన్నారు. అందులో భాగంగా ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు మూడు నెలలలోనే పరిహారపు చెక్కులను అందించడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తున్నదన్నారు తెలియజేస్తుందన్నారు. ఇక ఏనుగుల దాడులను నివారించేందుకు చేపట్టాల్సిన అన్ని రకాల చర్యలను తీసుకోవడం జరిగిందని ఆయన వివరించారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలతో పాటు అటవీ ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన హితవు పలికారు. అటవీ అధికారుల సలహాల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలని పేర్కొన్నారు. ఇలా ఉండగా పంట నష్టపరిహారం తక్షణం అందుతుండటంపై పలు రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పరిహారపు చెక్కులు పంపిణీ కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, టిడిపి నాయకులు సోమశేఖర్ గౌడ్, నాగరాజరెడ్డి,ఆర్బిసి కుట్టిలతో పాటు సబ్ డీ ఎఫ్ ఓ వేణుగోపాల్, ఎఫ్ ఆర్ ఓ నారాయణ, డిఆర్వో సలా ఉద్దీన్, ఎఫ్ ఎస్ ఓ రమేష్, సిబ్బందితో పాటు తదితరులుపాల్గొన్నారు.



మెడికల్ కళాశాలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

# సంతకాల సేకరణ

పలమనేరు నవంబర్ 27 ( మనసులో మాట):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మెడికల్ కళాశాలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పలమనేరులో వైఎస్సార్సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్స్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు కె. నాగభూషణం మాట్లాడుతూ... ప్రభుత్వం పి.పి.పి. విధానం పై తప్పక పునరాలోచన చేసి ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు, మేధావులు, విద్యార్థులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు.పార్టీ కోటి సంతకాలకు పిలుపునిస్తే అంతకు రెట్టింపుగా సంతకాల కార్యక్రమాలకు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సోమచంద్రా రెడ్డి ఉద్యోగస్తులు పెన్షనర్లు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్బి రాష్ట్ర మహాసభలు

# జయప్రదం చేయండి..

### జిల్లా ప్రధాన కార్యదర్శి పోతులయ్య



ధర్మవరం నవంబర్ 27 (మనసులో మాట) డిసెంబర్ 10, 11వ తేదీలలో అనంతపురం నగరంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్బి రాష్ట్ర మహాసభలు నిర్వహించడం జరుగుతుందని ఏఐఎస్బి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతులయ్య రాష్ట్ర నాయకులు జగదీష్ ,పట్టణ నాయకులు మురళి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసులు చేతుల మీదుగా కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం పోతలయ్య మాట్లాడుతూ ఈ రాష్ట్ర మహాసభలో పూర్తిస్థాయిలో ఫీజు రియబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్ల విద్యార్థులకు కాస్మోటిక్ మిస్ చార్జీలు పెంచాలని, జీవో నెంబర్ 77ను రద్దుచేసి ఉన్నత విద్యను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఏఐఎస్బి అనేది సోషలిజం శాంతి అభ్యుదయం లక్ష్యాలతో వేయి 1951 జూన్ 25న నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఏర్పాటుచేసిన ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై ఏఐఎస్బి పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. కావున విద్యార్థులందరూ కూడా అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని తెలిపారు.

# 26 వార్డుల్లో కూడా వైసీపీని గెలిపించుకుంటాం?



పలమనేరు నవంబర్ 27( మనసులో మాట): వైయస్ఆర్సీపీ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ చాముండేశ్వరి, కౌన్సిలర్ మండి సుధా, టౌన్ కన్వీనర్ హేమంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పలమనేరు లో తిరిగి 26 వార్డుల్లో కూడా వైసిపి వాళ్లను గెలిపించుకొని తిరిగి జండా ఎగురువేస్తామని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ చాముండేశ్వరి, కౌన్సిలర్ మండి సుధా మాట్లాడుతూ... ఆరోగ్యం సరిగా లేకపోవడంతో సమావేశానికి రాలేకపోయామని తెలిపారు. దేవుడు మీకు అవకాశాన్ని ఇచ్చాడు కాబట్టి అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం కౌన్సిలర్ మురళీకృష్ణ మాట్లాడుతూ... మదనపల్లి రోడ్ లో మద్యం ఏరులై పారుతుంది అన్నారు. లాటరీ టికెట్లు జరుగుతుందన్నారు. వైసీపీలో అభివృద్ధి జరిగిందా? కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి జరిగిందా? మేము చర్చలకు సిద్ధమని తెలిపారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. ఈ కార్యక్రమంలో హేమంత్ కుమార్ రెడ్డి, మండిసుధ, మురళీకృష్ణ, శ్యాంసుందర్ రాజ్, ఎస్ కె ఎస్ జాఫర్, కోదండ రామయ్య, రవి, క్యూడీఎస్ రాజేష్, రహీమ్ ఖాన్, నరేష్, నాగరాజ్, హేమంత్, రమేష్ రెడ్డి, షబ్బీర్, హైదర్, శ్యామ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం విద్యార్థులకు సత్య కుమార్ యాదవ్

# 'వేతన సేవ'

### పదవ తరగతి విద్యార్థుల పరీక్షా ఫీజులన్నీ స్వయంగా భరిస్తున్న మంత్రి సత్య కుమార్ యాదవ్

**ధర్మవరం నవంబర్ 27 (మనసులో మాట)...** నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా, వారి కుటుంబాలపై ఆర్థికభారం పడకుండా చేయాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్యమైన ప్రజాహిత నిర్ణయం తీసుకున్నారు. నియోజకవర్గంలోని మొత్తం 1800 మంది 10వ తరగతి విద్యార్థుల SSC పబ్లిక్ పరీక్షా ఫీజును పూర్తిగా తన వ్యక్తిగత నెలజీతం నుంచే భరించనున్నట్టు మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రకటించారు. మొత్తం రూ. 2,34,000ను విద్యార్థుల పరీక్షా ఫీజుల కోసం సమర్పిస్తూ, విద్యా ప్రోత్సాహానికి ఆయన ఎంత ప్రాధాన్యం ఇస్తారో మరోసారి ప్రజలకు స్పష్టంచేశారు.

ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, ఐ.ఏ.ఎస్. కి అధికారిక లేఖను పంపారు. ధర్మవరం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థుల వివరాలు, పరీక్షా ఫీజులను జమ చేయాల్సిన ప్రభుత్వ బ్యాంకు ఖాతా సమాచారం, అలాగే తుది ధృవీకరించిన పరీక్షా ఫీజు మొత్తాన్ని వెంటనే అందించాలని లేఖలో కోరుతూ, ఎలాంటి ఆలస్యం లేకుండా విద్యార్థులకు ఈ ఆర్థిక సహాయం చేరేలా చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు.

మంత్రి ఈ నిర్ణయం పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఉపశమనం కలిగించనుంది. చదువులో ఉన్నత లక్ష్యాలు సాధించాలనే విద్యార్థుల ఆశయాలకు ఇది మరింత బలాన్నిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి భవిష్యత్తు నిర్మాణానికి అండగా నిలబడాలనే తపనతో సత్య కుమార్ యాదవ్ తీసుకున్న ఈ చర్య, ధర్మవరం నియోజకవర్గంలోని విద్యాభివృద్ధి, సామాజిక సేవ, ప్రజాసంక్షేమ లక్ష్యాలకు మరో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది.

# ప్రాజెక్టు లక్ష్యం అనేది ఒక మంచి వేదిక

### - ఎంపీడీవో సాయి మనోహర్




**ధర్మవరం నవంబర్ 27 (మనసులో మాట,)** ప్రాజెక్ట్ లక్ష్యము అనేది ఒక మంచి ప్లాట్ఫారం అని ఎంపీడీవో సాయి మనోహర్, ఎం ఈ ఓ లు రాజేశ్వరి దేవి గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో యంగ్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీవో సాయి మనోహర్, ఎం ఈ ఓ లు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి నుంచి స్కిల్స్ డెవలప్ చేసుకొనుటకు దానికి ఉపయోగపడుతుందని తెలియజేశారూ. ప్రాజెక్ట్ లక్ష కింద చేస్తున్నటువంటి ఈ కార్యక్రమం విద్యార్థుల నాయకత్వ లక్షణాలను కమ్యూనికేషన్ స్కిల్ ని ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని తెలిపారు. తెలియజేశారు. పలు అంశాల పైన యంగ్ పార్లమెంటేరియన్ విద్యార్థులు చర్చించడం జరిగింది అని తెలిపారు. 21వ శతాబ్ద భారతదేశం యొక్క పాత్ర,, ప్లాస్టిక్ పొల్యూషన్,.సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్, ప్రాథమిక హక్కులు ప్రాథమిక విధులు గురించి, లింగ భేద సమానత్వం మొదలగు అంశాలపై విద్యార్థులందరూ చర్చించడం జరిగింది అని తెలిపారు.ప్లాస్టిక్ పొల్యూషన్ పైన, ఎం జె పిపాఠశాల విద్యార్థు లు చక్కగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల నష్టాలు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు ప్రజల్లో తీసుకురావాల్సిన చైతన్యము గురించి చక్కగా మాట్లాడడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదటి బహుమతి ఎం జె పి రేగాటి పల్లి విద్యార్థులు రెండవ బహుమతి, కేజీబీవీ మోటుమర్ల విద్యార్థులు మూడో బహుమతి, చిగిచెర్ల విద్యార్థులు గెలుచుకోవడం జరిగింది అని తెలిపారు. వీరందరికీ ఎంపీడీవో, ఎంఈఓ లు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడి.నబి రసూల్ ,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉత్సాహవంతులైన విలేకరులకు, నిరుద్యోగులకు.. కంచర్ల మీడియా గ్రూప్ అభయం

KANCHARLA MEDIA GROUP
BEYOND MEDIA, INTO HEARTS

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మరియు డిజిటల్ మీడియాలో సరికొత్త సంచలనం

"కంచర్ల మీడియా"

అద్భుత ఉద్యోగ అవకాశం

సంబంధిత ఉద్యోగాలు

మార్కెటింగ్ టీమ్ లీడర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్,
జిల్లా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, స్ట్రింగర్స్/ రూరల్ రిపోర్టర్స్,
సర్క్యులేషన్ ఇంచార్జ్‌లు, డిటిపి ఆపరేటర్స్,
సబ్ ఎడిటర్స్, డెస్క్ ఇంచార్జ్‌లు, యాడ్ డిజైనర్స్,
కంటెంట్ రైటర్స్, యాంకర్స్,/ న్యూస్ ప్రెజెంటర్స్,
ప్రోగ్రామ్ మేనేజర్లు, వీడియో ఎడిటర్స్, వీడియో గ్రాఫర్స్,
అకౌంటెంట్, రిసెప్షనిస్ట్, ఆఫీస్ బాయ్స్

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు, ఆ జిల్లాలలోని మండలాలకు టీమ్ లీడర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్/ ప్రమోటర్స్ మరియు రిపోర్టర్స్ అత్యవసరంగా కావలెను.

అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత
కొత్తవారికి అవకాశం
స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వబడును.

జీతం రూ.10,000/- నుండి రూ.40,000/- లు వరకు

కంచర్ల మీడియా గ్రూపులో అవకాశం... మీ భవిష్యత్తుకు భరోసా..

నేరుగా సంప్రదించండి
విశాఖపట్నం : 81257 15809
విజయవాడ : 77805 44489

వేదిక & ఇంటర్వ్యూ తేదీ :

కంచర్ల మీడియా గ్రూప్ | విశాఖపట్నం - విజయవాడ - తిరుపతి - హైదరాబాద్
0891 - 4540746
Email 1 :admin@kancharlatv.com, Email 2 :marketing.kancharlamedia@gmail.com, Email 3 :kancharlavijayawada@gmail.com

K TV NEWS | YUPKAR TV | మనసులో మాట | SSLS creations | K OTT | K MEDIA

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
శుక్రవారం 28 నవంబర్ 2025



# కేసీఆర్ ఓఎస్డీని విచారించిన సిట్

- ఫోన్ ట్యాపింగ్ కేసుపై విచారణ ∎ 2 గంటల పాటు కొనసాగిన విచారణ

**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు మళ్లీ వేగం పుంజుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత సహాయకుడిగా (ఓఎస్డీ) పనిచేసిన రాజశేఖర్ రెడ్డిని ప్రశ్నించింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ విచారణలో అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నూతన పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన రాజశేఖర్ రెడ్డిని సిట్ విచారణకు పిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. ఈ కేసులో ఇప్పటికే పలువురు పోలీసు అధికారులను సస్పెండ్ చేయగా, కీలక నిందితుడిగా ఉన్న మాజీ అధికారి రాధాకిషన్ రావును అరెస్టు చేశారు. 'బీఆర్ఎస్ సుప్రీం' ఆదేశాల మేరకే తాము పనిచేశామని రాధాకిషన్ రావు తన రిమాండ్ రిపోర్టులో పేర్కొనడం సంచలనం రేపింది. ఈ క్రమంలోనే కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన రాజశేఖర్



రెడ్డిని విచారించడం ద్వారా మరిన్ని వివరాలు రాబట్టాలని సిట్ భావిస్తోంది. రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన సమాచారం ఆధారంగా ఈ కేసులో మరికొందరు కీలక వ్యక్తులను కూడా సిట్ విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ దర్యాప్తు ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు దారితీస్తాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# కుంభకోణానికి ఆస్కారమే లేదు

- ఇండస్ట్రియల్ పాలసీపై దుష్ప్రచారం
- పొల్యూషన్ ఫ్రీగా చేయడమే లక్ష్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

ఇండస్ట్రియల్ పాలసీ పై కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని పొల్యూషన్ ఫ్రీగా చేయడమే తమ ప్రభుత్వ పాలసీ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ పాలసీలో కుంభకోణానికి ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం తెచ్చింది పారదర్శకమైన పాలసీ అని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు . బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తాము తెచ్చిన ఇండస్ట్రియల్ పాలసీ అర్థం కాలేదని తెలిపారు. ప్రతిపక్షాల నేతలు కావాలనే తమ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ఇండస్ట్రీలను ఓఆర్ఆర్ బయటకు పంపాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. ఈ పాలసీ తమ ప్రభుత్వం కొత్తగా తెచ్చినది కాదని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా ఈ పాలసీపై చర్చ జరిగిందని గుర్తుచేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదని... పాలసీ మార్చేది లేదని చెప్పుకొచ్చారు. ఇండస్ట్రియల్ పాలసీ రూపకల్పనలో తాను భాగమై ఉన్నానని వివరించారు. కొత్త ఇండస్ట్రియల్ పాలసీతో తెలంగాణ రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా ప్రతిపక్షాల నేతలకు వ్యతిరేకించాలనే ఉద్దేశ్యం తప్పా ఏం లేదని విమర్శించారు. అయితే, నల్గొండ డీసీసీ నియామకంపై స్పందించడానికి నిరాకరించారు. పార్టీ ఇంటర్నల్ విషయాలను బయట మాట్లాడనని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తమ ప్రభుత్వంలో విద్యుత్ శాఖలో ఎలాంటి కుంభకోణం జరగలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇండియా బుల్ అనే కంపెనీ దగ్గర ఉపయోగంలో లేని ఎక్విప్‌మెంట్ ఎందుకు కొన్నదని ప్రశ్నించారు. భద్రాద్రి ప్రాజెక్టులో అవుట్ డేటెడ్ టెక్నాలజీ వాడాల్సిన అవసరం ఏముంది..? అని నిలదీశారు. భద్రాద్రి ప్రాజెక్టు అనవసరంగా తెలంగాణ ప్రజలపై రుద్దిన ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు చేశారు.

# సిగాచీ ఘటన చిన్నదా?

54 మంది చనిపోయిన ఘటన చిన్నదేమీ కాదు

పోలీసులపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

డిసెంబర్ 9కి వాయిదా వేసిన ధర్మాసనం



**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

సిగాచీ ఫార్మా పరిశ్రమలో 54 మంది కార్మికుల ప్రాణాలను బలిగొన్న పేలుడు ఘటనలో పోలీసు దర్యాప్తు తీరును తెలంగాణ హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఇంత పెద్ద దుర్ఘటన జరిగి నెలలు గడుస్తున్నా దర్యాప్తు పూర్తి కాకపోవడంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది సాధారణ ప్రమాదం కాదని, ఇంతటి ఘోరంపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని చెప్పడం దారుణమని వ్యాఖ్యానించింది. ఈ ఘటనపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పోలీసుల వైఖరిపై ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. "ఇప్పటికే 237 మంది సాక్షులను విచారించినా పురోగతి ఏది? పేలుడుకు బాధ్యులైన వారిని ఇప్పటివరకు ఎందుకు గుర్తించలేదు?" అని నిలదీసింది. ఇంతటి తీవ్రమైన ఘటనకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయకపోగా, కేవలం డీఎస్పీ స్థాయి అధికారితో దర్యాప్తు చేయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తు పురోగతిపై పూర్తిస్థాయి నివేదికను వెంటనే సమర్పించాలని అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణకు దర్యాప్తు అధికారి తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేసింది. దర్యాప్తులో పారదర్శకత లోపించరాదని, వేగంగా పూర్తి చేసి బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలని సూచించింది. అనంతరం, తదుపరి విచారణను డిసెంబర్ 9కి వాయిదా వేసింది.



# రాష్ట్ర అభివృద్ధి ప్రతిబింబించేలా..

## తెలంగాణ రైజింగ్-2047 పాలసీ

- ఆర్థికాభివృద్ధిని 3 రీజియన్లుగా విభజించాలి
- భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేయాలి
- గ్లోబల్ సమ్మిట్‌పై సీఎం రేవంత్ సమీక్ష
- పాలసీ డాక్యుమెంట్‌పై భేటీలో చర్చ



**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దేందుకు స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీ డాక్యుమెంట్‌లో కనిపించాలన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని 3 రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలన్నారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకాన మీ, పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా విభజించుకోవాలని సూచించారు. ఈ మూడు రీజియన్లలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి చేయాలో డాక్యుమెంట్‌లో పొందుపరచాలన్నారు. వాస్తవిక దృక్పథం కనిపించేలా డిజైన్లు ఉండేలా జాగ్ర తలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌పై రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, యువతకు మెరుగైన ఉపాధి లక్ష్యంగా అందరికీ సమాన అవకాశాలు, సమీకృత అభివృద్ధే లక్ష్యంగా రానున్న 22 ఏళ్లకు భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం చెప్పారు. వైద్యం, విద్య, టెక్నాలజీ, జీసీసీలు, ఫార్మా, అగ్రికల్చర్‌తో పాటు వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు (ఏఐ), స్టార్టప్, ఎంఎస్ఎంఈలు, టూరిజం, ఎగుమతులు వంటి రంగాలు రానున్న రెండు దశాబ్దాల్లో ఆర్థిక వృద్ధికి కీలక రంగాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, సులభతర అనుమతులు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు రాష్ట్రాన్ని పెట్టుబడిదారుల మొదటి గమ్యస్థానంగా నిలబెట్టనున్నాయన్నారు. ఈ బలాలే పునాదిగా మరింత పెట్టుబడులను ఆకర్షించే విధంగా విజన్ డాక్యుమెంట్ ఉండాలని సీఎం సూచించారు. మూసీ పునరుజ్జీవం, హైదరాబాద్‌లో 2,959 చెరువులు, పార్కులు, అటవీ ప్రాంతాలను వాటి పూర్వ స్థితికి తీసుకురావడంతో పాటు.. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన రోడ్లు, సౌర విద్యుత్ వెలుగులతో విలేజ్ 2.0 లక్ష్యంతో పనిచేసేలా ప్రణాళిక చేసినట్లు అధికారులు వివరించారు. రీజినల్ రింగ్ రోడ్డు, హై-స్పీడ్ మొబిలిటీ కారిడార్లు, రీజినల్ రింగ్ రైల్, నాలుగు ఇండస్ట్రియల్ కారిడార్లు, 11 రేడియల్ రోడ్లు, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, పెద్దపల్లి, కొత్తగూడెంలలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటును డాక్యుమెంట్‌లో వివరించనున్నట్లు తెలిపారు.

# నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తాం

- బతుకమ్మకుంట కేసులో కోర్టుకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం
- హైడ్రా చీఫ్‌రంగనాథ్‌కు హైకోర్టు హెచ్చరిక
- డిసెంబర్ 5లోపు కోర్టు ఎదుట హాజరుకు ఆదేశం




**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంట వివాదంలో డిసెంబర్ 5వ తేదీ లోపు కోర్టు ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని ఏవీ రంగనాథ్‌ను ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తామని హైకోర్టు హెచ్చరించింది. బతుకమ్మకుంట వ్యవహారంలో హైకోర్టుకు ఏవీ రంగనాథ్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఆయనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంటలోని ప్రైవేట్ స్థలంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి మార్పులు చేర్పులు చేయవద్దంటూ ఈ ఏడాది జూన్12వ తేదీన కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘిం చారంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి చర్యలు తీసుకో వద్దంటూ ఆయన సూచించింది. అంతేకాకుండా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ రంగనాథ్‌ను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. కానీ కోర్టుకు హైడ్రా కమిషనర్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే ఇప్పటికే ఇక్కడ సుందరీకరణ పనులు సాగాయి. పూర్వవైభవం తీసుకుని వచ్చారు. ఇటీవల సిఎం రేవంత్ తదితరులు కలిసి ప్రారంభించారు.

# నల్లచెరువులో ఆక్రమణలను మేం తొలగించలేదు

తొలగింపులపై క్లారిటీ ఇచ్చిన హైడ్రా

**హైదరాబాద్, నవంబర్ 27:** కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద బుధవారం తాము ఎలాంటి ఆక్రమణలను తొలగించలేదని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హైడ్రా) స్పష్టం చేసింది. చెరువు భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, పేదల గుడిసెలంటూ తప్పుడు ప్రచారం చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించింది. హైడ్రా అధికారుల కథనం ప్రకారం... చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి వచ్చే సర్వే నంబర్ 176లో చెత్త సేకరించేవారు, స్క్రాప్ వ్యాపారులు తాత్కాలిక షెడ్లు వేసుకున్నారు. చెరువు ప్రాంతాన్ని ఖాళీ చేయాలని వారిని కోరగా, రెండు మూడు రోజుల క్రితమే వారు స్వచ్ఛందంగా తమ షెడ్లను తొలగించుకుని వెళ్లిపోయారు. అయితే, ఈ స్థలాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్న కొందరు కబ్జాదారులు.. సర్వే నంబర్ 180 పేరుతో ఇప్పుడు కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చారు. గతంలో ఇక్కడ ఉన్నవారి నుంచి అద్దెలు వసూలు చేసిన వారే, ఇప్పుడు వారిని అడ్డం పెట్టుకుని భూమిని కొట్టేయాలని చూస్తున్నారని హైడ్రా ఆరోపించింది. ఈ వ్యవహారంపై కొందరు హైకోర్టును కూడా ఆశ్రయించి, సర్వే నంబర్ 180 కింద తమకు నష్టపరిహారం కావాలని కోరారు. అయితే, తాము ఖాళీ చేయిస్తున్నది సర్వే నంబర్ 176 అని, చెరువులో చెత్త వేయడం వల్ల నీరు కలుషితమవుతోందని హైడ్రా కోర్టుకు వివరించింది. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. సర్వే నంబర్లను సరిచూసి, నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని సూచించినట్లు అధికారులు తెలిపారు. అసలైన నివాసితులు వెళ్లిపోయిన తర్వాత, కబ్జాదారులు చేస్తున్న చివరి ప్రయత్నమే ఈ గందరగోళమని హైడ్రా స్పష్టం చేసింది.

TUWJ
Telangana State
Union of Working Journalists

# 3న జర్నలిస్టుల మహా ధర్నా

**హైదరాబాద్, నవంబర్ 27:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నదని టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ గురువారం ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ప్రతినిధి బృందాలు గత రెండేళ్ల కాలంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని అనేక దఫాలు కలిసి జర్నలిస్టుల సమస్యలపై, సంక్షేమంపైన విజ్ఞాపన పత్రాలు సమర్పించిన, కలిసిన ప్రతిసారీ మంత్రి స్పష్టమైన హామీలు ఇచ్చినప్పటికీ అవి కార్యరూపం దాల్చకపోవడం విచారకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరి పట్ల మాసాబ్ ట్యాంక్, హైద్రాబాద్ లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద డిసెంబర్ 3న ఉదయం 10 గంటలకు మహా ధర్నా నిర్వహించాలని టియుడబ్ల్యూజే నిర్ణయించడం జరిగిందన్నారు. అక్రెడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్యతరగతి పత్రికలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ ఆందోళన కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి జర్నలిస్టులు పాల్గొనాలని కోరారు.

# బీఆర్ఎస్, బీజేపీ బీసీ ద్రోహులు

## మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,నవంబర్27:** బీసీ రిజర్వేషన్ అంశంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీసీల కోసం పోరాడేది తాము మాత్రమేనని, ఇతర పార్టీలు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం మొసలి కన్నీళ్లు కారు-స్తున్నాయని తీవ్ర విమర్శలు చేశారు.. బీఆర్ఎస్, బీజేపీ. బలహీనవర్గాల ద్రోహులు అని మండిపడ్డారు.. గతంలో ఇతర రాష్ట్రాల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ, ఈ పరిమితిని అధిగమించేందుకు ప్రభుత్వం సేకరించిన డాటా, నివేదికలు ఆధారంగా కోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు. అసలు బిసి కోటాపై కోర్టులో ఇంప్లీడ్ ఎందుకు కాలేదు? అని పొన్నం ప్రశ్నించారు.. సిగ్గులేకుండా బయట విమర్శలు చేసే బీఆర్ఎస్ నాయకులు కోర్టులో మాత్రం లేరు అని మంత్రి ఆరోపించారు. కోర్టులో రిజర్వేషన్ నిలిపేస్తే బీఆర్ఎస్ నేతలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. అటు.. బీసీ రిజర్వేషన్ల అమలులో అడ్డంకులు తొలగించేందుకు కేంద్రం సహకరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్న నిధులు ఇప్పించేందుకు బీజేపీ నేతలు ప్రయత్నం చేయడం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు 42? రిజర్వేషన్లతోనే జరపాలన్న ఆలోచన ఉందని తెలిపారు పొన్నం.. ఇక బీసీ సర్వేలో పాల్గొనని పార్టీలకు మాట్లాడే నైతిక హక్కు లేదని పొన్నం తీవ్రంగా హెచ్చరించారు. కేంద్రంలో మా ప్రభుత్వం ఉంటే గంటల్లో బీసీ రిజర్వేషన్ అమలు అయ్యేదన్న ఆయన.. మేము కోర్టులో చేస్తున్న పని మీకూ తెలుసు. తెలిసీ మాపై ఆరోపణలు చేయొద్దు. సలహాలు ఇవ్వండి.. తీసుకుంటాం.. కానీ, రాజకీయ పార్టీల ఒత్తిడికి లోనవ్వొద్దు అని సచించారు.. బీజేపీ?బీఆర్ఎస్ బీసీ ద్రోహులు అని మండిపడ్డారు పొన్నం.. బలహీన వర్గాల పట్ల బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అన్యాయం చేశాయని తీవ్రంగా మండిపడ్డారు. రాజ్యాంగం ఏం చెబుతుందో తెలియకపోతే తెలుసుకోవాలి. గిరిజన ప్రాంతాల్లో వారికి హక్కుగా రిజర్వేషన్ ఇవ్వాలి.. బీసీ సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదం అని వ్యాఖ్యానించారు.

# రాష్ట్రంలో రేవంత్ రెడ్డి రాక్షస పాలన


## చట్టాలను బేఖాతరు చేస్తున్న కాంగ్రెస్ నేతలు.. ■ ఆర్ఎస్ ప్రవీణ్



**హైదరాబాద్,నవంబర్ 27 :** రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రాక్షస పాలన కొనసాగుతుందని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ చట్టంలోని నిబంధనలను బేఖాతరు చేసి కాంగ్రెస్ నేతలు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొనసాగేది ప్రజా పాలన కాదని.. ప్రజా ప్రతీకార పాలన.. పోలీసు రాజ్యమని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి అనుచరులు మంత్రి సురేఖ ఓఎస్డీ సుమంత్ తో కలిసి దక్కన్ సిమెంట్ యజమానులను గన్నుతో బెదిరిస్తే వారిని కాపాడేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీపీకి లేఖ రాయగా రాత్రికి రాత్రే మంత్రి ఉత్తమ్, సీఎం రేవంత్‌లు టాస్క్‌ఫోర్స్ పోలీసులను మంత్రి సురేఖ ఇంటికి పంపించిన విషయం వాస్తవం కాదా ఆయన ప్రశ్నించారు. అయినప్పటికీ సుమంత్‌ని అరెస్ట్ చేయలేదన్నారు. అలాంటప్పుడు చేయని నేరానికి అకారణంగా ఐదు రోజులు కర్ల రాజేశ్ పోలీసుల రిమాండ్‌లో ఉంటే ఈ నియోజకవర్గానికి బాధ్యత వహించే మంత్రి ఉత్తమ్ ఎందుకు లేఖ రాయలేదని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ పేరు చెప్పాలని రాజేశ్‌ను పోలీసులు చిత్రహింసలు పెట్టారని అందువల్లే ఆయన మృతి చెందారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎత్తిపోతల పథకానికి రూ.5 కోట్ల ప్రాజెక్టును రాత్రికి రాత్రే రూ.50 కోట్లకు పెంచడం అవినీతి కాక మరేమిటన్నారు. ఏమాత్రం ప్రణాళిక లేకుండా కొడంగల్ నారాయణపేట ప్రాజెక్ట్‌కు రూ.4 వేల కోట్లు కేటాయించారని ఈ అంశంలో సీఎం రేవంత్ రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. రాజేశ్‌కు నేర చరిత్ర లేదని అతనొక్కడే కుటుంబానికి ఆధారమని, త్వరలో ఇల్లు నిర్మాణం చేయిస్తానని తెలిపారు. తన కుమారుడి ఆరోగ్యం బాగాలేదని రాజేశ్ తల్లి ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్తానని పోలీసుల ఎదుట నెత్తి నోరు బాదుకున్నప్పటికీ పోలీసులు వినలేదని, నాణ్యమైన వైద్యం అందించకుండా చంపారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆయనను అప్రూవర్‌గా తీసుకుని కేసును విచారించాల్సింది పోయి ఏకంగా చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చేవెళ్ల సాక్షిగా దళితులను బాగా చూసుకుంటామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో వాగ్దానం చేయించి ఈరోజు ప్రాణాలు తీస్తున్నారన్నారు. బడుగు వర్గాల అధికారులపై ఏసీబీ అధికారులు అక్రమ కేసులు బనాయిస్తుంటే మంత్రులు ఏం చేస్తున్నారని దుయ్యబట్టారు.

# రాజకీయాల్లో గెలుపోటములు సహజం

- మళ్లీ గెలుస్తాం.. కేసీఆర్‌ను సీఎంను చేస్తాం
- అసలు యుద్ధం 2028లో ఉంటుంది
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్




**హైదరాబాద్, నవంబర్ 27:** రాజకీయాల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ గెలుస్తాం.. అధికారంలోకి వస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ఏపిలో కల్వకుర్తిలో ఎన్టీఆర్ కూడా ఓడిపోయారని ఆయన గుర్తుచేశారు. అసలు యుద్ధం 2028లో ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల సమక్షంలో బయట పెడుదామని పిలుపునిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు జరిగాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బానిసత్వం లేని ఒకే ఒక్క పార్టీ గులాబీ పార్టీ అని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8 లక్షల ఎకరాలకు కేసీఆర్ సాగునీరు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లి 660 మీటర్ల ఎత్తు ఉంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులను కేసీఆర్ చేపట్టారని అన్నారు. గొలుసుకట్టు రిజర్వాయర్లను 90 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. ఒక పంపును కూడా కేసీఆర్ ప్రారంభించారని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం తప్ప రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. కరెంట్ కష్టాలతో ఎంతమంది చనిపోయారో మీకంతా తెలుసని కేటీఆర్ గుర్తుచేశారు. వైఎస్ హయాంలో ఉచిత కరెంట్ ఇచ్చినా.. ఆరు గంటలే ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో దొంగలు కొట్టే సమయంలో కరెంటు ఇచ్చేవారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు రాలేదని రేవంత్ రెడ్డే చెప్పాడని అన్నారు. కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ, సాగునీరు తెచ్చుకున్నామని తెలిపారు. రైతుకు పెట్టుబడి రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. మన పార్టీ నాయకుల అనైక్యతతోనే ఓడిపోయామని కేటీఆర్ అన్నారు. మనం చేసిన పనులు సరిగ్గా చెప్పుకోలేదని తెలిపారు. సోషల్‌మీడియాలో చెప్పిన అబద్ధాలను ప్రజలు నమ్మారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93వేల కోట్ల ఖర్చు అయ్యిందని.. కానీ రాహుల్ గాంధీ వచ్చి రూ.లక్ష కోట్ల కుంభకోణం అంటే ప్రజలు నమ్మారని అన్నారు. ప్రజలు ఆరు గ్యారంటీల గారడిలో పడి మోసపోయారని తెలిపారు. కల్వకుర్తిలో ఆస్పత్రి లేదని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మాట్లాడుతున్నాడని.. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ బాధ్యుడా అని నిలదీశారు. 420 హామీలను కాంగ్రెస్ నాయకులు తుంగలో తొక్కారని కేటీఆర్ విమర్శించారు. ఇప్పుడు ఏం చేశావని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తే ఫ్రీ బస్సు అంటున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ అంటూ పురుషులకు డబుల్ రేట్లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టేసరికి కేసీఆర్ గుర్తుకొచ్చిందు అని కేటీఆర్ అన్నారు. ఏ ఊళ్లో అయినా పది మంది గుమిగూడితే.. తొందరగా కేసీఆర్‌ను తెచ్చుకోవాలని అనుకుంటున్నారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వ్యాఖ్యానించారు.

# అబద్ధాలకు అంబాసిడర్ కేటీఆర్

- ■ అసత్య ప్రచారాలతో ప్రజలు ఏమార్చే రకం
- ■ బీసీ రిజర్వేషన్ల వ్యాఖ్యలు సత్యదూరం
- ■ కేటీఆర్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన సీతక్క



**హైదరాబాద్, నవంబర్ 27:** స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 17 శాతానికి తగ్గించిందన్న బీఆర్ఎస్ నేత కేటీఆర్ వ్యాఖ్యలను మంత్రి సీతక్క తిప్పికొట్టారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను ఏమార్చలేరని గట్టిగా జవాబు ఇచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అబద్దాలకు అంబాసిడర్‌గా మారి కేటీఆర్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బీసీలు విశ్వసించరని తెలిపారు. కేటీఆర్ ప్రచారం చేస్తున్నట్లుగా బీసీల రిజర్వేషన్‌లు ఎక్కడా తగ్గలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించి గొంతు కోసిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందని.. కానీ 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించిందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లను తగ్గించి తడిబట్టతో బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్ అంటూ విరుచుకుపడ్డారు. ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. గత స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు చేశారని.. కానీ ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందన్నారు. సర్పంచుల రిజర్వేషన్ల ఖరారుకు రాష్ట్రం యూనిట్‌గా కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. అందుకోసం ప్రత్యేకంగా డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కూడా చెప్పిందని సుప్రీం తీర్పును మంత్రి గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని సిఫార్సు మేరకు మండలం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్ల నిర్ణయం జరిగిందన్నారు. ఆయా మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభాను బట్టి సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయని తెలిపారు. అందుకే కొన్ని మండలాల్లో రిజర్వేషన్లు పెరిగినట్లుగా, మరికొన్ని మండలాల్లో తగ్గినట్లుగా పైకి కనిపిస్తున్నా, స్టేట్ యూనిట్‌గా చూస్తే ఎక్కడా రిజర్వేషన్లు తగ్గలేదని వెల్లడించారు. ఏ మండలంలో కూడా రిజర్వేషన్లు 50శాతానికి మించి ఉండరాదని సుప్రీం కోర్టు ఆదేశించిందన్నారు. రిజర్వేషన్ల ఖరారులో సుప్రీం కోర్టు తీర్పులను అమలు చేశామని వివరించారు. సుప్రీం తీర్పును అపహాస్యం చేసినట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కుల గణన చేపట్టి పక్కాగా రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని తెలిపారు. కుల గణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం, బీసీ రిజర్వేషన్లపై సన్నాయి నొక్కులు నొక్కుతోందని వ్యాఖ్యలు చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామని... అందు కోసం అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. అసెంబ్లీలో తీర్మానం చేశామని.. జంతర్ మంతర్‌లో స్వయంగా సీఎం నేతృత్వంలో ధర్నా చేపట్టామని మంత్రి అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా, కాంగ్రెస్‌ను విమర్శిస్తూ బీజేపీ బీ టీంగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ అమలు చేస్తోందన్నారు. బీసీలకు 42 శాతం సీట్లు బీఆర్ఎస్ ఇస్తుందా లేదా చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

# ప్రశాంతంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ

## పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం

## పోలీస్ అధికారులతో డిజిపి వీడియో కాన్ఫరెన్స్




**హైదరాబాద్, నవంబర్ 27:** రాష్ట్రంలో జరగబోయే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిల పోలీస్ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ మినహా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు మొదలుకొని స్టేషన్ హౌస్ ఆఫీసర్ల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని,ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేష్ ఎం భగవత్, మల్టీ జోన్ 2 అడిషనల్ డీజీపీ డీఎస్ చౌహాన్, మల్టి జోన్- 1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఏఐజీ రమణ కుమార్, లీగల్ అడ్వయిజర్ ఇ రాములు, తదితరులు పాల్గొన్నారు.

# కేవలం వారం రోజులే గడువు

- వక్ఫ్ ఆస్తుల నమోదుకు ఏఐఎంపీఎల్‌బీ అత్యవసర విజ్ఞప్తి
- డిసెంబర్ 5లోగా ఉమ్మీద్ పోర్టల్‌లో ఆస్తులు నమోదు చేయండి




**న్యూఢిల్లీ, నవంబర్ 27:** భారత ప్రభుత్వ ఉమ్మీద్ పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తులను నమోదు చేయడానికి గడువు చాలా తక్కువగా ఉందని, కేవలం ఒక వారం మాత్రమే మిగిలి ఉందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఏఐఎంపీఎల్‌బి) జనరల్ సెక్రటరీ మౌలానా ముహమ్మద్ ఫజల్ ఉర్ రహీం ముజాద్దిది భారతదేశంలోని ముస్లింలందరికీ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 5, 2025 గడువును పొడిగించడానికి బోర్డు అన్ని స్థాయిల నుండి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ఈ గడువులో ఎటువంటి మార్పు లేకపోతే, ఉమ్మీద్ పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల నమోదు చాలా తక్కువగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలోని ముస్లింలందరూ దీనిపై వెంటనే దృష్టి పెట్టడం చాలా అవసరం అని ఆయన పేర్కొన్నారు. ముస్లింలందరూ తమ ఎండోమెంట్ ఆస్తులను వీలైనంత త్వరగా ఉమీద్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, ఈ విషయంలో చు-రుకైన ఆసక్తి చూపాలని, మిగతా అన్ని పనులను వదులుకుని ఈ గొప్ప కార్యానికి పూర్తి మద్దతు ఇవ్వాలని మౌలానా ముజాద్దిది కోరారు. జిల్లా/బ్లాక్, పంచాయతీ స్థాయిలో ఈ పని క్రమం తప్పకుండా జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అప్పుడే మన పూర్వీకులు దానం చేసిన ఆస్తులను మనం రక్షించుకోగలుగుతామని, దీని ప్రాముఖ్యతను గ్రహించకపోతే పెద్ద నష్టం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ పనిని ప్రాధాన్యతా ప్రాతిపదికన పూర్తి చేయాలని, అలాగే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఎండోమెంట్ ఆస్తులను కాపాడటానికి, రక్షించడానికి మనకు ధైర్యాన్ని ఇవ్వాలని, ఈ ఆస్తిపై చెడు దృష్టి ఉన్నవారిని అడ్డుకోవాలని ప్రార్థనలు కూడా ఏర్పాటు చేయడం అవసరం అని తెలిపారు.

# అభివృద్ధిలో ఆర్ అండ్ బీ కీలక పాత్ర

- 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యానికి ఆర్అండ్బీ కీలకం
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- 'విజన్ 2047'పై సమీక్ష



**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్ర పురోగతి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ (ఎకానమీ) లక్ష్యాన్ని చేరుకోవడంలో రోడ్లు మరియు భవనాల (ఆర్అండ్బీ) శాఖ అత్యంత కీలక పాత్ర పోషించాలని ఆ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి స్పష్టం చేశారు. ఎర్రమంజిల్లోని ఆర్అండ్బీ ప్రధాన కార్యాలయంలో 'విజన్ 2047'పై ఆయన ఉన్నతాధికారులతో బుధవారం విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి వాకిటి శ్రీహరి, ఆర్డీసీ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, స్పెషల్ సిఎస్ (ముఖ్య కార్యదర్శి) వికాస్ రాజ్, ఆర్అండ్బీ ఈఎన్సీలు (ఇంజనీర్ ఇన్ చీఫ్) మోహన్ నాయక్, జయ భారతి, ఎన్హెచ్ఏఐ (భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ) రీజినల్ అధికారి శివ శంకర్, ఆర్అండ్బీ సి.ఈ.లు శ్రీనివాస్ రెడ్డి, బి.వి. రావు, లింగారెడ్డి, నర్సింగ్ రావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి గారి లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆర్అండ్బీ అధికారులు, ఇంజనీర్లపై గురుతర బాధ్యత ఉందని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే ఐదేళ్లు, పదేళ్లు, పదిహేనేళ్లు ఇలా ట్రాఫిక్ను అంచనా వేసి సమగ్రమైన కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్అండ్బీ శాఖ పరిధిలో గత రెండేళ్లలో కోటి చదరపు అడుగుల నిర్మాణాలు చేపట్టడం గర్వకారణమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

### తెలంగాణ రూపురేఖలు మార్చే ప్రాజెక్టులు

రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఎన్నో బృహత్తర ప్రాజెక్టులను చేపట్టామని మంత్రి తెలిపారు. హ్యామ్ రోడ్లు (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) తెలంగాణలో రోడ్డు అనుసంధానతను (కనెక్టివిటీ) గణనీయంగా పెంచుతాయని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు నుండి అనుసంధానం చేసే రేడియల్ రోడ్లు తెలంగాణ ముఖ చిత్రాన్నే మార్చేస్తాయని పేర్కొన్నారు. ఎక్స్ ప్రెస్ వేలు, ఎలివేటెడ్ కారిడార్లు మరియు నూతన విమానాశ్రయాలు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనున్నాయని స్పష్టం చేశారు.

### విజన్ డాక్యుమెంట్కు ఆదేశం

రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్ని కిలోమీటర్ల రోడ్లు ఉన్నాయి, అవి ఏక లేన్ (సింగిల్ లేన్), ద్వి లేన్ (డబుల్ లేన్), చతుర్ లేన్ (ఫోర్ లేన్) వంటి వివరాలతో సహా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రతి రోడ్డుకు సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 8, 9 తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్లో ఆర్అండ్బీ శాఖకు సంబంధించిన విజన్ డాక్యుమెంట్ వీడియో ప్రదర్శన తప్పనిసరిగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ విజన్ డాక్యుమెంట్లో ఇప్పటికే పూర్తయిన మరియు భవిష్యత్తులో చేపట్టే పనుల వివరాలు కవర్ అయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా: మన్ననూర్ – శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, భారత్ ఫ్యూచర్ సిటీ – బందరు పోర్టు గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్ – విజయవాడ ఎక్స్ప్రెస్ వే, వంటి ప్రతి అంశాన్ని అందులో పొందుపరచాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి సూచించారు.

# 'షీ' టీమ్ ఆధ్వర్యంలో అవగాహన

**సైబర్ నేరాలు, వేధింపులపై విద్యార్థులకు చైతన్యం**



**పరిగి, నవంబర్ 27 (మనసులో మాట):**

మహిళలు మరియు బాలికల భద్రతను లక్ష్యంగా చేసుకుని 'షీ' టీమ్ నిరంతరం కృషి చేస్తుందని 'షీ' టీమ్ పరిగి డివిజన్ ఇన్ఛార్జ్ నర్సింహులు అన్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మేహ్రా మరియు పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం పరిగి పట్టణంలోని ప్రగతి విద్యాలయంలో విద్యార్థులకు 'షీ' టీమ్ పనితీరుపై సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న వేధింపులు, ఈవ్-టీజింగ్ను అరికట్టడం, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సహాయం అందించడం 'షీ' టీమ్ ముఖ్య బాధ్యత అని తెలిపారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ నేరాలకు, అక్రమాలకు పాల్పడుతున్నారని విద్యార్థులను హెచ్చరించారు. విద్యార్థులు ఈ మోసాలపై అవగాహన పెంచుకుని, అటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలని సూచించారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే, మహిళలు, విద్యార్థినులు భయపడకుండా వెంటనే 181 లేదా 100 నంబర్లకు ఫోన్ చేసి సమస్యను తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అత్యాశకు పోయి ఆన్లైన్ మోసాలు మరియు లోన్ యాప్లకు గురికాకుండా ఉండాలని, మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే లేదా బెదిరింపులకు గురైతే తక్షణమే 100 నంబర్కు డయల్ చేయాలని సూచించారు. ఆన్లైన్ మోసపోయినట్లు లేదా సైబర్ నేరానికి గురైనట్లు గుర్తించిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు సమాచారాన్ని అందించాలని తెలిపారు. 'షీ' టీమ్ సభ్యులు మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం గురించి, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మరియు మద్యపాన నిషేధం వంటి అంశాల గురించి వివరించారు. అంతేకాకుండా, మహిళలు, బాలికలు టి-సేఫ్ యాప్ను ప్లే స్టోర్ ద్వారా యాక్టివేట్ చేసుకోవాలని సూచించారు. 'షీ' టీమ్ సేవలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని, మహిళల భద్రతకు అండగా నిలబడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి విద్యాలయ హై స్కూల్ ప్రిన్సిపాల్ కల్పన, కరస్పాండెంట్ వి. ప్రకాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, విద్యార్థులు, మరియు 'షీ' టీమ్ సభ్యులు శోభ, బి. సావిత్రి పాల్గొన్నారు.



# "రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం

**సర్పంచ్, వార్డు స్థానాల్లో వందల సంఖ్యలో నష్టం**

**టీజేపీసీ వికారాబాద్ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్**

**పరిగి, నవంబర్ 27 (మనసులో మాట):**

ప్రస్తుత గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల కేటాయింపుల్లో బీసీ (వెనుకబడిన తరగతుల) సమాజం పట్ల తీవ్ర అన్యాయం జరిగింది. రాష్ట్రంలో బీసీల జనాభా 60 శాతం కన్నా ఎక్కువగా ఉన్నప్పటికీ, రిజర్వేషన్లలో మాకు 20 శాతం కూడా ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి జరిగిన అవమానం అని టీజేఏసీ వికారాబాద్ జిల్లా చైర్మన్ ముకుంద నాగేశ్వర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరిగిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీలకు జరిగిన అన్యాయాన్ని గణాంకాలతో సహా వివరించారు. "వికారాబాద్ జిల్లాలో మొత్తం 594 గ్రామ పంచాయతీల్లో, బీసీలకు కేటాయించిన సర్పంచ్ స్థానాలు కేవలం 107 మాత్రమే (18.01%). మా జనాభా ప్రకారం 22.3% రిజర్వేషన్ ఇవ్వాలంటే, మాకు 132 సర్పంచ్ స్థానాలు దక్కాలి. అంటే, ప్రస్తుత కేటాయింపుతో బీసీలు 25 సర్పంచ్ స్థానాల నష్టాన్ని చవిచూశారు. గత ఎన్నికల నోటిఫికేషన్లో బీసీలకు 42% రిజర్వేషన్ ఉన్నప్పుడు మాకు 249 సర్పంచ్ స్థానాలు ఇవ్వాల్సి ఉండేది. ఇప్పుడు కేవలం 107 స్థానాలే ఇవ్వడం వల్ల బీసీలు ఏకంగా 142 సర్పంచ్ స్థానాలు కోల్పోయాము. అదేవిధంగా, జిల్లాలోని మొత్తం 5,058 వార్డు స్థానాల్లో, బీసీలకు కేటాయించినవి కేవలం 995 (19.67%) మాత్రమే. మాకు 22.3% ప్రకారం 1,127 వార్డు స్థానాలు దక్కాలి. దీంతో బీసీలకు 132 వార్డు సభ్యుల స్థానాలు నష్టం జరిగింది. సామాజిక న్యాయం కోసం, మా హక్కుల కోసం బీసీ వర్గాలందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం మాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, తక్షణమే న్యాయం చేయాలి," అని ముకుంద నాగేశ్వర్ పిలుపునిచ్చారు.

# ఉద్యమ చరిత్రలో నవంబర్ 29 గొప్ప రోజు

- ఉద్యమ సారథి కేసీఆర్ దీక్ష దేశ రాజకీయాల్లో పెను మార్పు తెచ్చింది
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో నవంబర్ 29వ తేదీ ఒక చరిత్రలో నిలిచిపోయే గొప్ప రోజు అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం తెలంగాణ భవన్లో ఆయన అధ్యక్షతన జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) స్థాయి బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో" అంటూ ఉద్యమ సారథి కేసీఆర్ నవంబర్ 29న చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష దేశ రాజకీయాలలో పెను భూకంపం సృష్టించిందని గుర్తు చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని గత పది సంవత్సరాలలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ నాయకత్వంలో ఎంతో అభివృద్ధి చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ప్రధాన నినాదంతోనే తెలంగాణ ఉద్యమం మొదలైందని తలసాని అన్నారు. 1969, 1972 లోనే ఉద్యమం జరిగినా, 2001 తర్వాతే కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడిందని పేర్కొన్నారు.తెలంగాణ ఏర్పడిన తర్వాతనే మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ త్రాగునీటిని అందించి గ్రామీణ ప్రాంత ప్రజల ఇబ్బందులను పరిష్కరించినట్లు చెప్పారు. నిరంతర విద్యుత్ సరఫరా, సాగునీటి వనరుల అభివృద్ధి కారణంగా వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. పేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు చేసిన అన్నపూర్ణ కేంద్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇందిరాగాంధీ క్యాంటీన్లుగా పేరు మార్చిందని ఆయన విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలును పూర్తిగా మరిచి ప్రజలను మోసం చేసిందని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి, గ్రామపంచాయతీ ఎన్నికలలో కేవలం 17 శాతం స్థానాలు కేటాయించి తీవ్ర ద్రోహం చేసిందని విమర్శించారు. తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సేనని, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికి, పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న వారికి సముచిత గౌరవం కల్పిస్తామని ఆయన ప్రకటించారు. ఈ నెల 29వ తేదీన కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన రోజును పురస్కరించుకుని తెలంగాణ భవన్లో దీక్షా దివస్ను పండుగ వాతావరణంలో ఎంతో ఘనంగా నిర్వహించనున్నట్లు తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

# తిరుమల శ్రీవారి సేవలో తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఎమ్మెల్యే**



**వేములవాడ, నవంబర్ 27 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు వేములవాడ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) ఆది శ్రీనివాస్ గారు గురువారం వేకువజామున తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రభుత్వ విప్కు మరియు వారి కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం అందించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలంతా పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీవారిని వేడుకున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మరియు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగాలని ఆ ఏడుకొండల వెంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు.

# సయీాద్ అహ్మద్ ఖాస్మికి ఘన సన్మానం

**ధార్మిక, సామాజిక సేవలను మరింత విస్తృతం చేయాలని ఆకాంక్ష**



**ఖమ్మం, నవంబర్ 27 (మనసులో మాట):**

జమియత్ ఉలేమా ఏ హింద్ (జేయూహెచ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మౌలానా మొహమ్మద్ సయీద్ అహమద్ ఖాస్మిని సోమవారం నాడు ఘనంగా సన్మానించారు. ఇటీవల హైదరాబాద్లో జరిగిన జేయూహెచ్ ఎన్నికలలో ఆయన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. స్థానిక కాల్వ ఒడ్డు ప్రాంతంలోని మదర్సా ఇస్లామీయ దారుల్ ఉలూమ్ లో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోమినాన్ మసీదు మాజీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ హకీమ్, మోమినాన్ మసీదు ఇమామ్ మౌలానా జబీ ఉల్లా, మరియు బాధ్యులు షేక్ అహ్మద్ లు కలిసి మౌలానా ఖాస్మిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ, మౌలానా ఖాస్మి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా, ఆయన మరింత విస్తృతంగా ధార్మిక (మతపరమైన) మరియు సామాజిక సేవలను చేపట్టాలని కోరారు.

# శిశుగృహ, బాలసదనం నుండి పిల్లల దత్తత

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, నవంబర్ 27 (మనసులో మాట):**

కరీంనగర్ శిశు గృహలో పెరుగుతున్న నాలుగు నెలల వయసున్న ఆడ శిశువును హుస్నాబాద్ కు చెందిన పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకున్నారు. బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న 13 సంవత్సరాల బాలికను తమిళనాడుకు చెందిన పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకున్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా దంపతులకు పిల్లలను దత్తత ఇచ్చారు. జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో జరిగిన ఈ దత్తత కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. అనాథ శిశువుల దత్తత, రక్త సంబంధీకుల నుండి దత్తత తీసుకోవాలనుకునే వారు కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, డి సి పి ఓ పర్వీన్, ప్రొటెక్షన్ ఆఫీసర్ తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, సాదినేని రమేష్ పాల్గొన్నారు.

# జర్మనీలో పర్యటించాలని మంత్రి శ్రీధర్ బాబుకు ఆహ్వానం

**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

జర్మనీలో పర్యటించాలంటూ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఆహ్వానం అందింది. టెక్నాలజీ, ఇండస్ట్రీ, ఇన్నోవేషన్, ఇంటర్నేషనల్ బిజినెస్ లో 'తెలంగాణ %-% జర్మనీ' మధ్య ద్వైపాక్షిక సహకారం మరింత బలోపేతమయ్యేలా తమ దేశంలో పర్యటించాలని జర్మన్ బుండెస్□టాగ్ (పార్లమెంట్) సభ్యుడు, ఏఎఫ్డీ పార్లమెంటరీ గ్రూప్ ఫారిన్ పాలసీ అధికార ప్రతినిధి, ఇండో-జర్మన్ పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్ చైర్మన్ మార్కస్ ఫ్రోహ్నమైయర్ ఆయనను ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రి శ్రీధర్ బాబు జనవరిలో జర్మనీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన జర్మనీ ప్రభుత్వ పెద్దలు, కీలక అధికారులు, అక్కడి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రి నిపుణులతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ హై లెవెల్ మీటింగ్స్ లో ఇండస్ట్రియల్ పార్టనర్షిప్స్, తెలంగాణలో ఇన్వెస్ట్ మెంట్ ఆపర్చునిటీస్, జర్మనీలో తెలంగాణ కంపెనీలకు మార్కెట్ యాక్సెస్ కల్పించడం, జర్మనీ %-% తెలంగాణ మధ్య టెక్నాలజీ ట్రాన్స్ ఫర్, ద్వైపాక్షిక సహకార బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించనున్నారు.

# బీసీ రిజర్వేషన్ల పై కాంగ్రెస్ మోసం

## బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ శీలం పాపారావు విమర్శ



**ఖమ్మం, నవంబర్ 27 (మనసులో మాట):**

బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీవ్ర ద్రోహానికి, మోసానికి పాల్పడిందని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ శీలం పాపారావు తీవ్రంగా విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తున్నట్లు ప్రకటించి, స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ, వాస్తవ కేటాయింపులు చూస్తే ఈ విషయం స్పష్టమవుతోందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 12,728 గ్రామ పంచాయతీలకు గాను, బీసీలకు కేవలం 2,176 పంచాయతీలు మాత్రమే కేటాయించారన్నారు. దీని ప్రకారం బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లు కేవలం 17 శాతం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకు ముందు 42 శాతం రిజర్వేషన్లంటూ కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడి చేసినప్పటికీ, గతంలో ఉన్న 23 శాతం రిజర్వేషన్‌ను కూడా అమలు చేయకపోవడం బీసీల పట్ల కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని దుయ్యబట్టారు. బీసీలకు మోసం చేయడంలో కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కూడా మించిపోయారని డాక్టర్ పాపారావు మండిపడ్డారు. "గతంలో 34 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఉండగా, కేసీఆర్ దానిని 23 శాతానికి తగ్గిస్తే, ప్రస్తుతం రేవంత్ రెడ్డి దానిని 17 శాతానికి పరిమితం చేయడంను రెండు పార్టీలలో గల బీసీలు గమనించాలి." అని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను కుదించేందుకే జీవో 46ను జారీ చేయడం జరిగిందని ఇప్పుడు స్పష్టమైందని ఆయన అన్నారు. జిల్లాలను యూనిట్ ల వారీగా వర్గీకరించడం వల్ల అనేక జిల్లాలలో బీసీ రిజర్వేషన్ల అంశం అసమతుల్యంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఉదాహరణగా, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాకు సంబంధించి బీసీలకు ఒక్క గ్రామ పంచాయతీ కూడా కేటాయించబడలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాక, కొన్ని జిల్లాలలో కొన్ని మండలాల్లోని బీసీలకు ఎలాంటి రిజర్వేషన్లు దక్కలేదని తెలిపారు. బీసీల పట్ల ఇదే వైఖరి అవలంబిస్తే కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి తగిన ఫలితాన్ని అనుభవిస్తారని డాక్టర్ శీలం పాపారావు హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

# నాణ్యత లోపంపై హరీశ్ రావుదే బాధ్యత

## శశిభూషణ్ కాచే

## ఓడేడు బ్రిడ్జి కొట్టుకుపోవడంపై బీఆర్ఎస్‌ను ప్రశ్నించిన టీపీసీసీ సభ్యుడు





**మంథని, నవంబర్ 27 (మనసులో మాట):**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మానేరు నదిపై నాణ్యత లేకుండా నిర్మించిన చెక్ డ్యాములు, బ్రిడ్జిలు కూలిపోవడంపై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు తక్షణమే బాధ్యత వహించాలని టీపీసీసీ ఎన్నికల కమిషన్ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు శశిభూషణ్ కాచే డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మంథనిలో మీడియా సమావేశం నిర్వహించి బీఆర్ఎస్ నాయకత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. మానేరుపై దాదాపు రూ. 300 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్ డ్యాములు నాసిరకంగా ఉన్నాయని శశిభూషణ్ కాచే ఆరోపించారు. దీనికి ఉదాహరణగా, ఓడేడు మానేరుపై నిర్మించిన బ్రిడ్జి గాలివానకే కొట్టుకుపోయిందనేది నిజం కాదా అని బీఆర్ఎస్ నాయకులను సూటిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ మంత్రిగా హరీష్ రావు ఉండి నిర్మించిన కాళేశ్వరం బ్యారేజీలు, చెక్ డ్యాములు మరియు బ్రిడ్జిలు నాసిరకంతో నిర్మించారని, ఈ ప్రాజెక్టుల్లో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆయన విమర్శించారు. ఈ అవినీతికి పాల్పడి నాసిరకంతో నిర్మించిన చెక్ డ్యాములపై తక్షణమే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు కాచే తెలిపారు. అలాగే, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కూడా ఈ విషయమై ఫిర్యాదు అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు శంకర్, మంథని సురేష్, పర్షవేని మోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను మోసం చేసిన ప్రభుత్వం

## హామీలు నెరవేర్చకపోతే మరో ఉద్యమం

## జాగృతి అధ్యక్షురాలు కవిత



**బాన్సువాడ, నవంబర్ 27 (మనసులో మాట):**

తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హామీని నిలబెట్టుకోకుండా మోసం చేసిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే హామీలను నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. జనం బాట కార్యక్రమంలో భాగంగా కవిత గారు గురువారం బాన్సువాడ మండలం కొయ్యగుట్ట అమరవీరుల స్థూపం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం కొయ్యగుట్టలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యమకారులకు పెన్షన్, గుర్తింపు కార్డులు జారీ చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులకు ఇంటి స్థలాలు కేటాయించకపోతే, ప్రభుత్వంపై మరో ఉద్యమం తప్పదని ఆమె తీవ్రంగా హెచ్చరించారు. అలాగే, గురుకుల హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న సౌకర్యాల రుసుములను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇటీవల చందూర్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థి మృతిపై ప్రభుత్వం పారదర్శకంగా (నిష్పక్షపాతంగా) విచారణ చేపట్టాలని కల్వకుంట్ల కవిత ఈ సందర్భంగా కోరారు.

# వేగంగా నేమ్ బోర్డు, ప్రకటనల అనుమతులు

- జీహెచ్ఎంసీ నిర్ణయం
- అనుమతుల ప్రక్రియ వికేంద్రీకరణ




**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యాపార, వాణిజ్య సంస్థలకు ఒక శుభవార్త ప్రకటించింది. నగరంలోని ప్రకటనలు మరియు నేమ్ బోర్డుల అనుమతుల జారీ ప్రక్రియను కీలక మార్పులతో వికేంద్రీకరించింది. ఈ సంచలన నిర్ణయం ద్వారా ఇకపై వ్యాపారస్తులు, ప్రకటన కర్తలు అనుమతుల కోసం నగర ప్రధాన కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు.

### వికేంద్రీకరణ లక్ష్యం.. వేగం, పారదర్శకత

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్. వి. కర్ణన్ తీసుకున్న ఈ నిర్ణయం వెనుక ముఖ్య లక్ష్యాలు రెండు ఉన్నాయి. అనుమతుల ప్రక్రియను మరింత వేగవంతం చేయడం, దరఖాస్తుదారులకు ప్రక్రియను సులభతరం చేయడం. ఈ ప్రకటనలు, నేమ్ బోర్డుల అనుమతులు పూర్తిగా జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో మాత్రమే జారీ చేయబడేవి. దీనివల్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో పాటు, దరఖాస్తుదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

ఇకపై: ఈ అనుమతులు సర్కిల్ స్థాయిలోనే ప్రాసెస్ చేయబడతాయి. దీంతో దరఖాస్తుదారులకు స్థానికంగా పనులు పూర్తి చేసుకునే వెసులుబాటు లభిస్తుంది.

### ప్రకటనకర్తలకు మార్గదర్శకాలు

ప్రకటనలు, సైన్‌బోర్డులు లేదా నేమ్ బోర్డుల ఏర్పాటుకు సంబంధించిన విషయాల కోసం ప్రకటన కర్తలు ఇకపై నేరుగా తమ సంబంధిత సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను సంప్రదించవచ్చు. ఇది స్థానిక స్థాయిలో సమస్యల పరిష్కారానికి, త్వరితగతిన అనుమతులు పొందడానికి వీలు కల్పిస్తుంది. సేవల్లో పూర్తి పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచడానికి జీహెచ్ఎంసీ ఒక ముఖ్య విజ్ఞప్తి చేసింది. ప్రకటనలు, నేమ్ బోర్డు అనుమతులకు సంబంధించిన అన్ని దరఖాస్తులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లోనే సమర్పించాల్సి ఉంటుంది. ఈ నూతన పద్ధతి ద్వారా వేగవంతమైన, పారదర్శక సేవలను పొంది, వ్యాపార సంస్థలు సహకరించాలని జీహెచ్ఎంసీ సూచించింది.

# ఫిల్మ్‌నగర్‌లో ఆధునిక ఫుట్‌పాత్

- పనులకు శ్రీకారం చుట్టిన జీహెచ్ఎంసీ
- కోటిన్నర వ్యయంతో 1.5 కి.మీ మేర పర్యావరణహిత నిర్మాణం

**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

పాదచారుల భద్రత, సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, వీధులను మరింత సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) జూబ్లీహిల్స్‌లోని ఫిల్మ్‌నగర్ ప్రాంతంలో మోడల్ ఫుట్‌పాత్ అభివృద్ధి పనులను ప్రారంభించింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఖైరతాబాద్ జోన్ పరిధిలోని సర్కిల్-18లో ఉంది. రామానాయుడు స్టూడియో %-% రోడ్ నెంబరు 79/82 జంక్షన్ నుండి బీవీబీ జంక్షన్, సీవీఆర్ ఛానల్, రోడ్ నెంబరు 82 వరకు పాదచారుల రద్దీ అధికంగా ఉండే మొత్తం 1,500 మీటర్ల (1.5 కిలోమీటర్లు) పొడవైన మార్గాన్ని ఇది కవర్ చేస్తుంది. ఇందులో రోడ్డుకు ఎడమ వైపున 1,000 మీటర్లు, కుడి వైపున 500 మీటర్లు అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ ప్రణాళికలు రూపొందించింది. ఈ పనుల కోసం జీహెచ్ఎంసీ మొత్తం రూ. 1 కోటి 68 లక్షలు ఖర్చు చేయనుంది. వచ్చే నాలుగు నెలల్లోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

### పర్యావరణహిత ప్లాస్టిక్ పేవర్ బ్లాకులతో నిర్మాణం


జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ఈ ఫుట్‌పాత్ నిర్మాణంలో వినూత్నంగా ప్లాస్టిక్ పేవర్ బ్లాకులను ఉపయోగిస్తున్నారు. ఈ పేవర్ బ్లాకులు దాదాపు 65%-%70 శాతం పోస్ట్-కన్స్యూమర్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేయబడతాయి. ఇవి 35 ఎమ్.పి.ఏ కంప్రెషన్ బలం కలిగి ఉండి, సాధారణ కాంక్రీట్ పేవర్‌లకు సమానమైన దృఢత్వాన్ని అందిస్తాయి. భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేసి, పర్యావరణాన్ని సంరక్షించడానికి ఈ విధానం దోహదపడుతుంది.

### ప్రత్యేక సౌర శక్తి గ్రిడ్‌తో 'స్మార్ట్ ఫుట్‌పాత్'

ఈ మోడల్ ఫుట్‌పాత్‌ను మరింత 'స్మార్ట్'గా మార్చడానికి, దాని పైభాగంలో 10 కిలోవాట్ సామర్థ్యం గల సౌర శక్తి గ్రిడ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ వ్యవస్థలో అధిక సామర్థ్యం గల సౌర మాడ్యూల్స్, గ్రిడ్-టైడ్ ఇన్వర్టర్, ఎనిమిది నుండి పది అడుగుల ఎత్తులో ఐరన్ మౌంటింగ్ నిర్మాణం ఉంటాయి. దీనికి అదనంగా, ఆటోమేటెడ్ మాడ్యూల్ శుభ్రపరిచే వ్యవస్థ (క్లీనింగ్ సిస్టం), విద్యుత్ పంపిణీ పెట్టెలు, మెరుపు నిరోధకాలు వంటివి ఉంటాయి. ఈ సౌర పందిరి (రూఫ్ టాప్) పాదచారులకు రక్షణ కల్పించడంతో పాటు, విద్యుత్తును ఉత్పత్తి చేసి భద్రతను మెరుగుపరుస్తుంది.

### అంధులు, వృద్ధుల కోసం ప్రత్యేక టైల్స్

పాదచారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, ఈ ఫుట్‌పాత్‌ను అంధులు, వృద్ధులకు అనుకూలంగా తీర్చిదిద్దుతున్నారు. దృష్టి లోపం ఉన్నవారు, వృద్ధులు సులభంగా నడవడానికి మార్గనిర్దేశం చేసే విధంగా స్పర్శ సంబంధిత టైల్స్ (టాక్టైల్ పేవర్లు) మరియు గైడ్ బార్లను ఏర్పాటు చేయనున్నారు. తద్వారా ఈ ఫుట్‌పాత్ అందరికీ సౌకర్యవంతంగా ఉంటుంది.




# ఆరోగ్య మహిళ.. వైద్య పరీక్షలు తప్పనిసరి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- టీఎన్జీవో భవన్ లో మహిళా ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు



**కరీంనగర్, నవంబర్ 27 (మనసులో మాట):**

జిల్లాలోని మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా ఉచిత వైద్య పరీక్షలను మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ టీఎన్జీవో సంఘ భవనంలో ఎన్జీవోల సంఘం, జిల్లా వైద్యారోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళా ఉచిత వైద్య పరీక్షల కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మహిళ ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. సుమారు 50 వేల రూపాయలు విలువచేసే 45 రకాల పరీక్షలు ఈ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఈ పరీక్షలు చేస్తారని తెలిపారు. ప్రత్యేక క్యాంపుల ద్వారా కూడా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే టీఎన్జీవో భవన్లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు. టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతాయని ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇందులో భాగంగా టీఎన్జీవో భవన్లో 300 మంది అంగన్వాడీ సిబ్బంది సహా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేసే మహిళా ఉద్యోగులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. అవసరమైన వారికి ఉచిత మందులు అందజేసినట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బందితోపాటు అపోలో రీచ్, వాసన్ ఐ కేర్ ఆస్పత్రి వైద్యులు ఈ సేవలో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సనా, ఉమా శ్రీ, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా సహాధ్యక్షులు ఒంటెల రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, మహిళా జేఏసీ నాయకులు ఇరుమల్ల శారద, సునీత, సరిత, విజయలక్ష్మి, లలితమేరీ, రమణ, స్వరూపా, లక్ష్మీ, బాగ్యలక్ష్మి, ఉర్మిళ, అస్గర్ అలీ, గోవిందాపతి శ్రీనివాస్, వాస్తవిక్ గౌడ్, కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, లవ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారం పోలీస్ స్టేషన్ తనిఖీ

## గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన



**ముత్తారం, నవంబర్ 27 (మనసులో మాట):**

రామగుండం పోలీస్ కమి షనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్, ముత్తారం మండల (ఎం) పోలీస్ స్టేషన్‌ను గోదావరిఖని ఏసీపీ (అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్) ఎం. రమేష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా, ఏసీపీ గారు ముందుగా స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా కేడీ (కేస్ డైరీ), డీసీ (డోసీయర్), సస్పెక్ట్ షీట్లను పరిశీలించి, వారి ప్రస్తుత చర్యల గురించి తెలుసుకున్నారు. అలాగే, స్టేషన్ వర్టికల్స్ (విభాగాల పనితీరు), ఎఫ్ఐఆర్ (తొలి సమాచార నివేదిక) ఇండెక్స్ మొదలైన రికార్డులను కూడా పరిశీలించారు. ముఖ్యంగా, రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూసుకోవాలని ముత్తారం పోలీసులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని స్టేషన్ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ సందర్భంగా ఏసీపీ వెంట మంథని సీఐ (సర్కిల్ ఇన్‌స్పెక్టర్) బి. రాజు మరియు ఎస్సైలు (సబ్ ఇన్‌స్పెక్టర్లు) ఉన్నారు.

# మక్తల్‌లో పోలీసుల మాక్ డ్రిల్

- శాంతిభద్రతల పరిరక్షణ, తక్షణ స్పందన సామర్థ్యం పెంపు
- అదనపు ఎస్పీ ఎండీ రియాజ్



**మక్తల్, నవంబర్ 27 (మనసులో మాట):**

నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ మరియు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మక్తల్ పోలీసులు మరియు ప్రత్యేక సాయుధ బలగాలు సంయుక్తంగా మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించాయి. ఈ డ్రిల్‌ను మక్తల్ పట్టణ కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మైదానంలో విస్తృత స్థాయిలో చేపట్టారు. అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హూల్ హక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, పోలీసు సిబ్బందికి మాబ్ కంట్రోల్‌లో అనుసరించాల్సిన విధానాలు, కార్యాచరణ ప్రణాళికలు, గందరగోళ పరిస్థితులలో తక్షణ స్పందన, అలాగే ప్రజల ప్రాణ రక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చామని ఆయన పేర్కొన్నారు.

### ఆచరణాత్మక ప్రదర్శనలు

మాక్ డ్రిల్‌లో భాగంగా సిబ్బంది ఫుట్ ఫార్మేషన్ (బృందంగా కదిలే విధానం), టీమ్ కోఆర్డినేషన్ (సమన్వయం), హెచ్చరిక విధానాలు, చట్టపరమైన చర్యల అమలు పద్ధతులు వంటి ముఖ్య అంశాలను ఆచరణాత్మకంగా (ప్రాక్టికల్‌గా) ప్రదర్శించారు. ఈ శిక్షణ ద్వారా పోలీసులు అనూహ్య పరిస్థితుల్లో మరింత చాకచక్యంగా, సురక్షితంగా ఎలా స్పందించాలో అవగాహన పొందారని అదనపు ఎస్పీ తెలిపారు.

### స్మోక్ గన్స్, ఫైర్ ఇంజన్ల ప్రత్యక్ష ప్రదర్శన

ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా, సిబ్బందికి మరింత అవగాహన కల్పించేందుకు స్మోక్ గన్స్ (పొగ గన్నులు) మరియు ఫైర్ ఇంజన్ ద్వారా మాబ్‌పై ఎలా అదుపు సాధించాలి, ఎలాంటి పరిస్థితుల్లో ఏ విధమైన అగ్ని నిరోధక చర్యలు వాడాలి అనే అంశాలను ప్రత్యక్ష ప్రదర్శన (లైవ్ డెమో) చేసి చూపించారు. దీనితో పోలీసు సిబ్బంది అనుభవం మరింత పెరిగిందని అధికారులు తెలిపారు. ప్రజల భద్రత పోలీసుల ప్రధాన బాధ్యత అని, ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యం (ప్రొఫెషనలిజం), సేవాభావంతో మాబ్ కంట్రోల్ నిర్వహించగలగాలి అని అదనపు ఎస్పీ సూచించారు. ఇలాంటి మాక్ డ్రిల్లులు క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా సిబ్బంది స్పందనా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ మాక్ డ్రిల్‌లో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రామ్ లాల్, ఎస్సైలు భాగ్యలక్ష్మి రెడ్డి, ఎస్.ఎం. నవీద్, అశోక్ బాబు, రమేష్, రేవతి, ఆర్ఎస్సైలు శివశంకర్, మద్దయ్యతో పాటు కానిస్టేబుళ్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మద్దతు ధరను సద్వినియోగం చేసుకోండి

**సహకార సంఘం కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్**

**మంథనిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు**



**మంథని, నవంబర్ 27 (మనసులో మాట):**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి, ప్రభుత్వ మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ రైతులకు సూచించారు. సంఘ అధ్యక్షులు కొత్త శ్రీనివాస్ ఆదేశాల మేరకు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని మంథని మండలంలో గల ఖాన్ సాయి పేట్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, సంఘ డైరెక్టర్లు, రైతులు, హమాలిలు మరియు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యదర్శి అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు లభించే మద్దతు ధర వివరాలు ఇలా ఉన్నాయి: ఏ గ్రేడ్ ధాన్యానికి: క్వింటాల్‌కు రూ. 2,389, సాధారణ రకానికి: క్వింటాల్‌కు రూ. 2,369, సన్న రకానికి: క్వింటాల్‌కు అదనంగా రూ. 500 బోనస్ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. కేంద్రాలలో 17 శాతం తేమ కలిగిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసి, వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆయన సూచించారు. ధాన్యం కేంద్రంలో ఎప్పటికప్పుడు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, రైతుల నుంచి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులు తీసుకొని ధాన్యం వివరాలను ట్యాబ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ట్యాబ్ ఆపరేటర్లు మరియు ఇన్‌ఛార్జిలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ పెద్దిరాజు ప్రభాకర్, నాయకులు కుడుదుల కోటయ్య, మహాదేవ్, సంఘ సిబ్బంది, పాల్గొన్నారు.



# టీబీ ముక్త్ అభియాన్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

**డాక్టర్ అమూల్య ప్రియదర్శిని**

**118 మందికి పరీక్షలుబీ 32 మందికి కఫం నమూనాల సేకరణ**

**దౌల్తాబాద్ మండలం, నవంబర్ 27 (మనసులో మాట):**

సరైన సమయంలో చికిత్స తీసుకుంటే క్షయ (టీబీ) వ్యాధిని పూర్తిగా అరికట్టవచ్చని, చికిత్సతో పాటు పోషకాహారం కూడా తీసుకుంటే త్వరగా నయం అవుతుందని వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళ జ్వరం రావడం, ఆకలి మందగించడం, రాత్రి పూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కఫం (తెమడ) పరీక్ష చేయించుకోవాలని ఆమె ప్రజలకు సూచించారు. క్షయ ముక్త్ అభియాన్లో భాగంగా నిర్వహించిన ఈ క్యాంపులో మొత్తం 118 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. వీరికి రక్తపోటు (బీపీ), చక్కెర (షుగర్) పరీక్షలతో పాటు 32 మందికి కఫం పరీక్షల కోసం నమూనాలు సేకరించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, టీబీ సూపర్ వైజర్ రహత్ అలీ, సూపర్ వైజర్ ఏఎన్ఎంలు అనురాధ, నర్సమ్మ మరియు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్‌లో ఘనంగా బాల వైజ్ఞానిక ప్రదర్శన

- నవంబర్ 29 నుండి డిసెంబర్ 1 వరకు మూడు రోజుల పాటు ప్రదర్శన

**కరీంనగర్, నవంబర్ 27 (మనసులో మాట):**

విద్యార్థులలో ప్రాథమిక దశ నుండే వైజ్ఞానిక స్ఫూర్తిని ప్రోత్సహించి, వారిలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికి తీయడానికి కరీంనగర్ జిల్లాలో జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించనున్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల ఈ ప్రతిష్ఠాత్మక ప్రదర్శనకు వేదిక కానుంది. నవంబర్ 29, 30 మరియు డిసెంబర్ 1 తేదీలలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శన సన్నాహక సమావేశానికి జిల్లా విద్యాధికారి శ్రీరాం మొదయ్య, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.

### కరీంనగర్ సృజనాత్మకతకు మారుపేరు

కరీంనగర్ జిల్లా సృజనాత్మకతకు మారుపేరని, విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టే గొప్ప జిల్లా అని విద్యాధికారి శ్రీరాం మొదయ్య హర్షం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం కరీంనగర్ జిల్లా నుండి విద్యార్థులు జపాన్ వెళ్లడానికి ఎంపిక అవుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సంవత్సరం కూడా జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, ఐఏఎస్ మార్గదర్శకత్వంలో, జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన (2025-26 సంవత్సరానికి) మరియు జిల్లా స్థాయి ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రదర్శన (2024-25 సంవత్సరానికి) ఘనంగా నిర్వహించడానికి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలను వేదికగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### భారీగా నమూనాల నమోదు

ఈ బాల వైజ్ఞానిక ప్రదర్శనకు మొత్తం 717 నమూనాలు నమోదు కాగా, ఇందులో నుండి 7 జూనియర్ మరియు 7 సీనియర్ నమూనాలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు. అలాగే, ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రదర్శనకు 126 నమూనాలు నమోదు చేయబడగా, అందులో నుండి 13 నమూనాలను రాష్ట్ర స్థాయికి పంపడం జరుగుతుందని అధికారులు తెలిపారు.



### వేదిక, వసతి కల్పించిన అల్ఫోర్స్ విద్యాసంస్థలు

విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, అల్ఫోర్స్ విద్యాసంస్థలపై విశ్వాసంతో ఈ గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు జిల్లా పరిపాలనాధికారి పమేలా సత్పతి, ఐఏఎస్‌కు ధన్యవాదాలు తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల పక్షాన పాఠశాలను వేదికగా ఇవ్వడమే కాకుండా, ప్రదర్శనకు హాజరయ్యే విద్యార్థులకు మధ్యాహ్నం భోజన వసతి కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను చాటాలని, వారికి అన్ని విధాలుగా చేయూత అందిస్తామని హామీ ఇచ్చారు.

### ప్రదర్శన యొక్క ప్రధాన అంశాలు

ఈ వైజ్ఞానిక ప్రదర్శన యొక్క ప్రధాన థీమ్ (ముఖ్య అంశం): అభివృద్ధి చెందిన భారతదేశం మరియు స్వయం సమృద్ధి భారతదేశం. ఉప అంశాలుగా: సుస్థిర వ్యవసాయం, వ్యర్థ పదార్థాల నిర్వహణ మరియు ప్రత్యామ్నాయ మొక్కలు, హరిత శక్తి, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వినోదపరితమైన గణిత నమూనాలు, ఆరోగ్యం మరియు పరిశుభ్రత, నీటి సంరక్షణ మరియు నిర్వహణ వంటి అంశాలపై విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శిస్తారు. ఈ మూడు రోజుల ప్రదర్శనకు జిల్లా కలెక్టర్ చైర్ పర్సన్ గా, జిల్లా విద్యాధికారి కన్వీనర్ గా మరియు జిల్లా సైన్స్ అధికారి కో కన్వీనర్ గా వ్యవహరిస్తారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కట్ట ఆనందం, డీసీఇబీ కార్యదర్శి భగవంత రావు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ సమన్వయకర్త అనంతచార్య, మిల్కూరి శ్రీనివాస్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# చెన్గోముల్ పీఎస్ ఆకస్మిక తనిఖీ

**కేసుల విచారణలో నాణ్యత, ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశం**



**పూడూర్ మండలం, నవంబర్ 27 (మనసులో మాట):**

వికారాబాద్ జిల్లా ఎస్పీ (పోలీస్ సూపరింటెండెంట్) శ్రీమతి స్నేహ మెహ్రా గురువారం పూడూర్ మండలం పరిధిలోని చెన్గోముల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పనితీరును, సిబ్బంది విధుల నిర్వహణ తీరును పరిశీలించడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. పర్యటనలో భాగంగా, ఎస్పీ గారు ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణ, రికార్డుల నిర్వహణ, రిసెప్షన్, అలాగే లాకప్ గదుల వంటి వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ చరిత్ర, పరిధికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. గతంలో నమోదైన కేసుల సంఖ్య, ప్రస్తుతం విచారణలో ఉన్న మరియు పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి గురించి స్టేషన్ అధికారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారితో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో సానుభూతితో వ్యవహరించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కేసుల విచారణలో నాణ్యత (క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్) పాటించి, నిందితులకు తప్పకుండా శిక్ష పడే విధంగా చూడాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా: పోక్సో (పిల్లలపై లైంగిక నేరాల నిరోధక చట్టం) కేసులు, ఎస్సీ/ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కేసులు, మహిళలు మరియు బాలికలకు సంబంధించిన కేసులు, ఇతర తీవ్రమైన (గ్రేవ్) కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వాటిని వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆస్తి సంబంధిత నేరాలైన దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని శ్రీమతి స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలకు సంబంధించిన ముందస్తు సమాచారం సేకరించి పెట్టుకోవాలని తెలిపారు. చివరగా, సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, విధుల్లో క్రమశిక్షణతో పాటు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్గోముల్ ఎస్సై (సబ్ ఇన్‌స్పెక్టర్) భరత్ కుమార్ రెడ్డి మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సికిల్‌సెల్, తలసేమియా రోగుల కోసం రెండు రోజుల ఉచిత వైద్య శిబిరాలు

**జిల్లాలో నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం**

**కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**కొత్తగూడెం, నవంబర్ 27 (మనసులో మాట):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సికిల్‌సెల్ మరియు తలసేమియా వంటి దీర్ఘకాలిక రక్తవ్యాధులతో బాధపడుతున్న రోగుల కోసం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలోని ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో, నవంబర్ 28, 29, 2025 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని నిర్ధారించడం, అవసరమైతే నిరంతర చికిత్సకు అనుసంధానం చేయడం మరియు వ్యాధి గురించి కుటుంబ సభ్యులకు పూర్తి అవగాహన కల్పించడం. ఈ రెండు రోజుల ప్రత్యేక వైద్య శిబిరాలు జిల్లాలోని నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించబడతాయి: శుక్రవారం ఉదయం 8:00 నుండి మధ్యాహ్నం 12:30 వరకు నర్సాపురం రైతు వేదిక, దుమ్ముగూడెం (దేవాలయం పక్కనే, ప్రధాన రహదారి, లక్ష్మీనగరం వైపు)లో మొదటి శిబిరం ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 6:00 వరకు భద్రాచలం రైతు వేదిక (మార్కెట్ యార్డ్‌లో)లో రెండవ శిబిరం కొనసాగుతుంది. శనివారం ఉదయం 8:00 నుండి మధ్యాహ్నం 12:30 వరకు అశ్వారావుపేట రైతు వేదిక, నారాయణపురం గ్రామం, అశ్వారావుపేట మండలంలో మూడవ శిబిరం ఉంటుంది. చివరగా, మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 6:00 వరకు రామవరం రైతు వేదిక, చుంచుపల్లి మండలంలో నాలుగవ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరాల కోసం హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా నిపుణులైన వైద్యుల బృందం హాజరుకానుంది. వీరు రోగుల నిర్ధారణ, వైద్య సలహాలు, అవసరమైన చికిత్స పద్ధతులను వివరంగా వివరిస్తారు. సికిల్‌సెల్, తలసేమియా రోగులకు వైద్య కార్డుల జారీ, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డు నమోదు మరియు కౌన్సిలింగ్ సేవలు వంటివి పూర్తిగా ఉచితంగా అందించబడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ వ్యాధులు ఉన్నట్లు గుర్తించిన పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను సమీప శిబిరానికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్యుల సూచనలు పొందాలని కోరుతూ, రోగుల ఆరోగ్య రక్షణలో ప్రతి కుటుంబం చురుకైన పాత్ర వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు పారమిత విద్యార్థులు

**మొయినాబాద్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటనున్న ఐదుగురు క్రీడాకారులు**



**కరీంనగర్, నవంబర్ 27 (మనసులో మాట):**

కరీంనగర్‌లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ నెల 28 మరియు 29 తేదీలలో తెలంగాణ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లాలోని మొయినాబాద్‌లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలబాలికల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఈ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి ఈ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలు: ఆరవ తరగతికి చెందిన సి.హెచ్. అన్విక్ష్ పదిహేడేళ్ల లోపు (అండర్-13) బాలుర విభాగంలో ఎంపికయ్యారు. పదిహేనేళ్ల లోపు (అండర్-15) విభాగంలో ఏడవ తరగతికి చెందిన బాలిక వై. క్రీనాతో పాటు, తొమ్మిదవ తరగతికి చెందిన బాలురు బి. సుక్రీత్ మరియు యం. రిశబ్ ఉన్నారు. పదిహేడేళ్ల లోపు (అండర్-17) బాలుర విభాగంలో పదవ తరగతి విద్యార్థి పి. శశిధృవ్ ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ఈ క్రీడాకారులను పాఠశాల చైర్మన్ డాఇ. ప్రసాదరావు మరియు డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్, కె. హన్మంతరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రబీంద్ర పాత్రో, రాము, భవానీ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు సరిగొమ్ముల రాజు, సాగర్ లు పాల్గొన్నారు.

# ఢిల్లీలో ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్

## డ్రగ్ కార్టెల్‌లో ఉన్న 50మంది నైజీరియన్ల అరెస్ట్



**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

దేశరాజధాని ఢిల్లీ తెలంగాణ ఈగిల్ టీమ్ భారీ ఆపరేషన్ చేపట్టి డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్న 50మంది నైజీరియన్లను పట్టుకుంది. వీరంతా వీసా గడువు ముగిసినా మనదేశంలో తిష్టవేసి కూర్చుకున్నారు. మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కృషిచేస్తున్న ఈగల్ పోలీసులు ఈ భారీ ఆపరేషన్లు పూర్తి చేశారు. దిల్లీ, గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. దిల్లీలో అక్కడి క్రైమ్ బ్రాంచ్ సమన్వయంతో ఈగల్ ఫోర్స్ మెగా ఆపరేషన్‌ను చేపట్టింది. ఈ సంయుక్త బృందంలో దిల్లీ క్రైమ్ బ్రాంచ్ నుంచి వందమంది అధికారులు, ఈగల్ ఫోర్స్ నుంచి 124 మంది అధికారులు పాల్గొన్నారు. మెహ్రౌలి, సంత్ నగర్, ప్రతాప్ ఎన్‌క్లేవ్, పృథ్వీ పార్క్, చంద్ర నగర్ తదితర 20కి పైగా ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. గడువు ముగిసిన వీసాలతో నివసిస్తున్న 50 మందికి పైగా నైజీరియన్లను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారంతా ఒక పెద్ద నైజీరియన్ డ్రగ్ కార్టెల్‌లో కీలక సభ్యులుగా ఉన్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో భారీగా మాదకద్రవ్యాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. గ్రేటర్ నొయిడా, గ్వాలియర్, విశాఖపట్నంలోనూ ఈగల్ ఫోర్స్ స్థానిక పోలీసుల సహకారంతో కీలక ఆపరేషన్లు చేపట్టింది. ఆయా ప్రాంతాల్లో డ్రగ్ కింగ్‌పిన్‌లను, సెక్స్ వర్కర్లుగా వ్యవహరిస్తూ డ్రగ్స్ విక్రయించే మహిళలు, మ్యూల్ ఖాతాదారులను గుర్తించింది. ముందస్తు పక్కా సమాచారంతో ఈగిల్ బృందం అక్కడి పోలీసుల సహకారంతో దీనిని చేపట్టింది. నైజీరియన్లను విచారిస్తే మరిన్ని వివరాలు రాబట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# మరో గ్రామం ఏకగ్రీవం

## ఆదిలాబాద్ జిల్లా తేజాపూర్ ఏకగ్రీవానికి అంగీకారం

**ఆదిలాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

తెలంగాణ పల్లెల్లో ప్రజాస్వామ్య ఎన్నికల సందడి మొదలైంది. గ్రామ పంచాయతీ ఎన్నికల పక్రియ అధికారికంగా ప్రారంభం కావడంతో రాష్ట్రం మొత్తం ఎన్నికల వాతావరణం లోకి ప్రవేశించింది. దీనితో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ పక్రియ ప్రారంభమయ్యింది. నామినేషన్ రోజు మరో సర్పంచ్ ఏకగ్రీవమయ్యారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని తేజపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తేజపూర్ గ్రామపంచాయతీకి పరిధిలోని సాలెగుడా, డోబ్బిగూడ , తేజపూర్ గ్రామ పటేల్‌ల ఆధ్వర్యంలో సమావేశమై స్వచ్ఛందంగా ఎన్నికలు నిర్వహించకుండా కోవా రాజేశ్వర్‌ను సర్పంచ్‌గా మరో 8 మంది వార్డు సభ్యులను ఎన్నుకున్నారు.మరోవైపు.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజునే తొలి ఏకగ్రీవ ఎన్నిక నమోదు అయింది. రుద్రంగి మండలంలోని రూపులా తండాలో సర్పంచ్ పదవికి జవహర్ లాల్ నాయక్‌ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో అక్కడ ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఎన్నికల పక్రియ ప్రారంభమైన వెంటనే ఏకగ్రీవ నిర్ణయానికి గ్రామ పెద్దలు, యువత, మహిళలు కలిసి మద్దతు తెలపడంతో పోటీ అవసరమే లేకుండా పోయింది. జవహర్ లాల్ నాయక్ ఏకగ్రీవంగా ఎంపికైన వెంటనే తండా అంతటా టపాసులు కాల్చి వేడుకలు జరుపుకున్నారు.

## పంచాయతీ ఎన్నికల

# లీగల్ సెల్ ఏర్పాటు

**హైదరాబాద్,నవంబర్27(మనసులో మాట):**

పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌లో ప్రత్యేక లీగల్ సెల్ ఏర్పాటు చేశారు. ఈ లీగల్ సెల్‌ను ముగ్గురు సూపరిండెంట్ స్థాయి అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఎన్నికల్లో రిజర్వేషన్లను సవాలు చేస్తూ కోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో లీగల్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికలు నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తిచేసే విధంగా, ఎన్నికల పక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా వెంటనే చర్యలు తీసుకునేలా జిల్లాలతో లీగల్ సెల్ సమన్వయం చేయనుంది. కేసులకు సంబంధించిన వివరాలు, సూచనలను 24 గంటల్లోపుగా అదనపు అడ్వొకేట్ జనరల్, గవర్నమెంట్ ప్లీడర్‌కి నివేదించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఎన్నికల పక్రియ నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయడంతో పాటూ కోర్టు కేసులు ఎన్నికలను ప్రభావితం చేయకుండా ఉండేందుకు ఈ ప్రత్యేక సెల్ అన్ని జిల్లాలను సమన్వయం చేస్తుంది.

# మహబూబ్ పట్నం ఎన్నికపై స్టే

**మహబూబాబాద్, నవంబర్27(మనసులో మాట):**

మహబూబాబాద్ జిల్లా మహబూబ్ పట్నం గ్రామ పంచాయతీ ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. ఆరుగురు ఓటర్లు ఉన్న ఎస్టీలకు ఒక సర్పంచ్, మూడు వార్డు స్థానాలు ఎలా రిజర్వ్ చేశారంటూ హైకోర్టు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మహబూబ్ పట్నంలో మూడు ఎస్టీ కుటుంబాలకు చెందిన ఏడుగురు ఓటర్లు ఉన్నారు. వీరికి సర్పంచ్‌తో పాటు మూడు వార్డులు కూడా కేటాయించారు. ఈ రిజర్వేషన్లు మార్చాలని గ్రామానికి చెందిన యాకూబ్, శ్రీకాంతాచారి, లింగయ్య, విజయ్, వెంకటమల్లు, పోలు నాగయ్య తదితరులు బుధవారం హైకోర్టును ఆశ్రయించారు. గతంలో మహమూద్‌పట్నం గ్రామ పంచాయతీ నుంచి తండాలను వేరు చేసి కొత్త పంచాయితీలు ఏర్పాటు చేశారని, దీంతో ఆ గ్రామంలో 576 ఓట్లు ఉన్నట్లు పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. 199 మంది ఎస్సీలు, 358 మంది బీసీలు, 13 మంది ఓసీలు, ఏడుగురు ఎస్టీలు ఓటు హక్కును కలిగి ఉన్నారని చెప్పారు. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పించడంతో సర్పంచ్ స్థానంతో పాటు 3 వార్డులు దక్కాయి. దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలను రద్దు చేస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కిష్టాపురం గ్రామ సర్పంచ్‌గా కొండం రంగారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ సర్పంచ్‌తో పాటు 8 మంది వార్డ్ మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొండం రంగారెడ్డి బ్రదర్స్ గ్రామానికి అనేక సేవా కార్యక్రమాలు చేశారు. దీంతో ఆ గ్రామస్తులంతా ఏకమై పార్టీలకతీతంగా సర్పంచ్‌గా రంగారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కవితను ఎందుకు పంపించారో చెప్పండి

**జనగామ,నవంబర్27(మనసులో మాట):**



కేటీఆర్ వ్యవహార శైలి నచ్చకపోవడంతోనే సొంత చెల్లెలు కవిత పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. పార్టీలో అంతర్గత కలహాలతోనే ఆమెను కావాలనే బయటకు పంపారని అన్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదన్నారు. నీతులు వల్లించే నేతలు ఈ విషయంలో సమాధానం చెప్పాలన్నారు. కేసీఆర్ తర్వాత భారత రాష్ట్ర సమితి పార్టీ ముక్కలు చెక్కలవుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో కడియం మాట్లాడారు. హరీశ్‌రావు సైతం పార్టీ నుంచి బయటకు వెళ్లే సమయం కోసం ఎదురుచూస్తున్నట్లు వివరించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రంపై ఒత్తిడి తేకుండా.. కేసులకు కేటీఆర్ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఉన్న మేరకు ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేస్తుంటే కెటిఆర్ తదితరులు కావాలనే యాగీ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

# గ్రూప్-2 ర్యాంకర్లకు ఊరట

**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**



2015 గ్రూప్-2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-2పై సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు సీజే ధర్మాసనం జారీ చేసింది. 2015 గ్రూప్-2 నియామకాలు రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ బెంచ్ తీర్పును ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పును పిటిషనర్? డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు. సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది.గ్రూప్ 2 నియామకాలను రద్దు చేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన సీజే ధర్మాసనం తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. 2019 అక్టోబర్ 24న చేపట్టిన గ్రూప్ 2 నియామకాలను రద్దు చేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ బీమపాక ఈ నెల 17వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్ 2 జవాబు పత్రాల్లో వైట్ నర్ వినియోగం, డబుల్ బబ్లింగ్ చేసిన పార్ట్ బీ పత్రాలను మూల్యాంకనం చేయడం చెల్లదని సింగిల్ బెంచ్ ఉత్తర్వుల్లో పేర్కొంది. ట్యాంపరింగ్ జరిగినట్లు స్పష్టంగా కనిపించినప్పటికీ వాటిని పక్కన పెట్టకుండా మూల్యాంకనం చేయడం చెల్లదని స్పష్టం చేసింది. సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా చేసిన మూల్యాంకనం ఆధారంగా చేపట్టిన నియామకాలు చెల్లవని రద్దు చేస్తూ మరోసారి మూల్యాంకనం చేసి అర్హుల జాబితాను విడుదల చేయాలని జస్టిస్ నగేశ్ బీమపాక ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అంతా 8 వారాల్లో ముగియాలని టీజీపీఎస్సీని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్ అప్పీలు దాఖలు చేశారు. కాగా ఈ అప్పీలు సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులు సరిగ్గా లేవని దీనివల్ల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు నష్టపోవాల్సి వస్తుందని వాదించారు. డబుల్ బబ్లింగ్, వైట్‌నర్ వినియోగం అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని అన్నీ పరిగణలోకి తీసుకొని టీజీపీఎసీ నియామక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అప్పీలుపై వాదనలు విన్న సీజే ధర్మాసనం సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 2015లో గ్రూప్ 2 నోటిఫికేషన్ జారీ చేశారు. 2016లో మరికొన్ని పోస్టులు కలిపి అనుబంధ నోటిఫికేషన్ ఇచ్చారు. వివిధ కేటగిరీల కింద మొత్తం 1,032 పోస్టులకు 2016 నవంబరులో పరీక్షలు నిర్వహించారు. కొంత మంది అభ్యర్థులు వైట్?నర్ ఉపయోగించారని మరికొంత డబుల్ బబ్లింగ్ చేశారని 2017లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసింది. సాంకేతిక కమిటీ హైకోర్టుకు కొన్ని సూచనలు సమర్పించింది. దాని ప్రకారం ఓఎంఆర్ షీట్ లోని పార్ట్ ఏ లో వ్యక్తిగత వివరాలు, బుక్ లెట్ నెంబరుకు సంబంధించి చెరిపివేతలున్నా సమస్య కాదని తెలిపింది.పార్ట్ బీలో 150 ప్రశ్నల విషయంలో వైట్?నర్ వాడినట్లు గుర్తిస్తే ఆ జవాబులను పరిగణలోకి తీసుకోవద్దని సాంకేతిక కమిటీ సూచించింది. దీని ఆధారంగా మూల్యాంకనం చేసి 2019 అక్టోబరులో అర్హుల జాబితా ప్రకటించి నియామకపత్రాలిచ్చారు. ట్యాంపరింగ్ జరిగినా మూల్యాంకనం చేసి అర్హులను ఎంపిక చేశారంటూ మళ్లీ 6 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లపై సుదీర్ఘ విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ బీమపాక నియామకాలు రద్దు చేస్తూ ఈనెల 17వ తేదీన తీర్పు వెలువరించారు.

# మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి

- నోటిఫికేషన్ విడుదల.. నామినేషన్లు షురూ!
- మూడు విడతల్లో జరగనున్న ఎన్నికలు



**హైదరాబాద్, నవంబర్ 27 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాజకీయ సందడి మొదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తొలి విడత ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి. తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న, రెండో విడత డిసెంబర్ 14న, మూడో విడత డిసెంబర్ 17న జరిగేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ పంచాయతీ ఎన్నికలు 12,760 గ్రామ పంచాయతీలు, 1,13,534 వార్డులకు జరుగుతాయి. నోటిఫికేషన్ విడుదల కావడంతో పలు చోట్ల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.తొలి దశ నామినేషన్లు వేస్తున్నారు అభ్యర్థులు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 10:30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం కల్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 555 పంచాయతీలు, 4952 వార్డు స్థానాలకు మొదటి విడత ఎన్నికలు జరుగుతున్నాయి. గురువారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతోంది. వరంగల్ 91 పంచాయతీలు, 800ల వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. హనుమకొండ జిల్లా 69 పంచాయతీలు , 658 వార్డు స్థానాలు, మహబూబాబాద్ జిల్లా 155 పంచాయతీలు, 1338 వార్డు స్థానాలు, జనగామ జిల్లా 110 పంచాయతీలు,1024 వార్డు స్థానాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా 82 పంచాయతీలు, 712 వార్డు స్థానాలు, ములుగు జిల్లా 48 పంచాయతీలు, 420 వార్డు స్థానాలకు గానూ ఎన్నికలు జరుగుతున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమయ్యాయి. మొదటి విడతలో 630 గ్రామ పంచాయతీలు, 5,598 వార్డులకు నామినేషన్స్ స్వీకరిస్తున్నారు. నల్గొండ జిల్లాలో నల్గొండ, చండూరు రెవెన్యూ డివిజన్లలోని 318 గ్రామ పంచాయతీలు, 2,870 వార్డులకు నామినేషన్లు ప్రక్రియ కొనసాగుతోంది. సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, తుంగతుర్తి రెవెన్యూ డివిజన్లలోని 159 గ్రామ పంచాయతీలు, 1,442 వార్డులకు నామినేషన్లు జరుగుతోంది. యాదాద్రి - భువనగిరి జిల్లాలో భువనగిరి రెవెన్యూ డివిజన్‌లోని 153 గ్రామ పంచాయతీలు, 1,286 వార్డులకు నామినేషన్లు ప్రక్రియ కొనసాగుతోంది. ఈరోజు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్స్ స్వీకరిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో... తొలి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం మొదలైంది. ఆదిలాబాద్ జిల్లాలో 166, మంచిర్యాల జిల్లాలో 90, నిర్మల్ జిల్లాలో 136, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 114 సర్పంచ్, వార్డు స్థానాలకు తొలివిడత ఎన్నికలు జరుగుతోంది. అయితే, హైకోర్టు ఆదేశాల కారణంగా ములుగు, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లోని 32 పంచాయతీలకు ఎన్నికలు జరగవు. తొలి విడతకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలవ్వడంతో.. ఈ దశలో 189 మండలాల్లో 4,236 గ్రామ పంచాయతీలకు, 37,440 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలతో పాటు ఉపసర్పంచ్ ఎన్నిక కూడా అదే రోజు పూర్తి చేయాలని ఎస్ఈసీ కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. తొలి విడతకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. రోజూ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. తొలి విడత నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ నవంబర్ 29. ఆ తర్వాత నవంబర్ 30న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 3 వరకు అవకాశం ఉంది. డిసెంబర్ 11న పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. ఈ ఎన్నికల కోసం గ్రామాల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తారు. బ్యాలెట్ పేపర్లతో ఓటింగ్ జరుగుతుంది. నోటా (నాన్ ఆఫ్ ది అబౌవ్) ఆప్షన్ కూడా ఉంటుంది.పోలింగ్ పూర్తయిన అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమై, పూర్తయిన వెంటనే ఫలితాలు ప్రకటిస్తారు. ఉప సర్పంచ్ ఎన్నిక కూడా అదే రోజు లేదా తదుపరి రోజు పూర్తి అవుతుంది. మొత్తం 31 జిల్లాల్లో 545 మండలాల్లో ఈ ఎన్నికలు జరుగుతాయి. ఓటర్ల సంఖ్య 1.66 కోట్లు, వీరిలో మహిళలు 85.12 లక్షలు, పురుషులు 81.42 లక్షలు ఉన్నారు. రిజర్వేషన్ల పట్ల వివాదాలు ఉన్నప్పటికీ, బీసీలకు 17.08 శాతం (2,176 పంచాయతీలు) కేటాయించారు. దీనిపై బీసీ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.ఈ ఎన్నికలు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు కీలకం. గత 20 నెలలుగా ప్రత్యేక అధికారులు పరిపాలన చేస్తున్నారు. ఇప్పుడు కొత్త నాయకులు ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఎస్ఈసీ ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ (9240021456) ఉంది. మొబైల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. ఈ ఎన్నికలతో గ్రామాల్లో మార్పు రావాలని ఆశిస్తున్నారు. మొత్తం ప్రక్రియ డిసెంబర్ 17తో ముగుస్తుంది. ఓటర్లు తమ హక్కును వాడుకోవాలని ఎస్ఈసీ పిలుపునిచ్చింది.

## మావి పండగ చీరలు..

# రేవంత్ వన్నీ ఓట్ల చీరలు

### మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శలు

**సిద్దిపేట,నవంబర్27(మనసులో మాట):**

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పేరుతో బీసీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేశారని మాజీమంత్రి హరీశ్‌రావు మరోమారు విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి.. కేవలం



17 శాతమే ఇచ్చారన్నారు. కేసీఆర్.. పండుగ కోసం చీరలిస్తే రేవంత్‌రెడ్డి మాత్రం ఓట్ల కోసమే చీరలు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రికి ఎంతసేపూ ఓట్ల రాజకీయమే తప్ప.. రాష్ట్ర ప్రయోజనాల మీద శ్రద్ధ లేదన్నారు. సిద్దిపేటలోని భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో గురువారం దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. నవంబరు 29.. చరిత్రను మలుపుతిప్పిన రోజన్నారు. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. రాష్ట్ర సాధనకు ఉద్యమగడ్డ అయిన సిద్దిపేటలో 1,531 రోజుల పాటు దీక్షలు కొనసాగటం చరిత్ర అన్నారు. నవంబరు 29 నుంచి డిసెంబరు 9 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించారు.

## పవన్ కల్యాణ్‌వి

# తెలివితక్కువ మాటలు

### జగదీశ్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్, నవంబర్ 27(మనసులో మాట): :**



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన 'దిష్టి' వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల మధ్య రాజకీయ దుమారం రేపుతున్నాయి. కోనసీమ పచ్చదనానికి తెలంగాణ నేతల దిష్టి తగిలిందన్న పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్‌వి తెలివితక్కువ మాటలని, మెదడుకు పనిచెప్పకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. "మా దిష్టి వాళ్లకు తగలడం కాదు, ఇన్నేళ్లుగా వాళ్ల దిష్టే మా తెలంగాణకు, హైదరాబాద్‌కు తగిలింది" అని జగదీశ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ప్రతిరోజూ వందలాది మంది ఏపీ నుంచే హైదరాబాద్‌కు వస్తున్నారని, అలాంటప్పుడు తమ దిష్టి ఎలా తగులుతుందని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ దిష్టి తగులుతుందని అంత భయంగా ఉంటే, ఓ దిష్టిబొమ్మ పెట్టుకోవాలని, దాన్ని తామేమీ ఆపలేదని వ్యంగ్యంగా అన్నారు. "ఇంత తెలివిలేని వాళ్లు కూడా ఉప ముఖ్యమంత్రులు అవుతున్నారంటే ఆశ్చర్యంగా ఉంది" అంటూ జగదీశ్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుధవారం కోనసీమ జిల్లా రాజోలులో 'పల్లె పండుగ 2.0' కార్యక్రమంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పచ్చని కోనసీమకు తెలంగాణ నాయకుల దిష్టి తగిలింది. ఇక్కడి కొబ్బరి చెట్ల పచ్చదనాన్ని చూసే బహుశా వారికి ప్రత్యేక రాష్ట్రం ఆలోచన వచ్చిందేమో" అని వ్యాఖ్యానించారు. నరుడి దిష్టికి రాయి కూడా పగిలిపోతుందని ఆయన పేర్కొన్నారు. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశం కాగా, జగదీశ్ రెడ్డి తాజా ప్రతిస్పందనతో రాజకీయ వేడి మరింత పెరిగింది. ఈ మాటల యుద్ధం రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం



సౌతాఫ్రికా చేతిలో 2-0తో వైట్‌వాష్ అవ్వడం టీమ్ఇండియాకు కోలుకోలేని దెబ్బ అనే చెప్పాలి. సొంతగడ్డపై 408 పరుగుల భారీ తేడాతో ఓడిపోవడం, 25 ఏళ్ల తర్వాత సఫారీల చేతిలో సిరీస్ కోల్పోవడం ఒక ఎత్తైతే, ఇప్పుడు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం కావడం మరో ఎత్తు. వరుస ఓటములతో సతమతమవుతున్న భారత జట్టుకు ఇప్పుడు సుదీర్ఘ విరామం లభించింది. సౌతాఫ్రికా సిరీస్ ఓటమితో 2025లో టీమ్ఇండియా టెస్ట్ షెడ్యూల్ ముగిసింది. ఇక భారత జట్టు మళ్లీ వైట్ జెర్సీలో కనిపించాలంటే దాదాపు 8 నెలలు ఆగాల్సిందే. అంటే వచ్చే ఏడాది (2026) జూన్‌లోనే టెస్టు మ్యాచ్ ఉండనుంది. జూన్ 2026లో ఆఫ్ఘానిస్థాన్?తో భారత్ ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడనుంది. అయితే ఈ మ్యాచ్ డబ్ల్యూటీసీ సైకిల్‌లో భాగం కాదు. ఆ తర్వాత ఆగస్టులో శ్రీలంక పర్యటన, అక్టోబర్, నవంబర్‌లో న్యూజిలాండ్ పర్యటనలతో అసలు సిసలైన టెస్ట్ సీజన్ మొదలవుతుంది.ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ సైకిల్‌లో ఆడాల్సిన 18 మ్యాచ్‌లలో ఇప్పటివరకు 9 మ్యాచ్‌లు పూర్తి కాగా, విన్నింగ్ పాయింట్ పర్సెంటేజీ 48.15 మాత్రమే ఉంది. దీంతో పాయింట్ల పట్టికలో టీమ్ఇండియా 5వ స్థానానికి పడిపోయింది. ఫైనల్ చేరాలంటే టాప్-2లో ఉండటం తప్పనిసరి. ప్రస్తుతమున్న 48.15 శాతాన్ని కనీసం 60 శాతానికి పెంచుకుంటే తప్ప ఫైనల్ రేసులో నిలవడం కష్టం. ఇది అంత సులువైన విషయం కాదు. టీమ్ఇండియా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే సమీకరణాలు చాలా కఠినంగా ఉన్నాయి. మిగిలిన 9 టెస్టుల్లో కనీసం 6 మ్యాచ్‌లు గెలవాలి. ఒకవేళ 3 మ్యాచ్‌లు డ్రా అయినా పర్లేదు కానీ, ఒక్క మ్యాచ్ ఓడిపోయినా పరిస్థితి చేజారిపోతుంది. శ్రీలంకలో 2 టెస్టులు, న్యూజిలాండ్‌లో 2 టెస్టులు ఆడాల్సి ఉంది. ఆ తర్వాత ఆస్ట్రేలియా జట్టు 5 టెస్టుల సిరీస్ కోసం భారత్?కు రానుంది. విదేశీ గడ్డపై లంక, కివీస్‌ను ఓడించి, సొంతగడ్డపై ఆసీస్‌ను చిత్తు చేస్తే తప్ప ఫైనల్ బెర్త్ ఖాయం కాదు. 2026 ఆగస్టులో శ్రీలంకతో జరిగే 2 టెస్టుల సిరీస్ డబ్ల్యూటీసీలో భాగం. ఆ తర్వాత అక్టోబర్ నవంబర్‌లో న్యూజిలాండ్‌తో వారి గడ్డపై 2 టెస్టులు ఆడాలి. సొంతగడ్డపైనే మనం కివీస్ చేతిలో ఓడిపోయాం, మరి వారి గడ్డపై గెలవడం అంటే కత్తి మీద సామే. ఇక చివరగా భారత్?లో జరిగే బోర్డర్ గావస్కర్ ట్రోఫీ (ఆస్ట్రేలియా సిరీస్) నిర్ణయాత్మకం కానుంది. సొంతగడ్డపై ఇతర జట్లే మనల్ని ఓడిస్తున్నప్పుడు, ఆస్ట్రేలియాను ఎదుర్కోవడం పెద్ద సవాలుగా మారుతుంది. 2026లో టీమ్ఇండియా టెస్టులతో పాటు వన్డేలు, టీ20లపై కూడా దృష్టి పెట్టనుంది. జనవరిలో న్యూజిలాండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌లు, ఫిబ్రవరి, మార్చిలో టీ20 వరల్డ్ కప్ ఉన్నాయి. మొత్తం మీద 2026లో భారత్ కేవలం 5 టెస్టులు (ఆఫ్ఘానిస్థాన్, శ్రీలంక, న్యూజిలాండ్) మాత్రమే ఆడనుంది. ఆసీస్ సిరీస్ ఆ తర్వాత ఉంటుంది. ఈ గ్యాప్?లో టీమ్ఇండియా తమ లోపాలను సరిదిద్దుకుని, స్ట్రాంగ్ కమ్‌బ్యాక్ ఇస్తుందా లేదా అనేది వేచి చూడాలి.

# నా భవిష్యత్‌పై నిర్ణయం తీసుకోవాల్సింది బీసీసీఐనే

## భారత కోచ్ గంభీర్ సంచలన కామెంట్స్



గువాహటి టెస్టులో సౌతాఫ్రికాపై భారత్ ఘోర ఓటమి చవిచూసింది. 408 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. పరుగుల పరంగా టెస్టు క్రికెట్ చరిత్రలో టీమ్ఇండియాకు ఇదే అతి పెద్ద ఓటమి. దీంతో సౌతాఫ్రికాతో రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ క్లీన్‌స్వీప్ అయ్యింది. అయితే ఈ సిరీస్ ఫలితంతో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అతడి కోచింగ్ పీరియడ్‌లోనే గతేడాది స్వదేశంలో న్యూజిలాండ్‌పైనా 3-0తో భారత్ క్లీన్‌స్వీప్ అయ్యింది. ఒక కోచ్ పీరియడ్‌లో స్వదేశంలో భారత్ రెండుసార్లు క్లీన్‌స్వీప్ అవ్వడం ఇదే తొలిసారి.దీంతో గంభీర్‌పై ఒత్తిడి పెరుగుతోంది. అతడు తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలే వల్లే జట్టుకు ఈ పరిస్థితి అంటూ నెటిజన్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో సౌతాఫ్రికాతో రెండో టెస్టు మ్యాచ్ అనంతరం స్వయంగా గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాడు. ఇందులో కోచ్‌గా తన భవిష్యత్ ఏంటని మీడియా ప్రశ్నించగా, గంభీర్ సంచలన కామెంట్స్ చేశాడు. నా భవిష్యత్‌పై నిర్ణయం తీసుకోవాల్సింది బీసీసీఐనే. అంతిమంగా భారత్‌లో క్రికెటే ముఖ్యం. నేను కాదు. ఈ విషయాన్ని నేను కోచ్‌గా బాధ్యతలు తీసుకున్న రోజే చెప్పాను. ఈరోజు కూడా అదే చెబుతున్నా. అయితే ఇంగ్లాండ్ సిరీస్‌లో అద్భుతమైన ఫలితాలు రాబట్టింది కూడా మేమే అనే విషయాన్ని జనాలు అని మర్చిపోతున్నారు. కానీ అందరూ న్యూజిలాండ్ సిరీస్ గురించే మాట్లాడుతున్నారు'అలా అయితే ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ ట్రోఫీలు కూడా గెలిచింది నా కోచింగ్ పీరియడ్‌లోనే. ఇప్పుడున్న జట్టులో కుర్రాళ్లే ఎక్కువ. వాళ్లకు ఉన్న అనుభవం తక్కువ. కుదురుకోవడానికి వాళ్లకు కాస్త సమయం పడుతుందని నేను ఇదివరకే చెప్పాను. కుర్రాళు ్లకు ఇంకా టైమ్ ఇవ్వాలి. అయినా ఓటమిపై అందర్నీ నిందించాలి. ఓటమికి అందరిదీ బాధ్యతే' అని గంభీర్ అన్నాడు.తాజా ఓటమితో భారత్ స్వదేశంలో ఆడిన గత 7 మ్యాచ్‌ల్లో ఐదింట ఓటమిపాలైంది. ఇక గంభీర్ హెడ్‌కోచ్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత 19 టెస్టుల్లో 10 మ్యాచ్‌ల్లో టీమ్ఇండియా ఓడింది. గతేడాది స్వదేశంలో భారత్, న్యూజిలాండ్‌ను ఢీ కొట్టింది. ఆ సిరీస్‌ను కూడా 3- 0తో కోల్పోయింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటలోనూ భారత్ విఫలమైంది. ఆసీస్‌తో ఆడిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీని టీమ్ఇండియా 1- 3 కోల్పోయింది. అయితే ఈ ఏడాది యంగ్ ప్లేయర్లతో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన టీమ్ఇండియా మంచి ఫలితం రాబట్టింది. ఐదు మ్యాచ్?ల సిరీస్?ను 2-2తో డ్రా చేసుకుంది.స్వదేశంలో సౌతాఫ్రికాపై వైట్‌వాష్‌కు గురికావడం భారత్‌కు 25ఏళ్లలో ఇదే తొలిసారి. చివరిసారిగా సౌతాఫ్రికా 2000 సంవత్సరంలో భారత్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. అంతేకాకుండా ఈ సిరీస్‌లో రెండు టెస్టుల్లోనూ భారత్ నుంచి ఏ ఒక్క బ్యాటర్ కూడా మూడంకెల స్కోర్ అందుకోలేదు. గత 30ఏళ్లలో స్వదేశంలో టెస్టు సిరీస్‌లో టీమ్ఇండియా ప్లేయర్లు సెంచరీ చేయకపోవడం ఇదే తొలిసారి.

# సారీ ఫ్యాన్స్.. క్షమించండి

## టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్



భారత క్రికెట్ అభిమానులకు టీమిండియా టెస్ట్ వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ క్షమాపణలు చెప్పాడు. సౌతాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్‌లో అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయామని, తమను మన్నించాలని కోరాడు. గౌహతి వేదికగా బుధవారం ముగిసిన రెండో టెస్ట్‌లో సౌతాఫ్రికా 408 పరుగుల భారీ తేడాతో టీమిండియాను చిత్తు చేసిన సంగతి తెలిసిందే.ఈ విజయంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో సౌతాఫ్రికా క్లీన్ స్వీప్ చేసింది. 25 ఏళ్ల తర్వాత భారత గడ్డపై టెస్ట్ సిరీస్ గెలుపొందింది. వరుసగా రెండో ఏడాది టెస్ట్ సిరీస్‌లో టీమిండియా క్లీన్ స్వీప్ అయ్యింది. దాంతో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు ఆటగాళ్లపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ సిరీస్‌కు రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ నొప్పితో దూరమవడంతో వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్ జట్టును నడిపించాడు. కానీ 93 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలోనే ఏన్నడు లేని పరాజయాన్ని టీమిండియా చవిచూసింది.ఈ క్రమంలోనే అభిమానులకు క్షమాపణలు చెబుతూ రిషభ్ పంత్ సోషల్ మీడియా వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ పంచుకున్నాడు. 'గత రెండు వారాలుగా మేం సరిగ్గా ఆడలేదనేది నగ్న సత్యం. జట్టుగా.. వ్యక్తిగతంగా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాలని, కోట్లాది మంది భారతీయుల ముఖాల్లో చిరునవ్వు తీసుకురావాలని కోరుకుంటాం. కానీ ఈ సారి మేం మీ అంచనాలను అందుకోలేకపోయాం. అందుకు మమ్మల్ని క్షమించండి. కానీ క్రీడల్లో ఓటమి ఎప్పుడూ జట్టుగా.. వ్యక్తిగతంగా గుణపాఠం నేర్పుతుంది. మరింత మెరుగవ్వాలని విషయాన్ని సూచిస్తుంది. భారత్ దేశానికి ప్రాతినిథ్యం వహించడం మా జీవితాల్లోనే మాకు దక్కిన అతిపెద్ద గౌరవం. ఈ జట్టు సామర్థ్యం ఏంటో మాకు తెలుసు. మేం మరింత కష్టపడుతాం. మా ఆటపై మరింత ఫోకస్ పెడ్తాం. వ్యక్తిగతంగా జట్టుగా నేలకు కొట్టిన బంతిలా తిరిగి వస్తాం. మీ అమితమైన మద్దతు, ప్రేమకు ధన్యవాదాలు. జైహింద్'అని పంత్ తన సుదీర్ఘ పోస్ట్‌లో పేర్కొన్నాడు. టెస్ట్ సిరీస్ కోల్పోయిన టీమిండియా.. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం సిద్ధమవుతోంది. నవంబర్ 30న రాంచీ వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌తో కోహ్లీ, రోహిత్ రీఎంట్రీ ఇవ్వనుండగా.. బుమ్రా, సిరాజ్, శుభ్‌మన్ గిల్‌కు రెస్ట్ ఇచ్చారు. కేఎల్ రాహుల్ భారత జట్టును నడిపించనున్నాడు.



# శ్రీచరణికి కోటి 30 లక్షలు

వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) మెగా వేలంలో టీమిండియా స్టార్ స్పిన్నర్, తెలుగు తేజం శ్రీ చరణికి రూ. 1.30 కోట్ల జాక్‌పాట్ ధర దక్కింది. దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా గురువారం జరిగిన మెగా వేలంలో ఈ కడప బిడ్డను ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసింది. రూ.30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన శ్రీచరణి కోసం యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తీవ్రంగా పోటీపడ్డాయి. చివరకు ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.30 కోట్ల రికార్డ్ ధరకు సొంతం చేసుకుంది. గత సీజన్‌లోనూ శ్రీ చరణి ఢిల్లీ క్యాపిటల్స్‌కే ఆడింది. రూ. 50 లక్షల భారీ ధరకు ఈ తెలుగు తేజాన్ని ఢిల్లీ కొనుగోలు చేసింది. డబ్ల్యూపీఎల్ 2025 సీజన్‌లో రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడిన శ్రీ చరణి.. 4 వికెట్లతో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చింది. ఈ అద్భుత ప్రదర్శనతోనే టీమిండియాకు ఆడే అవకాశం అందుకున్న శ్రీచరణి ఏకంగా.. మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీకి ఎంపికైంది.మెగా టోర్నీలో 21 ఏళ్ల శ్రీ చరణి అదరగొట్టింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ అయిన ఈ ఆంధ్రా అమ్మాయి 9 మ్యాచ్‌ల్లో 4.96 ఎకానమీతో 14 వికెట్లు పడగొట్టింది. ఈ 9 మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచ్ మినహా.. ప్రతీ మ్యాచ్‌లో వికెట్ తీసింది. ముఖ్యంగా సెమీస్, ఫైనల్లో ఆమె కట్టుదిట్టమైన బౌలింగ్ టీమిండియా విజయానికి బాటలు వేసింది. ఈ టోర్నీలో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచింది. ఈ ప్రదర్శనే వేలంలో శ్రీ చరణి కోట్లు పలికేలా చేసింది. డబ్ల్యూపీఎల్ చరిత్రలో ఇదే తొలి మెగా ఆక్షన్ కాగా.. మల్లికా సాగర్ ఆక్షనీర్‌గా వ్యవహరిస్తోంది. ఆస్ట్రేలియా క్రికెటర్ అలీసా హీలీతో మెగా వేలం ప్రారంభం కాగా.. ఆమెను తీసుకోవడానికి ఫ్రాంచైజీలు ఆసక్తి చూపించలేదు. దాంతో ఆమె తొలి రౌండ్‌లో అన్‌సోల్డ్‌గా నిలిచింది. మరోసారి ఆమె పేరును వేలం వేసే అవకాశం ఉంది. న్యూజిలాండ్ ప్లేయర్ సోఫీ డివైన్‌ను గుజరాత్ జెయింట్స్ రూ.2 కోట్లకు కొనుగోలు చేయగా.. కివీస్‌కే చెందిన అమెలియా కేర్‌ను ముంబై ఇండియన్స్ రూ.3 కోట్లకు తీసుకుంది. భారత పేసర్ రేణుకా సింగ్‌ను గుజరాత్ జెయింట్స్ రూ.60 లక్షలకు కొనుగోలు చేసింది. ఇంగ్లండ్ ప్లేయర్ సోఫీ ఎక్లిస్టోన్‌ను రూ.85 లక్షలకు యూపీ వారియర్స్ ఆర్‌టీఎమ్ కార్డ్ ద్వారా రిటైన్ చేసుకుంది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వొల్వార్ట్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 1.10 కోట్లకు కొనుగోలు చేసింది.

# మహిళా ప్రీమియర్ లీగ్ 2026 షెడ్యూల్ విడుదల

మహిళా క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్. మహిళల క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్న మహిళా ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ షెడ్యూల్‌ను వేలం జరిగిన గురువారం నాడే విడుదల చేశారు. సుమారు నెల రోజుల పాటు జరగనున్న ఈ టోర్నమెంట్ జనవరి 9, 2026న ప్రారంభమై.. ఫిబ్రవరి 5, 2026న ఫైనల్ మ్యాచ్‌తో ముగుస్తుంది. మహిళా క్రికెట్‌ను మరింత ముందుకు తీసుకుపోయే ఉద్దేశంతో ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించడానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. వేలం జరిగిన రోజే బీసీసీఐ ఈ షెడ్యూల్‌ను కూడా ప్రకటించడం గమనార్హం. గత సీజన్‌లో డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌లు నాలుగు వేర్వేరు నగరాల్లో జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ సారి నిర్వహణ సౌలభ్యం కోసం మ్యాచ్‌లను కేవలం రెండు ప్రముఖ నగరాల్లో మాత్రమే నిర్వహించాలని నిర్ణయించారు.నవీ ముంబైలోని అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన డి.వై. పాటిల్ స్టేడియం ప్రధాన వేదికల్లో ఒకటిగా నిలవనుంది. క్రికెట్ సంస్కృతికి ప్రసిద్ధి చెందిన వడోదర కూడా మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వడం ద్వారా, స్థానిక క్రికెట్ అభిమానులకు లీగ్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభిస్తుంది.డబ్ల్యూపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి గత మూడు సీజన్లలో టైటిల్ గెలుచుకున్న జట్లు వివరాలు ఇలా ఉన్నాయి.హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్ మొదటి టైటిల్‌ను గెలుచుకుంది. లి2024: స్మృతి మంధాన సారథ్యంలోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్‌ను కైవసం చేసుకుంది. లి2025: మళ్లీ ముంబై ఇండియన్స్ ఢిల్లీ క్యాపిటల్స్ను ఓడించి, తమ రెండో టైటిల్‌ను గెలుచుకుంది. డబ్ల్యూపీఎల్‌లో జట్లు లీగ్ దశలో ఒకదానితో ఒకటి రెండు మ్యాచ్‌లు ఆడతాయి. లీగ్ దశలో మొదటి స్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది.

# అత్యంత ఖరీదైన క్రీడాకారిణిగా దీప్తి శర్మ



మహిళల ప్రీమియర్ లీగ్ 2026 వేలం మార్కీ ప్లేయర్స్‌తో ప్రారంభమైంది, ఈ కేటగిరీలో మొత్తం 8 మంది క్రీడాకారులు ఉన్నారు. 7 మార్కీ క్రీడాకారులకు వారి జట్లు లభించాయి, అయితే ఈ రౌండ్‌లో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, అలీసా హీలీని ఎవరూ కొనలేదు. ఈ రౌండ్‌లో అత్యంత ఖరీదైన క్రీడాకారిణి ఆల్ రౌండర్ దీప్తి శర్మ, యూపీ వారియర్స్ ఆమె కోసం ఆటీఎం ని ఉపయోగించింది. దీప్తి శర్మ తిరిగి యూపీ వారియర్స్‌కు వెళ్లడంపై సంతోషం వ్యక్తం చేస్తూ జియోహాట్‌స్టార్‌లో మాట్లాడుతూ, "చాలా బాగుంది. నేను యూపీకి చెందినదాన్ని, కాబట్టి ఏదో ఒక విధంగా ఈ జట్టుతో నాకు అనుబంధం ఉంది. ఇక్కడి నిర్వహణ చాలా బాగుంది. మహిళల ప్రీమియర్ లీగ్ నా ప్రదర్శనను మెరుగుపరచడానికి చాలా సహాయపడింది." దీప్తి శర్మ మహిళల ప్రీమియర్ లీగ్ 2026 వేలం జాబితాలో మూడో స్థానంలో ఉంది, ఆమెకు ముందు అలీసా హీలీని ఎవరూ కొనలేదు. హీలీని కొనకపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. చాలాసేపు దీప్తిపై కూడా ఏ జట్టు బిడ్ వేయలేదు, చివరకు ఢిల్లీ ఆమెపై ఆమె బేస్ ప్రైస్‌తో బిడ్ వేసింది. ఆ తర్వాత ఏ జట్టు ఆసక్తి చూపించకపోవడంతో ఆమె ఢిల్లీకి అమ్ముడుపోయింది. కానీ యూపీ ఆమెపై ఉపయోగించింది, ఆ తర్వాత ఢిల్లీ తన తుది ధర 3 కోట్ల 20 లక్షల రూపాయలుగా పేర్కొంది. యూపీ ఉపయోగిస్తూ దీప్తిని కొనుగోలు చేసింది. మార్కీ రౌండ్‌లో యూపీ వారియర్స్ ముగ్గురు ఆటగాళ్లను కొనుగోలు చేసింది. దీప్తి శర్మ (3.2 కోట్లు)తోపాటు ఈ రౌండ్‌లో సోఫీ ఎక్లెస్టన్ (85 లక్షలు), మెగ్ లానింగ్ (1.9 కోట్లు)ను కూడా కొనుగోలు చేసింది. ఈ రౌండ్‌లో గుజరాత్ జెయింట్స్ ఇద్ది ఆటగాళ్లను (సోఫీ డివైన్, రేణుకా సింగ్) తమ జట్టులో భాగం చేసుకుంది. ఆశా శోభనను యుపి వారియర్స్ సొంతం చేసుకుంది. ఇతర జట్లు కూడా శోభనపై ఆసక్తిని వ్యక్తం చేయడంతో ఆమె ధర 30 లక్షల రూపాయల నుంచి 1 కోటి రూపాయలకు పెరిగింది. ఆశా బేస్ ధర 30 లక్షల రూపాయలు ఈ వేలంలో ఆమె మునుపటి ఎడిషన్ కంటే 11 రెట్లు ఎక్కువ డబ్బు అందుకుంది. ఆశా శోభన మార్చి 16, 1991న కేరళలోని త్రివేంద్రంలో జన్మించిన ఆల్ రౌండర్. 34 ఏళ్ల ఆమె ఇప్పటివరకు భారతదేశం తరపున రెండు వన్డేలు, ఆరు టి20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. ఆమె ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2022/23, 2023/24 ఎడిషన్‌లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడింది. ఆశా శోభన ఇప్పటివరకు ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ఆర్‌సిబి తరపున 15 మ్యాచ్‌లు ఆడి 17 వికెట్లు పడగొట్టింది. ఆమె బ్యాటింగ్‌తో అంతగా ఆకట్టుకోలేకపోయినప్పటికీ, ఆమెకు ఆ సామర్థ్యం ఉంది.2026 ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ వేలంలో ఆశా శోభన దుమ్మురేపింది. గత సంవత్సరం కంటే 11 రెట్లు ఎక్కువ సంపాదించింది. రాబోయే ఎడిషన్ కోసం, ఆమె బేస్ ధర ?30 లక్షలుగా నిర్ణయించింది. ఆమె ధర ?1 కోటికి చేరుకుంది.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# ట్రోలర్స్‌కు ఇచ్చిపడేసింది

సెలబ్రెటీల లైఫ్‌లో సోషల్ మీడియా పెద్ద పాత్ర పోషిస్తుంది. సినిమా సెలబ్రెటీలకు సోషల్ మీడియాలో ఎంత క్రేజ్ ఉంటుందో.. దాని వల్ల నష్టం కూడా అంతే ఉంటుంది. సోషల్ మీడియా ద్వారా చాలా మంది సెలబ్రెటీలు, ముఖ్యంగా హీరోయిన్స్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతే కాదు హీరోయిన్స్ చాలా మంది లేనిపోని వివాదాల్లో ఇరుక్కుంటూ ఉంటారు. దాంతో సోషల్ మీడియాలో నెటిజన్స్ ఓ రేంజ్‌లో ట్రోల్స్ చేస్తూ ఉంటారు. వివాదాస్పద కామెంట్స్ చేసో లేక, వింత డ్రస్సుల వల్లో ఎదో ఒకరకంగా ట్రోల్స్‌కు గురవుతూ ఉంటారు. కొంతమంది హీరోయిన్స్ తమ డ్రస్సింగ్ కారణంగా ట్రోల్స్ బారిన పడుతూ ఉంటారు. మరికొంతమంది సర్జరీల విషయంలో ట్రోల్ చేస్తుంటారు తాజాగా ఓ హీరోయిన్‌ను సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేశారు. సర్జరీల విషయంలో హీరోయిన్‌పై ట్రోల్స్.. దానికి ఆ స్టార్ హీరోయిన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అందాల భామ శ్రుతిహాసన్ ఆచితూచి సినిమాలు చేస్తుంది. రీసెంట్ డేస్‌లో వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ హిట్స్ అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. కెరీర్ బిగినింగ్‌లో సక్సెస్ కోసం ఎంతగానో ఎదురుచూసిన శ్రుతిహాసన్ ఆ తర్వాత వరుసగా విజయాలను అందుకుంది. తక్కువ సమయంలోనే ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్‌కు అందుకుంటూ దూసుకుపోతుంది. తెలుగు తమిళ్ సినిమాల్లో హీరోయిన్‌గా రాణిస్తుంది శ్రుతిహాసన్. శ్రుతిహాసన్ అందంపై ట్రోల్స్ వినిపిస్తూ ఉంటాయి. ఆమె అందం కోసం సర్జరీ చేయించుకుందని.. అందుకే ఆమె ఇంత అందంగా ఉందని పలువురు ఆమె పై ట్రోల్స్ చేస్తున్నారు. తాజాగా ఆ ట్రోల్స్ పై స్పందించింది శ్రుతి.. రైనో ప్లాస్టి అనే సర్జరీ గురించి, అలాగే లిప్ ఫిల్లర్స్ గురించి మాట్లాడింది. ఇది నా శరీరం, నా ఇష్టం అలానే నాకు నచ్చిన నిర్ణయం నేను తీసుకుంటాను అని చెప్పుకొచ్చింది శృతిహాసన్.అలాగే రైనో ప్లాస్టి అనేది ముక్కుకు చేసే సర్జరీ.. అంది అందం కోసమే కాదు అంతకు ముందు నా ముక్కుకు గాయం అయ్యింది అనికోసమే సర్జరీ చేయించుకున్నా అని తెలిపింది శ్రుతి.

# ఎల్లమ్మ సినిమా చేయడం లేదు



సౌత్ ఇండియన్ స్టార్ నటి కీర్తి సురేష్ చాలాకాలం తర్వాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆమె చివరిగా నటించిన పెద్ద తెలుగు సినిమా మెగాస్టార్ చిరంజీవితో చేసిన 'భోళా శంకర్'. ఆ తర్వాత 2025లో సుహాస్‌తో చేసిన ఉప్పు కప్పురంబు విడుదలైనప్పటికీ, ఆ చిత్రం వచ్చిన సంగతే చాలా మందికి తెలియకుండా పోయింది. అవకాశాలు తగ్గాయా? లేక ఆమెకే ఆసక్తి తగ్గిందా? అనేది స్పష్టంగా తెలియకపోయినా, కీర్తి సురేష్ కొంతకాలంగా తెలుగు సినిమాల్లో కనిపించలేదు. దాదాపు విరామం తర్వాత కీర్తి సురేష్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. దర్శకుడు చంద్రు రూపొందించిన ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీ తెలుగులో కూడా విడుదల కానుంది. డైరెక్ట్ తెలుగు సినిమాతో కాకుండా, డబ్బింగ్ వెర్షన్‌తో తెలుగువారిని ఆకట్టుకోవడానికి కీర్తి సిద్ధమవుతోంది. తాజాగా రివాల్వర్ రీటా ప్రమోషన్ కోసం తెలుగులో ప్రెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంలో సినిమా వివరాలతో పాటు రాబోయే ప్రాజెక్టుల గురించి కూడా కీర్తి సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒక రిపోర్టర్ చాలా కాలంగా ప్రచారంలో ఉన్న 'ఎల్లమ్మ' సినిమా గురించి ప్రశ్నించాడు. 'ఎల్లమ్మ సినిమాలో హీరోయిన్‌గా మీరు నటిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయం నిజమేనా? అని అడిగాడు. దీనికి కీర్తి స్పష్టంగా స్పందిస్తూ లేదు... నేను 'ఎల్లమ్మ' సినిమా చేయడం లేదని స్పష్టం చేసింది. 'ఎల్లమ్మ' చిత్రానికి కేవలం హీరోయిన్ ఎంపికలోనే కాదు, హీరో విషయంలో కూడా ఇప్పటివరకు స్పష్టత రాలేదు. నాని, శర్వానంద్, నితిన్, బెల్లంకొండ శ్రీనివాస్ వంటి పలువురు నటుల పేర్లు వినిపించగా, తాజాగా సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ పేరు కూడా చర్చలోకి వచ్చింది. అయినప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌లో నిజంగా ఎవరు హీరోగా నటిస్తారు, ఎవరు హీరోయిన్‌గా ఉంటారు అన్నది ఇంకా తెలియరాలేదు. హీరోయిన్‌గా కీర్తి సురేష్ లేదన్న సంగతి మాత్రం స్పష్టమైంది. ఇక ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుంది? నటీనటుల అధికారిక జాబితా ఎప్పుడెప్పుడు బయటకు వస్తుంది? అనేదానిపై మేకర్స్ నుంచి ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

## వివాదాలు ఎదురవుతాయని
# ఊహించలేదు
### కుటుంబ వివాదంపై స్పందించిన మంచు లక్ష్మి




తన కుటుంబంలో ఇలాంటి వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదని నటి మంచు లక్ష్మి స్పష్టం చేశారు. సినిమా ప్రచారాల కోసం ఇచ్చే ఇంటర్వ్యూలకు తప్ప, ప్రత్యేకంగా వ్యక్తిగత చర్చల కోసం మాట్లాడటానికి పెద్దగా ఆసక్తి చూపబోనని తెలిపారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, తల్లి-సోదరి-కుమార్తెగా తన పాత్రల గురించి మాట్లాడుతూ, తల్లిగా మాత్రం తనను తాను 10కి 10 మార్కులు వేసుకుంటానని చెప్పింది. మంచు కుటుంబంలో జరిగిన విభేదాలపై కూడా ఆమె స్పందించారు. 'దేవుడు ప్రత్యక్షమై ఒక వరం కోరుకోమంటే... మా కుటుంబం మళ్లీ మునుపటిలాగే ఒక్కటిగా మారాలని మాత్రమే అడుగుతానని అన్నారు. ప్రతి కుటుంబంలోనూ గొడవలు ఉండటం సహజమే అయినా, ఎంత విభేదాలు వచ్చినా చివరకు అందరూ కలిసే ఉండాలనే భావన మనసులో నిలిచి ఉండాలని ఆమె పేర్కొన్నారు. భారతీయ కుటుంబాల్లో మాత్రం కొన్ని సందర్భాల్లో కలహాలు జీవితాంతం విరిగిపోనివ్వాలని భావించే ధోరణి కనిపిస్తుందని, అది సరికాదని వ్యాఖ్యానించారు. 'చివరికి మనకుండేది రక్తసంబంధీకులే. కుటుంబాన్ని కలిసి ఉంచేందుకు అవసరమైన పోరాటం చేయాలిబీ దూరం పెంచుకోవడం మాత్రం ఎప్పుడూ సరైంది కాదని తెలిపారు. 'నేను ముంబయిలో ఉన్నాను. ఇక్కడి పరిస్థితులు తెలిసినా బాధపడలేదని కొందరు వార్తల్లో రాశారు. కానీ నేను పొందిన బాధను నాకు మాత్రమే తెలుసనని మంచు లక్ష్మి చెప్పారు. వివాదాలపై తాను మాట్లాడకపోవడంతో, కొందరు తమకు నచ్చినట్లుగా ఊహాగానాలు సృష్టించారని చెప్పారు. అది నా వ్యక్తిగత విషయం. ఇలాంటి సమస్యలు వస్తాయని నేను ఊహించలేదు. వాటిని చూసి షాక్ అయ్యాను. నా కుటుంబం గురించి నేను అనుకున్నది, ఆ పరిస్థితుల్లో నాకు కలిగిన బాధ బయటివాళ్లకు చెప్పాల్సిన అవసరం లేదని భావించానని ఆమె వ్యాఖ్యానించారు.



# ఎట్టకేలకు హిట్ కొట్టిన రామ్ పోతినేని

రామ్ పోతినేని నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఆంధ్రకింగ్ తాలూకా.. ఈ సినిమా భారీ అంచనాల మధ్య నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న డైరెక్టర్ పి. మహేశ్ బాబు ఈ సినిమాను తెరకెక్కించాడు. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటించాడు. అలాగే రావు రమేష్, మురళీ శర్మ, రాజీవ్ కనకాలు, తులసి, సింధు తులానీ, రాహుల్ రామకృష్ణ, సత్య, వీటీవీ గణేష్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మించారు. ఇక ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు రావడంతో ప్రీమియర్స్ చూసిన ప్రేక్షకులు సినిమా పై తమ అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఇక సినిమా బాగుందని.. చాలా కాలం తర్వాత రామ్ మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు అంటున్నారు. రామ్ నటన సినిమాకే హైలైట్ అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. అలాగే ఎట్టకేలకు రామ్ హిట్ కొట్టాడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు కొందరు ప్రేక్షకులు. మొత్తానికి ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్ లోకి వచ్చాడు రామ్ పోతినేని.



CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861